ఆటా బహుమతి నవల

యోగాడకొండ

ఉణుదుర్తి సుధాకర్



SHOUT
SHARE
IT

ATA బహుమతి పొందిన నవల

యారాడ కొండ

ఉణుదుర్తి సుధాకర్

అమెరికా తెలుగు సంఘం
నేపర్‌విల్
USA

Ānvīkshikī
Publishers
ఆన్వీక్షికి పబ్లిషర్స్ ప్రై.లి.
హైదరాబాద్
2020

YAARAADAKONDA
ATA Prize Winning Novel
Published in paperback in India in 2020 by
American Telugu Association (ATA)
in association with
Anvikshiki Publishers Pvt. Ltd.

Copyright©Unudurti Sudhakar

The moral right of the author has been asserted.

All rights reserved
No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means, without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

ISBN - "978-81-948767-0-0"

Cover Painting
Captain J.T.Blunt
Pen & Ink and Water Color-1795

Book Making & Cover Design
Mahy Bezawada
970 597 2222

Lay-out
Jhansi Nallamelli

Printed @
Anupama Printers
Shanti Nagar,
Hyderabad.

For Copies

Visalandhra Publishing House,
Navachetana Publishing House,
Navodaya Book House,
Akshara Books Hyderabad,
Telugu Book House,
www.logili.com, www.telugubooks.in

Anvikshiki Publishers Pvt.Ltd.
Azra House, 59/C/D,
MLA Colony, Banjarahills,
Hyderabad.
Ph: 970 597 2222, 984 988 8773
www.bit.ly/anvikshikibooks

Rs. 225/-

ఆన్వీక్షికి దర్శనం

I have always imagined that Paradise
will be a kind of library.

-Jorge Luis Borges

మంచి పుస్తకం చదివి ఆస్వాదిస్తే కలిగే ఆనందమేంటో నాకు తెలుసు తెలుగు సాహిత్యం మాత్రమే కాకుండా ఇతర భారతీయ భాషల్లోనూ, ఆంగ్లభాషలోనూ వచ్చే సాహిత్యాన్ని విరివిగా చదవడం నాకు అలవాటు. ఒక తరం వేరొక తరానికి తమ అనుభవ పరంపరను నిరంతరం అందించే శాశ్వత విజ్ఞాన నిధులు పుస్తకాలు.

కానీ నా తర్వాత తరంలో పుస్తకాలు చదవడం తగ్గిపోతోందనే ఆలోచన నాకు కొంత బాధ కలిగించింది. పుస్తకాలు చదవడంలోని ఆనందాన్ని కొత్త తరానికి పరిచయం చెయ్యాలన్న ఆలోచన నాలో ప్రస్ఫుటంగా నాటుకుంది.

2018 డిసెంబర్‌లో ఒక రోజు మా శ్రీవారు సత్యదేవ్ నాతో మాట్లాడుతూ మనమొక పబ్లిషింగ్ హౌస్ స్థాపించబోతున్నామనగానే నాకు పాలో కొయిలో చెప్పిన ఒక సత్యం గుర్తొచ్చింది.

When you want something, all the universe conspires in helping you to achieve it. సత్యదేవ్ నాకు వెంకట్, మహిలను పరిచయం చేసారు. వెంకట్, మహి కూడా నాలాగే ఆలోచిస్తూ కొత్త జనరేషన్ మళ్ళీ తెలుగు పుస్తకాలు చదివేలా చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నారని తెలిసి సంతోషించాను. తెలుగులో ఇప్పుడున్న ప్రచురణ సంస్థలకంటే భిన్నంగా ఏం చేయగలమని మేము ముగ్గురం చాలాసార్లు చర్చించుకున్నాం. చాలామందితో మాట్లాడాం. తెలుగు చదివేవాళ్ళు తక్కువైపోతున్నారు. తెలుగులో రావాల్సినన్ని పుస్తకాలు రావడం లేదు. తెలుగు పుస్తకాలు అమ్ముడవడంలేదు - ఇలా రోజూ ఎక్కడో ఒక దగ్గర ఎవరో ఒకరినోట వింటూనే వచ్చాం.

కానీ ఇవన్నీ సమస్యలు. ఒక మంచి పుస్తకం ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం సూచిస్తుందని అనుకున్నాం. ఆ మంచి పుస్తకం ప్రచురించే ఆలోచన నుంచి పుట్టిందే ఆన్వీక్షికి ప్రచురణలు.

అయితే ఇక్కడ మాకొక ప్రశ్న ఎదురైంది. ఏది మంచి పుస్తకం?

పుస్తకాలన్నింటినీ ఒకే గాటిన కట్టి మాట్లాడ్డం కుదరదు. ఒక్కొక్కరికీ ఒక్కొక్క రకమైన పుస్తకం మంచి పుస్తకం అనిపిస్తుంది. కొందరికి లిటరరీ ఫిక్షన్ నచ్చితే, కొందరికి రొమాంటిక్ ఫిక్షన్ నచ్చొచ్చు. మరికొందరికి బయోగ్రఫీలు నచ్చొచ్చు. మరికొంతమందికి డిటెక్టివ్ ఫిక్షన్ నచ్చొచ్చు. సైన్స్ ఫిక్షన్, ఆధ్యాత్మిక రచనలు, బాలల సాహిత్యం - ఇలా ఎన్నో రకాల సాహిత్యాన్ని ఇష్టపడే పాఠకులు ఉంటారు. ఒక ప్రచురణ సంస్థగా అన్ని రకాల పుస్తకాలను ప్రచురించడమే మా బాధ్యత! కాకపోతే మాకంటూ కొన్ని పరిధులు విధించుకున్నాం.

సాంఖ్య, యోగా, చార్వాక దర్శనముల కలయికే ఆన్వీక్షికి. క్లుప్తంగా మూడు ఆంగ్ల పదాలలో చెప్పాలంటే Open your Eyes, Open your Mind, Open your Soul. మేము ప్రచురించే పుస్తకాలు పాఠకుడికి ఈ మూడింటిలో ఏ ఒక్కటైనా కలిగించగలిగితే మా ప్రయత్నం సఫలమైనట్టే.

వందన బండారు
చీఫ్ పబ్లిషర్,
ఆన్వీక్షికి పబ్లిషర్స్ ప్రైవేట్ లిమిటెడ్,
హైదరాబాద్.

ఆటా అక్షరాల బాట

అమెరికాలో రెండేళ్లకోసారి ఆటా మహాసభల సందర్భంగా నిర్వహించే సాహిత్య సదస్సుకి విశేషమైన ఆదరణ ఉంది. భిన్నతరాల రచయితల్ని, కవుల్ని, పండితులని అమెరికాలో ఒకే వేదిక పైకి తీసుకురావడానికి ఆటా దాదాపు మూడు దశాబ్దాలుగా పనిచేస్తుంది. అయితే, ఆ మహాసభల బైట కూడా అటు అమెరికాలో ఇటు రెండు తెలుగు రాష్ట్రాలలో భాషా సాహిత్య రంగాలలో ఇంకా విశాలమైన కృషి జరగాల్సి ఉందని ఆటా భావించి అందులో భాగంగానే 2019 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ తెలుగు సదస్సును నిర్వహించింది. కనీసం మూడు తరాల రచయితలు, కవులు 'ఆటా.. అక్షరాల బాట..' పేరుతో తలపెట్టిన ఈ సదస్సులో భాగస్వాములయి భాషా సాహిత్య కార్యక్రమాలలో ఇష్టంగా పాల్గొన్నారు. కొత్త తరం నుండి, అంటే ఇరవై నుండి నలభై ఏళ్ల వయసున్న రచయితల, కవుల సాహిత్య కృషి మీద వెలుగు పడాలని కోరుకుంటూ ఆటా ఆరోజు కొత్త తరంతో సాహిత్య సంభాషణ మొదలుపెట్టింది. ఇకముందు

కూడా ప్రతీ రెండేళ్ల కోసారి, డిసెంబర్ నెలలో అన్నీ ప్రాంతాల వారిని భాగస్వామ్యం చేస్తూ భాషా సాహిత్యాల పెంపుకోసం అంతర్జాతీయ సదస్సును నిర్వహించాలని ఆటా సంకల్పించింది.

ఇంతే కాకుండా తెలుగు భాషా, సాహిత్యంపైన మక్కువతో- మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండవ బహుమతి ఏభై వేలతో ఆటా ఈ ఏడాది (2020) నవలల పోటీ నిర్వహించింది. ఈ పోటీకి ప్రపంచం నలుమూలల నుండి దాదాపుగా 80 వరకూ నవలలు వచ్చాయి. ప్రముఖ రచయితలు పి.సత్యవతి, పూడూరి రాజిరెడ్డి, తాడికొండ శివకుమార శర్మ, సాయి బ్రహ్మానందం గొర్తి న్యాయనిర్ణేతలుగా ఈ నవలలని పరిశీలించి, అనేక వడపోతల తర్వాత ఈ దిగువ రెండు నవలలకి బహుమతి ప్రకటించారు:

1. మొదటి బహుమతి: లక్ష రూపాయలు: మనోధర్మపరాగం (మధురాంతకం నరేంద్ర, తిరుపతి)
2. రెండవ బహుమతి: యాభైవేల రూపాయలు: యారాడ కొండ (ఉణుదుర్తి సుధాకర్, హైదరాబాద్)

ఈ పోటీలో పాల్గొన్న ప్రతీ రచయితకీ, రచయిత్రికీ, పోటీ నిర్వహణలో మాకు ఎంతో సహకరించిన న్యాయనిర్ణేతలకు మా ఆటా కార్యవర్గం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. బహుమతులు గెలుచుకున్న నవలాకారులకి అభినందనలు!

బహుమతి పొందిన నవలలని మీకు అందించాలన్న ఉద్దేశ్యంతో వీటిని అందంగా ప్రచురించి మీ ముందుకు తెస్తున్నాము.

ఈ పుస్తకాలను ఉన్నత ప్రమాణాలతో ఎంతో అందంగా ప్రచురించిన అన్వీక్షికి ప్రచురణసంస్థకి, వెంకట్ శిద్దారెడ్డి గారికి, మహి బెజవాడ గారికి శ్రమకోర్చి నవలల ఎడిటింగ్‌లో సహకరించిన సాయి బ్రహ్మానందం గారికి కృతజ్ఞతలు.

నవలల పోటీని ఎంతో పారదర్శకంగా నిర్వహించిన ఆటా సాహిత్యవేదిక సమన్వయకర్త రవి వీరెల్లికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఇకముందుకూడా మంచి నవలలని మీ ముందుకు తేవాలన్న స్ఫూర్తితో ప్రతీ రెండేళ్ల కోసారి క్రమంతప్పకుండా జులై నెల గడువుగా నవలల పోటీని నిర్వహించాలని ఆటా సంకల్పించింది. ఆదరించండి.

పర్మేష్ భీంరెడ్డి
ఆటా అధ్యక్షులు
నవంబర్ 2020

తెలుగు సాహిత్యాన్ని
ఆధునికతవైపు మళ్లించి
అభ్యుదయానికి బాటలువేసిన
కళింగాంధ్ర బిడ్డలు
గురజాడ, శ్రీశ్రీ, చాసో,
రావిశాస్త్రి, కారాలకు..

యారాడ కొండ మీద ఒంటరిగా నిలబడి ఒక్కొక్కరోజు ఒక్కొక్కరకపు విశాఖపట్టణాన్ని చూశాను.

- శ్రీశ్రీ ('అనంతం')

యారాడ కొండ లేకపోతే విశాఖకి యిన్ని పరిశ్రమలుండవు. ఇన్ని పరిశ్రమల్లేకపోతే యింతమంది జనానికి ఈనాడు ఈపాటైనా బతుకుండదు. అన్నీ ఉన్నాయనే దేముడికి తిరుపతి కొండ ఎంకన్నే ఎంతెంతో లాభం తెస్తే, యారాడ కొండ వల్ల ఏమీలేని జనానికి ఎంతో లాభం వచ్చింది. రోజుకి లక్షలార్జించి వెళ్లడంకంటే, లక్ష మందికి రోజులు వెళ్లగలగనివ్వడం మంచిదని నేను తలుస్తాను. కాబట్టే నా దృష్టిలో ఏడుకొండలకంటే యారాడ కొండే ఎక్కువయింది.

- రాచకొండ విశ్వనాథశాస్త్రి

కాఫ్కా ముసలి పడవల చిన్న సభ

- త్రిపుర

ఓ నాలుగు ముసలి పడవలు
సముద్రపుటొడ్డున కూచున్నాయ్
ముసలి మూతులు దగ్గరగా లాక్కుని
చప్పుడు చెయ్యకుండా
ఒక చిన్న సభ పెట్టుకుందామన్నట్లు

వాటికి చాలా విషయాలు తెలుసు
ముసలి పడవలకన్నీ తెలుసు
కొనదేరిన పొడుగు దేహాలతో
యిసుక మీద
తీరుబడిగా కూచున్నాయ్

వాటి ప్రక్కటెముకలు
నల్లగా మెల్లగా కుళ్లుతూ ఉన్నాయ్
కాని చక్కగా కుదురుగా కనిపిస్తున్నాయ్
వాట్ని నీట్లో కదలడానికి కట్టేరు
నీట్లో హింసించడానికి కట్టేరు
నీటి సంగతి వాటికి తెలిసినంత
ఎవరికీ తెలీదు

ఆ చిన్న సభలో తీరుబడిగా
ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాయ్
ముసలి మూతులు కదిలించకుండానే
రోజంతా అక్కడే అలాగే కూచున్నా
ఏ నిర్ణయానికీ రాలేదు

నేలంటే వాటికి ప్రేమ
ముప్పాతిక భాగం నీట్లోనూ
ఒక పాతిక భాగం యిసుక మీద
ముసలి పడవలు
ముచ్చటగా మూతుల్తో నేలని ప్రేమిస్తూ
నీట్లోకి తప్పనిసరిగా లాగబడుతూ
ఏ కష్టం చెప్పుకోకుండా

కృతజ్ఞతలు

అమెరికా తెలుగు సంఘం ('ఆటా') నిర్వహించిన నవలల పోటీలో 2020 సంవత్సరానికిగాను ఈ రచనకు ద్వితీయ బహుమతిని ప్రకటించి, పుస్తకాన్ని ప్రచురించి, ప్రోత్సహించినందుకు వారికి నా ధన్యవాదాలు.

సంపాదక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన మిత్రుడు సాయి బ్రహ్మానందం గొర్తికి కృతజ్ఞతలు. ప్రచురణకర్తలు 'ఆన్వీక్షికి' సంస్థవారికి ధన్యవాదాలు.

చిత్తుప్రతిని చదివి తమ అభిప్రాయాలను, సూచనలను తెలియజేసిన ఆత్మీయ మిత్రులందరికీ కృతజ్ఞుడిని. తప్పులను సరిదిద్దిన టీ. చంద్రశేఖరరెడ్డికి నా ధన్యవాదాలు.

1986లో - నా సహచరి ప్రొ. యు. వింధ్య జాలరి స్త్రీలపై చేసిన అధ్యయనంలో వెలుగు చూసిన అంశాలు, ఈ నవలకు బీజం వేశాయి. మా అబ్బాయి జైదీప్ ఉణుదుర్తి, 'ఉపోద్ఘాతం', 'ఉపసంహారం' – ఈ రెండు అధ్యాయాలనీ జోడించమని సూచించాడు.

హైదరాబాద్
19 అక్టోబరు, 2020

ఉణుదుర్తి సుధాకర్
రచయిత

దిక్సూచి

ఉపోద్ఘాతం	✧	13
తుఫాను రాత్రి	✧	17
'జమీల'	✧	25
తానొకటి తలిస్తే	✧	34
పాత నగరం	✧	46
కొత్త స్నేహాలు	✧	58
అన్వేషణ	✧	68
లోవతోట	✧	78
తలోదారి	✧	86
చెంగల్రావుపేట	✧	100
మర పడవలు	✧	118
చదువెందుకు?	✧	128
పావలా సీసం	✧	142
డొంక కదిలింది!	✧	156
పుడమి సంతతి	✧	163
నిత్య సంఘర్షణ	✧	174
కొత్త నీరు	✧	188
ఉపసంహారం	✧	200

ఉపోద్ఘాతం

నేను యూరాడ కొండని...

నేను తూర్పు కనుమలలో భాగాన్ని. భారతదేశపు తూర్పు తీరానికి నట్టనడుమ సముద్రంలోకి చొచ్చుకుపోయిన కొండని. ఇప్పుడంటే భారతదేశం ఇక్కడుంది గానీ ఒకప్పుడు, అంటే పది కోట్ల సంవత్సరాల క్రితం ఈ భూభాగం ఇప్పటి అంటార్కిటికానీ, ఆఫ్రికా ఖండాన్నీ ఆనుకొని ఉండేదని అంటే మీరు నమ్ముతారా? ఆనాడు ఏకాండి భూభాగంగా ఉన్న గోండ్వానా మహాఖండంలో భారత ఉపఖండం ఒక భాగం. నేటి తూర్పుతీరం అంటార్కిటికా ఖండంతోనూ, పశ్చిమతీరం ఆఫ్రికా ఖండంతోనూ పెనవేసుకొని ఉండేవి. మొత్తం భారత ఉపఖండం గోండ్వానా నుండి విడిపోయి ఐదు కోట్ల సంవత్సరాలపాటు సగటున సంవత్సరానికి అంగుళం చొప్పున సుదీర్ఘమైన సముద్ర ప్రయాణం చేసి నేటి యూరేసియా ఖండాన్ని చేరుకుంది. ఐదుకోట్ల సంవత్సరాల క్రితం, ఇప్పటి టిబెట్‌తో ఢీకొంది. ఫలితంగా హిమాలయ పర్వత శ్రేణులు పెల్లుబికాయి. అవి ఎంత ఎత్తుకి లేచాయంటే వాటి శిఖరాలు నిత్యం మంచుతో కప్పబడే వాతావరణాన్ని చేరుకున్నాయి. నైరుతి ఋతుపవనాలకు, ఏటా వచ్చే వర్ష ఋతువుకి కోటిన్నర సంవత్సరాల క్రితం నాంది పలికాయి. గంగా, బ్రహ్మపుత్ర, సరస్వతి, సింధు వంటి జీవనదులకు ఆయువుపట్టుగా మారాయి. అలాగే టిబెట్టు అత్యున్నత పీఠభూమిగా అవతరించింది. సంవత్సరానికి సుమారు రెండు అంగుళాల చొప్పున ఈశాన్య దిశగా నేటికీ ఈ ప్రయాణం కొనసాగుతూనే ఉంది. భారత భూభాగం ఆసియా ఖండాన్ని నెట్టుతూనే ఉంది. అటు టిబెట్టులోనూ, ఇటు పాకిస్తాను, కాశ్మీరు, నేపాలు, ఉత్తర భారత దేశాలలోనూ తరచూ సంభవించే భూకంపాలు ఈ నిరంతర కదలిక సృష్టించే ఒత్తిడి వల్లనే.

భారత ఉపఖండం గోండ్వానా నుండి చీలి విడిపోయినప్పుడు నేటి శ్రీలంక కూడా వెంబడించింది గానీ మడగాస్కర్ ద్వీపం వేరుపడి ఒక శకలంగా అక్కడే, ఆఫ్రికా తీరానికి చేరువగా ఉండిపోయింది పాపం. నేటి హిందూ మహాసముద్రం వెంబడి భారత భూభాగం చేసిన మహత్తర యాత్ర గనుక జరగకపోయి ఉంటే

మీరంతా భారతీయులు కాకుండా ఆఫ్రికా వాసులు అయి ఉండేవారు! సమకాలీన ఇరుగుపొరుగు దేశాలతో మీకు సరిహద్దు తగాదాలు ఉండేవికాదు! మీకు నవ్వొస్తోంది కదా? కాని ఇది ముమ్మాటికీ నిజం.

భౌగోళిక నిర్దిష్టతలే యావత్ సృష్టినీ, అడవులనీ, ఎడారుల్నీ సృష్టిస్తాయి; వృక్షజాతుల్నీ జంతుజాలాన్నీ – ఆమాటకొస్తే సమస్త ప్రాణకోటినీ వృద్ధిచేస్తాయి – లేదా కృశింపజేస్తాయి. అంతేకాదు, మానవ సమాజ పరిణామాన్ని నిర్దేశిస్తాయి; మీరు నాగరిక సమాజాలు అని భావిస్తున్న సమూహాల ఆవిర్భావాన్నీ, వాటి ఉన్నతినీ, అధోగతినీ భౌగోళిక నిర్దిష్టతలే నిర్ణయించాయి. తద్వారా మీ చరిత్రని లిఖించాయి. అందుకే నేనెప్పుడూ ఒక మాట అంటాను-

అంతా మీ నిర్వాకమే అని మురిసిపోవద్దు. మిమ్మల్ని మీరు 'బుద్ధిజీవులం, ఇంగిత జ్ఞానం కలిగిన వాళ్లం' అనుకుంటున్నారు కదా? సంతోషం. కానీ భౌగోళిక, పర్యావరణ సమతుల్యంతో చెలగాటం ఆడవద్దు. మీ పరిమితులను తెలుసుకొని జాగరూకతతో మసలుకోండి. లేదంటే మీకూ, మీ నాగరికతకూ వినాశం తప్పదు.

నేను తూర్పు కనుమలలో భాగాన్ని అని చెప్పాను కదా! పశ్చిమ కనుమలకన్నా కూడా మేము ప్రాచీనులం. తీరం వెంబడి అల్లుకుపోయిన మా కనుమల్లో ఎన్నెన్నో వింతలు, విశేషాలు చూశాం. మా కళ్ల ఎదుటే పర్వతాలు పగిలాయి. లావా నదులు ప్రవహించాయి. ఉల్కలు రాలిపడ్డాయి. కొన్ని కోట్ల సంవత్సరాల పాటు నిరంతరంగా సాగిన పరిణామ క్రమంలో – ఏక కణ జీవులతో మొదలుపెట్టి, సముద్రగర్భం నుండి భూతలానికి ఎగబ్రాకిన జీవరూపాలను, భూతలంపై ప్రాకుతూ పోయిన సరీసృపాలను, ఇంకా అనేక జీవజాతులను వాటి పరిణామాన్ని మేము చూశాము. వాటిల్లో ఎన్నో నశించాయి. కొన్ని రూపాంతరం చెంది నేటికీ కొనసాగుతున్నాయి. మా తూర్పు కనుమల మీదుగా రాకాసి పక్షులు ఎగిరాయి, రాకాసి బల్లులు ఈ ప్రాంతాలలో రాజ్యమేలాయి. ఆ రాకాసి జీవులు సుమారు పదమూడు కోట్ల సంవత్సరాల పాటు నిరాటంకంగా సంచరించాయి. నిటారుగా నిలబడి రెండు కాళ్లమీద నడిచే మనుష్యులను పోలిన జీవులు ఈ భూతలంపై అవతరించి కేవలం ఇరవై లక్షల సంవత్సరాలే అయింది.

ఆఫ్రికాలో ఉద్భవించిన మీ మానవజాతి మా కళ్ల ముందే ఈ ప్రాంతాలలో స్థిరపడింది. మీరు 'కొండవాళ్లు' అని పిలిచే జాతులనేకం మా కొండలమీదా, లోయల్లోనూ, మా చుట్టూ ఉండే అడవులలోనూ నిలదొక్కుకొని వృద్ధి చెందాయి. తమ పరిసరాలతో సహజీవనం ఎలా చెయ్యాలో ఈ గిరిపుత్రులకు బాగా తెలుసు. అందుకే కొన్నివేల సంవత్సరాలపాటు ఏ లోటూలేకుండా సుఖసంతోషాలతో మా నడుమ జీవించగలిగారు. మరో వైపున మా కళ్ల ఎదుటే ఎన్నో రేవు పట్టణాలూ, నగరాలూ,

రాజధానులూ నిర్మితమయ్యాయి; నాశనమయ్యాయి. జనాభా విపరీతంగా పెరిగిపోయింది. తిండిగింజల కోసమని వ్యవసాయ భూములు అవసరమయ్యాయి. వాటి కోసం మీ పూర్వీకులు అడవుల్ని ఆక్రమించి వాటిని పంటపొలాలుగా మార్చారు. యంత్రాలూ, పరిశ్రమలూ వచ్చాయి. కాలుష్యం మితిమీరిపోయింది. మరి కొద్ది దశాబ్దాలలో మిమ్మల్ని మీరే అంతం చేసుకొనేందుకు అత్యుత్సాహంగా ముందుకి పరుగిడుతున్నారంటే నాకు ఆశ్చర్యం అనిపిస్తోంది. విచారం కూడా కలుగుతోంది. 'అయ్యో, ఈ మనుష్యులెంత అల్పజీవులు? ఎందుకింత మూర్ఖంగా ప్రవర్తిస్తారు? తమ గోతిని తామే త్రవ్వుకుంటారు?' అని నాలో నేనే అనుకుంటూ ఉంటాను. నిజానికి ఆ రాకాసి బల్లులే మీకన్నా నయం. పాపం ఆ భయంకర ఉల్కాపాతం సంభవించకపోయి ఉంటే నేటికీ జీవించి ఉండేవేమో? ఒక జడ పదార్థాన్నయిన నాకే ఇలా అనిపిస్తూ ఉంటే, సజీవులైన మనుష్యులు ఎంత వ్యధ చెందాలి? ఎంతగా మధన పడాలి? ఎన్ని ఆలోచనలు చెయ్యాలి? ఎన్ని పరిష్కారమార్గాలు వెతకాలి?

కానీ ఒక మాట మాత్రం చెప్పుకోవాలి. ఇంతవరకూ ఈ భూతలంపై ఏ ఒక్క జీవజాలం కూడా తీసుకురాలేకపోయినన్ని మార్పుల్ని మీ మనుష్యులు సాధించారు. అదికూడా ఎంత తక్కువ కాలంలో?! ఎన్ని సామ్రాజ్యాలు నిర్మించారు? ఎంతమంది రాజులు, రాణులు వచ్చిపోయారు? ఎన్ని యుద్ధాలు చేసారు? ఎందరి ప్రాణాలు తీసారు? ఏ పాపమూ ఎరుగని సామాన్యుల్ని ఎన్ని విధాలుగా పీడించారు?... నేనుండే ఈ సుందర సముద్రతీరంలో కూడా ఏమైనా తక్కువ వింతలు జరిగాయా?! అప్పటికీ ఇప్పటికీ నేను చూసిన, చూస్తూన్న మానవ సంతతి ఎవరైనా ఉన్నారంటే అది చేపలు పట్టే వాళ్లే. ఆ తరవాత పెద్ద పెద్ద ఓడలలో సాహసయాత్రలు చేసే నావికులు, వాటిమీద వ్యాపారం చేసే వర్తకులు. వారి వెంట దేశవిదేశాలకు ప్రయాణం కట్టిన బౌద్ధ భిక్షువుల్నీ చూశాను. ఇంకా పెద్ద తెరచాప ఓడలలో యూరపు దేశస్థులు రావడం చూశాను. ఆ తరువాత ఆవిరి యంత్రంతో నడిచే స్టీమర్లు వచ్చాయి. అలా వచ్చిన తెల్లవాళ్లే నాకు 'డాల్ఫిన్స్ నోస్' అని నామకరణం చేశారు. రాత్రిపూట కాంతులు విరజిమ్మే ముక్కుపుడక లాంటి లైట్ హవుసును నిర్మించారు. దక్షిణం నుండి తీరాన్ని ఒరుసుకుంటూ వచ్చే సముద్ర ప్రవాహాన్ని నేను అడ్డుకుంటాను. నా అండతో తెల్లవాళ్లు నిర్మించిన సహజ రేవుగా విశాఖపట్టణం విలసిల్లింది. పరిశ్రమలకి ఆలవాలంగా మారింది. తెల్లవాళ్లు వెళ్లిపోయారు. వారి సంతతి అయిన ఆంగ్లో-ఇండియన్లు రేవు పక్కనే సోల్జరుపేటలో నివాసాలు ఏర్పరచుకున్నారు. ఇప్పుడంటే మహానగరంగా వర్ధిల్లుతోందిగానీ విశాఖపట్నం తొలుత – జాలరిపేట, చెంగల్రావుపేట, ఆంగ్లో-ఇండియన్ల సోల్జరుపేట - ఈ ముప్పేటల కలయిక. అన్నింటికన్నా పురాతనమైనదీ, అనాదిగా ఉంటూ వస్తున్నదీ జాలరిపేట. తరవాత అవతరించిన చెంగల్రావుపేట

అన్ని కులాలకూ, వృత్తులకూ ఆలవాలమైంది. బ్రిటీషు వారి పాలనలో అవతరించిన సోల్జరుపేట ఇటీవలిది. మీరు చదవబోయేది ఆ మూడు పేటల కథ.

ఔరంగజేబు పునరుద్ధరించిన ఆలంగీర్ మసీదు మొఘల్ పాలనకు గుర్తుగా నా వీపునే ఉన్నది. ఆ దిగువనే కనిపించే సూఫీ ఇషాక్ మదీనా దర్గా, అంతకన్నా ముందెప్పుడో అరబ్బు నావికుల కాలం నాటి చిహ్నం. దర్గా, బ్రిటీషు వారు కట్టిన మేరీ మాత చర్చి, పోర్టు ముఖద్వారంలో కాలువ ప్రక్కనే వెలసిన వెంకటేశ్వరుడి గుడి – ఈ మూడూ కూడా ఒకే కొండమీద ఉండడం ఈశ్వరేచ్ఛ అని నమ్మేవారున్నారు. అందుకే జపాను వాడు బాంబులు వేసినా, పాకిస్తానీయులు 'ఘాజీ' జలాంతర్గామిని పంపినా, 'హుద్ హుద్' తుఫాను బీభత్సం సృష్టించినా అన్ని ఆపదలనూ అధిగమించి నిలదొక్కుకున్నదీ నగరం అని వారంటారు. ఎవరి నమ్మకాలు వారివి. ఇతరుల నమ్మకాలను గౌరవించే ఉత్తమ సంస్కృతిని అందిపుచ్చుకున్న కాస్మోపాలిటన్ నగరంగా విశాఖపట్నం అవతరించిందంటే అందుకు చిహ్నాలు మూడు మతాలవారికీ ప్రీతిపాత్రమైన గుట్ట మీదనే నాలో భాగంగా ఉన్నాయి. దానికి స్థానికులు 'శాంతి కొండ' అని మరో పేరు పెట్టుకున్నారంటే అందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.

నా చుట్టుపక్కల సుమారు ఏభై ఏళ్ల వ్యవధిలో జరిగిన కొన్ని సంఘటనలను మీ ముందుంచుతున్నాను.



1

తుఫాను రాత్రి

నడి సముద్రంలో తుఫాను చెలరేగేటప్పుడు ఆ చుట్టుపక్కల నిర్భాగ్యులైన మనుష్యులెవరైనా ఉన్నట్టయితే వారికి అన్నిటికన్నా భయం గొలిపేవి ఈదురు గాలులు చేసే వింత ధ్వనులు. అవి ఉత్తుంగ తరంగాల రంకెలు; వినాశకర ప్రకృతిచేసే విలయతాండవ పదఘట్టనలు. క్షణికమైన మానవ మనుగడను పరిహాసం చేస్తూ మృత్యు దేవత పలికించే పిలుపులు. వీటికి ప్రతిస్పందనగా తమను ప్రాణాలతో విడిచిపెట్టమని సమస్త జీవులూ చేసుకొనే దయనీయమైన వేడుకోళ్లు. వివిధ స్వరాలలో వినవచ్చే ఆ నిరంతర మారణ ఘోషనీ, హృదయాలను కలచివేసే ఆ రోదనల్నీ, ఎంతటి ధీశాలులైనా ఒక్క పూటకన్నా ఎక్కువసేపు భరించలేరు. ఆ తరవాత వారి మతి భ్రమిస్తుంది; ఉన్నవి లేనట్టూ, లేనివి ఉన్నట్టూ ఊహించుకుంటారు.

రెండు రోజులుగా హోరున వర్షం కురుస్తున్నది. ఎడతెరిపి లేకుండా ఉవ్వెత్తున లేచి పడుతూన్న అలల ధాటికి ఆ జాలరుల తెరచాప పడవ అతలాకుతలం అవుతున్నది. చిమ్మ చీకట్లో ఆ కెరటాలేవీ కానరావడం లేదుగానీ, మెరుపు మెరిసినపుడల్లా వెంటాడుతూన్న తిమింగిలాల గుంపుల మాదిరిగా దొర్లుకొస్తూ మీద పడుతున్నాయనే భావన కలిగిస్తున్నవి. అవి పడవని అదే పనిగా ఎత్తి కుదేస్తున్నాయి. అది ఇనుప మేకులు వాడకుండా చెక్కలని కలిపి తాళ్లతో కుట్టి నిర్మించిన పడవ. ఈ నిర్మాణ పద్ధతి ఋగ్వేదకాలం నాటిదంటారు. బహుశా అంతకన్నా పురాతనమైనదేమో. పడవ ఒక నిమిషం కెరటపు అంచున వుంటే మరో నిమిషంలో – కొండ మీద నుండి లోయలో పడ్డట్టు – దభేలుమని క్రిందికి జారుతున్నది. ఇవాళ అప్పుడే రెండవ రాత్రి.

'ఇయ్యాలైనా ఒడ్డట్టుకుంటావో, లేదో' అనుకున్నాడు గంగరాజు, కానీ ఆ మాట బయటకి అనలేదు – మిగతా ముగ్గురూ భయపడతారని. ఆ పడవలో ఉన్న నలుగురిలోనూ అతడే పెద్ద; అందరిలోకీ అనుభవజ్ఞుడు. వాళ్లందరిలోకీ చిన్నవాడు – అతని మేనల్లుడు నూకరాజు.

"ఏటిది మాయ్యా? ఈ మోజా ఏటి?... ఒగ్గకుండున్నాది!" అన్నాడు నూకరాజు.

చీకట్లో మేనల్లుడి మొహం కనిపించలేదు గానీ అతని గొంతుకలోని భయం స్పష్టంగా వినిపించింది – గంగరాజు చెవులకి.

నూకరాజుకి పదిహేడేళ్లే గానీ మాచెడ్డ చురుకైన వాడు. పదవ తరగతి వరకూ చదువుకున్నాడు; పరీక్ష తప్పాక చదువుకి స్వస్తి పలికాడు. పని నేర్పించమని గంగరాజు తోడబుట్టిన చెల్లెలు పోలమ్మ ఆరునెలల క్రిందట అప్పగించింది. పోలమ్మకి లేకలేక కలిగిన సంతానం; కూతురైతే నూకాలమ్మ, కొడుకైతే నూకరాజు అని పెట్టుకుంటామని అనకాపల్లి నూకాలమ్మ తల్లికి మొక్కుకుంది. బావ పోయాక, చెల్లెలి కుటుంబానికి గంగరాజే దిక్కయ్యాడు. నూకరాజుని పనిమంతుడిని చేసి, కూతురు ఎల్లమ్మనిచ్చి పెళ్లిచేసి, తన అల్లుడిని చెయ్యాలని గంగరాజుకి లోలోపల ఆశగా ఉంది. ఇదే మాట, భార్య గంగమ్మతో ఓసారి అంటే, 'సూద్దాంలే. ముందు దాని సదువుకానీ' అంది. కూతుర్ని డిగ్రీ దాకా చదివించాలనీ, కొడుకుని డాక్టర్ని చెయ్యాలనీ గంగమ్మ కోరిక. వాళ్ల జాతిలో అంత చదువుకున్నవాళ్లు లేరు. కరకచెట్టు పోలమాంబ గుడికి వాల్తేరు వెళ్లి వస్తూ, ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణాన్ని దాటినప్పుడల్లా 'అమ్మా సరస్వతీ, నా పిల్లలికి సదువు బాగా రావాల' అని ఆ భవనాలకు దండం పెట్టుకుంటుంది. యూనివర్సిటీ అంటేనే సరస్వతీ నిలయం అని ఆమె భావన.

'నిజవే, కొడుకూ, కూతురూ బాగా సదూతున్నారు; వెంకటేసు డాక్టరు కాకపోయినా ఆఫీసరవుతాడని నమ్మకం ఉంది. తనలాగా సముద్రం మీద ఏటకి మాత్రం రాడు. కూతురు గనక ఒకవేళ పెద్ద సదువులు సదివితే పదో తరగతి పోయిన నూకరాజుని సేసుకుంటాదా?'. అయినా గంగరాజుకి మాత్రం ఎక్కడో ఆశ అనేది ఇంకా మిగిలి ఉంది.

జాలారిపేట వాసులు నూకరాజు ఎదురుపడినప్పుడల్లా 'ఒలే, మీ బావొచ్చాడే!' అంటూ ఎల్లమ్మని ఆటపట్టిస్తూంటారు. ఎల్లమ్మకి చిరాకు. నూకరాజుకి ఎల్లమ్మంటే ఆసక్తి ఉన్నట్లే తోస్తుంది. అతడు మేనమామ గంగరాజు పట్ల చాలా విధేయంగా ఉంటూ, మారు మాట్లాడకుండా చెప్పిన పనల్లా చేసుకుపోతాడు. నూకరాజుకే కాదు, జాలారిపేటలో గంగరాజంటే అందరికీ గౌరవమే. పేటలో అందరికీ అందరూ ఏదో విధంగా బంధువులే కాబట్టి అతన్ని ఏదో వరసపెట్టి పిలుస్తారు – 'అన్నయ్య, బావ, పెదనాన్న, చిన్నాన్న, మావ...' ఈ విధంగా. ఊళ్లో ఎవరికి ఎలాంటి కష్టం వొచ్చినా అతని సలహా కోసం వస్తారు. ఆడవాళ్లయితే గంగరాజు భార్య గంగమ్మ సలహాలేనిదే ఏ పనీ తలపెట్టరు. ఏ సమస్యవచ్చినా వాళ్లంతా ఒకే మాట మీద నిలబడతారు; ఆ మాట తరచూ గంగమ్మ నోటి వెంటే వస్తుంది. చేపల మార్కెట్లో గంగమ్మ చెప్పిన రేటుకే అమ్ముతారు. సముద్రం మీద వేటకి సంబంధించిన విషయాల్లో అయితే గంగరాజు మాటమీద అందరికీ గురి.

కానీ ఇప్పుడు అతనికి కూడా చాలా ఆందోళనగా ఉంది. సాటి జాలరుల పడవలేవీ కానరావడం లేదు. అంటే వాళ్లంతా వెనక్కి వెళ్లిపోయారా...? మార్కెట్లో మంచి రేటు వచ్చే సందువ చేపలు బాగా పడుతున్నాయి కదా అని అందరితోబాటు వెనక్కిపోకుండా మరోపూట వేట చేసుకొద్దామనుకున్నాడు. అదే అతను చేసిన పెద్ద పొరబాటు. సమయానికి ట్రాన్సిస్టర్ రేడియో కూడా నీళ్లు చేరి చెడిపోయింది. విశాఖపట్నం రేడియో స్టేషను ఇచ్చే తుఫాను హెచ్చరికగానీ, తత్సంబంధిత వివరాలుగానీ వినరాలేదు. అయినా గంగరాజుకి రేడియో అవసరం లేదు. నిన్నటి మధ్యాహ్నం ఎప్పుడైతే దక్షిణపు గాలి తూర్పుదిశకి మళ్లిందో అప్పుడే అతనికి అర్థం అయిపోయింది. అయితే తూర్పుగాలితో ఒక సౌకర్యం ఉంది. ఏమీ చెయ్యకపోయినా పడవని పడమరకి, అంటే తీరంవైపు నెడుతుంది. ఆ ధైర్యంతోనే వేట కొనసాగించాలని నిర్ణయించుకున్నాడు. తీరామోసి అనుకున్నదొకటి, అయిందొకటి. అలల ఉధృతిని, ప్రవాహవేగాన్ని అతడు అంచనా కట్టలేకపోయాడు.

ఆరోజు మధ్యాహ్నమే 'ఒడ్డుకెయ్యండేహె' అని తన సహచరులను ఆదేశించి తాను చుక్కాని పట్టుకున్నాడు. ఆ వెంటనే మిగతా ముగ్గురూ నానాపాట్లూ పడి తెరచాపని ఎత్తికట్టి, తిప్పి సరిచేసారు. పది నిమిషాల్లో అయిపోయే పనికి గంట పట్టింది. జాలరులకు పడవ మీద నిలదొక్కుకొని నిలబడడమే ఒక పెద్ద సవాలుగా మారింది. ఎప్పుడైతే వాలుగెడని కట్టి ఉంచిన తాళ్లను విప్పి, చుట్టి ఉంచిన తెరచాపని కాస్త పైకి లేపారో లేదో, దాంతో మొదలయ్యాయి నానా పుర్రాకులూను. గాలి ఉధృతానికి తెరచాప 'ఫట్, ఫట్' అంటూ కొట్టుకుంటూ, దాని క్రింద వ్రేలాడే అడ్డుగడ అదుపుతప్పి అటూఇటూ ఊగసాగింది. దాన్ని తాళ్లతో నిలువరించడానికి వీలు చిక్కడం లేదు. పడవేమో చిత్తం వచ్చినట్లు ఊగిపోతోంది.

"దీనమ్మ!...నిలుస్తంది కాదేటీ?" అంటూ విసుక్కున్నాడు కన్నబాబు.

అంతలోకే ఆ గడ రయ్యిమని వెనకాతలనించి దూసుకొని వచ్చి ఠపీమని అతని తలని తాకింది.

"ఒరే, కన్నా...", అని గంగరాజు హెచ్చరిస్తూనే ఉన్నాడు.

గాలి శబ్దానికి కన్నబాబుకి వినబడలేదు; తిన్నగా వెళ్లి నీళ్లల్లో పడ్డాడు. అతన్ని పైకి లాగడానికి అరగంట పట్టింది. జాలరులకి నీళ్లల్లో పడడం, మళ్లీ పడవలోకి ఎగబాకడం కొత్తేమీకాదు. నిత్యం జరిగేదే. కానీ తలకి దెబ్బ తగలడంతో కన్నబాబుకి స్పృహ తప్పింది. కాలూ చెయ్యీ అతని స్వాధీనంలో లేవు. నూకరాజూ, అప్పల్రాజూ నీళ్లల్లో దూకి, కన్నబాబు రెక్కలు పట్టుకొని లాక్కొచ్చారు. నానా తంటాలూ పడి అతడి భారీకాయాన్ని ఊగుతూన్న పడవలోకి ఎక్కించారు. పడుకోబెట్టారు.

"ఆడ్ని తాడేసి బల్లకి కట్టీండ్రా" అని గంగరాజు ఆదేశించాడు. ఊగుతూన్న పడవలోంచి జారి మళ్లీ నీళ్లల్లో పడతాడేమోనని అతని భయం.

నూకరాజూ, అప్పల్రాజూ – ఇద్దరూ కలిసి కొబ్బరితాడుతో కన్నబాబు నడుముని అడ్డుబల్లకి బలంగా బిగించి కట్టేశారు. నిముషంపాటు తెరిపివ్వకుండా అదేపనిగా ఊగిపోతూన్న పడవ మూలంగా అతి కష్టం మీద ఆ పని పూర్తి చేశారు.

కన్నబాబు బాధ్యతని అతని భార్య గంగరాజుకి అప్పగించింది. ఆమె కూడా వరసకి చెల్లెలే. "అన్నియ్యా! నా పెనిమిటిని నువ్వే కనిపెట్టి సూసుకోవాల. ఈ మద్దిన ఆడికి తాగుడెక్కువైపోయింది. ఏటకెల్లడం మానీసి, బేవార్సుగాల్ల తోన కూడి రోడ్లమ్మట బలాదూరుగా తిరుగుతున్నాడు. లచ్చిమీ టాకీసు కొబ్బరితోటకాడ ఓ ముండని మరిగాడు. నాకు తెల్దనుకుంటన్నాడుగానీ నాను సేపలమ్మి తెచ్చిన డబ్బులన్నీ దానికే పోస్తన్నాడు, ఏవైనా అంటే కాబూలోల్లకి వొడ్డీలు కడతన్నానంటాడు," అంటూ కన్నబాబుని అప్పజెప్పింది.

ఆమెకు భార్య గంగమ్మకూడా వంతపాడింది. గంగరాజు కాదనలేకపోయాడు; తన పడవమీద పెట్టుకున్నాడు. కన్నబాబు పనిమంతుడేగాని ధీమా ఎక్కువ. గంగరాజు దగ్గర భయపడతాడు; ఎదురుగా ఏమీ మాట్లాడడు. మిగతా వాళ్ల వద్ద మాత్రం తనకే అన్నీ తెలుసని గొప్పలు చెప్పుకుంటాడు.

కెరటాలు పడవ మీదకి దూసుకొచ్చినప్పుడల్లా కన్నబాబు తలకి అయిన గాయానికి ఉప్పునీళ్లు తగిలి మండిపోతున్నది. ఆ మంటకి అతనికి తెలివి వస్తూ పోతూ ఉంది. అప్పుడప్పుడు –

"అమ్మా, అబ్బా" అని మూలుగుతున్నాడు. పడుకోబెట్టిన చోటనే పడి ఉన్నాడు. ఏదేదో గొణుగుతున్నాడు. ఒక్క సారి మాత్రం –

"ఒరేయ్! సించ కొట్టేస్తందిరా!...ఒడ్డుకేసీండ్రా, బాబ్బాబు! ఇంటికెలిపోదాం, పదండ్రా" అని పెద్ద కేక పెట్టాడు.

అది అపస్మారక స్థితిలో చేస్తూన్న ప్రేలాపన అని మిగతా ముగ్గురికీ అర్థం అయింది. కన్నబాబు ఆక్రందనల్ని పట్టించుకొనేందుకు వాళ్లకి పురసత్తు లేదు. పడవని కాపాడడంలో పూర్తిగా నిమగ్నమై ఉన్నారు; ఇంకేదీ ఆలోచించే పరిస్థితి లేదు.

ఇటువంటి తుఫానులో పడవని ముగ్గురితో ఒడ్డుకి మళ్లించాలంటే తలకుమించిన పని. 'పడవగాని పల్టీ కొట్టిందంటే...?' ఏమి చెయ్యడానికీ గంగరాజుకి తోచడంలేదు. ఆ నిమిషంలో అతని కళ్ల ముందు భార్య గంగమ్మ, కొడుకు వెంకటేశు, ముద్దుల కూతురు ఎల్లమ్మ మెదిలారు. శక్తినంతటినీ కూడదీసుకొని వాళ్లందర్నీ మనసులోంచి బలవంతంగా బయటకు నెట్టాడు.

* * *

తెల్లవారేటప్పటికి ఇల్లు చేరుకోవల్సింది, రోజంతా నానా తిప్పలూ పడ్డారు గానీ దిక్కుతోచడం లేదు. చీకటైనా ఇంకా ఇక్కడే ఎక్కడో నడి సముద్రంలో చిక్కుకుపోయి ఉన్నారు. ఎక్కడున్నారో కూడా తెలిసిచావడం లేదు.

"లైటవుసు కనబడదేటి మాయ్యా?" అని మరోసారి అరిచాడు నూకరాజు.

'ఈడినెందుకు ఎంటేసుకొచ్చానా, బగమంతుడా' అనుకుంటూ మథనపడ్డాడు గంగరాజు. నూకరాజు ప్రశ్న వినబడనట్టు ఊరుకుండిపోయాడు. మేనల్లుడి ప్రాణానికి తన ప్రాణం అడ్డం పెడతానని చెల్లెలికి మాటిచ్చిన విషయం గుర్తుకొచ్చిందతనికి.

చీకటి కావడంతోనే యారాడ కొండమీది లైటు హవుసు దీపం కనబడి దారి చూపుతుందని ఆ పడవలోని నలుగురు జాలర్లూ చాలా ఆశపడ్డారు. ప్రతీ పది సెకెన్లకూ ఒకసారి వెలుగు చిమ్ముతూ అది ప్రసరించే కాంతి పుంజం వాళ్ల బతుకుల్ని ఒడ్డెక్కించగల ఏకైక ఆశాకిరణం. అర్ధరాత్రి కావస్తున్నా దాని జాడే లేదు.

'అంటే అంత దూరం ఒచ్చీసారా?...మోజా ఉత్తరానికి కొట్టీసుంటాది. గాలి సూత్తే ఒగ్గకుండగ తూరుపునుండే కొడతంది. అంటే ఏటన్నమాట? ఏ నిమిసానికైనా యారాడకొండ లైటు హవుసు కనబడాల; ఇసాపట్నం దీపాలు అవుపించాలి. పోనీ మరీ దూరం కొట్టుకుపోయినా, ఒడ్డంబడి ఉండే ఊళ్ల తాలూకు దీపాలో ఏవో ఒకటి కనబడాలి కదా!...తను తూరుపనుకుంటున్నది మరే దిక్కో?' ఈ విధంగా సాగుతున్నవి గంగరాజు ఆలోచనలు.

తిండీ, నిద్రాలేక గంగరాజుకి తలనెప్పిగా ఉంది. ఒంట్లో శక్తి క్షీణించింది. చలికి చిన్న వణుకు పుట్టింది. చుట్ట వెలిగించి ఒక దమ్ము లాగాలని అతనికి బలంగా అనిపించింది. పొగాకు కోసం దవడలు పీకుతున్నాయి. చుట్టలూ, అగ్గిపెట్టెలూ మొత్తం అన్నీ మొదటే తడిసి ముద్దయ్యాయి. ఆ తరవాత వాళ్ల చేతి సంచులన్నీ సముద్రంలో పడి కొట్టుకుపోయాయి. అంతవరకూ పట్టిన చేపల్ని ఉంచిన తాటాకు బుట్టలు కూడా అలాగే నీటి పాలయ్యాయి. ఆ తరవాత వాళ్లు భోజనాలు తెచ్చుకున్న క్యారియర్లు బయటకి పోయాయి. అయినా ఇప్పుడు నిలకడగా కూర్చొని భోజనాలు చేసే అవకాశం లేనేలేదు. హరికేను లాంతరు పగిలి ఆరిపోయింది. టార్చి లైటు పనిచెయ్యడం లేదు. వలల్ని మాత్రం కాపాడుకోగలిగారు.

అదృష్టం ఏమిటంటే తాగేందుకు నీళ్లకి కరువులేదు. ఏకధారగా వర్షం కురుస్తూనే ఉంది. తలగుడ్డలు పిండి ఆ నీటిచుక్కలు నాకుతున్నారు. నూకరాజు నిక్కరూ బనీనూ వేసుకున్నాడు; మిగతా ముగ్గురూ గోచీల్లోనే ఉన్నారు. తలగుడ్డల్ని నడుములకు చుట్టుకున్నారు. ఎవరికీ కాళ్లకి చెప్పుల్లేవు. ఆ చిన్న పడవమీద నీళ్లల్లో నానుతూ, దాని ఊగిసలాటకి నిలదొక్కుకుంటూ, చెక్కలమీద నిలబడే ఉన్నారు. కాళ్లు లాగుతున్నాయి; అరచేతులూ, అరిపాదాలూ ఒరిసిపోయి మంటపెడుతున్నాయి.

ఒకపక్క ఎడతెరిపి లేకుండా ఒకదాని వెంట ఒకటిగా వచ్చి మీద పడుతూన్న కెరటాలూ, పైనుంచి అదేపనిగా సూదులతో గుచ్చినట్లుగా వర్షం – వాళ్లని పూర్తిగా ముంచెత్తుతున్నవి. వీటికి తోడు రొజ్జగాలి.

తుఫాను మూసుకొచ్చినప్పటినుండీ గంగరాజు తన అనుచరుల పనితీరును ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు. దెబ్బ తగిలిన కన్నబాబు ఇప్పుడు మూలుగుతూ పడిఉన్నాడు గానీ మిగతా ఇద్దరూ – మేనల్లుడు నూకరాజు, దూరపు చుట్టం అప్పల్రాజు – ఊగిసలాడుతున్న పడవమీద చకచకా కదులుతున్నారు; విసుగూ, విరామం లేకుండా పిచ్చెత్తినట్టు పనిచేస్తున్నారు. గాలి చేస్తున్న భయానక ధ్వనులకన్నా హెచ్చు స్వరంలో బిగ్గరగా అరుస్తూ, ఒకరికొకరు సాయపడుతూ చిరిగి పీలికలవుతూన్న తెరచాపని ఎటు తిప్పమంటే అటు తిప్పుతున్నారు; తాళ్లతో కట్టి నిలుపుజేస్తున్నారు. పడవని కాపాడుకుంటూ వస్తున్నారు. నిద్రాహారాలు లేకపోయినా మరో పూట కూడా వీళ్లిద్దరూ తట్టుకొని నిలబడగలరని గంగరాజుకి నమ్మకం కుదిరింది. 'కానీ రేపు మద్దేనానికైనా ఒడ్డుకి చేరకపోతే...?'

ఈమధ్య కొందరు జాలరులు బిగినీసు (బిజినెస్) అంటే స్మగ్లింగ్‌లోకి అడుగుపెట్టారు. సీకో లేదా సిటిజెన్ వాచీలు, ట్రాన్సిస్టర్లు, నైలెక్సు చీరలూ...వీటికి మంచి రేట్లు వస్తున్నాయి. అలా బాగా గడించిన జాలరులో గంగరాజు బావమరిది, అంటే భార్య గంగమ్మ తమ్ముడు సింహాచలం కూడా ఉన్నాడు. ఆ వ్యాపారం ఎప్పటికైనా ప్రమాదమే అనీ, కులవృత్తి అయిన చేపలవేట మీదే దృష్టి పెట్టమనీ గంగరాజు ఎంత మొత్తుకున్నా సింహాచలం వినిపించుకోలేదు.

ఒక రోజున కొంచెం మందు పుచ్చుకున్నాక,

"నీ తల పండిపోయిందిగానీ, నీకు బాగుపడ్డం తెలీలేదు బావా!" అనేశాడు సింహాచలం.

అప్పటినుంచీ వాళ్లిద్దరి మధ్యా అంతగా మాటల్లేవు. తన కొడుకుని సింహాచలం చేరదీస్తున్నాడని అప్పల్రాజు తల్లికి తెలిసింది. ఆమె గంగరాజుకి పిన్ని వరస అవుతుంది. అందుకే ఆమె అప్పల్రాజుని బిగినీసు జట్టు నుండి తప్పించి గంగరాజుకి అప్పగించింది.

అప్పల్రాజు ఆ పడవలో ఉన్న నలుగురిలోకీ కొంచెం భయస్థుడు; పైగా సున్నిత మనస్కుడు. సినీమా చూశాడంటే ఏడవకుండా బయటకి రాడు. అలాగని సినీమాలు చూడడం మానడు. ఎన్టీవోడికి వీరాభిమాని. ఈసారంటే ఇలాగైందిగానీ, సముద్రం ప్రశాంతంగా ఉన్నప్పుడు ఘంటసాల పాటలు శ్రావ్యంగా పాడతాడు, నాటకాల్లోని పద్యాలు ఖణీమని చదువుతాడు. జుత్తు పెంచి ముడి వేసుకుంటాడు. కళ్లకు కాటుక, చెవులకి పోగులు పెట్టుకుంటాడు; బొట్టు పెట్టుకుంటాడు. ఎవరూ చూడనప్పుడు,

ఇంట్లో ఒక్కడూ ఉంటే, ఒక్కోసారి చీరకూడా కట్టుకుంటాడు. నాటకాల్లో, జాతర్లలో ఆడవేషం వేసే అవకాశం దొరికితే వదిలిపెట్టడు. 'ఆడారెదవ!' అని అంతా అతడిని హేళన చేస్తూంటారు. 'ఆడారి' అనేది అతడి ఇంటి పేరుగా స్థిరపడిపోయింది. 'పెళ్లెప్పుడు చేసుకుంటావురా? మంచి పిల్ల ఉందిరా, మాటాడమంటావా? పెళ్లిగానైతే పెళ్లాంతో ఏం చేస్తావురా?' అని వెటకారంగా అడుగుతూంటారు. ఆడారి అప్పల్రాజు ఓ వెర్రినవ్వు నవ్వి ఊరుకుంటాడు. గంగరాజు చిన్నాన్న పడవలో అయితే అతనికి ధైర్యంగా ఉంటుంది. ఎవరూ తన జోలికి రాకుండా, తనని వేధించకుండా చిన్నాన్న చూసుకుంటాడు. మిగతా వాళ్లెవరూ అప్పల్రాజుని తమతో బాటు వేటకు తీసుకెళ్లడానికి సుముఖంగా ఉండరు. ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటారు.

ఈ గండంగాని గట్టెక్కిస్తే దర్శనం చేసుకొని తలనీలాలు సమర్పించుకుంటానని సింహాచల నృసింహస్వామికి మొక్కుకున్నాడు అప్పల్రాజు. దాంతో అతనికి గొప్ప ధైర్యం కలిగింది. మరి కాసేపట్లోనే ఆ భగవంతుడు కనికరించాడు.

"మావా! అటుకాసి చూడు! యారాడ కొండ లైటు హవుసు!" చెయ్యి చూపిస్తూ నూకరాజు బిగ్గరగా అరిచాడు.

అంతా అటువైపు చూశారు. నిజమే, లైట్ హౌస్ దీపం వెలిగి ఆరింది! అందరికీ దుఃఖం ముంచుకొచ్చింది. నిజానికి ఆ దుఃఖానికి మూలం పట్టరాని ఆనందం. అప్పల్రాజు ఇక ఉండబట్టలేకపోయాడు.

"అమ్మా, మా తల్లీ! గంగమ్మతల్లీ! మమ్మల్నియ్యేల రచ్చించావు తల్లీ!" అనేశాడు బొంగురు గొంతుతో – ఎగదోసుకొస్తున్న ఏడుపుని ఆపుకుంటూ.

అప్పల్రాజుకే కాదు; వాళ్లందరి కళ్లల్లోనూ నీళ్లు ధారలు కట్టాయి. ఆ చీకటి, వర్షం వాటిని దాచిపెట్టాయి. తమలో పెల్లుబుకుతూన్న ఉద్వేగాన్ని బయటకు తెలియనివ్వలేదు. ఆ దుఃఖంతో కూడిన ఆనందాన్ని లోలోపలే దాచుకున్నారు. కాసేపు మౌనంగా ఉండిపోయారు.

గంగరాజుకి మాత్రం ఎక్కడో తేడా ఉందని అనిపించింది. ఆ లైట్ హవుసు దిశగా కళ్లు చిట్లించుకొని చూడసాగాడు. అతని లెక్కప్రకారం అది ఉత్తరాన ఉంది. యారాడ కొండ లైట్ హవుసయితే దక్షిణాన ఉండాలి కదా? పైగా అది ఎత్తుగా కొండపైన ఉన్నట్టు తోచలేదు. సముద్రమట్టానికే ఉంది.

"అది యారాడ కొండ కాదురా నూకాలూ, ఇంకేదో లైటు హవుసు అయ్యుంటాదిరా" అన్నాడు.

"ఏదో ఓటిలే, మాయ్యా! ఒడ్డు దొరికిపోయింది కదా?" అన్నాడు, నూకరాజు అసహనంగా.

చీకటి రాత్రి ముగిసింది. ఒక వైపున వెలుతురు వికసించనారంభించింది. తూర్పు దిక్కు ఎటువైపు ఉన్నదీ స్పష్టంగా తెలియవచ్చింది ఆ దిక్కుతోచని జాలరులకు.

'అబ్బే, అది యారాడ కొండ కాదు, ఇంకేదో ఊరు' అని మనసులో అనుకున్నాడు గంగరాజు. లైటు హవుసు ఇంకా వెలుగుతూనే ఉంది గానీ అది కొండ మీద లేదు. ఒడ్డునే ఉంది.

నూకరాజూ, అప్పల్రాజూ కూడా అదే అనుకున్నారు. ఎవరూ బయటకి అనలేదు. చీకటి వడివడిగా తొలగిపోతున్నది. సముద్రం కూడా కొంత నిమ్మళించింది. తూర్పు గాలి బలంగా, నిలకడగా వీస్తున్నది. సరుగుడు చెట్లతో కూడిన సన్నటి తీరరేఖ దూరాన కనబడుతోంది. అందరిలోనూ ఉత్సాహం వెల్లివిరిసింది. అలసటని మర్చిపోయారు. ఇక ఒడ్డు చేరుకోవడమే తరువాయి.

అప్పుడు జరిగిన ఊహించని సంఘటన ఆ జాలరుల్ని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టివేసింది.

'జమీల'

కేప్టెన్ జిమ్మీ పెరేరా అనుభవశాలి అయిన నావికుడు. గత అయిదేళ్లుగా వాణిజ్య నౌకలకు కేప్టెన్ గా పని చేస్తున్నాడు. కలకత్తా నివాసి; తెలివైనవాడు, పనిమంతుడు. ముప్పై అయిదేళ్లకే పరీక్షలన్నీ పాసై కేప్టెన్ అయ్యాడు. అతని వాణిజ్య నౌక 'జమీల' మద్రాసు నుండి కలకత్తా వెళ్తోంది. మద్రాసు రేవునుండి బయల్దేరగానే రేడియో ద్వారా తుఫాను హెచ్చరికను అందుకున్నాడు. తుఫాను అండమాను ద్వీపాలలో కేంద్రీకృతం అయిందనీ, మొదట ఉత్తరదిశగానూ, ఆ తరువాత ఈశాన్యదిశగానూ ప్రయాణించి ఒరిస్సా తీరాన్ని తాకుతుందని అప్పటి సమాచారం. తాము తుఫాను బారిన పడకుండా తప్పించుకోగలమని అతడు భావించాడు. కానీ వాతావరణశాఖ వారు ఊహించినట్లుగా కాకుండా తుఫాను కేంద్రం వేగంగా, వంకరటింకరగా కదిలింది. మచిలీపట్నం రేవుని దాటుతూండగా అలల ఉధృతి తీవ్రతరం అయింది. నర్సపూర్ పాయింట్‌లో అంటే – గోదావరి నది బంగాళాఖాతంలో కలిసే చోట – లైట్ హౌస్‌ని దాటగానే తుఫాను తాకిడి పూర్తి స్థాయిలో వారి నౌకపై విరుచుకు పడింది.

కేప్టెన్ జిమ్మీ శాండ్విచ్‌లు తింటూ, కాఫీ తాగుతూ రాత్రంతా బ్రిడ్జి మీదనే ఉన్నాడు. అర్ధరాత్రికి ముందుగానే, డాల్ఫిన్స్ నోస్ లైట్ హవుసును గుర్తించాక, థర్డ్ మేట్ వాచ్‌లో అక్కడే సెట్టీమీద కాసేపు నిద్రపోయాడు. 'ఎప్పటిలాగానే రాత్రిపూట కనిపించే లైట్ హవుసుల్నీ, పగలైతే సుదూరాన గోచరించే తూర్పు కనుమల రూపురేఖల్నీ గుర్తిస్తూ తీరానికి ఒకింత చేరువగానే ప్రయాణాన్ని కొనసాగించడమే ఉత్తమం,' అని నిద్రకు ఉపక్రమిస్తూ అనుకున్నాడు కేప్టెన్ జిమ్మీ. అవసరమైతే లేపమని సెకెండ్ మేట్‌కి చెప్పి చిన్న కునుకు తీశాడు. ఓ రెండు గంటలు పడుకొని ఉంటాడేమో. మధ్యలో తెలివి వస్తూనే ఉంది. ఓడ ఊగిసలాట ఎక్కువైంది. సెట్టీ పైనుండి క్రిందికి జారి, ఉలిక్కిపడి లేచాడు. చూడబోతే సమయం అయిదవుతోంది; తెల్లవారుతున్న సూచనలేవీ ఇంకా కనబడడం లేదు. ఛీఫ్ ఆఫీసర్ వాచ్‌లో ఉన్నాడు.

తుఫాను దృష్ట్యా భద్రత కోసం తీరం నుండి కొంత దూరంగా, నడి సముద్రంలోకి మళ్లించడం మంచిదేమో అని ఛీఫ్ ఆఫీసరు సాయంత్రమే సూచించాడు. ఆ సూచనను కేప్టెన్ జిమ్మీ ఆమోదించలేదు. ఇప్పుడు చూస్తే తుఫాను ఉధృతి కాస్త తగ్గింది. కానీ కెరటాలు ఇంకా 'జమీల' పార్శ్వాన్ని కుడివైపున ఢీకొడుతూ, ఓడని అదేపనిగా కుదుపుతూ, నిరంతరంగా దొర్లిస్తున్నాయి. ఇప్పుడు ఇంజినుగాని ఆగిందా – ఓడ తీరంవైపుగా నెట్టివేయబడడం, ఒడ్డెక్కిపోవడం ఖాయం. విశాఖపట్నం చుట్టుపక్కల ఉండే తీరం అంతా రాళ్లమయం కూడాను. జిమ్మీ ఆరిపోయిన పైపుని ఖాళీచేసి, పొగాకు దట్టించి మళ్లీ వెలిగించాడు. చుట్టూ చిమ్మ చీకటి. భారీ వర్షం. మెరుపు మెరిసినప్పుడల్లా కనిపించే ముప్పై అడుగుల ఎత్తైన కెరటాలు. బ్రిడ్జికి రెండువైపులా వింగ్స్ నుంచి గాలి చేసే వింత ధ్వనులు.

ఛీఫ్ ఆఫీసర్‌ని ఉద్దేశించి, "ఈమెను సమాంతర మార్గానికి మళ్లించు – తీరానికి ఇరవై మైళ్లు ఎడంగా – కుడివైపుకి," అన్నాడు. ఓడని స్త్రీగా పేర్కొనడం నౌకా దళ పరిభాషలో అనాదిగా వస్తూన్న ఆచారం.

ఇప్పటికైనా తన సలహాను పాటిస్తున్నందుకు సంతోషిస్తూ, ఛార్టు చెక్ చేసి –

"యెస్, సర్. ఈమెను సమాంతరమార్గానికి, ఇరవై మైళ్లు ఎడంగా, కుడివైపుకి," అని డ్యూటీలో ఉన్న చుక్కానీని ఉద్దేశించి-

"స్టార్బోర్డ్ టెన్," అని అరిచాడు ఛీఫ్ ఆఫీసర్.

జవాబుగా "స్టార్బోర్డ్ టెన్ సర్," అన్నాడు చుక్కాని. చేతిలోని చక్రాన్ని కుడివైపు తిప్పాడు. ఆదేశాలను యథాతథంగా పునరుచ్చరించడం కూడా నౌకాదళ ఆచారమే. ఆదేశం అందుకున్నవారు దాన్ని సవ్యంగా గ్రహించారని ఆ విధంగా నిర్ధారణ అవుతుంది.

ముందుజాగ్రత్త చర్యగా, "నథింగ్ టు పోర్ట్," అన్నాడు ఛీఫ్ మేట్. ఎట్టి పరిస్థితులలోనూ ఎడమవైపు మళ్లకూడదని అర్థం.

"నథింగ్ టు పోర్ట్, సర్," అని జవాబిచ్చాడు చుక్కాని.

"హెడింగ్ కిత్నా హై?" ఛీఫ్ ఆఫీసర్ అడిగాడు చుక్కానీని.

"జీరో-ఫోర్-జీరో, సర్"

"జీరో-ఫైవ్-జీరో"

"జీరో-ఫైవ్-జీరో, సర్"

"స్టెడీ యాజ్ షి గోస్"

"స్టెడీ యాజ్ షి గోస్, సర్" కోర్స్‌లో చేసిన మార్పుని ఛార్టులో గుర్తించాడు సీనియర్ కేడెట్.

బ్రిటీషు కంపెనీలో తర్ఫీదు పొందిన కేప్టెన్ జిమ్మీవన్నీ పాతకాలపు పద్ధతులు. క్రమశిక్షణలో ఏ చిన్న తేడా వచ్చినా సహించడు. తలవాచేలా చివాట్లు పెడతాడు. అలాగని ఎవరైనా ఏదైనా మంచి సలహా ఇస్తే కొట్టిపారెయ్యడు. సౌమ్యంగా వింటాడు; చర్చిస్తాడు. 'నువ్వు నాకు చెప్పేటంత వాడివా?' అన్నట్లుగా ప్రవర్తించడు – కొంతమంది ఇండియన్ కేప్టెన్ల మాదిరిగా.

పాతకాలం వాళ్లందరిలాగానే కేప్టెన్ జిమ్మీకి కూడా మూఢనమ్మకాలు కాస్త ఎక్కువే. మద్రాసులో బయిల్దేరిన రోజున కొత్తగా చేరిన కేడెట్ – బ్రిడ్జిమీద కేప్టెన్ ఉన్నాడని కూడా గమనించకుండా – డెక్ మీద ఉన్న సరంగుని పిలవడానికి ఈల వేసాడు. అంతే, జిమ్మీ అతగాడి మీద విరుచుకుపడ్డాడు. మళ్లీ బ్రిడ్జి మీదకి రావద్దని అరిచాడు. 'వాడిని డెక్ తుడిచే పనికే పరిమితం చెయ్యి! బ్రిడ్జి మీదకి రానివ్వకు! పనికిమాలిన వెధవ!' అని ఛీఫ్ ఆఫీసర్‌ని ఆదేశించాడు. బ్రిడ్జిమీద ఈలవేస్తే తుఫాను గాలిని ఆహ్వానించడమే అని కేప్టెన్ దృఢ విశ్వాసం. కేడెట్లకి సరిగ్గా తర్ఫీదు ఇవ్వడంలేదని ఛీఫ్ ఆఫీసర్ని కూడా తప్పుపట్టాడు. ఆరోజు ఉదయాన్నకూడా –

"అదిగో, ఆ ఇడియట్ బయిల్దేరుతూనే ఈల వేశాడు; అప్పట్నించి ఈ తుఫాను తగులుకుంది," – అని ఎగిరాడు.

అతను బ్రిడ్జిమీద ఉన్నాడంటే డెక్ అఫీసర్లకి కాస్త బెరుగ్గానే ఉంటుంది. కానీ ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కేప్టెన్ బ్రిడ్జి మీద ఉంటేనే ధైర్యంగా ఉంటుంది.

"ఛీఫ్ ఇంజినీరుతో మాట్లాడావా? నెంబర్ ఫోర్ బాయిలర్లో ఏదో ప్రాబ్లం అన్నాడు, నిన్న?" అన్నాడు జిమ్మీ, ఛీఫ్ ఆఫీసర్ని ఉద్దేశించి.

"అర్ధరాత్రికల్లా అన్ని బాయిలర్లూ పనిచేస్తున్నాయి. ఇంజినీర్లంతా అక్కడే – ఇంజిన్ రూములోనే ఉన్నారు ఓ గంట క్రితం వరకూ. స్టీమ్ ప్రెషర్ నిలకడగానే ఉంది. సెకెండ్ ఇంజినీరు వాచ్‌లో ఉన్నాడు. ఛీఫ్‌ని లేపమంటారా?" ఛీఫ్ ఇంజినీరు పాతకాలం మనిషి. వయసులో పెద్దవాడు. కేప్టెన్ జిమ్మీకి అతనంటే మంచి గురి. మామూలుగా అయితే కేప్టెన్ బ్రిడ్జిమీద ఉన్నప్పుడు ఛీఫ్ ఇంజినీరు కూడా తోడుగా ఉంటాడు.

"అలసిపోయి ఉంటాడు. నిద్రపోనీలే, పాపం. పొద్దున్న బ్రేక్‌ఫాస్ట్ టైంలో మాట్లాడతాను. కాఫీ చెయ్యమని కేడెట్‌కి చెప్పు," 'జమీల'- ఆవిరి యంత్రంతో పనిచేసే పాతకాలపు ఓడ. దాని మెయిన్ ఇంజిను తరచూ మొరాయిస్తూ ఉంటుంది. అది మార్గమధ్యంలో చెప్పాపెట్టకుండా ఆగిపోవడమూ, ఇంజినీర్లు ఇంజిన్ రూం

వేడిలో, బాయిలర్ల నడుమ రాత్రింబవళ్లు చెమటలు కక్కుతూ రెక్కలుముక్కలు చేసుకొని దాన్ని సముదాయించి దారికి తీసుకురావడమూ ఆ ఓడలో నిత్యకృత్యం.

"ఇప్పుడన్నీ ఆయిల్‌తో పనిచేసే బాయిలర్లే. కుర్ర ఇంజినీర్లు దీనికే ఇంత ఏడుస్తారు. డీజిల్ ఇంజిన్లు ఉన్న షిప్పులలో పోస్టింగు కోసం అడుగుతున్నారు. బొగ్గుతో పనిచేసే బాయిలర్లలో పనిచేస్తే తెలిసొచ్చేది, కష్టం అంటే ఏమిటో," అంటూంటాడు – రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ వాణిజ్య నౌకల్లో పనిచేసిన ఆ ఛీఫ్ ఇంజినీరు.

అంతా బాగుండే రోజుల్లో అయితే కేప్టెనూ, ఛీఫ్ ఇంజినీరూ రోజూ డిన్నర్‌కి ముందు కాస్త విస్కీయో, రమ్మో తీసుకుంటారు – రోజుకొకరి కేబిన్లో. పాత రోజుల్నీ, గతంలో తమతో ప్రయాణించిన సహనావికుల్నీ తల్చుకుంటూ – 'చీర్స్' చెబుతారు.

కేప్టెన్ చార్ట్ టేబిల్ వద్దకు వెళ్లి మారిన కోర్సుని (మార్గాన్ని) పెన్సిల్‌తో గుర్తిస్తూన్న ఛీఫ్ ఆఫీసర్ పనితీరుని గమనిస్తూ –

"డాల్ఫిన్స్ నోస్ లైట్ హౌస్‌ని పదకొండుకి దాటాం కదా?" అన్నాడు.

"అవును సర్. థర్డ్ మేట్ వాచ్‌లో."

"కళింగపట్నం లైట్ దాటామా?" కేప్టెన్ అడిగాడు సీనియర్ కేడెట్‌ని.

"నో సర్. ఇప్పుడింక సూర్యోదయానికి ముందుగా కళింగపట్నం లైట్ హౌస్ కనబడాలి – ఆరు లోపల. కానీ కనబడదేమో, సర్; తీరానికి దూరంగా వెళ్లిపోతున్నాం కదా?"

"మనం ఊహించినంత సులభం కాదురా, అబ్బాయ్! కెరటాలు, గాలీ, ప్రవాహం అన్నీ మనల్ని తీరం వైపే నెడుతున్నాయి. స్పీడు కూడా బాగా తగ్గింది." ఛీఫ్ ఆఫీసర్ని ఉద్దేశించి, "ఒకసారి రేడార్ చూసి తీరం కనిపిస్తే చెప్పు."

"కెరటాల మూలంగా రేడార్ ఏమంత స్పష్టంగా లేదు సర్, క్లట్టర్ బాగా ఎక్కువగా ఉంది."

"అలాగని రేడార్ని చెక్ చేస్తూండడం మాత్రం మానకు. కోస్తాకి దగ్గరగా ప్రయాణిస్తున్నప్పుడు రాత్రిపూట ఒక కేడెట్ సరిపోడు. వింగ్స్ మీద రెండు పక్కలా చెరో లుకౌట్ ఉండాలి. ఇంతకుముందు కూడా నీకు చెప్పాను. ఇవన్నీ రొటీన్ విషయాలు. మళ్లీమళ్లీ చెప్పించుకోకు. రేపోమాపో కేప్టెన్‌వి అవుతావు. అవసరం ఉన్నప్పుడు మనుషుల్ని పనికి వినియోగించడం నేర్చుకో."

"యెస్ సర్," అని ఛీఫ్ ఆఫీసరు కేడెట్‌ని క్రిందికి పంపించి మరో లుకౌట్‌ని రప్పించాడు.

కేప్టెన్ జిమ్మీ గనక సిఫారసు చేస్తే ఛీఫ్ ఆఫీసరు త్వరలోనే కేప్టెన్‌గా ప్రమోట్ అయ్యే అవకాశాలు బాగా ఉన్నాయి. జిమ్మీ చెప్పాడంటే కంపెనీ యాజమాన్యం శిరసావహించాల్సిందే.

కేడెట్ తెచ్చి ఇచ్చిన బ్లాక్ కాఫీ తాగి, పైపు వెలిగించి,

"డీఆర్ (డెడ్-రికనింగ్ – ఊహాత్మక స్థానం; తీరం, కొండలూ, లైట్ హవుస్‌లూ కనబడనప్పుడు, రేడార్ ద్వారా ఏమీ తెలియరానప్పుడు – ఓడ స్థానాన్ని వేగాన్ని, దిశని ఆధారం చేసుకొని ఉజ్జాయింపుగా అంచనా వేసే విధానం) - పొజిషన్ లెక్కవేసి ఎక్కడున్నామో చెప్పు," అన్నాడు జిమ్మీ.

ఛీఫ్ ఆఫీసరు ఛార్ట్ టేబిల్ వద్దకు పరుగెత్తాడు. "మరికాసేపట్లో కళింగపట్నం లైట్ దాటాలి సర్," అని అరిచాడు.

తూర్పుదిశన ఆకాశం కొద్దికొద్దిగా ఊదారంగులోకి మారుతోంది. తెల్లవారే సూచనలు కనిపిస్తున్నాయి. అలల ఉధృతి కూడా కాస్త నెమ్మదించింది. కేప్టెన్ అపనమ్మకంగా బైనాక్యులర్స్ తీసి ఓడకి ఎడమవైపుగా, పశ్చిమంగా చూశాడు. తెల్లవారిందంటే గండం గడచినట్లే.

"లైట్ ఆన్ పోర్ట్ సైడ్," అని అరిచాడు పోర్ట్ (ఎడమవైపు) వింగ్‌లో లుకౌట్‌గా ఉన్న సీనియర్ కేడెట్.

ఛీఫ్ ఆఫీసర్ మరో బైనాక్యులర్ తీసి ఆ దిశగా చూశాడు. లైట్ కనబడింది. సెకెండ్లు లెక్కించసాగాడు. పదిహేను సెకెండ్లకు మళ్లీ కనిపించింది. సందేహం లేదు. అది కళింగపట్నం లైట్ హవుసే. నేవిగేషన్ ఛార్టు చూసి నిర్ధారించుకున్నాడు – ఎందుకైనా మంచిదని.

"ఫ్రీక్వెన్సీ ఫిఫ్టీన్ సెకెండ్స్, పాసింగ్ కళింగపట్నం లైట్ ఆన్ పోర్ట్ సైడ్ సర్," అని అరిచి నిర్ధారించాడు.

"గుడ్. బేరింగ్ తీసుకోమను," అన్నాడు కేప్టెన్.

"నేను తీసుకుంటాను సర్."

"దానికి నువ్వెందుకు? సీనియర్ కేడెట్ కదా, ఆమాత్రం తీసుకోలేడా? నువ్వు ఛార్టు అప్ డేట్ చెయ్యి," అన్నాడు కేప్టెన్ చిరాగ్గా. నిద్ర సరిపోక అతని కళ్లు మండుతున్నాయి.

"యెస్ సర్," అని ఛీఫ్ ఆఫీసర్ ఛార్టు టేబిలు వద్దకు వెళ్లాడు.

సరిగ్గా అప్పుడే –

స్టార్ బోర్డ్ సైడ్ (కుడి వైపు) వింగ్ పైన ఉన్న లుకౌట్ అరిచాడు –

"ఫిషింగ్ బోట్ డెడ్ ఎహెడ్ సర్." ఛీఫ్ ఆఫీసర్ స్టార్ బోర్డ్ వింగ్ పైకి పరుగెత్తాడు.

అప్పటికే జాలరుల పడవ ఒకటి తిరగబడి ఉన్నది – కుడివైపున, కెరటాల మధ్య – అస్పష్టంగా కనిపించింది. 'జమీల' దానిని దాటుకుంటూ ముందుకి వడిగా సాగిపోతోంది.

"తిరగబడి ఉన్న కంట్రీ బోటుని దాటిపోతున్నాం సర్" అన్నాడు ఛీఫ్ ఆఫీసర్.

"టైము నోట్ చెయ్యి. లాగ్‌బుక్‌లో ఎక్కించాలి. మనుష్యులెవరైనా కనిపించారా? నేనూ చూస్తాను, పద. సెర్చ్ లైటు ఆన్ చెయ్యి. ఇంజిన్‌రూముకి చెప్పు, స్పీడు తగ్గించాలి. డెబల్ రింగ్ హాఫ్ ఎహెడ్." సీనియర్ కేడెట్ సెర్చ్ లైటు స్విచ్చి ఆన్ చేశాడు. తిరగబడ్డ బోటు మీద కాంతిపడేలా దాన్ని తిప్పాడు.

"డెబల్ రింగ్ హాఫ్ ఎహెడ్ సర్," అంటూ ఛీఫ్ ఆఫీసర్ ఇంజిన్ టెలిగ్రాఫ్ పొజిషన్‌ని మార్చాడు.

"జబ్ తుమ్ పెహలీ బార్ దేఖా, ఫిషింగ్ బోట్ కైసా థా?" అని లుకౌట్ ని కేప్టెన్ అడిగాడు.

"సీధా థా సర్" కేప్టెన్‌కి అర్థం అయిపోయింది.

"మన ఓడ దాన్ని ఢీకొని, పల్టీ కొట్టించింది. సందేహం లేదు" అన్నాడు ఛీఫ్ ఆఫీసర్‌తో.

"ఈ జాలారివాళ్లకి కొంచెం కూడా బుద్ధిలేదు. తుఫాను హెచ్చరిక ఉన్నప్పుడు కూడా సముద్రంలోకి వస్తారు – మన ప్రాణాలు తియ్యడానికి," అని చిరాకుపడ్డాడు ఛీఫ్ ఆఫీసర్.

మరో ఆలోచన లేకుండా "ఏండర్సన్ మెనూవర్," అని కేక పెట్టాడు కేప్టెన్ జిమ్మీ.

ఛీఫ్ ఆఫీసర్ ఆశ్చర్యపోయాడు. కేప్టెన్ వైపు, 'ఇప్పుడది అవసరమా?' అన్నట్లు చూశాడు.

అతని ఆలోచనలు ముందుకి పరుగెత్తుతున్నాయి – 'చల్లగా జారుకుంటే?... ఎవడు చూడొచ్చాడు – ఈ మసక వెలుతురులో, తుఫాను మధ్య, నడి సముద్రంలో? ఖర్మకాలి ఆ జాలారివాళ్లెవరైనా చస్తే? ఎంక్వైరీ, సస్పెన్షన్...లేనిపోని తంటా,'

ఛీఫ్ ఆఫీసర్ తటపటాయించడం చూసి, "ఏమైంది? ఏండర్సన్ మెనూవర్ మర్చిపోయావా? నీకు చేతకాకపోతే చెప్పు, నేను చేసి చూపిస్తాను," అని గద్దించాడు జిమ్మీ.

అత్యవసర పరిస్థితుల్లో – ముఖ్యంగా ఎవరైనా సముద్రంలో పడిపోతే – వేగంగా

కదులుతూన్న ఓడని స్వల్ప వ్యవధిలో దారి మళ్లించి, యథాస్థానానికి తీసుకురాగల విన్యాసాన్ని ఏండర్సన్ మెనూవర్ అంటారని ఛీఫ్ ఆఫీసర్‌కి తెలుసు. పరీక్షల్లో అడిగే ప్రశ్నలలో అది ముఖ్యమైనది కూడా. కానీ దాన్ని ఆచరణలో పెట్టాల్సిన దౌర్భాగ్యం ఇంతవరకూ ఏనాడూ కలగలేదు. ఉన్నట్టుండి ఇప్పుడు – ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో, అదీ కేప్టెన్ జిమ్మీ ఎదురుగా...ఛీఫ్ ఆఫీసర్ మెదడు కాస్త మందగించింది.

ఇక లాభంలేదని – కేప్టెన్ జిమ్మీ చొరవ తీసుకున్నాడు.

"హార్డ్ స్టార్ బోర్డ్," అని అరిచాడు.

"హార్డ్ స్టార్ బోర్డ్ సర్!" అని బదులుగా అరిచి, చక్రాన్ని వడివడిగా కుడివైపు తిప్పాడు డ్యూటీ చుక్కాని.

"సౌండ్ త్రీ షాట్స్ ఆన్ విజిల్. ఇన్ఫాం ఇంజిన్ రూం. ఆస్క్ ది కేడెట్ టు మూవ్ టు స్టాబోర్డ్ వింగ్, రిలీజ్ ది మ్యాన్ ఓవర్ బోర్డ్ బోయ్! – నౌ!," అని చకచకా ఆదేశాలుజారీ చేశాడు – కేప్టెన్ జిమ్మీ.

"యెస్ సర్."

"ఐ వాంట్ డెక్ క్రూ టు రిపోర్ట్ ఆన్ బోట్ డెక్, స్టాబోడ్ సైడ్. కాల్ సెకండ్ మేట్ అండ్ థర్డ్ మేట్. ఆస్క్ డెమ్ టు కీప్ ద లైఫ్ బోట్ రెడీ టు లోవర్. కాల్ ఛీఫ్ ఇంజినీర్. సౌండ్ ద జనరల్ అలాం," అంటూ,

జిమ్మీ స్వయంగా స్టాబోర్డ్ వింగ్ మీదకి వెళ్లాడు. అప్పటికి బాగా తెల్లవారింది. తిరగబడిన జాలరి పడవ వద్ద మునుగుతూ తేలుతూ, ఒక్కోసారి కెరటాల వెనుక అదృశ్యమవుతూ, రెండు తలకాయలు కనిపించాయి.

"బ్లడీ హెల్," అన్నాడు జిమ్మీ బైనాక్యులర్స్‌లోంచి చూస్తూ.

సీనియర్ కేడెట్‌ని ఉద్దేశించి, "గెట్ మీ ది లౌడ్ హెయిలర్," అన్నాడు.

మసక వెలుతురులోంచి, కెరటాల చాటునుంచి అకస్మాత్తుగా పెద్ద భూతంలాగా వచ్చి మీదపడ్డ షిప్పు తమ పడవని ఢీకొందని మొదట గంగరాజుకీ, ఆ వెంటనే అతని సహచరులకీ అర్థం అయిపోయింది. ఆ బలమైన కుదుపు అతన్ని అమాంతంగా నీళ్లల్లోకి విసిరివేసింది. పడవ తిరగబడిపోయింది. మొదట నల్లటి గోడలాగా కనిపించిన ఆ ఓడ, రాక్షస సర్పంలాగా వాళ్ల పక్కనుండి జరజరా ప్రాకుకుంటూ ముందుకి సాగిపోతోంది. అంతలోకే గంగరాజుకి నూకరాజూ, అప్పల్రాజూ కూడా తేలుతూ కనిపించారు. ముగ్గురూ ఈదుతున్నారు. తిరగబడ్డ తమ పడవని చేరుకోవాలనీ, దానిని పట్టుకొని నిలదొక్కుకోవాలనీ వాళ్ల బుద్ధికి సహజసిద్ధంగా తోచింది.

'జమీల' మూడుసార్లు తన హారన్‌ను మ్రోగించి, సెర్చిలైటు తమవైపుగా వేసినప్పుడు గంగరాజు దృష్టి ఆ ఓడవైపు మళ్లింది. తాము ఓడకి బాగా దగ్గరగా ఉన్నామనీ, ఏ నిముషంలోనైనా ఓడకి ఉండే ప్రొపెల్లర్ (పంఖా) తమని లోపలికి లాక్కొని ముక్కలుగా నరికేసే ప్రమాదం ఉందనీ అనుభవజ్ఞుడైన గంగరాజుకి మొదట తట్టింది.

"పంఖా! పంఖా!!" అని అతడు అరిచాడు.

అదృష్టవశాత్తూ ప్రొపెల్లర్ ఉండే ఓడ వెనుకభాగం వారినుండి దూరంగా జరిగింది. కేప్టెన్ జిమ్మీ ఆదేశించిన ఏండర్సన్ మెనూవర్ మూలాన కలిగిన తొలి సత్ఫలితం అది. వాళ్లు ముగ్గురూ ప్రాణాలు ఉగ్గబట్టుకొని ఓడకేసి విభ్రమంగా చూస్తున్నారు. అది తన కుడివైపు మళ్లింది; వర్తులాకారంలో తిరగనారంభించింది. నూకరాజు నల్లటి ఆ ఓడ వెనకభాగంలో తెల్లరంగులో ఇంగ్లీషులో వ్రాసి ఉన్న పేరుని చదవగలిగాడు; 'జమీల' అని పెద్ద అక్షరాలతో వ్రాసి ఉంది. క్రింద 'కలకత్తా' అని చిన్న అక్షరాలలో ఉంది.

గంగరాజు అప్పుడు గమనించాడు – కన్నబాబు తమ మధ్య లేడు. అతడిని పడవకి కట్టి ఉంచిన సంగతి గుర్తుకొచ్చింది.

"ఒరేయ్! కన్నబాబురా, కన్నబాబు!" అని అరిచాడు.

"నేను చూస్తాను, మాయ్యా" అంటూ పడవకి దగ్గరగా ఉన్న నూకరాజు మునకవేశాడు.

తలక్రిందులుగా తేలుతూ కెరటాల నడుమ ఊగిసలాడుతూన్న పడవని చేరుకొని తన మొలలో ఉన్న చాకుతో కన్నబాబుని కట్టిన తాళ్లను ఛేదించసాగాడు.

కన్నబాబు అప్పటికే బయటపడేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. మరో నిమిషంలో పడవ పక్కనే బయటకుతేలి, దగ్గుతూ, ఆయాసపడుతూ ఊపిరి పీల్చుకున్నాడు. 'జమీల 'వైపుగా ఈదసాగాడు.

గంగరాజు, 'హమ్మయ్య' అనుకున్నాడు. కానీ నూకరాజు జాడలేదు. అప్పటికి బాగా వెలుతురు వచ్చేసింది.

గంగరాజు మునకవేసి, పడవ క్రిందకి చేరాడు. నూకరాజు పడవలో ఉంచిన వలలో చిక్కుకుపోయి, విడిపించుకోలేక కొట్టుకుంటున్నాడు. అతని చేతిలో చాకు ఉంది గానీ వల అతన్ని పూర్తిగా చుట్టుకుంది. కాళ్లూ, చేతులూ ఆడడం లేదు.

గంగరాజు తన శక్తినంతటినీ కూడగట్టుకొని మేనల్లుడిని అమాంతంగా – వలతో సహా – బయటకు లాగాడు. నూకరాజు తల నీళ్లల్లోంచి బయటపడింది; ఊపిరి ఆడింది. నూకరాజుకి గాలి ఆడేటట్టుగా చేస్తూ, ఈదుతూనే మరోవైపున

అతని కాళ్లకి చుట్టుకున్న వలను చాకుతో కోసేందుకు ప్రయత్నిస్తున్నాడు గంగరాజు. కెరటాల ఉధృతికి పడవ ఊగుతూ, పడుతూ, లేస్తూ ఉంది.

ఈలోగా 'జమీల' ప్రదిక్షిణ చేసి వాళ్లకు సమీపంలోనే ఆగింది. ఎవరో లౌడ్ హెయిలర్లో ఏదో అరుస్తున్నారని గంగరాజుకి లీలగా తెలుస్తోంది. మరోసారి పడవ క్రిందకి మునకవేసి వెళ్లి, రెండు చేతులతోనూ పడవ అంచుని పట్టుకొని తన కాళ్లతో నూకరాజు నడుము మీద బలంగా తన్నాడు. దెబ్బకి నూకరాజు సురక్షితంగా బయటపడ్డాడు. అదే క్షణంలో గంగరాజును వల చుట్టుముట్టింది. అతను వలలో ఇరుక్కుపోయాడు. కాళ్లు ఆడిస్తున్నకొద్దీ మరింత చిక్కుకుపోయాడు. అప్పటికే చాలా సేపుగా ఊపిరి బిగపట్టి ఉన్నాడు.

'జమీల' సిబ్బంది నీళ్లల్లోకి లైఫ్ బోయ్ రింగులు విసిరారు. వాటి వైపుగా నూకరాజు, కన్నబాబు, అప్పల్రాజు ఈదసాగారు. మేనమామ కూడా తమ వెంట వస్తున్నాడని అనుకున్నాడు నూకరాజు. ఓడలోని నావికులు త్రాళ్లకు అడ్డుచెక్కలు బిగించిన నిచ్చెనను వ్రేలాడదీశారు. ముగ్గురూ ఆ నిచ్చెన ఎక్కి రొప్పుతూ డెక్ మీదకి చేరుకొని అక్కడే కూలబడ్డారు. సూర్యోదయం అయింది. వర్షం ఆగింది. మేఘాలు తేలిపోతున్నాయి. ఉదయపు వెలుగులో పరిసరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అప్పుడు నూకరాజు గ్రహించాడు – మామ గంగరాజు తమ వెంటలేడనే విషయాన్ని. వచ్చీరాని ఇంగ్లీషులో – ఇంకొక వ్యక్తి పడవ క్రిందనే ఉండిపోయాడనే సంగతి థర్డ్ మేట్‌కి తెలియజేసాడు. అతడా విషయాన్ని బ్రిడ్జిమీద ఉన్న చీఫ్ ఆఫీసర్‌కి వాకీటాకీ ద్వారా తెలిపాడు.

నాలుగవ జాలరిని వదిలి వెళ్లిపోయే ప్రసక్తే లేదన్నాడు కేప్టెన్. సెకెండ్ మేట్ ఆధ్వర్యంలో లైఫ్ బోట్‌ని నీళ్లల్లోకి దించారు. నలుగురు సీమెన్ అరగంటసేపు తంటాలుపడి గంగరాజు మృతదేహాన్ని పడవ క్రిందినుండి వెలికితీశారు. ఈ పని పూర్తి అయ్యేంతవరకూ, కెరటాల తాకిడి నుండి రక్షణ కల్పించడానికని కేప్టెన్ పర్యవేక్షణలో 'జమీల'ను అడ్డుగా నిలిపారు.

కన్నబాబు తలకి తగిలిన గాయాన్ని చూశాక అతనికి తక్షణమే వైద్యం అవసరం అని భావించిన కేప్టెన్ జిమ్మీ, ఓడని విశాఖపట్నానికి మళ్లించాలని నిర్ణయం తీసుకున్నాడు. తద్వారా పంచనామాను తొందరగా ముగింపజేసి, గంగరాజు మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించడం కూడా సాధ్యపడుతుందని అతడు భావించాడు. కంపెనీ యాజమాన్యానికీ, ఏజెంటుకీ రేడియో మెసేజిలు పంపమని రేడియో ఆఫీసర్‌కి పురమాయించాడు. అతడు మోర్సు కోడ్ ద్వారా ఆయా వర్తమానాలను పంపసాగాడు.



తానొకటి తలిస్తే

గంగరాజు మృతదేహాన్ని మెయిన్ డెక్‌పై ఉంచారు. ముఖం మాత్రమే కనబడే విధంగా తెల్లటి దుప్పటి కప్పారు 'జమీల' నావికులు. ముగ్గురు జాలరులకీ త్రాగడానికీ, తినడానికీ ఆ తరవాత విశ్రమించడానికీ ఏర్పాట్లుచేశారు. చర్మం చెక్కుకుపోయి రక్తం కారుతున్న చోట్ల ప్రథమ చికిత్స చేశారు. కన్నబాబు తలకి తగిలిన గాయాన్ని శుభ్రంచేసి బ్యాండేజీ కట్టారు. నొప్పి తగ్గడానికి మాత్రలిచ్చారు. ఈ పరిచర్యలన్నీ కేప్టెన్ జిమ్మీ పర్యవేక్షణలో జరిగాయి. నూకరాజు మంచినీళ్లు మాత్రం త్రాగి తన మేనమామ శవం పక్కనే కూర్చున్నాడు.

తండ్రి పోయాక తమ కుటుంబాన్ని ఆదుకున్న మావయ్య, జాలారిపేట అంతటికీ పెద్ద తలకాయగా ఉండే మావయ్య, 'నాకొగ్గియ్యే, నాను సూసుకుంటాననీసన్నానా, లేదా? ఆడి పేనానికి నా పేనం అడ్డం – సరేనా?' అని తన తల్లికి మాటిచ్చిన మావయ్య – ప్రశాంతంగా, శాశ్వతంగా నిద్రపోతున్నాడు. నూకరాజు మెదడు మొద్దుబారి పోయింది. ఏడుపుకూడా రాలేదు.

* * *

తుఫాను వెళ్లిపోయింది. వర్షం వెలిసింది. జాలారిపేటలో దారులన్నీ బురదగా ఉన్నాయి; అక్కడక్కడ గుంతలలో చేరిన వర్షం నీళ్లు. నాలుగు రోజుల తరవాత మళ్లీ పల్చగా ఉదయపు ఎండ కాస్తోంది. తీరప్రాంతాలలో నిత్యం ఉండే ఉక్కపోత, చిటచిట మొదలైపోయాయి. పేటలోని ఆడవాళ్లు చక్కగా తయారై, కొప్పుల్లో పువ్వులు పెట్టుకొని చేపల గంపలు నెత్తిన మోసుకుంటూ కురుపాం మార్కెట్‌కి బయల్దేరుతున్నారు. వాళ్ల నోళ్లల్లో చుట్టలు వెలుగుతున్నాయి. కొందరు అడ్డపొగ (నిప్పుని నోటిలో ఉంచి చుట్టకాల్చే విధానం) కాలుస్తున్నారు. విధానం ఏదైనప్పటికీ చుట్టలు వాళ్ల నోటి ధాటికి అడ్డురావడం లేదు.

జాలరుల జాతిలో ఆడవాళ్లంటే మాటలా? అని కొందరంటారు. కానీ నిజానికి మాటలే వాళ్ల ఆయుధాలు. ఆ ఆడవాళ్ల నోళ్లల్లో నోరు పెట్టడానికి హేమాహేమీలైన

మగధీరులుకూడా వెనకాడతారు. బొత్తిగా చదువు లేకపోయినా, బేరసారాలూ, అమ్మకాలూ, లెక్కలూ – వాళ్లకి మంచినీళ్ల ప్రాయం. డబ్బు లావాదేవీలన్నీ వాళ్లవే. చేపల్ని బజారుకి చేర్చడం, బయటి ప్రపంచంతో రోజువారీ పోరాటాలు చెయ్యడం, పీచు బేరాలాడే కొనుగోలుదార్లతో తలపడి, నాలుగు డబ్బులు ఇంటికి తీసుకురావడం, అవసరం పడ్డప్పుడల్లా అప్పు పుట్టించడం, చేసిన అప్పులకి వడ్డీలు కట్టుకోవడం – ఇవన్నీ ఆడవాళ్ల పనులే. వంటా, వార్పూ, పిల్లల్ని కనడం, పెంచడం, చీకటితోనే వేటకు వెళ్లే భర్తలకు క్యారేజీలు కట్టడం, వాళ్లు వినిపించుకోకపోయినా జాగ్రత్తలు చెప్పడం – ఇవన్నీ అందరు భార్యలూ చేసేవే. సముద్రం, వలలు, వేటా తప్ప లోకంపోకడ బొత్తిగా తెలియని తమ భర్తల ప్రమేయం లేకుండా ప్రతీ రోజువారీ విషయంలోనూ నిర్ణయాలు తీసుకోవడం జాలరి స్త్రీల ప్రత్యేకత. వ్యవహారకర్తలు, నెరజాణలుగానే కాకుండా, రాకాసులు, గయ్యాళులుగా కూడా వాళ్లు పేరు పడ్డారు. నిజానికి వాళ్లని చూస్తేనే మిగతా జాతుల వారంతా – గొప్పా-బీదా, ఆడా-మొగా అన్న తేడాలేకుండా – తోక ముడుస్తారు. చేపల్ని బజార్లకు మోసుకెళ్లి, నగదురూపంలోకి మార్చి, ఘల్లుఘల్లుమంటూ ఇంట్లోకి తీసుకొచ్చే ఆడవాళ్లంతా లక్ష్మీదేవి అంశను కల్గి ఉంటారని జాలరులలో ఒక పురాతనమైన నమ్మిక. అందుకే ఆడపిల్ల పుట్టిందంటే ఊరందరికీ పండగే.

ఇంక జాలరుల్లో మొగవాళ్ల విషయానికొస్తే – వేటనుండి రాగానే, పట్టితెచ్చిన చేపల్ని తమ ఆడవాళ్లకి అందజేయడంతో వాళ్ల బాధ్యత తీరిపోయినట్లే. ఆడవాళ్లు భర్తల చేతిలో పాతికో పరకో పెడతారు. దాంతో బీడీలో చుట్టలో కొనుక్కొని, గోచీగుడ్డతో సముద్రపొడ్డున పరధ్యానంగా నడుస్తూ, తొడలపై తక్లీలు తిప్పుతూ, తాడు పేనుతూ, వలల్ని బాగుచేసుకుంటూ, పడవల్ని మరమ్మత్తు చేస్తూ, తెరచాపలకు అతుకులు వేస్తూ గడిపేస్తారు. సాయంత్రాలు కాస్త నాటుసారా పుచ్చుకున్నాక, పేట మధ్యలో ఉన్న మర్రిచెట్టు కింద, చప్టామీద కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ, వేళాకోళాలాడుకుంటూ, తాతముత్తాతల నాటి సముద్రపు గాథలను మళ్లీమళ్లీ చెప్పుకుంటూ కాలం వెళ్లబుచ్చుతారు. ఒక్కోసారి వెళ్లిపోయిన తమ సహచరులను తల్చుకుంటూ నిట్టూరుస్తారు. సముద్రం మీదుగా నిత్యం వీచే ఉప్పుగాలి వారిని ఆవహించినపుడు మాత్రం మాటలు తోచక మౌనంగా ఉండిపోతారు. ఒడ్డెక్కించిన తమ పడవల్ని మళ్లీ సముద్రంలోకి నెట్టి, వేటకి బయలుదేరేవరకూ ఇదే వాళ్ల కార్యక్రమం.

తాటాకు పాకల జాలారిపేటలో అక్కడక్కడా ఉన్న మిద్దె ఇళ్లల్లో గంగరాజుది కూడా ఒకటి. తెల్లారకుండా గుమ్మం ముందుకొచ్చిన ఆడబడుచు పోలమ్మ –

"ఇదేటొలే గంగమ్మొదినా! ఏటకెళ్లినోల్లంతా ఎప్పుడనగా ఒచ్చీసారు! అన్నయ్యోలేటీ ఇంకన్నూ రాకండున్నారు?" అని భయం భయంగా అడిగింది.

ఆమె అలా అడగ్గానే గంగమ్మ లోలోపలే దాచుకున్న ఆందోళన బయటకి తోసుకొచ్చింది. రాత్రంతా ఆమెకు నిద్రలేదు. తుఫానుగాలి చేసే ఆక్రందనలను ఒక పక్క వింటూనే, అదనంగా ఏ చిరుసవ్వడైనా గంగరాజు ఇంటికి వచ్చేశాడనే అనుకుంటూ కునికిపాట్లు పడింది.

పోలమ్మ కొడుకు నూకరాజు కూడా గంగమ్మ పెనిమిటి గంగరాజు వెంట వేటకి వెళ్లి – ఇవాళ్టికి అప్పుడే మూడో రోజు. జాలరులంతా – వాళ్ల అలవాటు చొప్పున అదే రోజున, లేదా రెండో రోజున వెనక్కి వచ్చేశారు. అప్పటికింకా తుఫాను అంత ఉధృతం కాలేదు.

"మోజా తగ్గిపోయిందిలెయ్యే. ఇంకొచ్చేత్తారు," అని గొంతుకలో భయం ధ్వనించకుండా దాస్తూ ఆడబడుచుకి ధైర్యం చెప్పింది గంగమ్మ.

"రేవు కాడికెల్దాం గంగమ్మొదినా! నాకేటీ తోస్తలేదు," అంది పోలమ్మ – ఏడుపు గొంతుతో.

"ఇదిగో, పిల్లల్ని స్కూలుకి పంపించీసి ఎల్దాం. ఒక్క సిటం కూకోయే...టీ ఎడతాను, తాగుదూగాని."

"నాకే టియ్యి వొద్దులేగానీ – బేగెలిపోదాం పద." కొడుకూ, కూతురూ స్కూలు యూనిఫాంలు వేసుకొని సంచులు పట్టుకొని, బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్లిద్దరికీ టిఫిన్ బాక్సులు అందించింది గంగమ్మ. వాళ్లు బయలుదేరారు.

"సెల్లి సెయ్యొట్టుకోరా," అని కొడుకుని గద్దించింది.

"దానికిష్టం లేదు," అన్నాడు కొడుకు వెంకటేశు. నిజానికి చెల్లెలు చెయ్యిపట్టుకొని రోడ్డుమీద నడవాలంటే వాడికెందుకో నామోషీ. ఆ సంగతి ఎల్లమ్మకీ తెలుసు. పొద్దున్నే అన్నతో తగువెందుకని గుంభనంగా ఊరుకుంది. అదీగాక, తను పెద్దదాన్నయ్యాననీ, అంచేత ఎవరూ తన చెయ్యి పట్టుకోనవసరం లేదనీ ఎల్లమ్మ విశ్వాసం. అన్నా చెల్లెళ్లిద్దరూ బయటకి నడిచారు. సాగనంపడానికి గంగమ్మ గుమ్మం వద్దకు వచ్చింది.

అప్పుడు చూసింది గంగమ్మ – మరదలు వరండాలో ఒక పక్క బెంచీమీద పెట్టిన స్టీలు కంచం – దాంట్లో ఉన్న పువ్వులు, కొబ్బరికాయ, కర్పూరం, ఊదొత్తులు. మరో మాటలేకుండా ఇంట్లోకి వెళ్లి గంగమ్మకూడా అదే సరంజామా సిద్ధం చేసింది.

"తానం చేశావా, పోలమ్మా?" అంది.

"ఆ! తెల్లారగట్టే సేసీసినాను," అని జవాబిచ్చింది మరదలు – కొడుకు నూకరాజు మీద బెంగతో రాత్రంతా నిద్రపోలేదని చెప్పకుండా. మరో మాట లేకుండా ఆడవాళ్లిద్దరూ సముద్రతీరం వైపుగా నడిచారు.

చేపలు అమ్ముకోవడానికి బజారుకి బయలెల్లిన జాలరి స్త్రీల గుంపు ఎదురుపడి, గంగమ్మనీ, పోలమ్మనీ – 'అక్కా', 'వొదినా', 'పిన్నీ', 'అత్తా' అని సంబోధిస్తూ పలకరించారు. వదినా మరదళ్లిద్దరూ ఎక్కడికి బయిల్దేరారో వాళ్లకి అర్థం అయిపోయింది. కాసేపు వాళ్ల మాటలకు అడ్డుకట్ట పడింది. స్వరం తగ్గించి, 'ఇయ్యేల మద్దేనానికల్లా ఒచ్చేస్తార్లే' అని సముదాయించారు.

జాలారిపేట శివార్లలో, సముద్రతీరానికి దగ్గరగా ఒక అమ్మవారి గుడి ఉంది. అది ఎప్పటినుండి అక్కడ ఉందో, ఎంత పురాతనమైనదో ఎవరికీ తెలీదు. పేటలో ఉండే వాళ్లందరికీ ఆ అమ్మవారే కులదైవం. ఆమె చల్లని చూపే తమ వాళ్లందర్నీ తుఫానుల నుండి కాపాడుతుందనీ, వేటకి వెళ్లే మొగవాళ్లకి రక్షణగా నిలుస్తుందనీ జాలరుల దృఢ విశ్వాసం. ఆ చిన్న గుడిలో ప్రతీ ఏటా జరిగే జాతరలో ఒకప్పుడు బలులిచ్చేవారు. గత కొన్నేళ్లుగా ఆ గుడికి ఒక పంతులుగారు పూజారిగా కూడా కుదిరాడు. స్మగ్లింగ్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనే కొంతమంది జాలరుల భూరి విరాళాలతో గుడికి వచ్చే ఆదాయం బాగా పెరిగింది. తన వసతికి పక్కా ఇల్లు కట్టించమనీ, అమ్మవారంటే గౌరమ్మ గనకా, ఆమెకు యజమాని ఈశ్వరుడు గనకా శివలింగ ప్రతిష్ట అత్యవసరం అనీ పూజారి భక్తులను, ముఖ్యంగా గంగరాజుని కొంతకాలంగా వేడుకుంటున్నాడు. అంచేత గంగమ్మ ఆ గుడికి ఎప్పుడు వచ్చినా ఆమెకు ప్రత్యేకమైన ఆదరణ లభిస్తుంది.

వేటకి వెళ్లిన గంగరాజూ, అతని బృందం ఇంకా రాలేదనీ, మిగతా జాలరులంతా వచ్చేశారనీ గంగమ్మనోట విన్న పూజారి కంగారుపడ్డాడు.

"అమ్మవారికి మొక్కుకోండమ్మా! ఆ తల్లి మీ కుటుంబాన్ని చల్లగా చూస్తుంది," అని హితవు పలికాడు.

పూజ అయిపోయింది. పూజారి గంట వాయించాడు. హారతి కళ్లకి అద్దుకున్నారు ఆడవాళ్లిద్దరూ. పళ్లెంలో దక్షిణ వేశారు. కొబ్బరికాయ చెక్కా, అరటిపండు ముక్కా ప్రసాదంగా అందజేసాడు పూజారి.

అమ్మవారి గుడినుండి బయటకు వచ్చేసరికి బాగా ఎండ వచ్చింది. సైకిలు మీద వచ్చి, బయట వాళ్ల కోసం ఎదురుచూస్తున్న కానిస్టేబులు,

"గంగరాజు భార్య గంగమ్మ నువ్వేనా?...ఇనస్పెక్టరుగారు నిన్ను ఎంబడే టీషనుకి రమ్మన్నారు," అన్నాడు ముక్తసరిగా.

ఆమె గుండె దడదడా కొట్టుకుంది. 'ఏటైంది కనిస్టేబుల్ బాబూ, ఏటైంది?' అంటూన్నా వినిపించుకోకుండా కానిస్టేబులు సైకిలెక్కి బయిల్దేరిపోయాడు. గంగమ్మకి ఆ పోలీసువాడు చావు కబురు మోసుకొచ్చి చల్లగా జారుకున్న యమభటుడిలా కనిపించాడు.

గుడి అరుగు మీద గంగమ్మా, పోలమ్మా కూర్చుండిపోయారు. వాళ్లకి కాళ్లూ చేతులూ ఆడడం లేదు. గొంతుకలు ఆర్చుకుపోయాయి. తీరా పోలీసు స్టేషనుకి వెళ్తే అక్కడ ఏ దుర్వార్త వినాల్సివస్తుందో అనే భయం వాళ్లను ఆవహించింది. దూరంగా సముద్రం, మనోహరమైన నీలి రంగులో కాకుండా అనిశ్చితమైన ఊదా రంగులో భయపెడుతూ ఘోషిస్తోంది. తుఫాను తాకిడి తగ్గిపోయినా కెరటాలు భీకరంగా, దూకుడుగా వచ్చి పడుతున్నాయి. గాలి ధాటికి కెరటాల నెత్తిన తేలియాడే తెల్లటి నురగ రేగిపోయి, చెల్లాచెదురవుతున్నది. రయ్యిమని వీస్తున్న ఈదురు గాలి ఉండిఉండి ఈలలు వేస్తూ ప్రమాదసూచిగా మారి హెచ్చరిస్తోంది. గంగమ్మకివన్నీ అపశకునాల్లా తోచాయి. గుడి బయటనుండే అమ్మవారికి మరోసారి దండం పెట్టుకొని, 'నువ్వే కాపాడాల తల్లీ' అనుకుంటూ బయల్దేరింది.

గంగమ్మా, పోలమ్మా – ఎవరి ఆలోచనల్లో వాళ్లు. ఎంత వారించినా కీడుని శంకించే మనసు, నిర్దిష్టమైన పాడు వివరాల్లోకి పోతుంది; పాములు పాకే చీకటి లోయల్లోకి నెట్టివేస్తుంది. ఆశ మాత్రం అస్పష్టంగా, అరకొరగా, మంచుతెర వెనక మెదిలే దూరపుకొండలాగా అగుపిస్తుంది. ఆశా నిరాశల మధ్య, పరస్పర విరుద్ధమైన ఆలోచనల నడుమ వాళ్లు నలిగిపోయారు.

"ఇనస్పెక్టుబాబుతో మాట్టాడనందుకు మా తమ్ముడు సిమ్మాచలాన్ని తోడు రమ్మందాం," అని గంగమ్మ అన్నది. పోలమ్మ "అలాగేలే వొదినా," అంది. అంతకు మించి వాళ్ల మధ్య మరే సంభాషణా లేదు.

* * *

సింహాచలాన్ని వెంటబెట్టుకొని గంగమ్మా, పోలమ్మా పోలీసు స్టేషనుకి చేరుకొనేసరికి అక్కడ నూకరాజూ, కన్నబాబూ, అప్పల్రాజూ ఉన్నారు. కొంతమంది అపరిచితులు కూడా అక్కడ ఉన్నారు. తల్లినీ, అత్తనీ చూడగానే నూకరాజు ఏడ్చేశాడు. ఆ తరవాత కొంత నిభాయించుకున్నాడు. అప్పల్రాజు ఏడ్చి అలసిపోయి, దిగ్భ్రాంతికి గురైనట్లుగా, పిచ్చిచూపులు చూస్తూ కూర్చున్నాడు. కన్నబాబు తలకి కట్టుతో, నొప్పితో బాధపడుతూ కనిపించాడు. వాళ్లు ముగ్గురూ పోలీసులు నమోదు చేసుకున్న వాంగ్మూలాలపై సంతకాలు చేశారు; వేలిముద్రలు వేశారు.

సింహాచలం పోలీసు స్టేషనంతా కలియ తిరిగాడు. అందర్నీ పలకరించాడు. ఇనస్పెక్టరుతో సహా అక్కడున్నవాళ్లంతా అతనికి పరిచయస్థులే; కొంతమంది సన్నిహితులు కూడాను. పోలీసు స్టేషన్లోనూ, కేజీఎచ్‌లోనూ చెల్లించవలసిన ముడుపులుంటాయి, రెండువేలివ్వమని సింహాచలం అక్కని అడిగాడు. గంగమ్మ మారు మాట్లాడకుండా ఇచ్చేసింది.

మరికాసేపట్లో పొడుగ్గా, తెల్లగా ఉన్న ఒకాయన కూడా తన వాంగ్మూలాన్ని స్వయంగా తయారుచేసి, టైపు చేయించి తీసుకొచ్చాడు. సంతకం చేసి ఇనస్పెక్టరుకి అందజేశాడు.

"అతనే ఆ ఓడ కేప్టెను, జిమ్మీ దొర," అన్నాడు నూకరాజు – గంగమ్మ, పోలమ్మలతో.

మరో గంటయ్యాక, ఇనస్పెక్టరు గంగమ్మని లోపలికి పిల్చాడు. గంగరాజు శవం కే.జీ.ఎచ్.లో ఉందని, పోస్టుమార్టం రిపోర్టు రాగానే స్వాధీనం చేసుకోవచ్చనీ చెప్పాడు. గంగమ్మనీ, పోలమ్మనీ కూడా వాళ్ల కళ్లముందు జరుగుతూన్నది కలా, నిజమా అనే సందేహం వీడలేదు.

"మీతో బాటుగా ఒక కానిస్టేబిలు కే.జీ.ఎచ్.కి వస్తాడు. కాసేపు పైన వరండాలో కూర్చోండి," అని ఇనస్పెక్టరు వాళ్లను బయటకు పంపించాడు.

గంగమ్మ, పోలమ్మలు కూర్చున్న చోటికి వచ్చి జిమ్మీ వాళ్లను పలకరించాడు. కంపెనీ వారి స్థానిక ఏజెంటు దుబాసీగా వ్యవహరించాడు.

జరిగినదానికి జిమ్మీ తన సానుభూతి తెలియజేశాడు. జాలరులను రక్షించడానికి తానూ, తన సిబ్బందీ చెయ్యగలిగిందంతా చేశామన్నాడు. ఒక నిండు ప్రాణం పోయినందుకు తానెంతో వ్యధకు గురి అయ్యానని అన్నాడు. ఏదైనా సహాయం కావాలంటే చెప్పమన్నాడు.

గంగమ్మ –

"ఇలగైపోయిందేటి బాబూ?...ఆ బగమంతుడేటలాగ్గా – ఏదీ కాకుండగ, పుటుక్కుమని నా తాలి తెంపీసి నా పెనివిటి పేనాలట్టుకుపోయాడు? ముప్పయ్యేల్లు బట్టీ ఏటకెలతన్నాడు. ఆయనకన్నీ ఎరికే. గాలి వాటాంజూసి తుఫానొస్తందని చెప్పీసీవోడు. వాసనజూస్సి సేపలు అటుకాసున్నాయి, పదండ్రా అనీవోడు. అతగాడి మాటంటే మాటే. ఊరందరికీ పెద్ద మనిసి. అందరికీ దిక్కు చూపించీవోడు. మరా గంగమ్మ తల్లే మాదిక్కు సూసింది కాదు. ఆయమ్మే మా కుటమాన్ని ముంచీసింది. ఇంక నువ్వేటి సేత్తావు?" అంటూ ఏడ్చింది.

గంగమ్మ మాటల్ని అనువదించడానికి ఏజెంటు ఇబ్బందిపడ్డాడు.

పోలమ్మ అందుకుంది -

"నూకరాజుని నేన్చూసుకుంటాను లెయ్యే అనీవోడొదినే. ఆడే ముందెలి పోనాడు, మనందరినీ ఒగ్గీసి. మన బతుకుల్లంట బుగ్గి పోసీసాడు. ఆ బగమంతుడు. ఆ నూకాల్తల్లీ మన్ని సూసిందికాదు. పోలమ్మతల్లీ సూసిందికాదు. మరాయమ్మలకి మనమీదంత కోపవెందుకో తెల్దు. ఏం పాపం సేసినావో, ఏటో?

కొడుక్కి ఆయమ్మ పేరెట్టుకున్నాననైనా దయ సూపించిందికాదు నూకాలమ్మ తల్లి. మొదాట నా యజమాన్నట్టుకు పోయింది. నూకరాజుని మావ దగ్గర పనికి పెడితే బాగుపడతాడనుకునీసరికి మా యన్ననే అట్టుకుపోయింది. మన రాతలాగుంటే ఇంకెవరికి సెప్పుకోవాల? ఎవల్నని ఏటి నాబం?"

"ఈమె గంగరాజు చెల్లెలు," అని జిమ్మీకి పోలమ్మని చూపించాడు ఏజెంటు.

ఇంతలో సింహాచలం ఒక కానిస్టేబుల్ని వెంటబెట్టుకొని బయటకొచ్చాడు. అతగాడు, 'పదండమ్మా,' అన్నాడు. అప్పటికి ఒంటిగంట దాటింది.

కే.జీ.ఎచ్.లో గంగరాజు శవాన్ని చూసినప్పుడే ఏం జరిగిందనేది గంగమ్మకి పూర్తిగా అర్థం అయింది. పోలమ్మని పట్టుకొని గుండెలు పగిలేలా ఏడ్చింది.

సూర్యాస్తమయం అయ్యేలోగా అంత్యక్రియలు జరిగిపోవాలని పట్టుబట్టిన జాలారిపేట మొగవాళ్లంతా సింహాచలం పోయించిన సారా తాగి, హడావుడిగా సముద్రపొడ్డునే ఉన్న శ్మశానానికి బయిల్దేరారు. వెంకటేశు, ఎల్లమ్మ, నూకరాజు ఇంట్లోనే ఉండిపోయారు. పోలమ్మ వంటింట్లోకి వెళ్లి అందరికీ టీ చేసింది.

ఏడ్చిఏడ్చి అలసిపోయిన గంగమ్మ, టీ చప్పరిస్తూ –

"అదేటోగానొలే పోలమ్మా! ఎప్పుడూ లేన్ది, మీయన్న ఏటకెల్లీ రోజున నలుగురికీ సరిపడా నాటుకోడి కూర చెయ్యమన్నాడే. అంత సీకటితోన లెగిసి సెయ్యనందుకు నావల్లకాదనీసి కేరీజీలోన ఎండు చేపలూ, ఊరగాయా సద్దీసి పల్లక తొంగుండి పోన్నే," అన్నది.

ఎందుచేతనో గానీ, గంగరాజు మరణ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆమె ఈ ఊసు చెప్పేది.

* * *

కేప్టెన్ జిమ్మీనీ, ఛీఫ్ ఆఫీసర్నీ తొలి దశ విచారణ పూర్తి అయ్యేంతవరకూ విశాఖపట్నంలోనే ఉండాలని అధికారులు ఆదేశించారు. దుర్ఘటనకు సంబంధించిన వివరాలు, రికార్డులు సేకరించాక, కొత్తగా వచ్చి చేరిన కేప్టెన్, ఛీఫ్ ఆఫీసర్లతో 'జమీల' కలకత్తా వెళ్లిపోయింది.

విచారణ నడుస్తూ ఉండగానే కేప్టెన్ జిమ్మీమీదా, 'జమీల' యాజమాన్యం మీదా నష్టపరిహారం కోరుతూ దావా వెయ్యమని సింహాచలం, అక్క గంగమ్మకి సలహా ఇచ్చాడు.

'నీ తమ్ముడు తక్కువ్వోడు కాదు. గొప్ప సురుకు. నాలుగు రూపాయిలుగాని నలభైమైళ్ల దూరంలో ఉన్నాయంటే ఆ వాసన పట్టేస్తాడు, వలేసి లాగేస్తాడు. మరా సురుకు సేపలేటల కనబడింది కాదు – ఎంచేతో గాని,' అని పెనిమిటి గంగరాజు

తనతో అంటూండేవాడని గంగమ్మ గుర్తుచేసుకుంది. తమ్ముడి దూకుడుని అడ్డుకోవాలని –

"ఓడాపీసి మనోల్లందర్నీ ఎక్కించుకున్నాడు కాదా? మీ బావంటే వల సుట్టీసి సిక్కడిపోండు గాని," అంది గంగమ్మ నిదానంగా.

"నీకేటి తెల్దులెయ్యే అప్పా! సిప్పుల తాలూకు యజమానులంటే ఏటనుకుంటన్నావు? ఆల్లంతా బాగా బలిసినోల్లు. అయినాగానీ మనం గిజామని గీపెడితే తప్ప చేతిల చిల్లికానీ ఎట్టరు. అయన్నీ నాకొగ్గీయే, నాను సూసుకుంటానన్నాను కద. లాయరు చేత ఒక్క నోటీసిప్పించావనుకో, కెప్టేను కాదు కదా, ఆడి జేజమ్మ కూడా దిగొస్తాది. ఇలాటి కెప్టేన్లని ఇంత మందిని చూశాను," అంటూ తలమీది వెంట్రుకల్ని పట్టుకున్నాడు సింహాచలం. ఆ తరవాత గొంతు తగ్గించి,

"అందాకా ఓ రెండు వేలియ్యవే, లాయరుకి బయానా ఇవ్వాలి" అని చల్లగా ముగించాడు.

గంగమ్మ, "ఒరే! అయన్నీ మనం పడలేంరా, బాబూ. అయినా ఇప్పుడుకిప్పుడు రెండువేలంటే ఎక్కడినించి తెస్తాను? నాలుగు రోజులాగు. సూద్దారి," అని తమ్ముడి ఉత్సాహానికి అడ్డుకట్ట వేసింది.

వారం తిరక్కుండా సింహాలం, అక్క ఇంటికి వచ్చి మళ్లీ లాయరు నోటీసు ప్రస్తావన తీసుకొచ్చాడు. ఆ ముందురోజే కేప్టెన్ జిమ్మీ, కంపెనీ ఏజెంటు తరఫున ఒక మేనేజరూ తమ ఇంటికొచ్చారనీ, నూకరాజునీ, అలాగే కన్నబాబునీ, అప్పల్రాజునీ కూడా వెంట తీసుకొచ్చారనీ – గంగమ్మకి లక్ష రూపాయిలూ, మిగతా ముగ్గురికీ ఏభై వేలు చొప్పునా తక్షణ సహాయంగా ఇవ్వడానికి కంపెనీవాళ్లు సిద్ధపడ్డారనీ అందుకు తామంతా అంగీకరించామనీ, తమ వద్ద సంతకాలూ, వేలిముద్రలూ తీసుకున్నారనీ గంగమ్మ తన తమ్ముడికి చెప్పింది.

సింహాచలం మొదట నిర్ఘాంతపోయాడు. తరవాత తేరుకొని,

"ఏటిదప్పా? నాకు కబురైనా ఎట్టేవుకాదు. నేనుగాని అక్కడుంటే లచ్చకాదు, నాలుగు లచ్చలు వసూల్చేసి నీ చేతిలెట్టి ఉందును. సూడబోతే ఆ కేప్టనుగాడు గొప్ప మాయగాడిలాగున్నాడు. మీయందర్నీ బుట్టల ఏసీసుకున్నాడు. మద్దిలో మరి ఆడెంత నొక్కీసాడో?" అన్నాడు ఉక్రోషంగా.

గంగమ్మకి ఒళ్లు మండింది.

"తోడబుట్టినోడివనీసి పల్లకుంటన్నాను. ముగ్గురు పేనాలు కాపాడినోడిని అంత మాటంటావురా? కళ్లు పోతాయిరా, ఒరే! నూకరాజు నాకంతా సెప్పేడు. అయినా మనం అడగలేదు, సెయ్యలేదు. పెద్ద మనుసులు కాబట్టి ఇంటికొచ్చి దబ్బిచ్చీసారు,

మరో ఊసు, మరో మాట నేకండగ. మనిసన్నాక ఇస్వాసం ఉండాలరా," అనేసింది.

'బావలాగే ఈ అక్క కూడా ఒట్టి ఎర్రి బాగుల్ది. అడక్కుండగే ఇంటికొచ్చీసి లచ్చ రూపాయిల్తెచ్చి చేతిల ఎట్టీసారంటే ఏటనుకోవాల? ఎల్లి ఆల్ల పీకగానట్టుకున్నావంటే ఇంకా ఎంత కక్కుందురో – అన్న ఆలోచన లేదు దీనికి,' అని మనసులోనే అనుకున్నాడు సింహాచలం.

అక్క తనని నానా మాటలూ అన్నందుకు అతను పెద్ద బాధ పడలేదు గానీ నాలుగు డబ్బులు చేసుకొనే అవకాశం చేతికి చిక్కినట్టే చిక్కి జారిపోయినందుకు విచారించాడు.

తుది ప్రయత్నంగా గంగమ్మతో మరో మాటన్నాడు –

"సర్లే – నీ ఇష్ట పెకారం సెయ్యిలే గానీ మరి ఆ లచ్చా ఏటి సేత్తావు? ఇంట్లో పెట్టుకుంటే ఆరతి కరుపూరంనాగా కరుసైపోద్ది. నాకు గానిచ్చావనుకో, తీసికెల్లి బిగినీసుల మదుపెడతాను. పత్తీ సంవచ్చరం రెండు లచ్చలు నీ చేతిలో ఎడతాను. మెడతిప్పలేనంత బంగారం చేయించుకుందువుగాని. నీక్కాపోతే రేప్పొద్దున్న నీ పిల్లలకైనా ఉంటాది. నమ్మకం లేకపోతే చెప్పు, అప్పు తీసుకున్నట్టుగా కాయితం రాసిస్తాను."

"ఒరే! నీ బోకరు మాట్లు నాదగ్గర కాదు. అందుకే నీ బావకి నీ బిగినీసన్నా, నువ్వన్నా ఏనాడూ పడీది కాదు. నీ చేతిలో గనక ఆ డబ్బు ఎట్టానంటే ఆ పోయినోడిక్కూడా మనస్సాంతి లేకుండా చేసిందాన్నవుతాను. మరింకెప్పుడా ఊసెత్తకు నా దెగ్గిర," అని కుండ బద్దలు కొట్టింది.

సింహాచలం అక్కడి నుండి జారుకున్నాడు. తన ప్రతిపాదనని నూకరాజు, కన్నబాబు, అప్పల్రాజూ – ఈ ముగ్గురికీ తెలియజేసాడు. నూకరాజు లేదు పొమ్మన్నాడు; అప్పల్రాజు పదివేలకు మించి మదుపు పెట్టలేనన్నాడు; కన్నబాబు భార్యని అడిగి చెబుతానన్నాడు.

* * *

జాలరి పడవను 'జమీల' ఢీకొట్టిన సంఘటనపై ప్రాథమిక విచారణ విశాఖపట్నంలోనూ, తుది విచారణ కలకత్తాలోనూ జరిగాయి. విశాఖలో జరగాల్సిన తంతు పూర్తయ్యేంత వరకూ సోల్జరుపేటలో ఉన్న తన బావమరిది టోనీ ఇంట్లో ఉన్నాడు కేప్టెన్ జిమ్మీ. టోనీ పోర్టులో ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. ఎటొచ్చీ వారంరోజుల్లో ముగుస్తుందనుకున్న వ్యవహారం నెల్లాళ్లకు పైగా డేకిరీసింది. మద్రాసు, కలకత్తాల నుండి ప్రచురితమయ్యే ఇంగ్లీషు దిన పత్రికలు విచారణకి ప్రముఖ స్థానం కల్పించాయి.

జరిగిన దుర్ఘటనకి కేప్టెన్ జిమ్మీ బాధ్యుడు కాదని విచారణలో తేలింది. అంతేకాదు, తుఫాను సృష్టించిన భయానక పరిస్థితులలో ముగ్గురు జాలరుల ప్రాణాలను కాపాడడంలో అతడు అసాధారణమైన ప్రజ్ఞనూ, సమయస్ఫూర్తినీ కనబరిచాడనీ, ఒక బాధ్యతాయుతమైన, సమర్థవంతమైన మర్చంట్ నేవీ ఆఫీసర్‌గా వ్యవహరించాడనీ ఎంక్వైరీ కమిటీ అభిప్రాయపడింది. ఆ తీర్పును స్థానికంగానే కాకుండా దేశవ్యాప్తంగా వివిధ పత్రికలు ఫొటోలతో సహా ప్రచురించాయి. ఇది కేప్టెన్ జిమ్మీకి మంచి పేరు తెచ్చిపెట్టింది.

తీర్పు వెలువడ్డాక మొదటి ఆదివారంనాడే కేప్టెన్ జిమ్మీ, అతడు మొక్కుకున్న విధంగా తన భార్య షెరాన్, కొడుకు డారల్, కూతురు డెబొరాలను వెంట బెట్టుకొని పోర్టు పక్కనే రాస్ కొండమీద ఉన్న మేరీమాత గుడికి వెళ్లి ప్రార్థన చేశాడు. భారీ ముడుపును కానుకగా చెల్లించాడు. ప్రార్థనలు ముగించుకొని, టోనీ ఇంటికి బయల్దేరారు. పిల్లలిద్దరూ వడివడిగా మెట్లుదిగి ముందుకి వెళ్లిపోయారు.

ఆ చలికాలపు ఎండలో రాస్ కొండపైనుండి చూస్తే విశాఖపట్నం మనోహరంగా కనిపించింది. నిజానికి అది యారాడ కొండకి కొనసాగింపు. మధ్యలో హార్బరులోకి నౌకలు వచ్చిపోయేందుకు త్రవ్విన కాలువొక్కటే అడ్డం. యారాడ ఊరికి వెళ్లడానికీ, సింధియా కోలనీ వైపుగా వెళ్లేవారినీ కాలువ దాటించే ఆవిరి యంత్రపు పాతకాలం ఫెర్రీ, అన్ని వైపులా పచ్చని కొండలూ, గుబురుగా పెరిగిన చెట్లతో నిండిన లోవతోట, వచ్చేపోయే నౌకలు, దూరంగా నీలిరంగు సముద్రం, పోర్టుని చుట్టూతా ఆవరించిన నిర్మానుష్యమైన ఉప్పుటేరు, దూరంగా తూర్పు కనుమలు, మరో వైపున పచ్చదనం మధ్యలో చిన్న టౌను. అదీ ఆనాటి విశాఖపట్నం.

ఆ సుందర దృశ్యాలన్నీ కలగలిసిపోయి, జిమ్మీ మదిలో విశాఖపట్నం అంటే ఎనలేని మక్కువ కలిగించాయి. మధ్యధరా సముద్ర తీరం, ఆ తీరం వెంబడే ఉండే నగరాలు గుర్తుకొచ్చాయి. మేరీమాత చర్చి నుండి తిరిగి వస్తూ, తన భార్యతో (ఇంగ్లీషులో) –

"షెర్రీ, ఈ ఊరు నాకు బాగా నచ్చింది. కలకత్తా మాదిరిగా మహానగరమూ కాదు, అలాగని మరీ చిన్న టౌనూ కాదు. నువ్విక్కడే పుట్టి పెరిగావు. సహజంగానే నీకీ ఊరుతో ఒక లోతైన అనుబంధం ఉంది. మీ నాన్నా, మీ తమ్ముడూ కూడా ఇక్కడ సెటిల్ అయిపొమ్మని ఎప్పటినుంచో మనల్ని పోరుతున్నారు. మన బంధువులూ, స్నేహితులూ చాలామందే ఇక్కడ స్థిరపడ్డారు. ఎలాగూ సముద్రం మీద తిరగడం మానేద్దామని అనుకుంటున్నాను కదా? ఈ ఊళ్లోనే ఉద్యోగం చూసుకుంటే ఎలా ఉంటుంది?" అన్నాడు.

షెరాన్, భర్త మాటలను నమ్మలేకపోయింది. 'కలా?నిజమా?' అన్నట్లు అతనికేసి చూసి –

"హమ్మయ్య! ఇన్నాళ్లకు నా మాట నీ చెవికెక్కింది...'జమీల' ఏక్సిడెంటు మన మంచికే అయినట్టుంది," అంది, ఆనందం పట్టలేక.

జిమ్మీ ముఖం కందగడ్డలా ఎర్రబడింది.

"తప్పు. అలా అనకూడదు. ఒక మనిషి నిండు ప్రాణం పోయింది. ఎంత ప్రయత్నించినా అతన్ని రక్షించలేకపోయాం," అన్నాడు.

షెరాన్ తన తప్పు తెలుసుకుంది. "ఐ యామ్ సారీ!" అంటూ జిమ్మీ చేతిని తన చేతిలోకి తీసుకుంది.

భార్యాభర్తలిద్దరూ మరో మాటలేకుండా రాస్ కొండ మెట్లు దిగారు.

మర్నాడు బ్రేక్ఫాస్ట్ టైంలో టోనీని అడిగితే, "జిమ్మీ, నువ్వు అప్లై చెయ్యాలేగాని కళ్లకద్దుకొని మరీ తీసుకుంటారు. ప్రతీ సోమవారం జరిగే రివ్యూ మీటింగ్ అయ్యాక చైర్మన్ గారితో ఒక మాట అని చూస్తాను," అన్నాడతడు.

షెరాన్ తండ్రి జెఫ్రీకూడా – అల్లుడు జిమ్మీ విశాఖపట్నంలో ఉద్యోగం చూసుకుంటానంటే సంతోషించాడు. బ్రేక్ఫాస్ట్ అవుతున్నంత సేపూ వైజాగు గుణగణాలను పొగిడాడు.

జిమ్మీ గురించి పేపర్లలో చదివిన పోర్టు చైర్మన్, మొదట పైలట్గా జాయిన్ కమ్మని సలహా ఇచ్చాడు.

టోనీ తన ఇంట కొద్ది రోజులు ఉండమని జిమ్మీ కుటుంబాన్ని కోరాడు. రెండు కుటుంబాల మధ్యా సఖ్యత ఏర్పడింది.

మరో నెల్లాళ్లు తిరక్కుండానే జిమ్మీ పైలట్గా చేరిపోవడం, కుటుంబాన్ని కలకత్తానుండి తీసుకురావడం, సోల్జరుపేట సమీపంలోనే పోర్టువారి బంగళాలోకి మారిపోవడం – అన్నీ చకచకా జరిగిపోయాయి. జిమ్మీకి కలకత్తాతో బలమైన అనుబంధం ఉంది. ఆ నగరంలో పుట్టిపెరిగిన వాళ్లెవరైనా ఇంకెక్కడా ఉండలేరు అనే మాటలో వాస్తవం ఉంది. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అదంతా గడిచిపోయిన అధ్యాయంలాగా అతనికి అనిపిస్తోంది. అక్కడ వదిలి వచ్చిన తల్లిదండ్రుల సమాధులు మాత్రమే భౌతికమైన చిహ్నాలుగా గుర్తుకొస్తాయి. షెరాన్తో అనలేదుగానీ, వాల్టేర్ క్లబ్బులో ఒకసారి టోనీతో ఈ విషయాల్ని పంచుకున్నాడు. అప్పుడు టోనీ –

"షెరాన్కివేవీ తెలియవని ఎలా అనుకుంటున్నావు? కలకత్తా విడిచిపెట్టడం అంటే నీకది చాలా పెద్ద నిర్ణయం అని నాతో రెండు మూడు సార్లు అంది. తన

కోసమని వైజాగ్ రావడానికి సిద్ధపడినందుకు మేమంతా నీకు సహకరించాలని అక్క నాతోనూ, మా నాన్నతోనూ అన్నది," అన్నాడు.

* * *

జిమ్మీ పోర్టులో చేరిన కొత్తలో 'గ్రాంపస్' అనే టగ్గు ఒక పెద్ద ఓడని లాగుతూ ప్రమాదవశాన తిరగబడిపోయింది. ఎనిమిది మంది సిబ్బంది దాని క్రింద ఇరుక్కొని చనిపోయారు. ఆ ప్రమాదంపై విచారణ జరిపేందుకు పోర్టు చైర్మన్‌నియమించిన కమిటీకి జిమ్మీ ప్రధానాధికారిగా ఉన్నాడు. ఆ పనిని అతడే చొరవ తీసుకొని సకాలంలో పూర్తి చేశాడు. ఇక మీదట అటువంటి ప్రమాదాలు జరకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను నివేదికలో వివరంగా పేర్కొన్నాడు. రిపోర్టు చదివిన ఛైర్మన్ జిమ్మీని ప్రత్యేకంగా అభినందించాడు. దాంతో జిమ్మీ పేరు పోర్టులో చాలామందికి తెలిసింది.



పాత నగరం

నేను యారాడ కొండని...

ఏ మహాపట్నంలోనైనా - పాతనగరం సందర్శకులకీ, కొత్త నగరం వ్యాపారానికీ అంటారు. విశాఖపట్నానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

పారిశ్రామిక నగరంగా అవతరించిన విశాఖపట్నం, చుట్టుపక్కల ఉన్న ఎన్నో పల్లెలనూ, పేటలనూ, పొలాలనూ, తోటలనూ – చివరికి కొండలను కూడా – తనలో కలుపుకుంటూ విస్తరించింది; ఇంకా విస్తరిస్తూనే ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి యారాడ కొండ, తుమ్మెదల మెట్ట, సింహాచలం కొండల నడుమ – తీరం నుండి ఉప్పుటేరువరకూ ఉన్న ప్రదేశంలో నిలదొక్కుకుంది. విశాఖపట్నం అంటే కొండలు, మెట్టలు, దిబ్బలు, ఎగుడు-దిగుళ్లు, అప్పు-డొన్లు. విశాఖపట్నం అంటే సముద్రం, ఉక్కపోత, చల్లని సాయంత్రాలు. విశాఖపట్నం అంటే బంగాళాఖాతంలో పుట్టి, తీరాన్ని దాటే వాయుగుండాలు, ఆకస్మిక తుఫానులు, ఎక్కడో ఇండోనీసియా సముద్ర గర్భంలో అగ్నిపర్వతం పేలితే మీద పడే సునామీలు.

హార్బరు కాలువ మొదలుకొని టర్నరు చౌల్ట్రీ వరకూ ఉన్న ప్రాంతాన్ని పాత నగరం అని ఇప్పుడు అంటున్నారుగానీ అప్పట్లో అదే విశాఖపట్నం. అనాదిగా ఉంటూన్న జాలారిపేట, అన్ని ఇతర కులస్థులకీ నెలవుగా ఏర్పడ్డ చెంగల్రావుపేట, బ్రిటీషు పాలనలో రూపుదిద్దుకున్న పోర్టు, చర్చిలు, స్కూళ్లూ, సమాధుల నడుమ వెలసిన సోల్జరుపేట – ఈ మూడు పేటల ఉనికి ఆ హద్దులకే పరిమితం. బ్రిటీషు కాలం నాటి స్కూళ్లు, చర్చిలు, సమాధులు నేటికీ ఉన్నాయి. దేశవ్యాప్తంగా అధికారులు, పనివారలు వచ్చిచేరిన పరిశ్రమల వృద్ధికీ, నౌకాదళం విస్తరించడానికీ, అంతర్జాతీయ వాణిజ్యానికీ చోదకశక్తి అయిన ఆధునిక ఓడ రేవు బ్రిటీషు కాలం నాటిదే మరి.

కోట మాయమైనా మిగిలి ఉన్న 'కోటవీధి', ఒకప్పుడు ఓడ సరంగులకు ఆలవాలమైన 'అంబుసరంగు వీధి', రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సైనికులు వదిలివెళ్లిన సోల్జరుపేట – ఇవి కూడా పాతనగరంలో భాగాలే. పాతనగరానికి

కాస్తంత ఎడంగా, తీరం వెంట సంస్థానాధీశులు, జమీందార్లు నిర్మించుకున్న వేసవి విడిదులు, భవంతులు, ఆ తరవాత దశలో విద్యావంతులైన మధ్య తరగతి, సంపన్న వర్గాల అగ్రకులస్థులు మహారాణీపేటలో కట్టుకున్న బంగళాలు – ఇవి కూడా బ్రిటీషు కాలం నాటివే. ఇదీ ఆనాటి విశాఖపట్నపు స్వరూపం. జాలారిపేట, చెంగల్రావుపేట, సోల్జరుపేట – ఈ మూడింటినీ కలిపి ఉంచేది నేపథ్యంలో నిత్యం వినవచ్చే సముద్రపు ఘోష. విశాఖపట్నం లేనప్పుడు కూడా సముద్రం ఉండేది గానీ, సముద్రం లేకుండా విశాఖపట్నం లేదు. ఆ మూడు పేటల వాసుల్నీ కలుపుతూనే విడదీసిన అంశం ఏదైనా ఉందంటే అది 'ముక్కు ఎవరిది?' అనే ప్రశ్నకు జవాబును బట్టి – చేపల కంపు, లేదా వాసన.

విశాఖ పాతనగరంలో – అరవైలదాకా అన్ని కులాల హిందువులతో బాటుగా ముసల్మానులు, ఆంగ్లో-ఇండియన్లు ఎదురయ్యేవారు; ప్రతి ఒక్కరి విశిష్ట జీవన సరళి ఇంకా కళకళలాడుతూనే ఉండేది. అక్కడ విక్టోరియా మహారాణి విగ్రహాన్ని ప్రతిష్టింపజేసిన స్థానిక జమీందారు అంకితం వెంకట జగ్గారావు సుప్రసిద్ధ ఏ.వీ. ఎన్. కాలేజీని కూడా స్థాపించాడు. 'రాణీ బొమ్మ'కి ఎదురుగా నాజ్ రెస్టారెంటులో పొద్దున్నే వెన్న బాగా అద్దిన బన్నులు తిని, వేళ్లని తమ గెడ్డాలపై తుడుచుకున్నాక, ఇరానీ టీ సాసర్లలో పోసుకొని చప్పరిస్తూ, పష్టో భాషలో బిగ్గరగా మాట్లాడుకుంటూ – మధ్యమధ్యలో ఒకరి వీపులను ఒకరు చరుచుకుంటూ, పెద్దగా నవ్వుకుంటూ, గెడ్డాలను నిమురుకుంటూన్న కాబూలీవాలాలు కనిపించేవారు. దేశంకాని దేశంలో ఉన్నామని వారికెన్నడూ అనిపించినట్టు లేదు. ఆఫ్ఘనిస్తాన్లో ఉన్నంత ధీమాగా, స్వేచ్ఛగా ఇక్కడ కూడా సంచరించేవారు. వారి కుచ్చు తలపాగా, కుర్తా పైజామా, చెమ్కీ కోటు, పాదాలకి ముందుకి వంకీలు తిరిగిన పావుకోళ్లు, చేతిలో లాఠీ – చూపరులను ఆకట్టుకొనేవి. కాబూలీవాలాలు అత్యవసరంగా డబ్బు అవసరం పడిన పోర్టు కార్మికులనూ, చెంగల్రావుపేట దిగువ మధ్య తరగతి జనాల్నీ, చిరు వ్యాపారుల్నీ, ఒక్కోసారి జాలరుల్ని కూడా ఆప్యాయంగా పిలిచి మరీ రొక్కం చేతిలోపెట్టి, ఆపద్బాంధవుల్లా ఆదుకొనేవారు. వడ్డీలు కట్టించుకొనేటప్పుడు మాత్రం వాళ్ల చేతుల్లోని లాఠీలు శూలాల్లాగా కనిపించి అప్పు తీసుకున్నవాళ్లని భయపెట్టేవి. జీతాల రోజున యమభటుల గుంపు లాగా ఆఫీసు, లేదా ఫాక్టరీ బయట కాపు కాసి, ముక్కుపిండి వడ్డీలు కట్టించుకొనేవారు. ఎవరైనా తప్పించుకోవాలని చూస్తే నక్షత్రకుల్లాగా వెంటాడి, బండబూతులు తిడుతూ పీడించేవారు. ముఖ్యంగా ప్రభుత్వోద్యోగులకు అప్పులివ్వడానికి కాబూలీవాలాలు ఇష్టపడేవారు. వాళ్లెక్కడికీ పారిపోరనీ, అందర్లోకీ భయస్థులు వాళ్లే అనీ ఆ ఆఫ్ఘన్లకు తెలుసు.

నాజ్ రెస్టారెంటు నుంచి పోర్టు కెనాల్ వైపుగా నాలుగడుగులు వేస్తే

అంబుసరంగు వీధి, ఆ పైన కోటవీధి తగుల్తాయి. ఇంచుమించుగా ప్రతీ ఆంగ్లో-ఇండియన్ ఇంటి నుండీ సంగీతం వినిపిస్తుంది. పియానో, వయొలిన్, ఎకార్డియన్,... అంతా ఏదో ఒక వాయిద్యాన్ని పలికిస్తూ ఉంటారు. ఒక్కో ఇంట్లోంచి గ్రామఫోను రికార్డులు వీనుల విందు చేస్తూ – ఎల్విస్ ప్రిస్లీ, క్లిఫ్ రిచర్డ్స్, కార్పెంటర్స్, బీటిల్స్, ఎంగెల్ బెర్ట్ – వంటి గాయకుల గొంతులను వినిపింపజేస్తూ ఉంటాయి. కొన్ని ఇళ్ల నుండి బీథొవెన్, మొజార్ట్, చాయికోవస్కీల పాశ్చాత్య శాస్త్రీయ సంగీతం కూడా వినబడేది – ముఖ్యంగా సాయంత్రాలలో. ఆదివారం ఉదయం పూట అయితే అట్టే మసాలా లేకుండా కోడి, మేక, పంది లేదా గొడ్డు మాంసం, అలాగే చేపలకూర వండుతూన్న సువాసనలను కోటవీధి విరజిమ్మేది. హార్బరు ఛానెల్ ఒడ్డునే ఉన్న వెంకటేశ్వరుడి గుడికి వెళ్లే హిందువులందరూ వీటన్నింటినీ ఆస్వాదిస్తూ ఆ దారినే వెళ్లాలి.

పాత పోస్టాఫీసు వద్ద అంబుసరంగు వీధిలోకి వెళ్లకుండా కుడివైపు, అంటే హార్బరు దిశగా తిరిగితే ఎచ్.ఎమ్.ఎస్. ('హెర్ మేజెస్టీస్ షిప్') బేకరీ వస్తుంది, చిన్నదే అయినా స్థానికులకు నిత్యావసర వస్తువులైన బ్రెడ్డు, కేకులు, పేస్ట్రీలు, కూల్ డ్రింకులు అక్కడ దొరుకుతాయి. అదే వైపుగా ముందుకి వెళితే – లావెండర్ కెనాల్ అని ముద్దుగా పిల్చుకొనే మురికి కాలువ వస్తుంది, అది దాటితే పోర్టు. ఎగుమతి కోసం ఉద్దేశించి గుట్టలుగా పోసిన ఇనుప ఖనిజం రాసులు కనిపిస్తాయి. దానిని 1960ల వరకూ కూలీలు ఎండనక వాననక తట్టలలో నెత్తిన మోసుకుంటూ, చీమలబారుల్లా నిచ్చెనలను ఎక్కి, పెద్ద వాణిజ్య ఓడలలో కుమ్మరించి వెనుతిరిగేవారు.

అదే దారిన – అంటే మేరీ మాత చర్చి ఉన్న రాస్ కొండ వెంబడే ఒకటి రెండు కిలోమీటర్లు – మెరైన్ ఫోర్మన్ ఆఫీసువరకూ వెళితే, హార్బరు, అక్కడ నిలిపి ఉన్న ఓడలు కనిపిస్తాయి. ఎదురుగుండా, యారాడ కొండని ఆనుకొని – హిందుస్తాన్ షిప్ యార్డు; ఒక వైపు నిర్మాణంలో ఉన్న నౌకలు, మరోపక్క నౌకాదళం వారి ఓడలు, మధ్యలో క్రేన్లతో సరకులను ఎత్తుతూ, దించుతూ ఓడ కళాసుల సందడి నడుమ వాణిజ్య నౌకలు. అయితే ఆ దారి కొసన ఉన్న మెరైన్ ఫోర్మన్ ఆఫీసులోకి గాని వెళ్లగలిగితే – అక్కడ గోడకి తగిలించి ఉన్న క్యారియర్లు కనిపిస్తాయి. ఎన్నాళ్లయినా అవి అక్కడే ఉంటాయి. ఎందుకని అక్కడి గెడ్డాలు నెరిసిన పెద్దల్ని అడిగితే, వాళ్లల్లో అప్పటి సంగతులు తెలిసిన వాళ్లెవరైనా ఉంటే –

"ఓహ్! అవా? ఛానెల్‌లో మునిగిపోయిన పోర్టు టగ్ – 'గ్రాంపస్'లో పనిచేసిన కళాసులవి. వాళ్లంతా ఆ ప్రమాదంలో పోయారు." అంటారు.

"అవి ఇప్పటికీ ఇక్కడెందుకు ఉన్నాయి?"

"ఆ రోజున వాళ్లెవరికీ భోజనాలు అందనే లేదు. వాటిని తిరిగి ఇళ్లకి పంపించడానికి మనసొప్పక శుభ్రంచేసి అప్పటినుంచీ అలాగే ఉంచేశాం," అని చెబుతారు, నిర్వేదంగా.

* * *

తమ నివాసాన్ని కలకత్తా నుండి వైజాగుకి మార్చినది మొదలు షెరాన్‌లో ఒక కొత్త ఉత్సాహం ఉరకలు వేయసాగింది. మర్చిపోయిందనుకున్న తెలుగు మళ్లీ ఆమె నోటి వెంట వెలువడనారంభించింది. భర్త జిమ్మీ, పిల్లలు డారల్, డెబొరాల కళ్లకి ఆమె ఒక కొత్త మనిషిలాగా కనబడుతోంది. స్వంత ఊరంటే ఉండే మమకారం అటువంటిది. పైగా ఆమె తమ్ముడూ, అతని కుటుంబమూ పక్క వీధిలోనే ఉంటున్నారు. తల్లి మరణించి చాలాకాలం అయిందిగానీ, తండ్రి తమ్ముడింట్లోనే ఉంటున్నాడు. వారి సహకారంతో అతితక్కువ సమయంలోనే షెరాన్ తన కొత్త ఇంటిని తనకు నచ్చిన విధంగా తీర్చిదిద్దుకుంది. కలకత్తాలో ఉండగా వాళ్లు నివసించిన చిన్న ఫ్లాట్‌తో పోలిస్తే ఇప్పుడున్న బంగళా మహా భవనమే. పిల్లలిద్దరికీ – చెరో గది, ఇంటి చుట్టూ తోట. డారల్ కుక్కని పెంచుకోవాలని ఎప్పటి నుండో సరదా పడుతున్నాడు. డెబొరాకి పిల్లులంటే ఇష్టం. ఇద్దరికీ అనుమతి లభించింది. టోనీ కూతుళ్లిద్దరూ షెరాన్‌కి బాగా చేరికయ్యారు. వాళ్లకి డెబొరాయే రోల్ మోడల్. షెరాన్ తమ్ముడి ఇంట్లో వదిలివెళ్లిన తన పియానో తెచ్చుకుంది. ఒక తోటమాలిని కుదుర్చుకుంది. ఎక్కడ ఏ పూలు పెంచాలో, ఏయే కూరగాయలు పండించాలో, ఏయే గెత్తాలు వెయ్యాలో – అతనితో చర్చించింది. కూరలు బాగా కాసాయి. తమ్ముడి కుటుంబానికే కాకుండా, ఇరుగుపొరుగు వాళ్లకి కూడా కూరలు పంపడం మొదలు పెట్టింది. కొత్త స్నేహాలు ఏర్పడ్డాయి. తమ్ముడి ఇంట్లో వంటచేసే ముస్లిం మహిళను తమ ఇంటకూడా పనికి నియమించింది. ముస్లింలయితే గొడ్డు మాంసం కూడా వండుతారు. ఇక సమస్యల్లా ఒక్క పంది మాంసంతోనే. ఆ అవసరం పడినప్పుడు ఆమే స్వయంగా వండేది. కూరగాయలు కలకత్తాలో ఉండేంత తాజాగా, రుచిగా ఉండవుగానీ, చేపలు మాత్రం చాలా తాజావి దొరుకుతాయని షెరాన్‌కి ముందే తెలుసు.

పనివాళ్లతోనూ, బజార్లోనూ తల్లి ధారాళంగా తెలుగులో మాట్లాడుతూంటే డారల్, డెబొరాలకు కొంచెం విడ్డూరంగా ఉంది. అవసరం అయినప్పుడు వాళ్లు హిందుస్తానీలో మాట్లాడతారు. బెంగాలీ కొంచెం వచ్చుగానీ ఇక్కడ ఉపయోగం లేదు. కలకత్తా నుండి ఎప్పుడో వచ్చి స్థిరపడ్డ బెంగాలీ కుటుంబాలు చాలానే ఉన్నాయనీ, దుర్గా పూజల్లో వాళ్లు నెలకొల్పే పెండాల్స్‌కి వెళ్దామనీ టోనీ మామ ఊరించాడు. తల్లి వద్ద పియానో నేర్చుకోవడానికి డెబొరా ఉత్సాహం చూపింది. తను చేరబోయే ఆంగ్లో-ఇండియన్ స్కూల్లో మంచి ఫుట్ బాల్ టీము ఉందని మామ చెప్పినపుడు డారల్

ఆనందించాడు. టోనీ తన పరిచయాలను ఉపయోగించి, ఆయా ఫాదర్లతోనూ, సిస్టర్లతోనూ మాట్లాడి – డారల్‌ని సెయింట్ అలోషియస్ బాయ్స్ స్కూల్లోనూ, డెబొరాని క్వీన్ మేరీస్ బాలికల స్కూల్లోనూ చేర్పించాడు.

* * *

కేప్టెన్ జిమ్మీ తండ్రి రిచర్డ్, షెరాన్ తండ్రి జెఫ్రీ బెంగాల్-నాగపూర్-రైల్వే (బీ.ఎన్.ఆర్.)లో సహోద్యోగులు, స్నేహితులు. విశాఖపట్నం పోర్టు నిర్మాణ బాధ్యతని బీ.ఎన్.ఆర్. చేబట్టినప్పుడు కలకత్తా నుండి వైజాగు వచ్చారు. పోర్టు నిర్మాణంలో భాగస్వాములు కావడం వారిద్దరికీ ఒక గొప్ప అనుభవం. ఎన్నో ఒడిదొడుకుల మధ్య ఆ బృహత్ కార్యక్రమం విజయవంతంగా పూర్తికావడం వెనుక తమ శ్రమ కూడా ఉందనే విషయం వాళ్లకి ఒక సంతృప్తినీ, ఆనందాన్నీ మిగిల్చింది. పోర్టు పనుల్లో స్థానికులకు కాంట్రాక్టులు దొరికాయి; వ్యాపారులకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. నౌకా వాణిజ్యంలో అప్పటికే ఆరితేరిన కలకత్తా కంపెనీలు, దొరల సంస్థలు కొన్ని తమ బ్రాంచి ఆఫీసులను విశాఖలో తెరిచాయి. బెంగాలీలు కుటుంబాలతో వచ్చి స్థిరపడ్డారు. అలాగే మదరాసు, బొంబాయిలనుండి కూడా కొన్ని కంపెనీలు వచ్చాయి. ఎగుమతి, దిగుమతులు నిర్వహించే గుజరాతీలు, మార్వాడీలు వచ్చారు. ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, శ్రామికులు – వీరి సంఖ్య పెరుగుతూండడంతో వాళ్లకి అప్పులివ్వడానికి కాబూలీవాలాలు కూడా వచ్చారు. దేశ విభజన జరిగినప్పుడు సింధీలు, బోరా ముస్లింలు కూడా వచ్చి చేరారు. హిందూ-ముస్లిం తగాదాలు లేకుండా, దక్షిణ భారతదేశం ప్రశాంతంగా ఉంటుందనీ, ముఖ్యంగా విశాఖపట్నంవంటి టౌన్లు వ్యాపార వృద్ధికి కొత్త అవకాశాలను కల్పిస్తాయనీ వారంతా నమ్మారు. వారి నమ్మకాన్ని విశాఖ నగరం వమ్ము కానివ్వలేదు.

పోర్టు నిర్మాణంలో ఉన్నప్పుడు జరిగిన ఒక సంఘటన రిచర్డ్, జెఫ్రీలకు బాగా గుర్తుండిపోయింది. యారాడ కొండ వెంబడే కొనసాగే ప్రవాహంతో బాటుగా కొట్టుకొచ్చిన ఇసుక, మేటవేసుకుపోతూ, ఛానెల్‌ని మూసి వెయ్యడాన్ని ఎలా అరికట్టాలో తోచక బ్రిటీషు ఇంజినీర్లతో సహా అంతా తలలు పట్టుకున్నారు. అప్పుడు మైసూరుకి చెందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య అనే భారతీయ ఇంజినీరుని సంప్రదించారు. ఒక పాత ఓడని చానెల్ వద్ద ముంచి వెయ్యమనీ, అది ప్రవాహాన్ని ఒక గోడలాగా అడ్డుకొని, దాని దిశని మళ్లిస్తుందనీ అతడు సలహా ఇచ్చాడు. ఆవిధంగా, తక్కువ సమయంలో, అతి స్వల్పమైన ఖర్చుతో చక్కటి పరిష్కారం దొరికింది. విశ్వేశ్వరయ్య తెలివితేటలు, సాంకేతిక పరిజ్ఞానం జెఫ్రీ, రిచర్డ్‌లతో సహా అధికారులందర్నీ ముగ్ధులను చేసాయి. విశాఖ రేవులోకి ప్రవేశించిన తొలి నౌక సింధియా స్టీమ్ నేవిగేషన్ వారి ఎస్.ఎస్. 'జల దుర్గ'ను పోర్టులోనికి తీసుకురావడం,

వైస్రాయి లార్డు విల్లింగ్డన్, పోర్టుకి ప్రారంభోత్సవం చెయ్యడం వాళ్లకు జీవితాంతం గుర్తుండిపోయిన సంఘటనలు.

విశాఖపట్నం ఇద్దరికీ బాగా నచ్చిందిగానీ 1933లో పోర్టు నిర్మాణం పనులు పూర్తి కాగానే రిచర్డ్ కలకత్తా వెళ్లిపోయాడు. జెఫ్రీ మాత్రం వైజాగు పోర్టులోనే డ్రెడ్జర్ ఇంజినీరుగా కొనసాగాలని నిర్ణయించుకున్నాడు. రెండు కుటుంబాల మధ్యా స్నేహం, రాకపోకలు కొనసాగాయి. అవే జిమ్మీ-షెరాన్ల స్నేహానికీ, పెళ్లికీ దారితీసాయి.

1942లో జపాన్ యుద్ధ విమానాలు విశాఖపట్నం మీద బాంబులు వేసినప్పుడు జెఫ్రీ పోర్టు వర్క్ షాపులో ఉన్నాడు. ఊహించని విధంగా జరిగిన ఆ దాడిలో తొమ్మిది మంది పోర్టు కార్మికులు, ఉద్యోగులు మరణించారు. ఆ సంఘటనను జెఫ్రీ చాలా సార్లు వివరిస్తూండేవాడు. అది కొన్నాళ్లకి అందరికీ తెలిసినదే అయినా, మళ్లీమళ్లీ వినాలని అంతా కోరుకొనే కుటుంబ గాథగా మారిపోయింది. స్వతహాగా మంచి మాటకారి, సహజ కథకుడూ అయిన జెఫ్రీ ఆ గాథని ఎప్పుడూ ఇలానే చెప్పేవాడు –

"1942 ఏప్రెల్ ఆరవ తేదీ. నేనెన్నటికీ మర్చిపోలేను. నేను పని చేస్తూన్న డ్రెడ్జర్‌కి కొత్త షటిల్ వాల్వులు చేయించడానికి పోర్టు వర్క్ షాపులో ఆర్డర్ ఇచ్చాం. ఆ పని ఎంతవరకూ వచ్చిందో అని తెలుసుకోవడానికి నేనక్కడికి వెళ్లాను. అప్పటికే బర్మాలో ఉన్న మన ట్రూప్స్‌కి సప్లైలు ప్రధానంగా తూర్పుతీరం నుండే వెళుతున్నాయి. వాటిని అడ్డుకోవడానికి కలకత్తా, చిట్టకాంగ్, మదరాసు, విశాఖపట్నాలమీద జపాను వాళ్లు దాడులు చేస్తారనీ, బంగాళాఖాతం మీద పట్టును పెంచుకుంటారనీ పుకార్లు జోరుగా ఉండేవి. మనవాళ్ల సంగతి తెలుసు కదా – 'ఇదుగో పులి అంటే, అదుగో తోక అంటారు'. అయితే అప్పుడు యుద్ధవాతావరణం అంతటా అలుముకొని ఉండేది. ఆ పరిస్థితుల్నీ, ఆ ఉద్రిక్తతనీ ఇప్పుడు మీరు ఊహించలేరు. అప్పటికి నాలుగు నెలల ముందే – అంటే 1941 డిసెంబరులో పెరల్ హార్బర్ మీద జపానువాడు దాడి చేసి అమెరికన్ యుద్ధనౌకల్ని ధ్వంసం చేశాడు. దాంతో అమెరికా యుద్ధం ప్రకటించింది; రెండో ప్రపంచ యుద్ధంలో ప్రవేశించింది. 1942 ఫిబ్రవరిలో – దుర్భేధ్యం అనుకున్న సింగపూరుని జపానువాళ్లు వారం రోజుల్లో స్వాధీనం చేసుకున్నారు. బర్మాలో భీకరమైన పోరాటం జరుగుతోంది. జపాను వాళ్లకి తోడుగా సుభాష్ చంద్రబోసు సైన్యం కూడా ముందుకి ఉరుకుతోంది. బర్మాలో కూడా బ్రిటీషు సైన్యాలు ఓడిపోతే ఇక ఇండియా మీద పడతారు. అందుకు సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. మార్చి 23న ఎలాంటి పోరాటమూ లేకుండానే పోర్ట్ బ్లెయిర్ నుండి బ్రిటీషు సైన్యాలు తప్పుకున్నాయి. అండమాన్ ద్వీపాలను జపాను ఆక్రమించింది. సుభాష్ చంద్రబోసు పోర్ట్ బ్లెయిర్ వెళ్లి తన సైన్యపు జెండాని కూడా ఎగరేసాడు. జపాన్ సైన్యాల విజృంభణ చూస్తే బ్రిటీషు సైన్యాలు ఇండియాని రక్షించుకోలేవనే అంతా అనుకున్నాం. వాళ్ల

దృష్టి ఎంతసేపూ యూరప్ మీద, జర్మనీ నుండి తమ దేశాన్ని కాపాడుకోవడం మీదనే ఉండేది. 'చూస్తూ ఉండండి! ఈ బ్రిటీషు వాళ్లు మన మానాన మనల్ని వదిలేసి చల్లగా జారుకుంటారు. ఇలాంటప్పుడు జపాను వాడిని నమ్ముకోవడమే ఉత్తమం. బోసు ఎలాగూ వాళ్లతో చేయి కలిపాడు' అని కొందరు చెవులు కొరుక్కొనేవారు. ఏ రోజున ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అని అంతా భయపడుతూనే ఉన్నాం. బంగాళాఖాతంలో వాణిజ్య నౌకల్ని జపాను వాళ్లు ముంచేస్తున్నారు. సముద్రంపై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటున్నారు. యుద్ధం ఏ నిమిషంలోనైనా తూర్పుతీరాన్ని ఉప్పెనలాగా తాకుతుందనీ, పెద్ద ఎత్తున జపాను సైన్యాలు తీరం వెంట దిగబడతాయనీ ప్రతి ఒక్కరూ అనుకుంటున్నారు. బ్రిటీష్‌వాళ్లు అప్పటికప్పుడు వైజాగు తీరం వెంబడి కాంక్రీటుతో డిఫెన్సు పోస్టులని నిర్మించారు. హడావుడిగా ఎయిర్ పోర్టు నిర్మాణం మొదలుపెట్టారు. జపాను సైన్యాల ధాటికి అవేవీ కూడా అడ్డుకట్ట వేయలేవని అందరికీ తెలుసు. 'అవన్నీ కంటి తుడుపు కోసమే' అన్న వాళ్లున్నారు. అయితే ఆ అత్యవసర పరిస్థితుల్లో కాంట్రాక్టర్లు, ఆర్మీకి సప్లైలు చేసే వాళ్లు బాగా సొమ్ము చేసుకున్నారు. మా కళ్లముందే కొందరు స్థానికులు కోటీశ్వరులైపోయారు".

"అది సరే! అసలు కథ చెప్పు తాతా!" అన్నాడు డారల్ అసహనంగా.

"సరిగ్గా అప్పుడు, అలాంటి ఉద్రిక్త దినాలలో, ఏప్రిల్ 6 మధ్యాహ్నం అయిదు జాపనీస్ బాంబర్లు, ఇరవై-ముప్ఫై మైళ్ల దూరంలో నిలిచిన 'ర్యూజో' అనే ఎయిర్ క్రాఫ్ట్ కారియర్ నుండి బయల్దేరాయి. రాస్ కొండమీదుగా ఎగురుతూ వైజాగ్ హార్బర్ని చేరుకున్నాయి. వాటి రాకను రాయల్ ఎయిర్ ఫోర్స్ గస్తీ విమానాలు రెండు ముందుగానే పసిగట్టాయి. ఆ గస్తీ విమానాలలో ఒకదాని పైలట్ – మారిస్ బార్కర్ అని మనవాడే – ఆంగ్లో-ఇండియన్. అప్పుడు లంచ్ టైం అయింది. భోజనానికి క్వార్టర్స్‌కి బయలుదేరుతున్నాను. హెచ్చరికగా సైరన్లు మోగాయి. అంతా హడావుడిగా పరుగెత్తాం. వర్క్ షాపులోనే ఉన్న బాంబ్ షెల్టర్లో దూరాం. కొందరు వర్కర్లు అక్కడొక పెద్ద కాంక్రీటు పైపు ఉంటే దాంట్లో దూరి దాక్కున్నారు. వాళ్ల దురదృష్టం ఏమిటంటే – బాంబు సరిగ్గా ఆ పైపు మీదే పడింది. తొమ్మిదిమంది చనిపోయారు. పక్కనే ఉన్న పవర్ ప్లాంట్ మీద కూడా బాంబు పడింది. అప్పట్లో విశాఖపట్నం అంతటికీ ఆ ప్లాంట్ నుండే పవర్ సప్లై అయ్యేది. యారాడ కొండమీద, రాస్ కొండమీద ఉంచిన యాంటీ-ఎయిర్ క్రాఫ్ట్ గన్స్ మోతతో చెవులు గడియలు పడ్డాయి. నిజానికి పోర్టు చుట్టూ ఉన్న కొండలు, వాటిపై ఉంచిన ఫిరంగులు – వీటి కాల్పుల మూలంగానే జపాను విమానాలు బాగా క్రిందికి దిగి బాంబింగు చెయ్యలేకపోయాయి. అనుకున్నంతగా విధ్వంసం చేయలేక తొందరగా వెనుతిరిగాయి. మళ్లీ వస్తాయని అందరం అనుకున్నాం. అంతా గందరగోళం; కార్మికులు, ఆఫీసర్లు తలో దిక్కూ

పరుగెత్తారు. భయపడినట్లుగానే అదే రోజు సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో జపాను విమానాలు మళ్లీ దాడి చేసాయి. హార్బరులో ఉన్న అమెరికన్ యుద్ధనౌకని టార్గెట్ చేశారనీ, మధ్యాహ్నం చేసిన దాడిలో ఏరియల్ ఫొటోగ్రఫీ ద్వారా దానిని గుర్తించారనీ అంటారు. ఆ నౌక కూడా తన గన్స్‌ని విమానాలపైకి గురిపెట్టి కాల్చింది. రెండోసారి వచ్చినప్పుడు జపాన్ విమానాలు జారవిడిచిన పెద్ద 350 కిలోల బాంబు – అదృష్టవశాత్తూ పేలనేలేదు. అది గనక పేలి ఉంటే ఊరు మొత్తానికి ఎంత నష్టం సంభవించి ఉండేదో ఊహించలేం...అదర్రా వైజాగుపై జపాను బాంబు దాడి కథ!".

రిటైరయ్యాక, కొడుకు టోనీ ఇంట్లో ఉంటూన్న జెఫ్రీ – షెరాన్ కుటుంబం విశాఖ వచ్చాక జరుపుకున్న తొలి క్రిస్మస్ సెలవులలో – తన మనవలు, మనవరాళ్లను చెంతన కూర్చోబెట్టుకొని ఈ కథను మరోసారి చెప్పాడు. తాతగారి కథను తమకు కొత్తగా తెలిసివస్తూన్న విశాఖపట్నానికి డారల్, డెబొరాలు సులభంగా అన్వయించుకోగలిగారు. అంతేకాదు,

"అవును తాతా! ఆ బాంబు ఇప్పటికీ మా స్కూల్లో ఉంది, దాని మీద 'UXD-HE' అని ఉంటుంది," అని చేర్చాడు, ఆ ఏడాదే సెయింట్ ఎలోషియస్ ఆంగ్లో-ఇండియన్ బాయ్స్ స్కూల్లో చేరిన డారల్. ఇది తాతగారి కథనంలో లేని కొత్త సంగతి.

"అమ్మో! ఆ బాంబుగాని ఇప్పుడు పేలితే...?" అన్నది డెబొరా – భయం భయంగా.

"ఏముంది? మా స్కూలు కుప్పకూలిపోతుంది. పాఠాలూ ఉండవు, హోమ్ వర్కూ ఉండదు. ఎంచక్కా రోజంతా ఫుట్ బాల్ ఆడుకోవచ్చు," అన్నాడు – డారల్ చెల్లెలితో, డాంబికంగా.

"ఫూలిష్‌గా మాట్లాడకు, స్టుపిడ్ ఫెలో," అని డెబొరా అన్నకు ఎదురు జవాబిచ్చింది.

"అన్నని స్టుపిడ్ అనకూడదు," అని షెరాన్ వారించింది.

* * *

జిమ్మీ కొత్త ఉద్యోగంతో తలమునకలుగా ఉన్నాడు. వైజాగు పోర్టులో రాత్రిపూట నౌకలు వచ్చిపోయేందుకు అప్పటికింకా అనుమతి లేదు. అందుచేత నైట్ డ్యూటీ లేదు గానీ పగటి పూటే రెండు షిఫ్టులు ఉండేవి. టోనీ రోజూ పొద్దున్నే టెన్నిస్ ఆడడానికి పోర్టు జింఖానాకి, ఎప్పుడైనా సాయింత్రం పూట మిత్ర బృందంతో బాటుగా ఓ పెగ్గు పుచ్చుకోవడానికీ వాల్తేరు క్లబ్బుకి వెళ్తూంటాడు. బావ జిమ్మీని కూడా ఆ క్లబ్బులలో చేర్పించాడు; తన స్నేహితుల్ని పరిచయం చేశాడు. వైజాగులో ప్రతీ కుటుంబానికీ – ప్రత్యక్షంగానో పరోక్షంగానో – ఇంచుమించుగా అన్ని ఇతర కుటుంబాలూ తెలిసి

ఉండడం జిమ్మీకి ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే అలా పరిచయాలు ఉన్న వాళ్లంతా మధ్య తరగతికి చెందిన ఉద్యోగులు లేదా వ్యాపారులు అని జిమ్మీకి త్వరలోనే అర్థం అయింది. ఎవరి ప్రసక్తి వచ్చినా, 'అతనా? మా క్లాస్మేటుకి తమ్ముడు అనో, అతని చిన్నాన్న మా నాన్నగారి సహోద్యోగి అనో, అతని భార్య సెయింట్ జోసెఫ్ కాలేజీలో షెరాన్‌కి సీనియరు' అనో టోనీ అనేస్తాడు. ఇక క్రైస్తవులో, ఆంగ్లో-ఇండియన్లో అయితే వారివి ఎలాగూ చిన్న సమూహాలే. వాళ్లంతా ఆదివారం నాడు తమతమ చర్చిలలో కలుసుకుంటూనే ఉంటారు.

ప్రతీ ఆదివారం, టోనీ కుటుంబంతో బాటుగా జిమ్మీ, షెరాన్, పిల్లలూ పాత పోస్టాఫీసు వద్ద ఉన్న సెయింట్ జాన్స్ పారిష్ చర్చికి వెళ్లడం ఒక ఆనవాయితీగా మారింది. అంతకు ముందు రెండు మూడు సార్లు టోనీ కుటుంబంతో వేసవి సెలవులు గడపడానికి వచ్చినప్పుడు, అలాగే ఒక సంవత్సరం క్రిస్మస్ గడపడానికి అదే చర్చికి సకుటుంబంగా వెళ్లి ఉన్నాడు. అదొక సువిశాలమైన ప్రదేశంలో నిర్మించబడిన అందమైన పాతకాలపు చర్చి. 1844లో దాని నిర్మాణం పూర్తయింది. దుర్భేధ్యమైన కోటలా కాకుండా, చేతులు చాచి భక్తులను ఆహ్వానిస్తున్నట్లుగా ఉండే దాని రూపకల్పనలోనూ, నిర్మాణ పర్యవేక్షణలోనూ సర్ ఆర్థర్ కాటన్ ప్రధాన పాత్రను పోషించాడు.

ఒక ఆదివారం నాడు, చర్చిలో ప్రార్థనలు పూర్తయ్యాక, షెరాన్, జిమ్మీని తోడు రమ్మని కురుపాం మార్కెట్టుకి దారి తీసింది. 'మేము ఇంటికి నడిచి వెళ్లిపోతాం, మీరు కారు తీసుకెళ్లండి' అని టోనీ తన ఆస్టిన్ కారుని వాళ్లకి అప్పగించాడు. టోనీ భార్య వలేరీ –

"మేం మీకోసం మాంసం కొని ఉంచుతాం; మాకు కూడా కాసిన్ని చేపలు తెచ్చిపెట్టండి. బాగుంటే సందువలు, రొయ్యలు తీసుకురండి," అని షెరాన్‌ని కోరింది.

'చర్చిలో ప్రార్థనకని వేసుకున్న సూటూ, బూటూ, హేటూ ధరించి చేపల బజారుకి వెళ్లడం ఏం బాగుంటుంది?' అని జిమ్మీ కాస్త తటపటాయించాడు. పొద్దున్నే, ఎండెక్కకుండా వెళితే తాజా చేపలు దొరుకుతాయని షెరాన్ అతన్ని తొందరపెట్టింది. జిమ్మీ తన టై, కోటూ, హేటూ కార్లోనే విడిచిపెట్టి భార్య వెంట నడిచాడు. ఇద్దరూ కురుపాం మార్కెట్లో అడుగుపెట్టారు. కమాను మీద 'కింగ్ ఎడ్వర్డ్ ది సెవెంత్ కారొనేషన్ మార్కెట్' అని వ్రాసి ఉంది. ఆ బ్రిటీషు మహారాజు పట్టాభిషేకం సందర్భంగా కురుపాం రాజు 1914లో కట్టించిన బజారుకి కురుపాం మార్కెట్ అన్న పేరే స్థిరపడిపోయింది.

అప్పటికే చేపల బజారులో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వాణిజ్య కోలాహలం పరాకాష్టకి చేరుకుంది. అమ్మే వాళ్లంతా స్త్రీలే. కొనుగోలుదార్లలో

ఆడా, మొగా ఉన్నారు; తెలుగువాళ్లే కాకుండా, బెంగాలీలు, ఆంగ్లో-ఇండియన్లు, ముసల్మాన్లు కూడా ఉన్నారు. పంచె కట్టుకున్న బెంగాలీ పెద్దాయన ఒక వేలితో మనవడినీ, రెండో చేత్తో సంచినీ పట్టుకొని ముందు నడుస్తున్నాడు. మనవడు తాతని యక్షప్రశ్నలు వేస్తున్నాడు. తాత ఓపిగ్గా సమాధానాలు చెబుతున్నాడు. వాళ్లిద్దరూ బెంగాలీలో మాట్లాడుకోవడం జిమ్మీని ఆకట్టుకుంది; కలకత్తా రోజులు గుర్తుకొచ్చాయి. చిన్నతనంలో తండ్రి చెయ్యి పట్టుకొని బజారుకి వెళ్లడం జ్ఞాపకం వచ్చి అతని కళ్లు చెమర్చాయి. షెరాన్ చూస్తుందేమోనని, జేబులోంచి నల్ల కళ్లద్దాలు తీసి పెట్టుకున్నాడు.

చేపల్ని కడిగి, పొలుసు తీసి, ముక్కలు తరిగే కార్యక్రమం కూడా అక్కడే ఒక పక్క నడుస్తోంది. బాగా బలిసిన పిల్లులు చేప ముక్కలకోసం ఆశగా చూస్తూ, గంపల వద్ద మూగుతున్నాయి. జాలరులు అదిలించినా అక్కడే తచ్చాడుతున్నాయి. పీచు బేరాలాడే గిరాకీలని జాలరి స్త్రీలు తిట్టిపోస్తున్నారు. పెద్ద నోట్లని తమ జాకెట్లలో దోపుకుంటున్నారు; చిల్లర నాణేలని చిక్కాలలో బంధిస్తున్నారు. వాళ్ల నోటి ధాటికి జడిసిన కొనుగోలుదారులు మారుమాట్లాడకుండా అడిగిన ధర చెల్లించి చేపల్ని గుడ్డ సంచుల్లో పోసుకొని జారుకుంటున్నారు. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వాడకం ఇంకా మొదలు కాలేదు. అది ప్లాస్టిక్ రహిత ప్రపంచం.

షెరాన్ ఉత్సాహంగా ముందుకి దారితీసింది. జిమ్మీ ఆమె వెనక నడుస్తున్నాడు.

"దొరగారూ! నమస్తే!!" అని ఎవరో అన్నారు. షెరాన్ వెనక్కి తిరిగి చూసింది. ఆమె ఎవరోగాని, తమనే పలకరిస్తున్నదని షెరాన్‌కి అర్థం అయింది.

"ఈమె నీకు తెలుసా?" అని భర్తని అడిగింది. జిమ్మీ గంగమ్మని గుర్తుపట్టాడు. తల పంకించి, చెయ్యి ఊపాడు.

"ఈమె భర్తనే – 'జమీల' ప్రమాదంలో రక్షించలేకపోయాం," అన్నాడు భార్యతో. నల్ల కళ్లద్దాలు తీసి జేబులో పెట్టుకున్నాడు, మర్యాద కోసం.

గంగమ్మ వాళ్లను సమీపించి, చేతులు జోడించి, ఆప్యాయంగా, నవ్వుతూ పలకరించింది. భర్త మరణానికి జిమ్మీ కేప్టెన్‌గా ఉన్న ఓడ కారణమైనప్పటికీ ఆమె అంత ఆప్యాయంగా పలకరించడం, స్నేహంగా మాట్లాడడం, షెరాన్‌కి ఆశ్చర్యం కలిగించింది. గంగమ్మ అన్న మాటల్ని, షెరాన్ అనువదించింది.

భర్త చనిపోయాక, చేపల్ని టోకున కొనుగోలు చేసి బజార్లో అమ్ముతున్నాననీ, బాగానే గడిచిపోతున్నదనీ, దేనికీ ఇబ్బంది లేదనీ గంగమ్మ చెప్పింది.

కేప్టెన్ జిమ్మీ సకుటుంబంగా విశాఖపట్నం వచ్చేసాడనీ, పోర్టులో ఉద్యోగం చేస్తున్నాడనీ షెరాన్ చెప్పినపుడు, గంగమ్మ మొహంలో సంతోషం కనిపించింది. ప్రతీ

వారం తనే చేపలూ, రొయ్యలూ – కొడుకు వెంకటేశు ద్వారానో, నూకరాజు ద్వారానో ఇంటికి పంపిస్తానంది.

"అవసరం లేదు, మేమే వస్తూంటాం," అన్నది షెరాన్.

గంగమ్మ ఇతర జాలరి స్త్రీలని గదమాయించి, హడావుడి పడుతూ షెరాన్‌కి కావాల్సిన చేపల్నీ, రొయ్యల్నీ సేకరించి, పెద్ద తాటాకు బుట్టల్లో తెచ్చి ఇచ్చింది.

"మాకిన్ని అవసరం లేదు" అని షెరాన్ చెప్తున్నా వినకుండా బుట్టల్ని కారులో పెట్టమని ఒక అమ్మాయికి పురమాయించింది.

డబ్బులు తీసుకోవడానికి నిరాకరించింది.

"అయితే మాకు చేపలు వద్దు" అని షెరాన్ పట్టుబట్టడంతో,

"ఎంతో కొంత ఇవ్వండి" అని కారువరకూ వచ్చింది గంగమ్మ.

కారు కదలబోతూంటే, "మీరు నాకో సాయం సెయ్యాలమ్మా," అంది చేతులు జోడించి.

కొడుకుని డాక్టరు చెయ్యాలనీ, కూతుర్ని యూనివర్సిటీలో చదివించాలనీ ఆమెకున్న కోరికను బయటపెట్టింది.

"అయితే వాళ్లు మొదట మంచి స్కూళ్లల్లో చదవాలి. బాగా మార్కులు తెచ్చుకోవాలి," అన్నది షెరాన్.

ఇప్పుడున్న స్కూలు అంత బాగోలేదనీ, ఏదైనా మంచి స్కూల్లో చేర్పించడానికి సాయపడాలనీ గంగమ్మ కోరింది.

"రెండ్రోజులాగి సాయంత్రం పూట ఇంటికి రమ్మను, మాట్లాడదాం. నాది ఫస్టు షిఫ్టే. సాయంత్రం అయితే టోనీ కూడా ఉంటాడు," అన్నాడు జిమ్మీ.

తమ ఇంటికి ఎలా రావాలో షెరాన్ గంగమ్మకు వివరించింది.

కారు బయల్దేరింది.

"మనం ఈమెకు వీలైనంత సాయం చెయ్యాలి," అన్నది షెరాన్, భర్తతో.

"అవును. తప్పకుండా చెయ్యాల్సిందే. నా మనసులోని మాట చెప్పావు. అప్పుడే భగవంతుడు మనల్ని దయగా చూస్తాడు," అన్నాడు జిమ్మీ కారు తోలుతూ.

* * *

ఆ రోజు టోనీ భోజనానికి తమ ఇంటికి రమ్మని అక్కనీ, ఆమె కుటుంబాన్నీ ఆహ్వానించడం, జిమ్మీ గంగమ్మ కోరికను బావమరిదితో ప్రస్తావించడం – ఆ మర్నాడే టోనీ ఫాదర్లతో, బ్రదర్లతో, సిస్టర్లతో మాట్లాడి ఒప్పించడం – అన్నీ వెంటవెంటనే

జరిగిపోయాయి. వెంకటేశ్‌ని డారల్ చదువుతున్న సెయింట్ అలోషియస్‌లో పదవ తరగతిలోనూ, ఎల్లమ్మని డెబొరా స్కూలు క్వీన్ మేరీస్‌లో తొమ్మిదవ తరగతిలోనూ చేర్పించడానికి ఏర్పాట్లు జరిగాయి. అంటే వెంకటేష్-డారల్ అలాగే ఎల్లమ్మ-డెబొరాలు క్లాస్మేట్లు అయిపోతారు. అయితే ఆయా స్కూళ్ల అధిపతులు ఒక మెలిక పెట్టారు. ఇంగ్లీషు, లెక్కలు, జాగ్రఫీ – ఈ మూడింటిలోనూ ప్రవేశ పరీక్ష రాసి పాసవ్వాలని పట్టుబట్టారు.

"పిల్లల్ని సాయంత్రం పూట మా ఇంటికి పంపించు, నేను కోచింగ్ ఇస్తాను," గంగమ్మకి షెరాన్ హామీ ఇచ్చింది. ఆమె పెళ్లికి ముందు వైజాగులోనూ, పిల్లలు పుట్టేంతవరకూ కలకత్తాలోనూ టీచర్‌గా పనిచేసింది.

"జాగ్రఫీ నేను చెబుతాను," అన్నాడు జిమ్మీ.

5

కొత్త స్నేహాలు

ప్రవేశ పరీక్షలకై కోచింగు కోసం కేప్టెన్ జిమ్మీ ఇంటికి వెళ్లిన కొత్తలో వెంకటేశు, ఎల్లమ్మలకు అక్కడంతా వింతగా అనిపించేది. ఆ ఇంటికి వెళ్లగానే వచ్చే బ్రెడ్డు, కేకుల వాసన, ఇంట్లో అంతా ఇంగ్లీషులో మాట్లాడుకోవడం, మేరీ మాత, ఏసుక్రీస్తుల ఫొటోలు, జుత్తును పొట్టిగా కత్తిరించుకున్న షెరాన్, డెబొరాలు, వాళ్లిద్దరూ గౌన్లు తొడుక్కోవడం, బొట్టుపెట్టుకోకపోవడం, పెదాలకు లిప్ స్టిక్ పూసుకోవడం, షెరాన్ వాడే సెంటు వాసన, జిమ్మీ డ్రెస్సింగ్ గౌను వేసుకొని పైపు కాల్చడం (జిమ్మీకి ఎస్వీ రంగారావు అని వెంకటేశ్ పేరు పెట్టాడు), కుటుంబం అంతా చుట్టూ చేరి గ్రామఫోన్ రికార్డులు వినడం, షెరాన్ తన కూతురు డెబొరాకు పియానో నేర్పించడం,...అన్నీ కొత్త సంగతులే.

ఒక రోజైతే, వాళ్లు వెళ్లేసరికి గ్రామఫోను మోగుతోంది; జిమ్మీ, షెరాన్‌లు హాల్లో డాన్సు చేస్తున్నారు. షెరాన్ వాళ్లని కూర్చోమని సంజ్ఞ చేసింది. వెళ్లి డారల్, డెబొరాల సరసన కూర్చున్నారు. పాట పూర్తయింది. డాన్సు ఆగిపోయింది. భార్యాభర్తలు గ్లాసుల్లో వైన్ పోసుకొని తాగారు. ఆ తరవాత ఒకరినొకరు కౌగలించుకొని ఏకంగా ముద్దు పెట్టేసుకున్నారు. డారల్ వారికి ఫొటోలు తీశాడు. డారల్, డెబొరాలు ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు; 'బ్రావో! బ్రావో!' అని అరిచారు. ఎటు చూడాలో తెలియక వెంకటేశు, ఎల్లమ్మ నేలచూపులు చూశారు. ఇదంతా అబ్బురంగానే కాకుండా కొంచెం ఎబ్బెట్టుగా ఉన్నట్లు వెంకటేశు, ఎల్లమ్మలకు తోచింది. అంతటితో ఆగక – ఎస్వీ రంగారావు,

"ఏమైంది? డాన్సు మీకు నచ్చలేదా?" అని వాళ్లని నిలదీశాడు - ఇంగ్లీషులో.

"నచ్చింది...లైక్ సార్... వెరీ మచ్ లైక్ సార్!" అనేశాడు, వెంకటేశు కంగారుగా.

"నేర్చుకుంటారా?" అన్నది షెరాన్ నవ్వుతూ – తెలుగులో.

"డాన్సు వద్దులెండి. కానీ మా చెల్లికి పియానో నేర్పిస్తారా? దానికి సంగీతం అంటే ఇంట్రెస్టు. పాటలు బాగా పాడుతుంది." ఎల్లమ్మ అన్నను మోచేత్తో పొడిచింది.

'నోరు మూసుకోరా' అని అర్థం వచ్చేలా గుడ్లురిమింది.

"మొదట ఇంగ్లీషు పాఠాలు అయిపోనీ, తరవాత డెబొరాతో బాటుగా నేర్పిస్తాను," అన్నది షెరాన్.

కేకు ముక్కలు ప్లేట్లలో తీసుకొచ్చి ఇస్తూ, డెబొరా, ఎల్లమ్మతో,

"ఈ రోజు మా అమ్మా-నాన్నల పెళ్లి రోజు," అంది.

తన తల్లిదండ్రుల పెళ్లిరోజుగానీ, పుట్టినరోజులుగానీ ఎన్నడూ జరుపుకోలేదనీ, అవి ఎప్పుడో కూడా తనకు గుర్తులేదనీ ఎల్లమ్మకి తట్టింది. తన పుట్టినరోజు, అన్న పుట్టినరోజు కూడా ఎప్పుడో ఆమెకు తెలియదు. 'స్కూలు రికార్డుల్లో ఉన్న తేదీలు తప్పో, రైటో?

* * *

డారల్, డెబొరాలు కూడా తమ ఇంటికి తరచుగా వస్తూన్న అతిథుల పట్ల కుతూహలం చూపించారు. పరిచయం అయిన మొదటిరోజే వాళ్ల పేర్లను – 'వెంకీ', 'ఎల్లీ'లుగా మారుస్తున్నట్లుగా ప్రకటించారు. తమ స్కూళ్లల్లోనే, తమ క్లాసుల్లోనే చేరే ప్రయత్నంలో ఉన్నారని తల్లి చెప్పినప్పుడు వారికి మరింత ఉత్సాహం కలిగింది. తమ పుస్తకాలు తెచ్చి చూపించారు. స్కూళ్ల గురించి, టీచర్ల గురించీ, బ్రదర్లు, సిస్టర్ల గురించీ – మంచీ-చెడ్డా – ఎన్నో సంగతులు చెప్పారు. కొన్నే బోధపడ్డాయి. షెరాన్ వద్దని ఎంత వారించినా వినకుండా వచ్చినప్పుడల్లా గంగమ్మ ఇచ్చిన చేపలు, రొయ్యలు తీసుకొచ్చి అందజేసేవారు. జిమ్మీ కుటుంబసభ్యులు ఏయే చేపల్ని ఇష్టపడతారో గంగమ్మకి త్వరలోనే తెలిసిపోయింది. షెరాన్ తన శిష్యులకు కేకులు, పేస్ట్రీలు, బన్నులు, చిప్సు, కట్లెట్ల వంటి చిరుతిళ్లు పెట్టేది. తాగడానికి ఫాంటా, లేదా కోకాకోలా ఇచ్చేది; ఒక్కోసారి బాగా ఎండగా ఉన్నప్పుడు అప్పుడే తీసిన నిమ్మరసంలో సోడా పోసి, ఉప్పు కలిపి ఇచ్చేది. అవన్నీ ఆ ఇద్దరికీ, ముఖ్యంగా ఎల్లమ్మకి బాగా నచ్చాయి.

సముద్రం మీదుగా వీచే చల్లని గాలి, పోర్టులోపలికి వచ్చేపోయే ఓడలకీ, వాటిని లాగే టగ్గులకీ మధ్య ధ్వనించే సంకేతపూర్వక సంభాషణల ఘీంకారాలు, బంగళా చుట్టూతా ఉన్న తోటలోంచి వినవచ్చే పక్షుల కిలకిలారావాలు, ఉడతల కిచకిచలు, స్విచ్చి వెయ్యగానే ఉలిక్కిపడి కదిలి, బద్ధకంగా, ఒళ్లు విరుచుకుంటూ తిరిగే పాతకాలపు సీలింగు ఫ్యాన్ల సవ్వడి – ఈ ఇంపైన నేపథ్యంలో వెంకటేశు, ఎల్లమ్మల చదువులు వడిగా ముందుకి సాగాయి.

"ఇంగ్లీషులో మాట్లాడడానికి సందేహించవద్దు. మీకు ఎలా వస్తే అలా మాట్లాడండి," అంటూ షెరాన్ వాళ్లని ప్రోత్సహించింది.

వాళ్లు తప్పులు మాట్లాడితే గనక సరిదిద్దాలనీ, అంతేగాని ఎట్టి పరిస్థితులలో

కూడా నవ్వకూడదనీ, ఎగతాళి చేయకూడదనీ షెరాన్ తన పిల్లల్ని హెచ్చరించింది. డారల్, డెబొరాలు తమ కొత్త స్నేహితులకు సహకరించారు. వాళ్లకు బొత్తిగా తెలుగు రాకపోవడం మూలాన వెంకీ, ఎల్లీలకు ఇంగ్లీషులో మాట్లాడడం తప్ప మరో మార్గం లేకపోయింది. అందువలన వాళ్లకి ఇంగ్లీషు తొందరగా పట్టుబడింది. అంతే కాదు, ఉచ్చారణ కూడా చక్కగా కుదిరింది. ఈ విజయం వెనుక షెరాన్ పడ్డ శ్రమ చాలా ఉంది. ఇంగ్లీషు ఒక దారిలో పడగానే లెక్కలు, జాగ్రఫీపైన దృష్టి పెట్టింది. పాఠాలు చెప్పేటప్పుడు మాత్రం – షెరాన్ పూర్తిగా ఇంగ్లీషులోనే మాట్లాడేది. జాగ్రఫీ చెబుతానని జిమ్మీ మొదట అన్నాడుగానీ, పని ఒత్తిడి మూలంగా అతనికి కుదరలేదు. అయితే ప్రతీ ఆదివారం, రీడర్స్ డైజెస్టు అట్లాసు తీసి చూపించడం, పాత 'నేషనల్ జియోగ్రాఫిక్' సంచికలు చదివించడం, క్విజ్ లు, టెస్టులు నిర్వహించడం చేసేవాడు.

వెంకీ, ఎల్లీలు పుస్తకాలకు అట్టలు వేసుకొని వాటిని నలగకుండా భద్రంగా ఉంచుకోవడం, పుస్తకం తెరిచినప్పుడల్లా కళ్లకు అద్దుకోవడం చూసి – షెరాన్ తన పిల్లలతో –

"పుస్తకాలంటే ఎంత శ్రద్ధ! చదువు మీద ఎంత గౌరవం! వీళ్లను చూసి నేర్చుకోండి," అన్నది.

"మీరు పుస్తకాలని తెరిచేటప్పుడల్లా ఎందుకలా కళ్లకద్దుకుంటారు?" అని డెబొరా ఒకసారి ఎల్లమ్మని అడిగింది.

"పుస్తకం అంటే సరస్వతీ దేవి కదా! అందుకు," అని ఎల్లమ్మ జవాబిచ్చింది.

డెబొరాకి తన కలకత్తా స్కూల్లో జరిపే సరస్వతీ పూజ, ఆరోజున ఆడపిల్లలందరూ – చిన్న క్లాసుల వాళ్లతో సహా – చీరలు కట్టుకొని రావడం, తను కూడా కట్టుకుంటానని పేచీ పెడితే తల్లి ఒప్పుకోవడం ఇవన్నీ గుర్తుకొచ్చాయి.

ఎల్లీ, వెంకీలు వచ్చినప్పుడల్లా తీసుకొచ్చే చేపలు, రొయ్యలకన్నా కూడా అప్పుడప్పుడూ తెచ్చే ఊరగాయలూ, పచ్చళ్లూ డెబొరాకి ఎక్కువగా నచ్చుతున్నాయి. తండ్రి కొన్న కొత్త అంబాసిడర్ కారులో వారానికోసారి కుటుంబం అంతా హోటల్ ఊటీకి వెళ్లి ఇడ్లీలు, వడలు, మసాలా దోశెలు తినడం, ఆ తరవాత లీలామహల్‌కి వెళ్లి ఇంగ్లీషు సినిమా చూడడం ఆమెకిప్పుడు చాలా ఇష్టమైన కార్యక్రమాలు. ఒక్కోసారి ఎల్లమ్మ, వెంకటేశులు వారితో బాటు వస్తారు. వాళ్లు కూడా 'ఆంటీ, అంకుల్' అంటూ పెరేరా కుటుంబంలో సభ్యులుగా కలిసిపోయారు.

ఇంతలో 'విశాఖ ఉక్కు' ఉద్యమం ఉధృతం అయింది. నెల్లాళ్ల పాటు స్కూళ్లు మూతపడ్డాయి. ఆ నెల్లాళ్లూ షెరాన్ చెప్పే పాఠాలే వాళ్ల చదువులు. వెంకీ, ఎల్లీల ప్రగతికి ఆమె మురిసిపోయింది. శిష్యులిద్దరూ ప్రవేశ పరీక్షల్లో సునాయాసంగా

పాసయ్యారు. వేసవి సెలవలు పూర్తయ్యాక పై తరగతుల్లో చేర్చుకుంటామని స్కూళ్ల యాజమాన్యాలు తెలియజేసాయి. ప్రమాదంలో మరణించిన గంగరాజు పిల్లలను వృద్ధిలోకి తీసుకొచ్చి, మంచి చదువులు చెప్పించగలుగుతున్నామని జిమ్మీ-షెరాన్ దంపతులిద్దరికీ కొంత ఊరట కలిగింది. వేసవిలో డెబొరాతో బాటుగా ఎల్లీ కూడా పియానో పాఠాలు నేర్చుకోవడం మొదలుపెట్టింది. సహజసిద్ధమైన ఆమె స్వరజ్ఞానం షెరాన్‌ని ఆశ్చర్యపరచింది. ఎల్లమ్మకి గ్రామఫోన్లో విన్న 'కార్పెంటర్స్' పాటలు, 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్' సినీమాలోని పాటలు, చర్చిలో పాడే క్రైస్తవ భక్తి గీతాలు పాడటం అతి తక్కువ కాలంలోనే పట్టుబడింది.

క్రిస్మస్ పండగ దగ్గరపడింది. కోటవీధిలో పెరిగిన కోలాహలం, ఉత్సాహం వెంకీ, ఎల్లీల దృష్టికి వచ్చాయి. అంతా ఇళ్లకు సున్నాలు, రంగులు వేయిస్తున్నారు; కొత్త బట్టలు కుట్టించుకుంటున్నారు; కొంతమంది ఫర్నిచర్ మారుస్తున్నారు; గుమ్మాలకీ, కిటికీలకీ కొత్త తెరలను తగిలిస్తున్నారు; కేకులు ఆర్డర్ చేస్తున్నారు. మరికొందరు ఇంట్లోనే కేకులు తయారుచేస్తున్నారు. షెరాన్, వారం రోజులపాటు ట్యూషన్‌కి కూడా సెలవు ప్రకటించింది.

క్రిస్మస్ సెలవులకు ముందు, చివరి రోజున ట్యూషన్‌కి వెళ్లినపుడు హాల్లో కొత్తగా వచ్చిచేరిన మేరీమాత, ఏసుక్రీస్తుల బొమ్మ ఎల్లమ్మ దృష్టిని ఆకర్షించింది. అమె ఒళ్లో ఏసు క్రీస్తు నిశ్చేతనంగా పడిపోయి ఉంటాడు. తల్లి అతని ముఖంలోకి అనంతమైన ప్రేమానురాగాలతో, కరుణతో చూస్తూ ఉంటుంది. ఆ బొమ్మని చూస్తూ ఎల్లమ్మ అక్కడే నిలిచిపోవడాన్ని డెబొరా గమనించి,

"మా నాన్న షిప్పులో ఇటలీ వెళ్లినప్పుడు కొన్నాడు. ఇప్పుడు క్రిస్మస్ అని కొత్తగా అద్దం పెట్టె చేయించాడు," అన్నది.

బజారుకని సంచి పుచ్చుకొని బయటకు వెళ్తూన్న జిమ్మీ, హాల్లో ఆ బొమ్మ ముందున్న పిల్లల్ని చూసి పలకరించాడు.

"అది మైఖెలేంజిలో చెక్కిన 'పియాటా' అనే ప్రసిద్ధ శిల్పానికి చిన్న సైజు ప్రతిరూపం," అన్నాడతడు. అతనేమంటున్నాడో ఎల్లమ్మకి అర్థం కాలేదు. అది గమనించిన జిమ్మీ,

"ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా తీసి, ఎల్లీకి చూపించు," అని డెబొరాకు పురమాయించి బయటకు నడిచాడు.

"తరవాత చూపిస్తాలేగానీ ఆడుకుందాం, పద," అంది డెబొరా.

"ఏసు క్రీస్తు మేరీమాత ఒడిలో నిద్రపోతున్నాడా?" ఎల్లమ్మ ఆ విగ్రహాన్ని మంత్రముగ్ధురాలిలా చూస్తూ అక్కడే నిలబడిపోయింది.

"లేదు. అప్పటికే శిలువ వేయబడ్డాడు," ఎల్లమ్మకి దుఃఖం ముంచుకొచ్చింది.

"తోటలో చెట్టుకి డాడీ ఉయ్యాల కట్టాడు; ఊగుదాం – పద, పద. ఉడత నిన్న పిల్లలు పెట్టింది, తెలుసా?" అంటూ డెబొరా ఆమె చేయి పట్టుకొని లాక్కెళ్లింది.

డెబొరా, ఎల్లీకి ఆదర్శప్రాయం అయింది. ఆమెలాగానే జుత్తు కత్తిరించుకోవాలనీ, అటువంటి ఫ్రాకులు కుట్టించుకోవాలనీ, జోళ్లు, మేజోళ్లు, రిబ్బన్లు – అన్నింటిలోనూ ఆమెలాగానే ఉండాలని ఎల్లీ కొట్టుకుపోయింది. వేసవి సెలవులు పూర్తయ్యేనాటికి తాను అనుకున్నట్లుగానే మారింది కూడా. ఎల్లమ్మ తల్లి గంగమ్మ అన్నింటికీ ఒప్పుకుందిగానీ, బొట్టు మాత్రం ఉండితీరాలని పట్టుబట్టింది. కనీకనిపించనంత చిన్న బొట్టు పెట్టుకోనారంభించింది ఎల్లమ్మ. చేతులకున్న గాజులు, కాళ్లకున్న పట్టీలు ఎప్పుడో తీసేసింది. రిస్టు వాచీ పెట్టుకుంది. బయటకు వెళ్లేటప్పుడు ఎండగా ఉంటే, నల్ల కళ్లద్దాలు ధరించేది. అన్నీ డెబొరా లాగానే. పియానో పాఠాలలోకూడా ఆమె డెబొరాని అందుకుంది. ఎల్లమ్మ కట్టూబొట్టూ కొంతమంది జాలారిపేట పెద్దలకు రుచించలేదు. గంగరాజు మీద గౌరవంతో కొందరూ, గంగమ్మ నోటికి జడిసి మరి కొందరూ ఊరుకున్నారు.

వాళ్లిద్దరి అన్నలూ ఎప్పుడైనా ఇంటిపట్టున ఉంటే గనక నలుగురూ మధ్యాహ్నాలు 'మోనోపోలీ', లేదా 'కారమ్స్' ఆడేవారు. ఒక్కరోజు కూడా ఆట సవ్యంగా సాగేది కాదు. పూర్తయ్యేలోగా పెద్ద వాగ్యుద్ధాలు జరిగేవి. డారల్ అందరిమీదా పెత్తనం చెయ్యాలని చూసేవాడు. ఆటల నియమ నిబంధనలన్నీ తనకే తెలుసనీ, తన మాటే నెగ్గాలనీ పట్టుబట్టేవాడు. వెంకీ తన మిత్రుడికి వంత పాడేవాడు. డెబోరా,

"ఈ స్టుపిడ్ బాయ్స్‌తో కాకుండా మనం వేరే ఆడుకుందాం, పద" అని ఎల్లమ్మని లాక్కుపోయేది.

ఐస్‌ఫ్రూట్ వాడి గంట వినబడ్డప్పుడు మాత్రం డారల్ యుద్ధ విరమణ ప్రకటించి, 'అమ్మని అడిగి ఒక రూపాయి తీసుకురావే. నువ్వు అడిగితే ఇస్తుంది' అని చెల్లెల్ని ప్రాధేయపడి, పావలాకొకటి చొప్పున నాలుగు ఐస్ ఫ్రూట్లు కొని తీసుకొచ్చేవాడు; తగాదాలు మర్చిపోయి నలుగురూ వాటిని చప్పరించేవారు. బయట ఎండ మండిపోతున్నా, ఉక్కపోతతో చెమటలు కారిపోతున్నా ఆ నిమిషంలో స్వర్గంలో ఉన్న అనుభూతి కలిగేది వారికి.

* * *

"క్రిస్మస్ ముందురోజు చర్చిలో అర్ధరాత్రి వరకూ జరిగే వేడుకలకు మేం కూడా వెళ్తాం," అని వెంకీ, ఎల్లీలు సరదా పడ్డారు. గంగమ్మ సరే అంది.

కాస్త చలిగా ఉన్నప్పటికీ చర్చి ప్రాంగణంలో ఉన్న ఆరుబయలులో ప్రార్థనలు జరిగాయి. లాన్స్‌లోని గడ్డి మంచుకి తడిసింది. లైట్లు, స్పీకర్లు. పండగ వాతావరణం.

అక్కడికి వచ్చిన మగవాళ్లంతా సూట్లు వేసుకున్నారు. జిమ్మీ సరేసరి. ఆడవాళ్లు, పిల్లలు కళ్లు జిగేలుమనిపించేలా కొత్త బట్టలు వేసుకున్నారు. యువతీ యువకులు సరికొత్త ఫేషన్లలో టిప్‌టాప్‌గా తయారయ్యారు. ఫాదర్లు ఉపన్యసించడం, మధ్యమధ్యలో యువతీ యువకుల గుంపు పక్కనే ఉన్న మరో స్టేజి మీద వాయిద్యాలు వాయిస్తూ పాటలు పాడడం – వెంకీ, ఎల్లీలకు అంతా కొత్తగా ఉంది. సర్వీసు ఎక్కువగా ఇంగ్లీషులోనే సాగింది. కొంతసేపయ్యాక ఒక ఫాదర్ తెలుగులో మాట్లాడడం మొదలుపెట్టాడు. గాయకుల బృందం తెలుగు పాటలు పాడుతున్నారు. అంతకు ముందెన్నడూ వాళ్లు తెలుగు క్రైస్తవ గీతాలను అంత శ్రద్ధగా వినలేదు.

ఆ రోజు రాత్రి ఎల్లమ్మకు సరిగ్గా నిద్ర పట్టలేదు. కలత నిద్రలోనే ఆమె ఒక కలగన్నది. తండ్రి గంగరాజు మృతదేహాన్ని మేరీమాత తన ఒళ్లో పెట్టుకొని తల నిమురుతూన్నట్లుగా ఆమెకు ఆ కలలో కనిపించింది. ఉలిక్కిపడి లేచింది. పైన ఫ్యాన్ తిరుగుతూన్నా ఒళ్లంతా చెమటలు పట్టాయి. నోరు ఎండిపోయింది. మంచం కింద, చెంబులో ఉన్న మంచినీళ్లు తాగింది. పక్క మంచంమీద తల్లి సన్నగా గురక పెడుతోంది. అన్న ముందు గదిలో నిద్రపోతున్నాడు. ఇంకా చీకటిగా ఉంది; కటకటాల్లోంచి వరండాలోకి ప్రసరించిన వెన్నెల, గుమ్మంవద్ద పరుచుకుంది. మంద్రంగా సముద్రపు ఘోష; మధ్యమధ్యలో ఫెళ్లుమని విరుగుతున్న కెరటాల చప్పుడు. ఎల్లమ్మ చాలాసేపు అలానే మంచం మీద కూర్చుండిపోయింది. తండ్రి గంగరాజు ఆమెకు చేరువగా, తోడుగా ఉన్నాడనే భావన ఆమెకు కలిగింది.

ఆనాటి నుండీ ఎల్లమ్మ ఆదివారం ఉదయాన్న జరిగే ప్రార్థనలకు జిమ్మీ కుటుంబంతో బాటుగా క్రమం తప్పకుండా వెళ్లేది. కొద్ది రోజుల్లోనే అక్కడ భక్తులు పాడే ఇంగ్లీషు, తెలుగు ప్రార్థన గీతాలలో శ్రావ్యమైన తన గొంతును కూడా కలిపేది. ఇంగ్లీషు భక్తి గీతాల కన్నా తెలుగు పాటలే ఆమె హృదయాన్ని సూటిగా తాకేవి. ఎందుచేతనంటే అవి ఆమెకు మరింత బాగా అర్థం అయ్యేవి.

* * *

వేసవి సెలవుల్లో వెంకీ, డారల్‌కి ఊరు, చుట్టుపక్కల ప్రదేశాలూ చూపించాడు. 'ఎండల్లో ఎక్కువగా తిరక్కండి' అని షెరాన్ వారిస్తున్నా వినకుండా వాళ్లిద్దరూ రోజుకో దిక్కుకి ప్రయాణం కట్టేవారు. ఒక రోజు వెంకీ డారల్‌ని ఫెర్రీలో ఛానెల్ దాటించి, సింధియా కోలనీకి తీసుకెళ్లాడు.

"షిప్ యార్డు కోలనీని 'సింధియా'అని ఎందుకు పిలుస్తారు?" అని డారల్ అడిగినప్పుడు,

"ఏమో! తెలీదు" అన్నాడు వెంకీ.

"మా నాన్నని అడగాలి. ఆయనకి తెలుస్తుంది".

మరో రోజున డారల్‌ని యారాడ కొండ ఎక్కించాడు; లైట్‌హవుసు చూపించాడు. అక్కడి నుండి కనిపించే మనోహర దృశ్యం – ఒక వైపున అనంతమైన సముద్రం, నెమ్మదిగా తీరం వైపు సాగిపోయే కెరటాలను అంత ఎత్తు నుండి చూడడం ఒక కొత్త అనుభవం. తీరం వెంబడే పరచుకున్న విశాఖ నగరం. డారల్, తండ్రికి చెప్పకుండా అతడి బైనాక్యులర్స్ తీసుకొచ్చేశాడు. దాంట్లోంచి చూస్తూ, 'అదుగో హవా మహల్', 'అది కలెక్టర్ ఆఫీస్', 'అది కే.జీ.ఎచ్,'... అంటూ వెంకీ – వివిధ భవనాలను డారల్‌కి చూపించాడు. ఒక రోజున ఇద్దరూ వెంకటేశ్వరుడి గుడికి వెళ్లారు. తెల్లటి మేని ఛాయ, రాగి జుత్తు, నీలం కళ్లతో ఉన్న తనని హిందూ దేవాలయం లోనికి రానిస్తారో లేదో అని డారల్ సందేహించాడు గానీ 'ఏం ఫరవాలేదు. ఎవరూ ఏమీ అనరులే' అని వెంకీ ధైర్యం చెప్పాడు. నిజంగానే ఎవరూ పట్టించుకోలేదు.

అక్కడి నుండి పోర్టు ఛానెల్ బాగా దగ్గరగా కనిపిస్తుంది. ఒక సాయంత్రం అంతా వచ్చేపోయే ఓడల్ని చూస్తూ గడిపారు. సముద్రం మీద వెళ్లే పెద్ద ఓడల గురించి డారల్‌కి ఎన్నో విషయాలు తెలుసు. అతను తన తండ్రి ఓడలో కొన్ని నెలలబాటు ప్రయాణించాడు కూడా. ఒకరోజున ఇద్దరూ సైకిళ్లు అద్దెకు తీసుకొని భీమిలి వెళ్లారు. వంపులు తిరుగుతూ సాగిపోయే నిర్మానుష్యమైన సన్నటి దారికి ఒక వైపు పచ్చని కొండలు, మరోవైపు మెరిసే నీలం రంగు సముద్రం. తీరం వెంట తెల్లటి ఇసుకలో దట్టంగా సరుగుడు తోటలు. అంతటా ప్రశాంతత. దారి పొడుగునా సాగరఘోష. కలకత్తా మహానగరం నుండి వచ్చిన డారల్‌కి ఇదొక గుర్తుండిపోయే అనుభవం. తిరుగు ప్రయాణంలో అకస్మాత్తుగా మేఘాలు కమ్ముకొచ్చాయి; పెద్ద వర్షం పడింది. ఇద్దరూ తడిసి ముద్దయ్యారు. మర్నాడు ఇద్దరికీ జలుబు చేసింది; షెరాన్ భయపడినట్లుగా జ్వరం రాలేదు. సింహాచలం కొండ ఎక్కిస్తానని వెంకీ అన్నాడు గానీ, 'ఎండలు మరీ ఎక్కువగా ఉన్నాయి, క్రిస్మస్ సెలవుల్లో వెళ్లండి' అని షెరాన్ సూచించింది. అరుకు ప్రయాణం కూడా అలాగే వాయిదా పడింది. 'కాస్త చల్లబడనీ. అందరం పిక్నిక్‌లాగా మన కారులో వెళ్దాం' అన్నది షెరాన్.

ఇంకో రోజు మంచి ఎండలో వెంకటేశ్వరుడి గుడి పక్కనే ఉన్న దర్గా కొండ ఎక్కారు. అప్పుడు కూడా డారల్, తన తండ్రికి చెప్పకుండా బైనాక్యులర్స్ తీసుకొచ్చాడు. అక్కడంతా నిర్మానుష్యంగా, ప్రశాంతంగా ఉంది. మధ్యమధ్యలో పక్షులు అరుస్తున్నాయి. దర్గా చుట్టూ బాగా దట్టంగా పెరిగిన చెట్లు చల్లని నీడనిస్తున్నాయి. ఇద్దరికీ బాగా దాహం వేసింది. సందేహిస్తూనే, దర్గా గుమ్మం బయట అరుగుమీద కూర్చొని జపమాల తిప్పుకుంటూన్న తెల్ల గెడ్డం సాయిబుని నీళ్లడిగారు. మారుమాట లేకుండా అతను లోపలికి వెళ్లి నీళ్లు తెచ్చి ఇచ్చాడు. అతను

తప్ప ఆ చుట్టుపక్కల పిట్టమనిషి లేడు. వెంకీకి కొంచెం భయం వేసింది.

"ఈ దర్గా ఎవరిదో అడుగు" అన్నడు డారల్, వెంకీతో - ఇంగ్లీషులో.

వెంకీ అడిగే లోపే ఆ సాయిబు స్వచ్ఛమైన ఇంగ్లీషులో,

"ఇది సూఫీ సయ్యద్ ఆలీ ఇషాక్ మదీనా రహమతుల్లా వారి దర్గా. మదీనా నుండి తన శిష్యులతో సహా ఈ సూఫీ ఇక్కడికి విచ్చేసాడు. ఈ కొండమీద తన నివాసం ఏర్పరచుకున్నాడు. ఎప్పుడు, ఏ సంవత్సరంలో వచ్చాడు అంటే చెప్పలేం. అప్పట్నించీ ఇది హిందువులకీ, ముసల్మాన్లకీ కూడా చాలా పవిత్రమైన ప్రదేశం. ఇషాక్ పట్టణమే కాలక్రమేణా విశాఖపట్నం అయింది. ప్రాచీనమైన ఇషాక్ పట్టణం రేవులోకి వచ్చి వెళ్లే ఓడలన్నీ ఈ సూఫీ మీద గౌరవంతో తమ జండాలను ముమ్మారు దించి మరీ కదిలేవి. తుఫాన్లలో చిక్కుకోకుండా సూఫీ తన మహిమతో ఓడలను కాపాడేవాడు. ఎంతమంది హిందూ, ముస్లిం, యూరోపియన్ నావికుల ప్రాణాలను అతడు కాపాడాడో లెక్కలేదు. షెహెన్ షా ఔరంగజేబు ఈ ప్రాంతాన్ని జయించేనాటికే ఈ దర్గా ఉండటాన్ని అతని సైనికులు గమనించారు. అదుగో, ఇదే కొండపైన, కొంచెం పైకి చూస్తే అక్కడ కనిపిస్తున్న మసీదు చూశారా? అది కూడా అప్పటికే ఇక్కడ ఉన్నది. ఔరంగజేబు దానికి మరమ్మత్తులు చేయించాడు. అప్పుడే ఈ దర్గా నిర్వహణ కోసం కూడా రెండు గ్రామాలను అతడు దానం చేశాడు. నైజాం పాలనలో కూడా అధికారులు వీటి నిర్వహణకు నిధులు జారీ చేశారు".

"నైజాం? అతను హైదరాబాదు సంస్థానం పాలకుడు కదా?" అని సందేహం వెలిబుచ్చాడు డారల్.

"ఒకప్పుడు ఈ ప్రాంతమంతా నిజాందే. దీనిని ఉత్తర సర్కార్ అనేవారు; అంటే నైజాం సర్కార్‌లో భాగం అన్న మాట. గంజాం నుండి గోదావరి వరకూ ఉన్న ప్రాంతాన్ని నైజాం దగ్గర ఐదు లక్షల రూపాయలకు బ్రిటీషు వాళ్లు కొనుక్కున్నారు. కోస్తా ప్రాముఖ్యత, వ్యాపారంలో రేవుల పాత్ర బ్రిటీషు వాళ్లకి తెలిసినంతగా ఇంకెవ్వరికీ తెలీదు".

"ఇవన్నీ మీకెలా తెలుసు?"

"మా పెద్దలు చెప్పారు".

డారల్ ఇంకా ఏదో అడగబోయాడు.

"పద, మనం బయల్దేరాలి," తొందరపెట్టాడు వెంకీ.

ఆ వెండి గడ్డపు ముసల్మాన్ పండితుడి వద్ద సెలవు తీసుకొని వడివడిగా కొండ దిగసాగారు.

కొండ సగం దిగాక, డారల్, చటుక్కున ఆగి, "ఓ మై గాడ్!" అన్నాడు.

"ఏమైంది?" కంగారుపడ్డాడు వెంకీ.

"బైనాక్యులర్స్ మర్చిపోయాను! నీళ్లు తాగినప్పుడు క్రింద పెట్టానను కుంటాను. పోయిందంటే మా డాడీ చితగ్గొడతాడు," అన్నాడు డారల్, భయపడుతూ.

ఇద్దరూ మళ్లీ కొండపైకి ఎక్కారు. దర్గాని చేరుకున్నారు.

తెల్ల గెడ్డం సాయిబు గుమ్మం దగ్గరే కూర్చొని ఉన్నాడు. పిల్లల్ని చూడగానే, చిరునవ్వు చిందిస్తూ బైనాక్యులర్స్‌ని అందజేశాడు. డారల్ థాంక్సు చెప్పి అందుకున్నాడు.

కొండ దిగుతూ, "ఆ ముసలాడు పాపం మంచివాడు కాబట్టి బతికిపోయాను," అన్నాడు, వెంకీతో.

ఎండలు బాగా ముదిరేనాటికి విశాఖ పరిసరాలను గాలించడం నిలుపుచేసి, వెంకీ మరో కొత్త ఆటని ప్రవేశపెట్టాడు. అది సముద్రంలో ఈత కొట్టడం. పైన ఎంత వేడిగా ఉన్నా, ధబ్బుమని సముద్రంలోకి దూకగానే చల్లటి నీళ్లు సేద తీరుస్తాయి. ఎంతసేపు ఆ కెరటాల మధ్య ఆడినా వేళ తెలియదు. టౌన్ హాలు ఎదురుగా అట్టే లోతులేని బీచితో మొదలుపెట్టి, కోస్టల్ బ్యాటరీ గోడ వెంబడి కాస్త ప్రమాదకరమైన తీర్థపురాళ్ల వరకూ తమ ఈతకు అనుకూలమైనదిగా డారల్‌కి పరిచయం చేశాడు. డారల్‌కి ఈత వచ్చుగానీ అప్పటివరకూ అతని విన్యాసాలు క్లబ్బులలో ఉండే స్విమ్మింగు పూల్సుకే పరిమితం. అందరి జాలరుల పిల్లల మాదిరిగానే వెంకీకి సముద్రంలో ఈదడం పుట్టుకతో వచ్చిన విద్య. సముద్ర తీరంలో పొంచి ఉండే ప్రమాదాల గురించి కూడా అతనికి బాగా తెలుసు. అందుకే తన మిత్రుడిని దశలవారీగా ఈ కొత్త సాహస క్రీడలోకి ప్రవేశపెట్టాడు. ఈ సాహసంలో వెంకీ కొత్తగా డారల్‌కి పరిచయం చేసిన జాలారిపేట మిత్ర బృందం కూడా ఉన్నారు. వాళ్లకి తెలుగే తప్ప ఇంగ్లీషు రాదు. అందుచేత డారల్‌కి నాలుగు తెలుగు ముక్కలు పట్టుబడ్డాయి. వాటిల్లో కొన్నిబూతులు కూడా ఉన్నాయి.

ఆ విధంగా వేసవి సెలవులు గడిచిపోయాయి. ఎన్ని సాహసాలు చేశారో! ఎన్నెన్ని సంగతులు మాట్లాడుకున్నారో! – వాళ్లకే గుర్తులేదు. ఇద్దరూ బాగా చేరువయ్యారు. ఒకరినొకరు చూడకుండా ఒక్కరోజు కూడా గడపలేనంత స్నేహం ఏర్పడింది వాళ్ల మధ్య. వెంకీ ఇంగ్లీషు చాలా మెరుగైంది. ఇప్పుడు ఇంగ్లీషులో తిట్టగలడు కూడా.

డారల్‌తో స్నేహబంధం అంత తొందరగా పెనవేసుకుపోవడం, వాళ్లిద్దరూ విడదీయలేనంతగా చేరువ కావడం వెనుక – చిన్న వయసులో ఏర్పడే కొత్త మైత్రిలో

ఉండే చురుకుదనం ఉంది. అంతేకాదు, తన తండ్రి మరణంతో ఏర్పడ్డ వెలితిని అధిగమించడానికి కూడా అది వెంకీకి ఆసరా అయింది. అయితే ఆ సంగతి అతనికి ఎన్నో ఏళ్ల తరవాతనే తెలిసొచ్చింది.

* * *

ప్రతీ వేసవిలోనూ చేపలు ఎండబెట్టడానికి గంగమ్మకి సాయపడే కొడుకూ, కూతురూ ఆ ఏడాది ఐపు లేకుండా పోయారు. 'పోనీ పిల్లలిద్దరూ దొరల దగ్గర ఇంగ్లీషు నేర్చుకుంటున్నారులే' అని సరిపెట్టుకొని మరదలూ, నూకరాజు తల్లీ అయిన పోలమ్మ సహాయంతో ఆ పని కానిచ్చింది. ఒక రోజున ఎండు చేపల్ని గంపల్లోకి ఎత్తుతూ, పోలమ్మ తటపటాయిస్తూనే –

"ఒదినా! ఒక మాటడుగుతాను. మా నూకరాజుకి ఎల్లమ్మని చేసుకుంటే బాగుంటది. అన్నయ్యకూడా అదే మాట అనీవోడు. నువ్వేటంటావు?" అనేసింది.

"మీ అన్నయ్య ఇలాగెలిపోతాడనీసి మనం అనుకున్నావేటి? ఎప్పుడెల గుంటాదో? 'దాన్ని యూనవరిసిటీల చదివించాల' అనీవోడు మీయన్న," అని దాటవేసింది, గంగమ్మ.

మేనకోడలు యూనివర్సిటీ చదువులు చదివితే, పదో తరగతి తప్పిన నూకరాజుని చేసుకొనే అవకాశమే లేదని పోలమ్మకి బోధపడిపోయింది. ఏమనడానికీ తోచలేదు. 'అన్న ఉన్నప్పుడే లగ్గం ఎట్టీసుకోవల్సింది. పోనీ పెద్ద మనుసుల ముందు ఒకమాట అనీసుకున్నా సరిపోను. పొరబాటయిపోయింది' అనుకుంటూ నిట్టూర్చింది.

గంగరాజన్న పోయిన దగ్గర నుండీ కొడుకు నూకరాజు తిన్నగా వేటకి వెళ్లడం లేదు. ఒకరోజు వెళ్తే నాలుగు రోజులు ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు. 'ఎక్కడికెళ్లావురా?' అనడిగితే చెప్పడు. వేళకి ఇంటికి రాడు. వంట చేసిన రోజున బయటెక్కడో తిన్నానంటాడు. అలాగని వండకపోతే, ఏదో ఒక సమయానికి వచ్చి, ఇంట్లో తినడానికి ఏమీ లేవని విసుక్కుంటాడు. బయటకిపోయి తింటానని మళ్లీ వెళ్లిపోతాడు. 'బగమంతుడి దయవల్ల కొడుక్కి దురలవాట్లు లేవుగానీ, రానురాను ఏటయిపోతాడో' అని పోలమ్మకి బెంగగా ఉంది.

"ఏదో ఒకటి సెయ్యాలి గద్రా? ఏటకెల్లకపోతే ఇల్లెలా గడుస్తాదిరా?" అంటే –

"ఓడ కంపెనీ వోల్లిచ్చింది ఉన్నాది కాదేటి?" అంటాడు.

ఆ డబ్బుకి మరికొంత జోడించి పక్కా ఇల్లు కట్టుకోవాలని పోలమ్మ ఆశ పడుతోంది. తొందరగా పెళ్లి చేసేస్తే కొడుకు మళ్లీ మనుషుల్లో పడతాడని పోలమ్మ ఆలోచన.



అన్వేషణ

చిన్నప్పుడే తండ్రిని పోగొట్టుకున్న నూకరాజుకి గంగరాజు మావంటే సొంత నాన్నతో సమానం. అటువంటి వాడు కూడా వెళ్లిపోయాడు. మొదట తెరచాప, తరవాత చుక్కాని ధ్వంసం అయిన పడవలాగా ఉంది నూకరాజు జీవితం ఇప్పుడు. అందుకే అతనికి దేనిమీదా దృష్టి నిలవడం లేదు. ఏమి చెయ్యాలో, అసలు తనకేమి కావాలో తెలియని అయోమయం. అన్ని వైపులా చిమ్మచీకటి – ఆనాటి తుఫాను రాత్రిలాగానే. అతని తల్లి పోలమ్మకి నూకరాజు పరిస్థితి అర్థం అవుతూనే ఉంది. ఏదోలా కొడుకు ఒక దారిన పడాలని ఆమె తాపత్రయం.

వెంకటేశు బావా, ఎల్లమ్మా – జిమ్మీదొర ఇంటికి ప్రైవేటుకి వెళ్తున్నారని పోలమ్మ ఒకరోజున అన్నం వడ్డిస్తూ నూకరాజుకి చెప్పింది. ఏమంటాడో అని ఆశగా చూసింది. కాసేపాగి, 'నువ్వు కూడా ఎల్లొచ్చు గదరా?' అని పోరింది; 'నువ్వొస్తానంటే ఆ కెప్టేను రావద్దనీసంటాడా? కావాలంటే గంగమ్మత్తతో మాట్లాడిస్తాను' అని నసపెట్టింది.

"నాకెందుకే ప్రైవేటు? చదివింది చాలదా?" అంటూ నూకరాజు ఆమెపై విసుక్కున్నాడు.

'ఏటకీ ఎల్లక, సదువూ లేక – ఏటి సేత్తావురా? ఇంటికాడ కూకోని తింటావా?' అని నిలదియ్యాలనుకుంది కానీ ఆమె వల్ల కాలేదు. భర్త ఉండి ఉంటే నయానో, భయానో ఒప్పించేవాడు కదా అని దుఃఖించింది. 'జమీల' ఏక్సిడెంటయ్యాక, కొన్నాళ్లు చూసి, పోలమ్మ కొడుకుని తన మరిది వద్దకు – అతనితో బాటుగా వేటకు వెళ్తాడని – కోనాడ పంపించేసింది. ఆరు నెలలయ్యాక తిరిగొచ్చేశాడు. ఎందుకొచ్చేశాడో పోలమ్మకి తెలియలేదు. పిన్ని అంటే నూకరాజుకి ఇష్టం అని తెలుసు. 'చిన్నాన్న ఏటైనా అన్నడేట్రా?' అంటే, 'ఏటంటాడు? ఏటనలేదు,' అంటాడు తప్ప ఇంకేమీ చెప్పడు. మూడు నెలలుగా ఇక్కడే, తల్లితోనే ఉంటున్నాడు. మరికొన్నాళ్లయ్యాక వెంకటేశు, ఎల్లమ్మలిద్దరూ ఇంగ్లీషు మీడియం స్కూళ్లలోకి మారిపోయారన్న సంగతి కూడా ఆమే కొడుకు చెవిన వేసింది; విని గమ్మున ఊరుకున్నాడు.

పోలమ్మ కొడుకుతో,

"ఆ అప్పారావుగాడిని సూడరా! పదో తరగతి పాసై సక్కగ గవర్నమెంటుద్దోగం సేసుకుంటన్నాడు. ఆడి జీతం అయిదు వందలేగానీ, పైరాబడి మరో అయిదువందలైనా ఉంటదట," అంది. ఇదే మాట మళ్లీమళ్లీ అనేసరికి నూకరాజుకి చిరాకొచ్చింది.

"ఆ అప్పారావుగాడి సంగతి నాకు తెల్దనుకుంటన్నావా? ఆడు చేసీవన్నీ ఎదవ పనులే. అక్కడి మాటిక్కడా, ఇక్కడి మాటక్కడా చెప్పుకోని బతుకుతున్నాడు. ఆడి టెంతు క్లాసు సర్టిఫికేటే గోలుమాలు. ఆడూ, సిమ్మాచలం తోడు దొంగలు. ఆడికీ నాకూ ఒకటేనేటే? ఆడి ఊసు నా కాడింక ఎత్తక. అయినా ఆడి వూసు మనకేల?" అని తల్లిని కసురుకున్నాడు.

"మనకేల అంటే, మరి ఆడి కోసం ఎల్లమ్మని అడుగుతున్నారు!" అని అసలు విషయం బయటపెట్టింది పోలమ్మ.

"నీకెవరు చెప్పారు?" నూకరాజు గొంతులో ఆసక్తిని పసిగట్టింది పోలమ్మ.

"గంగమ్మత్తే చెప్పింది. సిమ్మాచలం చేత అడిగించాడట." నూకరాజు నిర్ఘాంతపోయాడు.

"ఎప్పుడయ్యిందే, ఇదంతన్ను?" కొడుకు మొహంలో ఆందోళనను గమనించిన పోలమ్మ లోలోపలే నవ్వుకుంది.

"పోయినోరం"

"గంగమ్మత్త ఏటంది?"

"ఏటంటది? ముందు దాని చదువు అవ్వనీ, తరవాత సూద్దారి – అనీసందట. కూతుర్ని యూనవరిసిటీల చదివించాలని కదా, గంగమ్మ ఆస," అని పోలమ్మ అన్నదిగానీ, నిజానికి పెద్ద ప్రహసనమే జరిగింది.

అప్పారావు పోలమ్మ భర్తవైపు దూరపు చుట్టం; నూకరాజు కన్నా రెండు మూడేళ్లు పెద్ద. కస్టమ్స్ ఆఫీసులో అటెండరుగా పనిచేస్తున్నాడు. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. అంతేకాకుండా సింహాచలానికి సన్నిహితుడు కూడా. కొంతమంది కస్టమ్స్ అధికారులతోనూ, అలాగే సిబ్బందితోనూ సింహాచలం సత్సంబంధాలు కలిగి ఉండడానికి అప్పారావు తోడ్పాటు, సహకారం చాలా ఉన్నాయి. సింహాచలం చేసే వ్యాపారానికీ, కస్టమ్స్ విభాగానికీ విడదీయరాని సంబంధం ఉంది మరి.

అయిదవ తరగతి పాసైన అప్పారావు తండ్రి కూడా అదే ఆఫీసులో ప్యూనుగా పనిచేసేవాడు. అతను అకస్మాత్తుగా పోవడంతో అప్పారావుకి మానవతా కారణాల దృష్ట్యా ఉద్యోగం దొరికింది. అందరు జాలరుల మాదిరిగానే అతని తాత కూడా

చేపల వేటకి వెళ్లేవాడు గానీ, అంతటితో ఆ కుటుంబీకులు కులవృత్తికి స్వస్తి పలికారు. చిన్నాచితకా ఉద్యోగాలు – ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలలో – చేయసాగారు. జాలరులలో అటువంటి వాళ్ల సంఖ్య నానాటికీ హెచ్చవుతోంది. చాలా మంది జాలారిపేట విడిచిపెట్టి నగరంలోని ఇతర ప్రాంతాలకూ, ప్రభుత్వ సంస్థల ఉద్యోగాల మూలంగా లభించే క్వార్టర్సులోకీ మారిపోయారు కూడా. అప్పారావు ఈ మధ్యనే పైరవీలు చేసి బలహీన వర్గాలకు ఉచితంగా ఇచ్చే గృహ సదుపాయాన్ని స్వంతం చేసుకున్నాడు. నిజం చెప్పాలంటే, ఈ విధంగా కులవృత్తి మానుకొని ప్రధాన జీవన స్రవంతిలో కలిసిపోయిన జాలరులు ఒక బలమైన సామాజిక అల్లికగా, కులంలోనే ఒక ఉపకులంగా అవతరించారు. వాళ్ల కట్టూ, బొట్టూ, మాటతీరు – అన్నీ భిన్నంగా ఉంటాయి. తమ మూలాలను – ఉపయోగపడే చోట్ల ప్రముఖంగా ప్రకటించుకోగల నేర్పుతో బాటు, అవసరంలేని చోట్ల దాచిపెట్టగల లౌక్యాన్ని కూడా వాళ్లు అలవర్చుకున్నారు. ప్రకృతికి చేరువగా ఉండే జాలరి పురుషుల సహజసిద్ధ లక్షణాలైన నిష్కపటత, సరళత – చేపల వేటకి దూరంగా ఒకటి, రెండు తరాలబాటు ప్రధాన స్రవంతితో వీరు చేసిన సహజీవనంతో మటుమాయం అయిపోయాయి.

అదే సమయంలో ఎంతోమంది జాలారిపేట వాసులు నగరానికి ఉత్తరంగా భీమిలి వెళ్లే దారిలో ఉన్న పెద్ద జాలారిపేటకు తరలిపోవడం ఆరంభించారు. పాత పద్ధతులలో చేపలవేటని కొనసాగించడానికి అక్కడింకా అవకాశాలు ఉండడం, జనాభా పెరుగుదల, పాత జాలారిపేటకు విస్తరించే అవకాశాలు లేకపోవడం ఇందుకు కారణాలు. పక్కాఇళ్లు కలిగిఉన్న గంగమ్మ కుటుంబాల వంటివి మాత్రం పాత జాలారిపేటలోనే ఉండిపోయాయి. ఇందుకు మరో కారణంకూడా ఉంది. జాలరుల పద్ధతులు, సంప్రదాయాలు చూస్తూండగానే మారిపోవడం, జాలరులై ఉండీ కులవృత్తినీ, కులాచారాలను వదులుకోవడం గంగమ్మకీ, ఆమెలాంటి పాతకాలం మనుషులకు మనస్తాపం కలిగించింది. 'జాలారోల్లయిఉండీ ఈ మొగోల్లు ఏటకెల్లకుండగ వుద్దోగాలూ, యాపారాలు సెయ్యడమేటి, కలికాలం కాపోతేని?' అనుకొనేది గంగమ్మ. తమకు బాగా తెలిసిన పాత ప్రపంచంలోనే కొనసాగాలని ఆమెవంటి వాళ్లంతా నిర్ణయించుకున్నారు.

ఇటీవల ఒక పెళ్లిలో ఎల్లమ్మ, అప్పారావు కంటబడింది. మొదటి చూపులోనే అతడు ప్రేమలో పడ్డాడు. ముఖ్యంగా ఆమె ఆధునిక వస్త్రధారణ, చకచకా ఇంగ్లీషు మాట్లాడడం అతన్ని ఆకట్టుకున్నాయి. తానొక ఆఫీసరుగా, ఆమె తనకు సరైన జోడీగా – ఊహించుకొని ఉబ్బితబ్బిబ్బయ్యాడు. తన సన్నిహితుడు, శ్రేయోభిలాషి అయిన సింహాచలానికి ఆమె స్వయానా మేనకోడలని అప్పారావుకి ముందే తెలుసు. ఒక రోజున ఒమర్ ఖయ్యాం బార్‌లో తన బాధను అతనితో చెప్పుకున్నాడు. తన కనీస

డిమాండ్లను కూడా వెల్లడించాడు. 'దానికేముందిలేరా? మా అక్కతో మాట్లాడతాను' అని మాటిచ్చేశాడు సింహాచలం – మూడో రౌండు ఇచ్చిన గుండె ధైర్యంతో.

అప్పారావు గనక దగ్గర చుట్టంగా మారితే కస్టమ్స్ విభాగంతో సంబంధాలు మరింత బలపడతాయనీ, అందువల్ల తనకు తప్పక మేలు జరుగుతుందనీ సింహాచలం ఆశపడ్డాడు. అయితే అక్క దగ్గర ఈ ప్రతిపాదన చెయ్యడానికి ధైర్యం చాలక వెనకాడాడు. 'మాట్లాడావా? మాట్లాడావా...?' అని అప్పారావు సతాయిస్తున్నాడు. ఇక తప్పదని గ్రహించిన సింహాచలం – కాస్త జంకుతూనే – గంగమ్మ వద్ద ఎల్లమ్మ, అప్పారావుల పెళ్లి మాటెత్తాడు. తన సన్నిహితుడి గుణగణాలను అతిగా పొగిడి ఆకాశానికెత్తాడు. 'జాలారుల్లో అంతకన్నా బుద్ధిమంతుడు, ప్రయోజకుడు నీకు దొరకడు' అన్నాడు.

గవర్నమెంటు ఉద్యోగం, నెలకి వెయ్యి రూపాయిలు అనగానే గంగమ్మకి కొంచెం మనసు లాగింది. ఈ సంబంధం అయితే కూతురు సుఖపడుతుంది అనుకుంది.

అక్క మెత్తబడిందని గ్రహించి, అసలు సంగతి బయటపెట్టాడు.

"పిల్ల నచ్చింది, కానీ కట్నం అవుసరంలేదన్నాడు. కాకపోతే ఒక స్కూటరు, పది తులాల బంగారం, పెద వాల్తేరులో ఉన్న నీ స్థలం రాసిచ్చేస్తే చాలన్నాడు." గంగమ్మ ఆశ్చర్యపోయింది. "మనోల్లంట కట్టాలూ, కానకాలూ ఎక్కడున్నాయిరా?" అంది.

గంగమ్మకు తెలిసి జాలరులలో ఆడపిల్ల పుట్టిందంటే పండగే. లక్ష్మీదేవి అడుగుపెట్టిందని అంతా మురిసిపోయేవారు. ఎల్లమ్మ పుట్టినప్పుడు కూడా అదే జరిగింది. ప్లస్‌లూ, మైనస్‌లూ తత్సంబంధిత సమీకరణలూ వాళ్ల ప్రపంచంలోకి అప్పటికింకా పూర్తి స్థాయిలో ప్రవేశించలేదు.

"లోకం మారిపోయిందే అప్పా! పూర్వం లాగనుకుంటన్నవేటి? మనోల్లందరూ ఇప్పుడు ఉద్యోగస్తులు. కట్నాలు, కానుకలు – ఇయన్నీ ఇంక మామూలే. ఇదేం కొత్త విసయం కాదు. ఈ రోజుల్లో కూడా ఏటకెల్లీ జాలారోల్లంటే దద్దమ్మలన్నమాట. అటువంటోల్లకి నువ్వు మాత్రం ఎల్లమ్మనిస్తావా?" 'నిజమే. ఏటకెల్లీ వోడిని నేసుకోని, ఆడు తెచ్చీ నేపల్ని బజార్లంట తిరిగి అమ్మమంటే ఎల్లమ్మ మాత్తరం అమ్ముతాదేటి?' తమ్ముడి మాటల్లో ఎంతోకొంత వాస్తవం ఉందని గంగమ్మకి అనిపించింది. అడ్డూఆపూ ఎరగని ఆమె నోటికి తాళం పడింది.

ఒకప్పుడు వేటకి వెళ్లొచ్చి చేపలు తీసుకొచ్చి అప్పజెప్పడమే మొగాళ్ల పని. ఆ తరవాత కుక్కిన పేనుల్లా పడి ఉండడమే తప్ప భార్యలకు ఎదురుచెప్పే పరిస్థితే

లేదు. జాలరి స్త్రీల నోటి ధాటికి, పెత్తనానికి ఎదురన్నది లేదు. అలాంటిది – మొగుళ్లు తాగొచ్చి పెళ్లాలను కొట్టడం, పెళ్లిల్లో కట్నాలు, కానుకలు ఇవ్వాలని పట్టుబట్టడం. ఆడపిల్లల తల్లిదండ్రులు కూడా ఒప్పేసుకోవడం – ఇవన్నీ మొదలైపోయాయి. 'ఏనాడూలేని ఈ దిక్కుమాలిన అలవాట్లు మా కులంలోకి ఎక్కడినుండి వచ్చాయా?' అని గంగమ్మ తరచూ ఆశ్చర్యపోతూంటుంది; జవాబులు దొరకనప్పుడల్లా తన అలవాటు చొప్పున 'కలికాలం' అని సరిపెట్టుకుంటుంది.

సింహాచలానికి ఏం చెప్పాలా అని ఒక్క నిమిషం ఆలోచించాక,

"అది యూనివరిసిటీల పెద్ద సదువులు సదవాలంటరా! మీ బావ అదే మాట అనీవోడు. మరప్పుడు అదేటంటాదో, మనకేటెరిక?"

"అందుకే ఇప్పుడే మాట్లాడీసుకుని ఒప్పందం చేసీసుకుంటే ఒక పనైపోతాది కదే? నాలుగు రోజులు ఆగమంటే అప్పారావు ఆగుతాడు,"

"దాని చదువయ్యాదాకా మరోమాట లేదురా. అయినా ఇప్పుడే చెపతన్నాను. సరీగ ఆలకించు. అంతా బాగుండి, అదొప్పుకున్నా సరే కట్టాలూ, కానకాలూ ఇచ్చీది లేదు. అది మన పద్దతీ కాదు; ఆనువాయితీ కాదు. అయినా ఎల్లమ్మకేటీ? బంగారం! దాని కోసం పెద్దపెద్ద ఆపీసార్లే మన గుమ్మం కాడికొస్తారు," అన్నది గంగమ్మ నిశ్చయంగా.

"అయితే అప్పారావుకేటి చెప్పమంటావు?"

"ఇదే చెప్పు." అప్పారావు భగ్నప్రేమికుడిగా మారి కొన్నాళ్లపాటు ఒమర్ ఖయ్యాంని ఆశ్రయించాడు, పోషించాడు. ఏడాది తిరక్కుండా తన షరతులకు అంగీకరించిన జాలర్ల పిల్లనే చేసుకున్నాడు.

* * *

ఎండు చేపలు, రొయ్యల పొట్టు అమ్మగా వచ్చిన మొత్తం కొంత ఇవ్వాల్సి ఉందనీ, నూకరాజుని పంపమనీ గంగమ్మ, పోలమ్మతో అన్నది. నూకరాజు అయిష్టంగా గంగమ్మత్త ఇంటికి బయల్దేరాడు. గంగరాజు మావ పోయినదగ్గర్నించీ ఆ ఇంటికి వెళ్లాలంటే వెనకాడుతున్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో - ఏడాది మొత్తం మీద రెండు సార్లు మాత్రమే వెళ్లాడు. ఇదిగో మళ్లీ ఇప్పుడు. నాలుగడుగులు వేసాక,

'ఏల్లమ్మ కనిపిస్తుందేమో?' అని ఎక్కడో చిన్న ఆశ కలిగింది అతనిలో.

కటకటాల తలుపు తీసి లోపలికి వెళ్లాడు. ముందు గదిలో – గోడకి తగిలించిన గంగరాజు మావ ఫొటో – గంధపు దండతో, పగలు కూడా వెలుగుతూన్న పచ్చరంగు బల్బుతో కనిపించింది. ఆ ఫొటో అద్దంపైనే అతని నుదిటి మీద బొట్టు పెట్టి ఉంది. చాలాసార్లు పెట్టడం వల్ల ఆ బొట్టు మొహం మీదికి కారిపోయి ఉంది. ఆ ఫొటోకేసి

కొన్ని క్షణాల సేపు తదేకంగా చూసాడు. గంగరాజు మావ చనిపోయాడంటే ఇప్పటికీ నూకరాజుకి నమ్మకం కుదరడం లేదు. 'ఆడి పేనానికి నా పేనం అడ్డం ఎడతాన్లెయ్యే' అని తన తల్లితో మావ అన్న మాటలు గుర్తుకొచ్చాయి. లోపల్నించి మాంసం వండుతున్న మసాలా వాసన జోరుగా వస్తోంది.

తలుపు తీసిన అలికిడి విని గంగమ్మ వంటింట్లోంచి వచ్చింది.

"ఏం నూకరాజూ! అక్కడే ఉండిపోయావు, లోపలికిరా" అంది. అందరిలాగా 'నూకాలూ' అని కాకుండా, 'ఒరే, గిరే' అనకుండా అతన్ని మర్యాదగా పూర్తి పేరుతో పిలిచేది గంగమ్మత్త ఒక్కర్తే.

మధ్య గదిలో ఉన్న వెంకటేశు, "ఏం బావా? ఎలా వున్నావు? కనబడ్డం మానీసావు" అని పలకరించాడు.

నల్లగా, కురచగా బలిష్టంగా ఉండే వెంకటేశు ఇంకా కండలు పెంచాడు. అతడు బాక్సింగు, ఫుట్ బాల్ ఆటలంటే ప్రాణం పెడతాడని నూకరాజుకి తెలుసు.

"మా పిన్నీ, చిన్నాన్నాల్ల ఊర్ల ఉన్నాను, ఇన్నాలూ," అన్నాడు నూకరాజు ముక్తసరిగా.

వెంకటేశు చేతిలో చేపలు పట్టే గేలాలు రెండు ఉన్నాయి; వాటి నైలాన్ తాళ్లకి కొక్కేలను కట్టి ముడేస్తూ,

"ఉంటావా, నాలుగు రోజులు?" అని అడిగాడు.

"ఇంక ఇక్కడే" అన్నాడు, నూకరాజు.

"బావకి టీ చేస్తాను, నువ్వు తాగుతావా?" గంగమ్మ కొడుకుని అడిగింది.

"నాకొద్దులే. ఇప్పుడు డారల్ ఒస్తాడు. ఇద్దరం కలిసి టౌనుహాలుకెళ్లి చేపలు పడతాం" అని తల్లికి జవాబిచ్చాడు – మరో వైపున తన పని కొనసాగిస్తూనే.

నూకరాజు, "నాకు కుదరదులే గానీ, ఈ డాలర్ గాడెవడ్రా?" అని అడిగాడు – కుతూహలంగా.

"డాలర్ కాదు బావా, డారల్. కేప్టెన్ జిమ్మీ నీకు తెలుసు కదా? అతని కొడుకు. ఇప్పుడు నా బెస్టు ఫ్రెండు." గంగమ్మ టీ తీసుకొచ్చి నూకరాజుకిస్తూ – వెంకటేశుతో,

"సెల్లిని తీసుకురమ్మని సెప్పానా? బయల్దేరు," అన్నది అసహనంగా.

"అదొచ్చేస్తుంది లేవే. దానికేం భయం లేదు. నీకన్నిటికీ భయాలే. అయినా దాన్ని డారల్ తీసుకొస్తానన్నాడు," అని తల్లి మీద విసుక్కున్నాడు వెంకటేశు.

"ఎల్లమ్మ ఎక్కడి కెల్లిందత్తా?" నూకరాజుకి సందేహం కలిగింది.

"ఇయ్యాల ఆదోరం కదా? చర్చీకెల్లింది," అన్నది గంగమ్మ.

గళాసు పెట్టడానికి వంటింట్లోకి వెళ్లి, నూకరాజు అత్తతో,

"అత్తా! అది చర్చికెందుకెళ్లింది?" అన్నాడు. అతని గొంతులో ఆందోళన ధ్వనించింది.

"ఎందుకెళ్లిందంటే ఏటి సెపుతాం? దానిష్టం. నా మాటింటే కదా?...నువ్వు ఈ పూట ఇక్కడే భోజనం చేసీ, నూకరాజూ. కోడికూర చేశాను. నీకిష్టం కదా?" జాలరుల ఇళ్లల్లో చేపలతో చేసే వంటకాలు రోజూ ఉండేవే. మాంసం వండిన రోజునే విందు భోజనం.

"ఒద్దులే అత్తా! అమ్మ నా గురించి సూస్తా ఉంటది." వీధిలోంచి ఎల్లమ్మ నవ్వు వినిపించింది. నూకరాజు ముందుగది వైపుగా నడిచాడు.

"స్టాప్, స్టాప్. దిస్ ఈజ్ మై హౌస్" అని ఎల్లమ్మ సైకిలు దిగి లోపలికి వచ్చింది.

ఎర్ర పోల్కా చుక్కల పొట్టి గౌను, కత్తిరించిన జుత్తు, ఎర్రటి హెడ్ బాండ్, పెదాలకి ఇంకా ఎర్రటి లిప్ స్టిక్, పొడుగ్గా పెంచిన గోళ్లకి రంగు, పాదాలకి ఎత్తు మడమల జోళ్లు, గుప్పుమన్న సెంటు వాసన – ఎల్లమ్మ అవతారం పూర్తిగా మారిపోయింది. నూకరాజు నోరు వెళ్లబెట్టాడు. గుండ్రంగా బొంగరంలా ఉండేది. పొడుగ్గా, తక్లీలా ఎదిగిపోయింది. అయినా అవే బూరె బుగ్గలు, తళతళలాడే పెద్ద కళ్లు, ఉంగరాల జుత్తు. పెంకె మొహం. నిగనిగలాడే మెరుగుపెట్టిన మాను నలుపు. తెల్లటి పలువరుస. 'ఏడాదిలో ఎంత మారిపోయింది?!'

"హాయ్! బావా!" అంది ఎల్లమ్మ జోళ్లు విప్పుకుంటూ. 'ఆ ఎత్తు జోళ్లు విప్పితే నా కన్నా కాస్త పొట్టిగానే ఉందిలే' అని సరిపెట్టుకున్నాడు నూకరాజు.

ఆమెలో మారకుండా ఉన్న లక్షణాలు ఏవైనా ఉన్నాయంటే అవి జాలరి ఆడవాళ్లందరికీ సహజంగా పట్టుబడే ఆత్మవిశ్వాసం, ధీమా. మాటకి రెండు మాటలు అంటించే నోటి ధాటి.

డారల్ సైకిలుకి స్టాండు వేసి, లోపలికి వచ్చాడు. అతని రాగి రంగు వంకీల జుత్తు చెమటకి తడిసి నుదుటికి కాస్తంత అంటుకుంది. చర్చి నుంచి వస్తున్నాడు గనక టక్ చేసుకొని స్మార్ట్‌గా హిందీ సినిమా హీరోలా ఉన్నాడు. ఎండలో సైకిలు తొక్కుతూ రావడం వలన మొహం ఎర్రబడింది. బాగా చెమట పట్టినట్లుంది. చొక్కా బొత్తాములు రెండు విప్పి ఉన్నాయి. లోపలి బనీను, శిలువ వ్రేలాడుతూన్న బంగారం గొలుసు కనిపిస్తున్నాయి. కళ్లకి నల్ల కళ్లద్దాలు. వంటికి అతుక్కుపోయిన స్కిన్ టైట్ పేంటు. కాళ్లకి ధగధగా మెరిసిపోతూన్న సూదిగా మొనదేలిన నల్లటి బూట్లు.

"ఎల్లీ! గెట్ మీ ఎ గ్లాస్ ఆఫ్ వాటర్ ప్లీజ్," అని ఎల్లమ్మని ఆదేశించాడు.

గ్లాసుతో మంచి నీళ్లు తీసుకొచ్చిన ఎల్లమ్మ నూకరాజుని డారల్‌కి పరిచయం చేసింది, ఇంగ్లీషులో –

"ఇతను నూకరాజని, మా కజిన్. 'జమీల' ఏక్సిడెంట్‌లో ఇతను కూడా ఉన్నాడు...నీకు చెప్పాను గుర్తుందా?" డారల్ తన చేతిని అందించి, "ఐ యామ్ వెరీ సారీ," అన్నాడు.

వెంకటేశు గేలాలను తీసుకొని బయటకు వచ్చాడు. డారల్ ఉత్సాహంగా –

"వెంకీ! ఇలా రా! నా కొత్త సైకిలు చూడు. నిన్న మా నాన్నా, నేనూ వెళ్లి, నువ్వు చెప్పినట్టే టర్నర్ చౌల్ట్రీ దగ్గర 'నాగరాజు బ్రదర్స్'లో కొన్నాం." వెంకటేశు సైకిల్ని పరిశీలనగా చూసి,

"ఎంతయింది?" అన్నాడు.

"రెండు వందలు చెప్పాడు. నూటా ఎనభైకి ఇచ్చాడు."

"అవును మరి. ర్యాలీ సైకిలా, మజాకానా?" ఈ డారల్ అనేవాడు గంగరాజు మావ పిల్లల్ని 'ఎల్లీ', 'వెంకీ' అని సంబోధించడం, తన కొత్త సైకిల్ని ఆర్భాటంగా ప్రదర్శించడం, ముఖ్యంగా ఎల్లమ్మని ముందు కూర్చోబెట్టుకొని ఊరేగడం – ఇవేవీ నూకరాజుకి బొత్తిగా రుచించలేదు. అతనిలో డారల్ పట్ల అప్పటికప్పుడు తీవ్రమైన ద్వేషం ఏర్పడిపోయింది. 'వీడూ, వీడి బోడి సైకిలూను' అనుకున్నాడు మనసులో. 'గొట్టాం పేంటులో పిట్టల దొర' అని తిట్టుకున్నాడు.

వెంకటేశూ, డారల్ బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నారు.

"బావా! సరదాగా మాతో రావచ్చుకదా? ఇప్పుడు నీకేం పని?" అన్నాడు, వెంకటేశు.

"మరోసారి వస్తాలే. అయినా నాకేమీ పనీపాటా లేదనుకుంటున్నావా?" అన్నాడు నూకరాజు కొంచెం కోపంగా.

"సర్లే నాయినా, నీ ఇష్టం." వాళ్లిద్దరూ బయటకి నడిస్తే ఎల్లమ్మతో మాట్లాడే అవకాశం దొరుకుతుందని నూకరాజు ఆశించాడు. ఎల్లమ్మలో వచ్చిన పరివర్తన అతన్ని కలవరపరచింది. సంగతేమిటో తెలుసుకొని తీరాలనుకున్నాడు. కానీ ఎలా?

"నువ్వు తోల్తావా?" అని డారల్, తన కొత్త సైకిల్ని వెంకటేశుకి అప్పగించాడు ఉదారంగా. వాళ్లు వెళ్లిపోయారు.

ఎల్లమ్మ రెండు మజ్జిగ గ్లాసులు తీసుకొని వచ్చింది. ఒకటి నూకరాజు చేతికిచ్చి,

"ఎలా ఉన్నావు, బావా?" అన్నది, అక్కడున్న ఫోల్డింగు కుర్చీలో కూర్చుంటూ.

"నాకేం, ఎప్పటిలాగానే ఉన్నాను. నువ్వే నీ కొత్త స్నేహితులతో క్షణం తీరుబడి లేకుండా ఉన్నావు," అన్నాడు, నూకరాజు నిష్ఠూరంగా.

ఎల్లమ్మ నవ్వింది. ఆమె బుగ్గమీద పడ్డ సొట్టని గమనించాడు నూకరాజు. 'ఏమీ మారలేదు' అనుకున్నాడు.

"కేప్టెన్ జిమ్మీ కుటుంబం అంతా చాలా మంచివాళ్లు. వాళ్ల సాయం చెయ్యబట్టి మంచి స్కూళ్లల్లోకి మారిపోయాం, మేమిద్దరం. డారల్ చెల్లెలు డెబొరా నాకు మంచి ఫ్రెండు."

"అది సరేలే. నువ్వు కిరస్తానుల్లోగాని కలిసిపోతున్నావా?" – నూకరాజు గొంతులో ఆందోళన ధ్వనించింది.

ఎల్లమ్మ పకపకా నవ్వింది.

"అదా నీ భయం! ప్రస్తుతానికి అలాంటి ఆలోచన ఏదీ లేదులే. ఇప్పుడు నువ్వు బుర్రలో పెట్టావు కదా? ఆలోచించాలి మరి," అన్నది పెంకెగా.

"ఇంకా కొన్ని విషయాలున్నాయి, నీతో మాట్లాడవల్సినవి."

"సరే!...మాట్లాడు!".

"ఇక్కడ కాదు. మీ అమ్మ వింటుంది. లోవతోటకి వెళ్దాం పద."

"ఇప్పుడు నేను రాలేను. భోజనం చెయ్యకపోతే అమ్మ ఊరుకోదు. అయినా లోవతోటకి ఎందుకు?". అక్కడికి ఎక్కువగా ఎవరు వెళ్తారో ఆమెకు తెలుసు.

"అక్కడైతే ప్రశాంతంగా ఉంటుంది. ఎవరూ మన జోలికి రారు...ఈ ఒక్కసారీ రాలేవా? ఇంకెప్పుడూ అడగను."

"సరేలే. ట్యూషన్‌కి వెళ్లాలని అమ్మకి చెప్పి సాయంత్రం బయల్దేరి వస్తాను. నువ్వు కూడా ఇక్కడే భోజనం చేసెయ్యొచ్చుగా?"

"వద్దులే. నాలుగ్గంటలకి మా ఇంటికిరా. అక్కడి నుండి ఇద్దరం కలిసి వెళ్దాం. మరో విషయం – కాస్త శుభ్రమైన బట్టలు వేసుకో."

"అంటే?"

"పరికిణీ, ఓణీ."

"నా ఇష్టం వచ్చిన డ్రెస్ వేసుకుంటాను, నువ్వు నాకు చెప్పేదేమిటి? అయినా నువ్వు బతిమాలుతున్నావు కాబట్టి వస్తానన్నాను. లేకపోతే నాకేం పని?" అన్నది ఎల్లమ్మ చిరాగ్గా.

ఎల్లమ్మలో ఇదివరకెన్నడూ చూడని ఆత్మవిశ్వాసం, దురుసుతనం కనిపించాయి, నూకరాజు కళ్లకి. ఆమె భాష కూడా కొంచెం మారినట్లు, పట్టిపట్టి మాట్లాడుతున్నట్లు, వత్తులు పలుకుతున్నట్లు అనిపించింది. 'అది బాపన భాషా? లేక కిరస్తానీ తెలుగా?' – నూకరాజు ఎటూ తేల్చుకోలేకపోయాడు.

"సరేలే. ఏదో ఒకటి ఏసుకొని రా," అన్నాడు నూకరాజు, చేసేది లేక.

"అన్నట్టు...అమ్మ నీకివ్వమంది," అంటూ ఎల్లమ్మ డబ్బు చేతిలో పెట్టింది.

లోవతోట

పోలమ్మత్త పాక ముందు నిలబడి, "బావా!" అని కేకేసింది ఎల్లమ్మ. పోలమ్మ బయటకి వచ్చి, "లోపలికి రాయే, బయటే ఉండిపోనావేటి?" అన్నది.

మేనకోడలు తమ ఇంటికి వచ్చినందుకు పోలమ్మ మురిసిపోయింది.

"ట్యూషన్‌కి టైమైపోయిందత్తా! బావ తోడు వస్తానన్నాడు. మరోసారి వస్తాలే." నూకరాజు పాక బయటికి వచ్చాడు. ఎల్లమ్మ పంజాబీ డ్రెస్ వేసుకుందని గమనించాడు. ఆనాటి విశాఖపట్నానికి అది కూడా ఒక వింతే. 'పొట్టి గౌను కన్నా నయమేలే' అని సరిపెట్టుకున్నాడు. ఇద్దరూ హార్బరు వైపుగా నడవసాగారు. మొహాల మీద ఎదురెండ.

"ఏదో మాట్లాడాలన్నావు కదా? మాట్లాడు," అంది ఎల్లమ్మ, నల్ల కళ్లద్దాలు తగిలించుకుంటూ.

"ఇప్పుడే కాదు." పాత రైటు హవుసు దాటి, వెంకటేశ్వరుడి గుడి ఉండే మెట్ట వద్దకు చేరుకున్నారు.

అక్కడ నాటు పడవ మీద ఛానెల్ దాటితే యారాడ కొండ ఒడిలో, రహస్యంగా ఒదిగి ఉండే లోవతోట వస్తుంది. అది నిజానికొక లోయ. లోయతోట కాలక్రమేణా లోవతోటయిందా? ఏమో. అక్కడ అడవిలాగా జీబుగా పెరిగిపోయిన చెట్లుంటాయి. చెట్ల మధ్య కాలి బాటలుంటాయి. ఎవరూ పెంచకపోయినా దట్టంగా పెరిగిపోయిన మొక్కలూ, పొదలూ ఉంటాయి. ఎప్పుడూ అడవిని చూడని వాళ్లకి చూపించి అడవంటే ఇలా ఉంటుందని చెప్పవచ్చు. ఎండాకాలంలోనూ, విశాఖపట్నపు ఉక్కపోతలోనూ కూడా లోవతోట చల్లగా, ప్రశాంతంగా ఉంటుంది. కొండగాలి నిత్యం వీస్తూనే ఉంటుంది. సముద్రం ప్రసాదించే చల్లదనం మృదువుగా తాకుతూనే ఉంటుంది. అటువైపు పడవ దిగ్గానే ఒకేఒక టీ దుకాణం కనిపిస్తుంది. తోటలో

ఎక్కువసేపు గడపడానికి అనువుగా అక్కడ సిగరెట్లు, బజ్జీలు, పకోడీలు, అరటి పళ్లు, రస్కోరా ఉండలు, సోడాలు కూడా దొరుకుతాయి. కాకపోతే కొంచెం ఎక్కువ రేట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తోటకి వెళ్లేందుకు రహదారి లేదు. పడవలో తప్ప మరో విధంగా అక్కడికెవరూ చేరుకోలేరు. వెనకతట్టు నుండి రావాలంటే షిప్ యార్డు లోపల్నించి రావాలి. అందుకుగాను అందరికీ అనుమతి ఉండదు. అంచేత లోవతోట ప్రధానంగా యూనివర్సిటీ లేదా కాలేజీల నుండీ, అసలు ఊరంతటి నుంచీ వచ్చి అక్కడ చాటుగా కలుసుకొనే ప్రేమికులకు నెలవు. కార్తీక మాసంలో పిక్నిక్కులకు, వనభోజనాలకు కూడా ఆలవాలం. ఆదివారాలలో, సెలవు రోజుల్లో రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. లోవతోటకి చాటుగా వచ్చే ప్రేమికులందరిదీ ఒకే సమస్య కాబట్టి వాళ్లెవరూ కూడా ఒకరినొకరు పట్టించుకోరు. అసాధారణమైన సామరస్యం, సహకారగుణం అక్కడికొచ్చే వారందరిలోనూ మెండుగా కనిపిస్తాయి.

పడవ నడిపే అతను చెరో అర్ధరూపాయి తీసుకొని నూకరాజునీ, ఎల్లమ్మనీ ఇంకా మరికొన్ని జంటల్నీ ఛానెల్ దాటించాడు. దిగుతూంటే, ఏడు తరవాత పడవ ఉండబోదని హెచ్చరించాడు.

కాసేపు నడిచాక ఒక మర్రిచెట్టు నీడలో బండ రాళ్ల మీద ఎదురెదురుగా కూర్చున్నారు. చాలాసేపటివరకూ మౌనంగానే ఉండిపోయారిద్దరూ. చివరికి ఎల్లమ్మ,

"ఏదో మాట్లాడాలన్నావు?" అన్నది.

"ఎలా చెప్పాలో, ఎక్కడ మొదలుపెట్టాలో తెలియడం లేదు. అసలు మా పడవని ఓడ తిరగదోసిన కాడనుండీ చెప్పాలి. మీ నాన్న నాకోసం ప్రాణాలిచ్చాడు. తెలుసు కదా?"

"తెలుసు. మా అమ్మ చెప్పింది. నేను బెంగ పెట్టుకుంటానని కాబోలు, మరీ అంత వివరంగా చెప్పలేదు."

"నేను చెప్తాను. ధైర్యంగా వింటావా? ఇంత వరకూ నేనెవరితోనూ ఈ విషయం మాట్లాడలేదు. ఎవరో ఒకరికి చెప్పకపోతే పిచ్చెక్కిపోతాను."

"చెప్పు. వింటాను." ఆనాటి తుఫాను బీభత్సం. తెలతెలవారుతూండగా, ఇక బతికిపోయామని అనుకుంటూంటే 'జమీల' ఢీకొట్టడం. తాను వలలో ఇరుక్కుపోవడం. తనను రక్షించడానికి వచ్చిన గంగరాజు మావని చుట్టేసిన వల, డెక్ మీద మావయ్య శవం పక్కన కనీసం ఏడవకుండా కూర్చోవడం, అన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు. నూకరాజు నోటివెంట మాటలు ప్రవాహంలాగా వెలువడ్డాయి. చివరిలో –

"'ఆడి పేనానికి నాపేసం అడ్డం పెడతాన్లేయే' అని మావయ్య మా అమ్మకిచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. ఇయ్యాల నేనిక్కడ కూచోని నీతో మాట్లాడతన్నానంటే

అందుకు కారణం మావయ్య దయాధర్మం తప్ప మరోటి కాదు," అని అన్నప్పుడు మాత్రం అతనికి ఏడుపొచ్చేసింది.

ఎల్లమ్మకూడా వలవలా ఏడ్చేసింది. నూకరాజు చేతిని అందుకుంది.

అప్పుడు ఎల్లమ్మ మాట్లాడనారంభించింది –

"మా నాన్న గురించి ఆలోచించి బాధపడని రోజులేదు. నేనూ ఎవరితోనూ మాట్లాడలేదు. అమ్మతో మాట్లాడితే ఇంకా బాధ పడుతుందని ఊరుకున్నాను. అన్న బయటకి కనిపించకపోయినా లోలోపల ఎంత బాధపడుతున్నాడో నాకు తెలుసు. డారల్‌తో వాడి స్నేహం, పొద్దస్తమానూ ఇద్దరూ కలిసి కొండలూ, గుట్టలూ తిరగడం – ఇవన్నీ ఆ బాధని మర్చిపోవడానికే. వాడితో కూడా మాట్లాడలేకపోయాను. ఒక విధంగా కేప్టెన్ జిమ్మీ కుటుంబం మా ఇద్దరినీ రక్షించింది. ఇంకో మహిమ జరిగింది. నేనెవరికీ ఇంత వరకూ చెప్పలేదు. నువ్వు కూడా ఎవరితోనూ అనకు," అంటూ –

క్రిస్మస్ పండగప్పుడు తెలుగు భక్తిగీతాలు వినడం, ఆ తరవాత తండ్రిని ఒడిలో పెట్టుకొని తల నిమురుతూన్న మేరీ మాత కలలోకి రావడం, తండ్రి తనకు చేరువగా ఉన్నట్లుగా అనిపించడం – వీటి మూలంగా తనకెంతో ఉపశమనం కలగడం – ఇవన్నీ నూకరాజుతో చెప్పింది.

నూకరాజు లేచివచ్చి ఎల్లమ్మ సరసన కూర్చున్నాడు. ఆమె తన తలను అతని భుజం మీద వాల్చింది. నూకరాజు చేతిని తన చేతిలోకి తీసుకుంది. అలా ఎంతసేపు గడిచిపోయిందో వాళ్లకు తెలియలేదు. ఇద్దరి మనసులూ తేలికపడ్డాయి. నూకరాజే మొదట మాట్లాడాడు –

"ఇంకో మాట చెప్పాలి. మీ సింహాచలం మావ తన బిజినీసులో మదుపు పెట్టమని అడుగుతున్నాడు. ఓడ కంపెనీ వాళ్లిచ్చిన ఏభైవేలూ బాంకులో ఉన్నాయి కదా? వాటి మీద కన్నేశాడు,"

"కొంపదీసి నువ్వుగాని ఒప్పుకున్నావా?" అన్నది ఎల్లమ్మ కంగారుగా.

"లేదింకా. సంవత్సరంలో రెట్టింపు చేసి ఇస్తానంటున్నాడు. బిజినీసులో వాటా ఇస్తానన్నాడు. లేదంటే అప్పుగానైనా ఇవ్వమంటాడు,"

"అటువంటి బుద్ధితక్కువ పనిమాత్రం చెయ్యకు. అయినా చక్కగా వేటకి వెళ్లకుండా స్మగ్లింగులో తల దూర్చడం ఏమిటి?"

"వేటకి వెళ్లాలంటే ఉత్సాహంగా అనిపించడం లేదు. అలాగని పూర్తిగా మానెయ్యలేదనుకో. ఏదో ఒక ఆదాయం ఉండాలి కదా?".

"మరేం చేస్తావు? పోనీ మళ్లీ చదువు మొదలుపెట్టు".

"మా అమ్మకూడా అదే అంటోంది. నిన్నూ, వెంకటేశునీ చూస్తుంటే మాత్రం, మళ్లీ చదువుకోవాలని అనిపిస్తోంది. కానీ మా అమ్మ అన్నట్టుగా పదో తరగతి గట్టెక్కించడం ముఖ్యం కాదు. చదివితే పెద్ద చదువులు చదవాలి,"

"లేకపోతే స్మగ్లింగు చెయ్యాలి! అంతేనా?" నూకరాజు మనసారా నవ్వాడు – చాలా రోజుల తరవాత. అతనికి అనేకమైన సందేహాలు కలిగాయి.

"ఏం చదవాలి? ఎక్కడ మొదలుపెట్టాలి? ఈ వయసులో స్కూలుకో, ట్యూషన్‌కో వెళ్తే అంతా నవ్వరా?"

"పోనీ ఒక పని చెయ్యి. పాత స్కూల్లో నా సీనియర్లు – ఇద్దరమ్మాయిలు ఆంధ్రా మెట్రిక్యులేషన్‌కి కట్టి పాసయ్యారు. తరవాత పీ.యూ.సీ.లో జాయిన్ అయ్యారు,"

"అలాగా? కొంచెం కనుక్కుంటావా?"

"ఓ యెస్. ఇక బయల్దేరుదాం," ఇద్దరూ లేచారు. నూకరాజు మనసు తేలికపడింది. ఛానెల్ మీదుగా వీస్తున్న చల్లని సముద్రపు గాలి, జీబుగా పెరిగిన చెట్ల మధ్యనుండి లోయలోకి వస్తూ వాళ్లని బుజ్జగిస్తోంది. మనుష్యుల అలికిడి లేదు. సీతాకోక చిలుకలు గుంపులుగా ఎగురుతున్నాయి. పొదల్లోంచి కీచురాళ్ల రొద. తుమ్మెదల ఝంకారం, అప్పుడప్పుడూ వినవచ్చే కోయిలల పలకరింపులు – తప్పితే అంతటా నిశ్శబ్దం. దూరంగా పోర్టులో ఉన్న ఒక ఓడ ప్రయాణానికి సిద్ధం అవుతూ తన బూరాను ముమ్మారు మ్రోగించింది. చెట్లు పరిచిన నీడల మధ్య, సన్నని కాలిబాట వెంట, పొదల్ని దాటుకుంటూ ఎల్లమ్మ వడివడిగా ముందు నడుస్తోంది.

నూకరాజు ఆమె భుజాలను తన చేతులతో పట్టుకున్నాడు. ఆమె ఆశ్చర్యపోయి ఆగింది. వెనకనుండి ఆమె నడుము చుట్టూ చేతులు వేసి మృదువుగా కౌగలించుకున్నాడు.

ముందుకి వంగి ఆమె చెవి పక్కన బుగ్గ మీద చిన్నగా ముద్దు పెట్టుకున్నాడు.

ఎల్లమ్మ విడిపించుకొని,

"ఏయ్! ఏమిటిది?" అని గద్దించింది.

"నువ్వు లేకపోతే నేనుండలేనే," అన్నాడు తల వంచుకొని.

"ఇందుకేనా ఇక్కడికి రమ్మన్నది? నీ మీద నమ్మకంతో వచ్చాను. ఇక్కడికి ఎవరొస్తారో నాకు తెలీదనుకోకు,"

"మనం పెళ్లి చేసుకుందాం," ఎల్లమ్మ నవ్వింది. "ఇప్పుడు నా దృష్టి కేవలం చదువు మీదే. అయినా ఇప్పుడే పెళ్లి ఊసెందుకు? నువ్వూ చదువుకో – ఆ తరవాత ఆలోచిద్దాం. స్మగ్లర్ని మాత్రం చేసుకోను – సందేహం లేదు," జెట్టీ దగ్గర పడింది.

నూకరాజుకి అంతా అల్లకల్లోలంగా, అయోమయంగా ఉంది. ఎల్లమ్మతో తప్పుగా ప్రవర్తించానేమోనని ఒక పక్క సంశయం; మనసువిప్పి మాట్లాడగలిగినందుకు మరోవైపు ఊరట.

"ఒకటడుగుతాను, చెబుతావా?" అన్నాడు నూకరాజు, సందేహిస్తూ.

"అడుగు,"

"డాలర్‌కీ, నీకూ మధ్య...?"

"డాలర్ కాదు, డారల్. అలాంటిదేమీ లేదు. చాలా మంచివాడు. వాళ్ల కుటుంబం అంతా ఎంతో మంచివాళ్లు," అన్నది ఎల్లమ్మ.

నూకరాజు మనసు కుదుటపడింది.

తీరా జెట్టీ చేరుకొనేసరికి అక్కడ వెంకటేశు, డారల్ కనిపించారు – తమ గేలాలూ, చేపల బుట్టలూ పట్టుకొని. డారల్ నిక్కరూ, టీ షర్టూ వేసుకొని ఫిషింగ్ చేసేందుకు సరియైన వేషధారణతో ఉన్నాడు. పైగా నెత్తి మీద పానమా టోపీ, కాళ్లకి తెల్లటి మేజోళ్లు, కేన్వాస్ షూస్. ఇంటికెళ్లి బట్టలు మార్చుకొని వచ్చాడన్న మాట.

వాళ్లు కూడా పడవ కోసం ఎదురు చూస్తున్నారు. నూకరాజు తడబడిపోయాడు గానీ, ఎల్లమ్మ ఏమీ పట్టనట్టుగా ఉంది. వెంకటేశు నవ్వుతూనే,

"ఏం బావా? చేపలు పట్టడానికి మాతో రమ్మంటే రాలేదుగానీ, లోవతోటలో షికార్లు కొట్టనందుకు మాత్రం నీకు టైము దొరికింది," అన్నాడు, కొంచెం నిష్ఠూరంగా.

ఎల్లమ్మ తనకు వినబడనట్లుగా ఎటో చూడసాగింది. డారల్‌కి ఏమీ అర్థం కాలేదు. నూకరాజు ఇబ్బందిగా నవ్వాడు. కాసేపు నిశ్శబ్దం వారినందరినీ ఆవరించింది.

"సోడా తాగుదాం," అన్నాడు నూకరాజు – ఏదో ఒకటి అనాలి గనక.

అంతా గోళీ సోడాలు కొట్టించుకొని తాగారు. డారల్‌కి అవి కొత్త. చాలా ముచ్చటపడ్డాడు. మరో సోడా తాగాడు. డబ్బివ్వబోయాడు గానీ, అతన్ని వారించి, నూకరాజే ఇచ్చాడు.

డారల్ చాలా ఉత్సాహంగా తాము పట్టిన చేపల్ని నూకరాజుకీ, ఎల్లమ్మకీ చూపించాడు. ఇంగ్లీషులో –

"వచ్చే ఆదివారం మా నాన్ననీ, తాతనీ కూడా ఇక్కడికి తీసుకొస్తాను. వాళ్లకీ ఫిషింగ్ అంటే మహా సరదా," అన్నాడు.

నూకరాజుకి అర్థం అయిందిగానీ జవాబు చెప్పలేకపోయాడు. ఎల్లమ్మ,

"పిక్నిక్ లాగా అందరం వద్దాం," అన్నది.

"భలే భలే! గొప్ప ఆలోచన!" అన్నాడు డారల్.

పడవ ప్రయాణికులతో నిండిపోయింది; ఎక్కువ మంది జంటలే. 'ఇక బయల్దేరు' అని అంతా పడవ నడిపే అతన్ని తొందరపెట్ట సాగారు.

"సిటం ఆగాల. ఓడ లోపలికొస్తంది," అన్నాడతడు, తీరుబడిగా బీడీ వెలిగించి.

"నీకెలా తెలుసు?" అన్నారెవరో.

"అదిగో, జెండా ఏసారు కాదా? టగ్గులు బయలెల్లాయి, ఓడని తేనందుకు," అంటూ రాస్ కొండ చివర్న ఛానెల్‌కి ఆనుకొని ఉన్న పోర్టు కంట్రోలు రూము పైన ఎగురుతూన్న జెండాని చూపించాడు.

డారల్ దానికేసి చూసి, "హి యీజ్ రైట్. షిప్ ఇన్ ఛానెల్ ఫ్లాగ్," అన్నాడు.

మరికాసేపట్లో, ఒక టగ్ బోటు ముందు లాగుతూ, మరోటి వెనక వేగాన్ని నియంత్రిస్తూ – ఒక పెద్ద ఓడని లోపలికి తీసుకొచ్చాయి. 'జగ్ సేవక్, బోంబే' అని తెల్లటి అక్షరాలతో ఆ ఓడపైన వ్రాసి ఉంది.

"జనరల్ కార్గో షిప్, గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ వాళ్లది," అని వివరించాడు, డారల్.

'మీ నాన్న దీనికి పైలట్‌గా ఉన్నాడా?' అని డారల్‌ని అడుగుదామని నూకరాజు అనుకున్నాడు గానీ ఇంగ్లీషులో ఎలా అడగాలో తెలియక ఊరుకున్నాడు.

ఎన్నాళ్ల తరవాత ఒడ్డు చేరుకున్నారో గాని – ఆ ఓడలోని నావికులు డెక్ మీద నిల్చొని పరిసరాలను ఆప్యాయంగా చూస్తున్నారు. పడవలో కూర్చున్నవాళ్లు కొంతమంది చేతులూపారు. ఓడలో ఉన్నవాళ్లు సమాధానంగా తమ చేతులను ఊపారు; ఈలలు వేసారు. పడవలోని కుర్రకారు కూడా ఈల వేశారు. యారాడ, రాస్ కొండల మధ్య ఉన్న ఛానెల్ ఆ ధ్వనులతో మార్మోగింది.

పడవ బయల్దేరాక వెంకటేశు చెప్పాడు – టౌను హాలు దగ్గర చేపలు పడలేదట. ఇళ్లకి వెళ్లి, భోజనం చేసి లోవతోట జెట్టీకి వచ్చామన్నాడు.

"ట్యూషన్‌కి వెళ్తున్నామని అమ్మతో చెప్పాను," అన్నది ఎల్లమ్మ అన్నతో.

"అనుకున్నాను," అని ఊరుకున్నాడు, వెంకటేశు నర్మగర్భంగా.

అన్నా చెల్లెళ్ల సఖ్యత నూకరాజుకి ముచ్చటగొలిపింది.

పడవ అవతలి ఒడ్డుకు చేరుకుంది. వెంకటేశు తాను పట్టిన చేపల్నికూడా డారల్‌కి ఇచ్చేశాడు. డారల్ పొంగిపోయాడు.

"అన్నీ నేనే పట్టానని మా అమ్మకీ, డెబొరాకీ చెబుతాను," అన్నాడు.

డారల్ చాలా అల్పసంతోషిలాగా, ఒట్టి అమాయకుడిలాగా కనిపించాడు నూకరాజు కళ్లకి.

"సైకిల్?" అన్నాడు నూకరాజు, డారల్ తో – మొదటిసారిగా మాటకలుపుతూ.

"మా ఇంట్లో వదిలేసాను – లోవతోటకి బయల్దేరేటప్పుడు," అన్నాడు డారల్. వినగా వినగా ఇంగ్లీషు బాగానే బోధపడుతుంది, అనుకున్నాడు నూకరాజు.

పడవ దిగాక, డారల్ తమ బంగళా వైపుగా మళ్లేటప్పుడు డారల్, అందరికీ బై బైలు చెప్పాడు.

నూకరాజుని ఉద్దేశించి, "బై, బై, రాజూ!" అన్నాడు.

ఆ పిలుపు నూకరాజుకి నచ్చింది. తన పాతకాలపు పేరుపట్ల అతనికి కొంత అసంతృప్తి ఉన్నది. అనకాపల్లి నూకాలమ్మతల్లికి మొక్కుగా పెట్టిన పేరు కాబట్టి ఏమీ అనలేకపోయాడు. డారల్ దాన్ని 'రాజు'గా కుదించడం బాగుందని అనిపించింది.

"బై, డారల్," అని అంతా అన్నాక అతడు తన దారిన తాను వెళ్లిపోయాడు.

"ఈ దొరలకీ మనకీ ఒక విషయంలో దగ్గర పోలిక ఉంది. అదేమిటంటే, చేపలు పట్టడం. డారల్‌తో స్నేహం చేశాక నాకు తెలిసింది. అయితే అది మనకి వృత్తి, వాళ్లకి సరదా," అన్నాడు వెంకటేశు, సాలోచనగా.

"అంతేకాదు, మనవాళ్లు గోచీ పెట్టుకొని, సముద్రం లోపలికి వెళ్లి వలవేసి చేపలు పడతారు; దొరలు టోపీ పెట్టుకొని, ఒడ్డున కూర్చొని గేలాలు పట్టుకుంటారు," అన్నాడు నూకరాజు.

"అవునవును. చేపలు పడకపోయినా దొరలకి చింతలేదు. బీర్లు తాగి ఇళ్లకి పోతారు. చేపలు లేకపోతే గనక మనకి పూట గడవదు" అన్నాడు వెంకటేశు.

ముగ్గురూ ఎలాంటి అరమరికలు లేకుండా నవ్వుకున్నారు.

* * *

ఆరోజు రాత్రి నూకరాజుకి నిద్రపట్టలేదు. అర్ధరాత్రప్పుడు లేచి సముద్రపొడ్డుకి వెళ్లి కూర్చున్నాడు. పోటు ఎక్కువగా ఉంది. దూరంగా తవ్వోడ 'విశాఖ', హార్బరు ముందు ప్రవాహం మూలంగా మేట వేసే ఇసుకని తొలగించి దారి చేస్తూ... లంగరు దించిన ఓడల దీపాలు నీటిపై పేర్చిన కాంతి రేఖలు - తిరగబడ్డ ఆశ్చర్యార్థకాల్లా. అక్కడక్కడా జాలరుల గుడ్డి దీపాల పడవలు. పైన చంద్రుడి చుట్టూ వలయాకారంలో గుడి. దక్షిణపు గాలి బలంగా వీస్తోంది. నీను వాసన. 'సముద్రం ఈనింది. ఇప్పుడు గనక పడవని దక్షిణం వైపుగా బారుచేస్తే చేపలు బాగా పడతాయి' అనుకున్నాడు. ఈ విషయాలు బోధించిన జ్ఞానులు నాన్న, గంగరాజు మావ జ్ఞాపకం వచ్చారు. అతన్ని

దుఃఖం ఆవహించింది. కన్నీళ్లు ధారలు కట్టాయి. అలా చాలాసేపు ఉండిపోయాడు. గంగరాజు మావ ఏదో చెబుతున్నాడని అతనికి తోచి, గగుర్పాటు కలిగింది. కెరటాల ఘోష అతనికి ఉపశమనం కలగజేసింది. ఇన్నాళ్లూ దిక్కుతోచని చీకటిలో, ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఆనాటి సాయంత్రం ఎల్లమ్మ అన్న మాటల్లో అతనికొక చిన్న ఆధారం దొరికింది.

'చదువుకోవాలి. ఆ చదివేదేదో పెద్ద చదువే చదవాలి. ఏదో పనికొచ్చే పని చెయ్యాలి. ఎల్లమ్మ తోడుంటే ఇంక భయం దేనికి?' అనుకున్నాడు.

నూకరాజు లేచి నిలబడ్డాడు. ఈరోజున తానొక సరియైన నిర్ణయం తీసుకున్నాడు. 'ఇక దాన్ని అమలుచెయ్యాలి. ఏది ఏమైనా సరే'. యారాడ కొండమీద లైట్ హౌసు తన కాంతి పుంజాన్ని ప్రసరించింది. అతనిలో ఒక ఆశాభావం మొలకెత్తింది. ఇంటివైపు నడిచాడు. అడుగులు ఉత్సాహంగా పడుతున్నాయి. అతనిలో ఒక సుస్థిరమైన సంకల్పం ఏర్పడింది.

మెరీనా హోటల్లో ఆనాటి కేబరే డాన్సు అయిపోయినట్టుంది. బయట అంతవరకూ ఓపిగ్గా కాపుకాసిన రిక్షావాళ్లు బాగా పొద్దుపోయాక విశాఖనగరం అందించగల ఆనందాలను పరిచయం చెయ్యడానికని తప్పతాగి ఉన్న ఓడ దొరల్ని కూర్చోబెట్టుకొని ఉత్సాహంగా బయల్దేరుతున్నారు.

ఆ రాత్రి నూకరాజుకి మంచి నిద్రపట్టింది. మరో వారం రోజుల్లో నూకరాజు ద్వారకా నగర్ వీ.టీ. కాలేజిలో ఆంధ్రా మెట్రిక్యులేషన్ కోచింగ్ క్లాసులో జాయిన్ అయ్యాడు. ఇన్నాళ్లూ తాను చెయ్యలేకపోయిన పనిని, మేనకోడలు అవలీలగా సాధించినందుకు పోలమ్మ మురిసిపోయింది.



తలోదారి

జాలరుల సమాజంలో స్త్రీ, పురుషులకు నిర్దిష్టమైన స్థానాలూ, పాత్రలూ ఉన్నాయి. వారి మధ్య శ్రమ విభజన స్పష్టంగా నిర్వచించబడింది. జాలరులు వేటకి బయలుదేరేటప్పుడు ఆడవాళ్లు వెంటరాకూడదనీ, పడవని తాకకూడదనీ వాళ్లల్లో ఒక ఆచారం ఉన్నది. తమ స్త్రీలమీది మమకారం వాళ్ల దృష్టిని మరల్చకుండా, అందుమూలంగా పురుషులు మనసు మార్చుకొని వేట మానుకోకుండా ఉండేందుకని బహుశా పూర్వీకులు ఈ విశ్వాసాన్ని కల్పించి ఉండవచ్చు. 'జమీల' సంఘటనలో గంగరాజు మరణించాక, ఆ ప్రమాదానికి మూల కారణం, 'ఆడా-మొగా కాని' అప్పల్రాజు అతని పడవలో ఉండడమేనేమో అనే శంక జాలరిపేటలో అందరిలోనూ కలిగింది.

ఒకరోజున సింహాచలం తన గ్యాంగుతో బాటుగా మందుమీదున్నప్పుడు ఈ విషయం చర్చకు వచ్చింది. 'ఈ ఆడారోడిని నీ పడవెక్కించకు బావా అంటే నా మాటిన్నాడు కాదు, గంగ్రాజు,' అని తన బిగినీసు మిత్రులతో అనేశాడు.

'మరయితే గంగ్రాజు అంతకుముందు కూడా చాలాసార్లు అప్పల్రాజుని ఎంటేసుకొని ఏటకెల్లాడు కదా?' వారిలో కొందరు సందేహం వెలిబుచ్చారు.

'దేనికైనా టైము రావాలి కదరా? ఆ గంగమ్మ తల్లి కూడా నూరో తప్పు చేసీవరకూ పల్లకుంటది. అప్పుడు సూపిత్తది, తడాఖా' అని తన శిష్యులకు జ్ఞానబోధ చేశాడు సింహాచలం.

అడపాదడపా అప్పల్రాజుని తమ పడవమీద వేటకు తీసుకెళ్లిన జాలరులు కూడా ముఖం చాటెయ్యడం మొదలుపెట్టారు. పనిలేక, ఆదాయంలేక అప్పల్రాజు విలవిలలాడిపోయాడు. ఓడ కంపెనీ వాళ్లిచ్చిన ఏభైవేలూ వడ్డీకి తిప్పుదామా అనుకున్నాడు. అతనికా లెక్కలూ, డొక్కలూ బొత్తిగా చేతకావు. పెళ్లాం ఉంటే చూసుకొనేదేమో. అతనికా భాగ్యం లేదు. అతనిది ముక్కుపిండి వడ్డీలు వసూలు చెయ్యగల స్వభావం కాదు. మొండి బకాయిదార్లని నడి రోడ్డు మీద నిలదియ్యడానికి

నోరు లేదు. అతనికి ఏం చెయ్యాలో తోచలేదు. కొన్నాళ్లు పిచ్చిగా సినీమాలు చూశాడు. విసుగొచ్చింది.

తల్లి మొత్తుకుంటున్నా వినకుండా సింహాచలాన్ని కలుసుకొని బిగినీసులో డబ్బు మదుపు పెడతానని తెలియజేశాడు. సింహాచలం ఎగిరి గంతేశాడు. 'నీకొక్కడికే బాగుపడీ యోగం ఉందిరా' అని పొగిడాడు. బ్యాంకులో వేస్తే వచ్చే వడ్డీకన్నా నాలుగు రెట్లు వస్తుందని నమ్మబలికాడు. నెలయ్యేసరికి లాభాల్లో వాటా ముట్టే ఏర్పాటు చేస్తాను అన్నాడు; మొదట కొన్నాళ్లు టంచనుగా ఇచ్చాడు కూడా. తనకు ఇకమీదట నిలకడగా ఆదాయం వస్తుందని అప్పల్రాజు మురిసిపోయాడు.

అప్పటికే కన్నబాబుని చేరదీసిన సింహాచలం, అప్పల్రాజుని కూడా తన బిగినీసు గ్యాంగులో కలుపుకున్నాడు. మందు పార్టీలకి రమ్మనేవాడు. కానీ అప్పల్రాజుకి నలుగురితో కలివిడిగా తిరగడం ఇష్టంలేదు – ముఖ్యంగా మొగవాళ్లతో. ఎవడో ఏదో అంటాడు. అంతా కలిసి అతన్ని వేధిస్తారు. మందు తాగారంటే ఇంక ఈ మొగాళ్లకి అడ్డూఆపూ ఉండవు. అప్పల్రాజు మనసుకి కష్టం కలిగించే మాటలంటారు; మోటు హాస్యాలాడతారు; విసిగిస్తారు. ఆడవాళ్లతోనూ, నాటకాల ట్రూపులతోనూ ఉన్నప్పుడే అప్పల్రాజుకి సాంత్వనగా ఉంటుంది. వాళ్లయితే అతని మనసు కనిపెట్టి సౌమ్యంగా మాట్లాడతారు. నొప్పించే విధంగా నడుచుకోరు.

మొదట్లో నెల తిరగ్గానే డబ్బు చేతిలో పెట్టిన సింహాచలం, ఆరు నెలలు కాగానే అదుగో, ఇదిగో అంటున్నాడు. వ్యాపారంలో నష్టం వచ్చిందంటున్నాడు. మొత్తం కలిపి వచ్చే నెలలో ఇచ్చేస్తానంటున్నాడు. 'అయినా పెళ్లీ పెటాకులూ లేని వాడివి, నీకేం ఖర్చులుంటాయిరా?' అన్నాడు. చివరికి ఒక రోజున,

"నువ్వు పెట్టినదానికన్నా ఎక్కువే ఇచ్చాను కదరా? ఇంకా ఎక్కడినుంచి తేను? చెల్లయిపోయింది," అనేశాడు.

'తమాషాగా ఉందా? ఊరి పెద్దోల్లకి సెపుతాను' అని అప్పల్రాజు ఉక్రోషంగా అన్నప్పుడు,

"నీ దిక్కున్నోడికి చెప్పుకోరా, ఆడారెదవా!" అని సింహాచలం అతడిని తగిలేశాడు.

ఆ రోజున మొహం వ్రేలాడేసుకొని ఇంటికెళితే, అప్పల్రాజు తల్లి అతడిని నిలదీసి వివరాలు రాబట్టింది; అప్పల్రాజు ఏడ్చుకుంటూ జరిగినదంతా చెప్పాడు. అతని తల్లి కోపంతో ఊగిపోయింది. 'ఇప్పుడే ఎల్లి ఆ సిమ్మాచెలంగాడి తాట తీస్తాను' అంది. నిజానికి ఆమె జబ్బు మనిషి. లేస్తే కూచోలేదు. కూచుంటే లేవలేదు.

"ఇప్పుడాడు ఇంటికాడ లేడులెయ్యే. అయినా రేపొద్దున్నే ఎల్లి మన పెద్దోల్లకి చెబుదాం" అని తల్లి జోరుకి అడ్డుపడ్డాడు అప్పల్రాజు.

మర్నాడు గ్రామపెద్దలకి ఫిర్యాదు చేస్తే, కాయితాలు చూపించమన్నారు. పోనీ ఒప్పందం జరిగినట్టుగా సాక్ష్యం చెప్పగల మధ్యవర్తులెవరైనా ఉన్నారా అని అడిగారు. లేకపోతే మేమేమీ చెయ్యలేం అనేశారు. నిజానికి ఆ పెద్దలంతా సింహాచలం మందు పోయిస్తే తాగేవాళ్లే; అతని చెప్పుచేతలలో ఉండే వాళ్లే.

* * *

అప్పల్రాజు ఒక రోజున ఎల్లమ్మ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో గంగమ్మ చేపల మార్కెట్టులో ఉంది.

"ఏటన్నయ్యా, ఇలగొచ్చేవు?" అంది ఎల్లమ్మ. సాటి జాలరులతో ఒకలాగా, పైవాళ్లతో మరో విధంగానూ మాట్లాడే లౌక్యాన్ని ఆమె అలవరచుకుంది.

అప్పల్రాజు తన తండ్రి పడవ మీద వేటకి వెళ్లేవాడని ఎల్లమ్మకి తెలుసు. అంతే తప్ప అతనితో ఆమెకు పెద్ద స్నేహం లేదు.

అప్పల్రాజు, "నీతో మాట్లాడాలి," అంటూ, చెప్పులు గుమ్మం బయటే విప్పి, లోపలికి వచ్చి, ముందు గదిలో ఉన్న గంగరాజు ఫొటోకి దండం పెట్టుకొని, లెంపలేసుకున్నాడు.

"కూచో, టీ చేస్తాను," అంది ఎల్లమ్మ.

"ఏం వొద్దులేగానీ, మంచినీళ్లియ్యి" నీళ్ల గ్లాసందుకొని, గటగటా తాగి,

"నీ దగ్గర మంచి డ్రెస్సులున్నాయి కదా, నాకు కొన్ని కావాల. మళ్లీ ఇచ్చేస్తాన్లే" అన్నాడు.

"ఆడోల్ల డ్రెస్సులు నీకెందుకు?" అంది ఎల్లమ్మ కొంచెం అనుమానంగా.

"నాటకంల ఏసం కట్టనందుకు" అన్నాడు అప్పల్రాజు సిగ్గుపడుతూ.

"సరే, లోపలికి రా" అని తన గదిలోకి తీసుకెళ్లి తన పరికిణీ, ఓణీలనీ, చీరల్నీ, గౌన్లనీ చూపించింది.

అప్పల్రాజు వాటినన్నింటినీ చూసి ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఆ బట్టల్లోనూ, ఎల్లమ్మ వద్దనున్న లిప్‌స్టిక్‌లలోనూ, పర్ఫ్యూంలలోనూ కూడా చాలా ఆసక్తిని కనబరిచాడు. అతని ఉత్సాహం చూస్తూంటే ఎల్లమ్మకి నవ్వొచ్చింది.

"నీకు నచ్చినవి తీసుకెళ్లు," అంది ఎల్లమ్మ.

ఏమేమి తీసుకెళ్లాలో తేల్చుకోలేక మిఠాయి దుకాణంలో దూరిన చిన్న పిల్లవాడిలా తత్తరబిత్తర అయిపోయాడు అప్పల్రాజు.

చివరికి కొన్నింటిని ఎంచుకున్నాడు. అక్కడ ఉన్న ఒక పర్ఫ్యూం బాటిల్ మూత తీసి కాస్త మణికట్టుమీద స్ప్రే చేసి ఆ పరిమళాన్ని తనివితీరా ఆస్వాదించాడు. అతని ఆసక్తిని గమనించిన ఎల్లమ్మ -

"అది 'ఈవినింగ్ ఇన్ పారిస్'. ఈ మధ్య మార్కెట్లో దొరకడం లేదు. కావాలంటే తీసుకెళ్లు. దాంట్లో ఎక్కువ లేదులే. అయినా నా దగ్గర మరోటి ఉంది," అంది.

ఒక లిప్‌స్టిక్ కూడా తీసుకున్నాడు.

"ఎప్పుడు నాటకం?" అంది ఎల్లమ్మ.

"ఇప్పుడే కాదులే. ఇంకా సెలక్సన్లు అవుతున్నాయి. ఇది నేను మునుపు ఏసిన నాటకమే. డవిలాగులన్నీ మనకి కంటతే," అన్నాడు అప్పల్రాజు, హుషారుగా నవ్వుతూ .

స్వరంలో ధ్వనించిన ఉత్సాహం, ఆత్మవిశ్వాసం ఎల్లమ్మకు ముచ్చటగొలిపాయి.

మరో నాలుగురోజుల తరవాత ముఖం వేలాడేసుకొని వచ్చి తాను తీసుకెళ్లిన బట్టలన్నీ తిరిగి ఇచ్చేశాడు.

"ఏటైంది అప్పల్రాజూ?" అడిగింది.

"మనకి రానేదు. ఆడేసాలకి లేడీసొచ్చేత్తంటే ఇంక మన దిక్కెవరు సూత్తారు?" అన్నాడు నిరాశగా.

అప్పల్రాజు చాలా నిస్పృహ చెంది ఉన్నాడని ఎల్లమ్మ గ్రహించింది.

"పోన్లే అన్నయ్యా, ఇదికాపోతే మరో చాన్సు ఒస్తాది"

"మనకింక ఓపు లేవే. ఆ డైరెక్రు మొకమ్మీదే అనీసేడు. నా ఏసం పరవాలేదట గానీ, గొంతుక బాలేదట. మొగ్గొంతుకన్నాడు".

ఎల్లమ్మకి అతడిని ఏ విధంగా సముదాయించాలో తోచలేదు.

"పోనీ మొగేసాలు ఎయ్యొచ్చు కదా?"

"నేనుగాని మొగేసం ఏసానంటే టేజీమీన సెప్పులు పడతాయి. నేను నాటకాలేసీదే ఆడేసం కట్టేటందుకు." ఎల్లమ్మకి కొంచెం అర్థం అయింది. "టీ చేస్తానుండు," అని లోపలికి వెళ్లింది.

వంటింట్లోకి వెళ్లి, గబగబా టీ చేసి తీసుకొచ్చింది ఎల్లమ్మ.

అప్పల్రాజు కుర్చీలో కూలబడి వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

టీ కప్పు అందించి, "ఊరుకో, ఊరుకో" అంది.

అప్పల్రాజు ఏడుపు ఆపాడు. అతని కళ్లు ఎర్రబారాయి. టీ చప్పరిస్తూ లేచి నిలబడ్డాడు. గంగరాజు ఫొటో వైపు తదేకంగా చూశాడు.

అతనికి మళ్లీ ఏడుపు ముంచుకొచ్చింది. టీ కప్పు కింద పెట్టి, రెండు చేతుల్లోనూ మొహం దాచుకొని ఏడ్చేశాడు.

"అదేటి అప్పల్రాజూ, దీనికే ఇంత ఇదైపోతే ఎలాగ?" అంది ఎల్లమ్మ.

"నీకు తెల్దే, ఎల్లమ్మా. మీ నాన్న పోయినకాడినుంచి నాకు దరిద్దరం పట్టుకుంది. నా దిక్కు సూసీవోడు లేడు. ఒరే అప్పల్రాజూ, ఎలగున్నావు, ఏటి సేత్తన్నావని అడిగినోడు లేడు. పత్తీ వోడూ కమ్మ కట్టీవోడే. ఏట కెల్దామంటే ఎంట తీసికెల్లీవోల్లు లేరు. నెలనెలా వడ్డీ ఇస్తాననీసి మాయమాటల్చెప్పి ఆ సిమ్మాచలం గాడు ఏబైవేలూ దెంకుపోయాడు. యాపారాలూ, యవ్వారాలూ చెయడమంటే నాకు వల్లకాదు. మా యమ్మ సూత్తే నామీద బెంగతోని జబ్బెపోయింది. ఏవైనంటే పెల్లి చేసుకోరా అంటాది. నాకెవడిస్తాడే పిల్లని, అంటే ఇనిపించుకోదు. పోనీ నాటకాలూ, ఏసాలూ ఏసి ఒక్క రవ్వ సంబాలించుకుందావనీసరికి ఆ చాన్సులు ఒక్కటయినా కలిసిరావట్లేదు. ఈ పుర్రాకులింక పడలేనే."

ఎల్లమ్మ అతని దగ్గరకు వెళ్లి పక్కనే కూర్చొని, భుజం మీద చెయ్యి వేసి,

"ఏం ఫరవాలేదు అప్పల్రాజూ, మేవంతా ఉన్నాం కాదా? అయినా సిమ్మాచలం మావ నీకు వడ్డీ ఇవ్వకంట ఎలా ఎగేస్తాడు? పెద్దోల్లతోని మాట్టాడించుదాం," అంది.

అప్పల్రాజు కొంత తేరుకున్నట్టుగా కనిపించాడు. లేచి వెళిపోతూ,

"ఆరోజున మీ నాన్న బతికిపోయి, నేనుగాని పోయుంటే శని ఇరగడ్తైపోనే. మీ నాన్నలాటోడుంటే ఊరికి ఉపకారం గానీ నాలాటోడున్నా లేపోయినా ఒకటేనే," అన్నాడు.

* * *

ఆరోజున పొద్దున్నే లేచిన నూకరాజు, తల్లి ఇంట్లో లేదని గమనించాడు. స్వయంగా టీ చేసుకొని తాగుతూంటే పోలమ్మ వచ్చి ఏడుస్తూ ఒక చావు కబురు చెప్పింది. ఆడారి అప్పల్రాజు ఊరి మధ్యన ఉన్న మర్రిచెట్టుకి ఉరిపోసుకొని చనిపోయాడు.

"ఒద్దురా! అటేపెల్లకురా! ఒరే బాబూ, నువ్వు సూడలేవురా!" అని తల్లి మొత్తుకుంటున్నా వినిపించుకోకుండా అటుగా పరుగెత్తాడు నూకరాజు.

అక్కడికి చేరుకోగానే తల్లి ఎందుకని అతడిని వారించిందో అర్థం అయింది. అప్పటికే శవాన్ని క్రిందికి దించి, చెట్టు చుట్టూతా ఉన్న చప్టా మీద పెట్టారు. అప్పల్రాజు చీర కట్టుకొని, పసుపు రాసుకొని, తలలో పువ్వులు పెట్టుకొని నిశ్చేతనంగా చెట్టుకింద ఉన్నాడు. అతని మొహంలో ఎన్నడూ చూడని ప్రశాంతత నెలకొని ఉన్నది. పురుషుడి శరీరంలో బందీగా, నిత్యం నరకం అనుభవిస్తూ ముప్పై అయిదేళ్లు గడిపిన స్త్రీ నేడు విముక్తి పొందింది. పక్కనే అతని తల్లి గుండెలు పగిలేలా ఏడుస్తున్నది.

మరికాసేపట్లో వెంకటేశు, ఎల్లమ్మ అక్కడికి చేరుకున్నారు. తమ తండ్రి సహచరుడి శవాన్ని చూస్తూ ఒకరి చేతులు ఒకరు పట్టుకున్నారు. నూకరాజు వెళ్లి ఎల్లమ్మ సరసన నిల్చున్నాడు. ఎల్లమ్మ తన అన్న చేతినీ, బావ చేతినీ విడిపించుకొని నెమ్మదిగా ముందుకెళ్లింది. చప్టాను చేరుకొని క్రిందకి వంగి అప్పల్రాజు నుదిటిమీద ఒక ముద్దుపెట్టింది – 'ముట్టుకోకు, ముట్టుకోకు' అని కొందరు అరుస్తున్నా వినిపించుకోకుండా. అప్పల్రాజు పూసుకున్న 'ఈవినింగ్ ఇన్ పారిస్' సుగంధం ఎల్లమ్మను చుట్టుముట్టింది.

ముగ్గురూ మౌనంగా తమ ఇళ్ల వైపుగా నడుస్తున్నారు.

ఎల్లమ్మ మనసంతా ఆలోచనలతో గజిబిజిగా అయిపోయింది. ఆ విధంగా అప్పల్రాజు తన జీవితాన్ని చేజేతులా ముగించడం, అతన్ని ఒంటరిని చేసి, వెంటాడి, వేధించిన సమాజపు కట్టుబాట్లకు విరుద్ధంగా అతడు బహిరంగంగా ప్రకటించిన తొలి ధిక్కారం; ఒక సున్నిత మనస్కుడి చివరి ప్రతిఘటన అని ఆమెకు అనిపించింది. అయినప్పటికీ అతని పట్ల అమానుషంగా ప్రవర్తించినందుకు సిగ్గుతో తల దించుకున్నవాళ్ళుగానీ, పశ్చాత్తాపం ప్రకటించి, తమని క్షమించమని కోరినవాళ్లుగానీ ఎవరూ లేరు. బిగ్గరగా అరిచి, అందరికీ ఇవన్నీ చెప్పాలని ఎల్లమ్మకి బలంగా అనిపించింది గానీ, దుఃఖంతో నోరు పెగలలేదు.

"గంగరాజు మావ పోయాక అటు ఏటకీ ఎల్లలేక, ఇటు ఇంటి కాడ పోరూ పడలేక పేనం తీసీసుకున్నాడు," అన్నాడు నూకరాజు - వెంకటేశు, ఎల్లమ్మలతో.

అంతవరకూ మౌనం పాటించిన వెంకటేశు,

"అవును. మా నాన్న పోవడంతోటి ఊల్లో చాలామంది నష్టపోయారు. చెడ్డోల్లు పోతే ఈడి పీడ ఇరగడైపోయిందిరా బాబూ అనీసి నాలుగు రోజులు కాగాన మర్చిపోతారు. అదేగాని మంచోల్లు పోయారనుకో – చాలామంది చాలా రకాలుగా నానా బాధలూ అనుభవిస్తారు. మరీ దగ్గరోల్లయితే తట్టుకోలేక లోపల్లోపల కుశించిపోతారు," అన్నాడు.

ఎల్లమ్మా, నూకరాజూ అతని వంక ఆశ్చర్యంగా చూశారు.

అప్పల్రాజుని అమ్మవారు పూనిందనీ, అతన్ని బలి తీసుకుందనీ ఊరి పెద్దలు భావించారు. అతని దహన సంస్కారాలు చెయ్యడానికి భయపడ్డారు. చీర ఉంచాలా, తీసెయ్యాలా అని చాలాసేపు తర్జనభర్జనలు పడ్డారు. ఇటువంటి సమస్యను గతంలో వాళ్లెన్నడూ ఎదుర్కోలేదు. పూజారి పంతుల్ని సంప్రదిస్తే ఇదంతా తనకు సంబంధంలేని వ్యవహారం అని తప్పుకున్నాడు. చివరికి భూతవైద్యుడిని పిలిపించి శాంతి చేయించాలని తీర్మానించారు. 'విప్పితే అమ్మవారికి కోపం వస్తుంది' అని భూతవైద్యుడు స్పష్టంగా చెప్పడం వల్ల చీరతోనే దహనం చెయ్యాలని నిశ్చయించారు.

అతని శరీరాన్ని తాకాల్సిన పని లేకుండానే ఆ తంతు ముగిసినందుకు పెద్దలూ, దగ్గర బంధువులూ లోలోపలే సంతోషించారు.

అప్పల్రాజు ఇంటికి వచ్చినప్పుడు ఇంకాస్త బాగా మాట్లాడి అతనికి ధైర్యం కలిగించి ఉండాల్సిందని ఎల్లమ్మకి అనిపించింది. ఆ మేరకు విఫలం అయ్యాననీ, అప్పల్రాజు చావుకి తాను కూడా ఏదోవిధంగా కారణం అయ్యాననే నేరభావం ఆమెను చాలాకాలం పాటు కృంగదీసింది.

ఏ సందర్భంలోనైనా, ముఖ్యంగా మనుష్యుల విషయాల్లో జోక్యం అవసరం అనిపిస్తే వెంటనే కలగజేసుకోవాలనీ, తాత్సారం చెయ్యకూడదనీ ఆమె ఒక బలమైన నిర్ణయం తీసుకుంది. ఆవిధంగా ఆమె తనను తాను సమాధానపరచుకుంది.

చాలారోజుల తరవాత నూకరాజుకీ, ఎల్లమ్మకీ మధ్య అప్పల్రాజు ప్రసక్తి వచ్చినప్పుడు నూకరాజు,

"మన జాలారుల్లో మొగవాళ్లకన్నా ఆడవాళ్లదే అన్నింటిలోనూ పైచేయి. కానీ విచిత్రం ఏమిటంటే, అప్పల్రాజు ఆడతనాన్ని మనవాళ్లెవరూ అమోదించలేదు. పైగా హేళన చేసారు" అన్నాడు.

"ఎందుచేతంటావు?" అడిగింది ఎల్లమ్మ.

"అప్పల్రాజు తనని ఆడదానిగా ఊహించుకున్నాడుగానీ జాలరి స్త్రీగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. ఇంకా జాలారి మొగవాడుగా చేపలు పట్టగలిగాడు గానీ, మన ఆడవాళ్లల్లాగా బజారుకెళ్లి చేపలు అమ్మే చాకచక్యం ఏనాడూ సంపాదించలేదు"

"నిజమే. అతని తల్లి మా నాన్నని బతిమాలి, అప్పల్రాజుని వేటకి పంపించింది గానీ, ఒక్క రోజు కూడా తనతో బాటుగా బజారుకి తీసుకెళ్లలేదు. అదే ఆమె చేసిన పొరబాటు," అన్నది ఎల్లమ్మ.

"ఆమెని అని ప్రయోజనం లేదు. బాగా చదువుకున్న వాళ్లకే ఆ ఆలోచన ఇంకా రాలేదు. సమాజం విధించే పరిమితులను దాటి ఆలోచించే వాళ్లు చాలా తక్కువమంది ఉంటారు. దానికి చదువుతో నిమిత్తం లేదు."

ఎల్లమ్మ మనసులో నూకరాజు మాటలు బాగా నాటుకుపోయాయి. ఒక మంచి పని చెయ్యాలని అనుకున్నప్పుడు ఎవరేమన్నా సరే పట్టించుకోకూడదని ఆమె నిశ్చయించుకుంది.

* * *

తెలుగు చదవడానికి కష్టపడే కన్నబాబు, పోస్టాఫీసు వద్దనున్న బడ్డీ కొట్లో ఇంగ్లీషు పేపరు కొనడం చూసిన నూకరాజు ఆశ్చర్యపోయాడు.

"ఏం కన్నా! ఇంగ్లీషు పేపరు చదువుతున్నావా?" అని అడిగాడు.

"దీంట్లో బ్రాకెట్టు నెంబర్లుంటాయి," అన్నాడు కన్నబాబు, కొంచెం సిగ్గుపడుతూ.

"ఏదీ, చూపించు,"

"ఇక్కడ కాదు, నాజ్ హౌటేల్లో కూర్చుందాం. నీకు నేర్పిస్తాను." నాజ్ రెస్టారెంటులో ఆరుగురు కాబూలీవాలాలు ఒకే టేబిల్ చుట్టూ కూర్చొని టీ తాగుతూ బిగ్గరగా మాట్లాడుకుంటున్నారు. నేపథ్యంలో రేడియో సిలోన్ మోగుతోంది. అవధ్ రాజ్యపు ఆఖరి నవాబు – వజీద్ అలీ షా రచించిన గీతాన్ని కే.ఎల్. సైగల్ తన విషాద స్వరంతో పాడుతున్నాడు – 'బాబుల్ మొరా...నైహర్ ఛూటో హి జాయ్...'.

"ఇక్కడ ఒద్దులే. మేడమీదకి పోదాం," అన్నాడు కన్నబాబు.

మేడమీద ఖాళీగా ఉంది. కూర్చున్నాక కన్నబాబు జేబులోంచి ఒక చిన్న పుస్తకం తీసాడు.

దాని మడతల్ని విప్పితే పెద్ద కాగితంగా విచ్చుకుంది. దాని నిండా రెండంకెల సంఖ్యలు అనేకం పట్టికల్లో ఉన్నాయి.

"ఇవన్నీ కిందటి నెలలో ఒచ్చిన నెంబర్లు. అవన్నీ జాగ్రత్తగా చూస్తే ఇక మీదట రాబోయేవి మనకి తెలిసిపోతాయి. రెండు నెంబర్లూ మనం కట్టినట్టే వచ్చాయనుకో, పది రెట్లు ఇస్తారు; ఏ ఒక్కటి వచ్చినా ఐదు రెట్లు. బాగుంది కదా? ఒక్కరోజులో పది రెట్లు! ఏ బాంకువాడిస్తాడు? ఏ బిగినీసులో మాత్రం వస్తుంది?"

"వచ్చిన నెంబర్లు అంటున్నావు. ఎక్కడినుంచి వస్తాయి?"

"విజయవాడ నుంచి. అర్ధరాత్రి ఫోనొస్తుంది. మొదట ఓపెనింగు, తరవాత క్లోజింగు."

"విజయవాడకి ఎక్కడి నుండి వస్తాయి?" నూకరాజులో కుతూహలం పెరిగిపోయింది.

"బొంబాయి నుంచి. ఇప్పుడు నేను పేపరు కొన్నాను చూశావా? ఆ బడ్డీ వోడు పలక మీద ఒక నెంబరు రాసి ఏలాడగట్టాడు."

"నేను గమనించలేదు."

"అది నిన్నటి నెంబరు. నిన్నగానీ దానిమీద ఎవరైనా కట్టి ఉంటే పది రెట్లు గెల్చుకునే వాళ్లు."

"నువ్వు నిన్న దేనిమీద ఆడావు?"

"నేను ఆడింది రాలేదులే."

"ఎందుకని?"

"గడి ఒదిలీసి ఆపోజిట్టు కొట్టీసాడు."

"ఆపోజిట్టంటే?"

"ఏ నెంబరుకైనా ఐదు కలిపితే ఆపోజిట్టు ఒస్తది. ఇప్పుడు మూడుందనుకో. దానికి ఐదు కలిపితే?"

"ఎనిమిది."

"ఎనిమిదికి ఐదు కలిపితే?"

"పదమూడు."

"మల్లా మూడొచ్చీసింది కదా? అంటే మూడూ ఎనిమిదీ ఆపోజిట్లన్నమాట," అన్నాడు, కన్నబాబు గొప్ప రహస్యం చెబుతున్నట్లు.

"మరి ఈ ఇంగ్లీషు పేపరు దేనికి?"

"చూపిస్తాను. ఇక్కడ చూసావా?" అంటూ ఆనాటి పేపర్లోని కార్టూన్ని చూపించాడు.

ఆ బొమ్మలో కారు ముందు నిలబడ్డ వ్యక్తి బాగా వంగి డ్రైవరుతో ఏదో అంటున్నాడు.

టీ కప్పులు తీసుకొచ్చిన సర్వరు వెళ్లేదాకా కన్నబాబు ఆగాడు.

"ఇవాళ కూడా చాలా సులభంగా ఇచ్చేశాడు. 'ఏడూ-సున్నా' మీద ఆడమని చెప్తున్నాడు. మామూలుగా అయితే భూతద్దంతో చూడాల," స్వరం తగ్గించాడు కన్నబాబు – అక్కడ ఎవరూ లేకపోయినా.

"నాకర్థంకాలేదు."

"వంగిన మనిషి ఏడు లాగా ఉన్నాడా, లేదా?'

"ఉన్నాడు."

"మరి వాడి పక్కనే కారు చక్రం. అంటే సున్నాయే కదా?"

"ఓహో!"

"అదే మరి. 'ఏడూ-సున్నా,'"

"నిన్న కూడా నువ్వు ఇలానే చూసి ఆడి ఉంటావు కదా?"

"అవును."

"మరి నీకెందుకు పేలలేదు?"

"అదే చెప్పాను కదా? సులభంగా ఉన్నప్పుడు అంతా అదే ఆడేస్తారు. అప్పుడు బొంబాయోల్లు ఏదో ఒక మెలికి పెట్టేస్తారు. చెప్పానుకదా? నిన్న ఏం చేశాడంటే, గడి

గేపిచ్చి ఆపోజిట్ కొట్టీసాడు." నూకరాజు కన్నబాబుని పరిశీలనగా చూసి,

"ఇదంతా ఒట్టి మోసం, కన్నా. నువ్వు చెప్పిందానికి అర్థంపర్థం లేదు. అనవసరంగా డబ్బు దొబ్బెడతన్నావు."

"నూకాలూ, నీకేటి తెల్దులేరా. బ్రాకెట్టు ఆడి లచ్చాదికారులైపోయిన వాళ్లున్నారు."

"నువ్వు చూశావా? అంతా వొట్టిదే, నమ్మకు."

"కనీసం ఒక నెల ఆడితేనేగాని బ్రాకెట్టు తీరీ అర్థం కాదులే నూకాలూ!"

"నీ ఖర్మ," అంటూ నూకరాజు కుర్చీ మీంచి లేచాడు.

* * *

కన్నబాబు పెళ్లాం మొగుడి మీద గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేసింది. 'జమీల' ప్రమాదంలో ఓడ యాజమాన్యం ఇచ్చిన ఏభైవేలూ, తాగుడు, జూదం మీదా, కొబ్బరితోటలోనూ తగలేస్తున్నాడనీ, ఆ డబ్బు తన పేరుమీద బ్యాంకులో ఉండాలనీ ఆమె వాదన. డబ్బు చేతికొచ్చాక కన్నబాబు కొత్తగా చేసుకున్న దురలవాటు జూదం. బ్రాకెట్టు, పేకాట – ఈ రెండింటిలోనూ బాగా మునిగిపోయాడు. అతని చుట్టూ ఒక భజన బృందం కూడా చేరారు.

జాలరులలో స్త్రీల గళం బలమైనది. విచారణ జరిపిన గ్రామ పెద్దలంతా మొగవాళ్లే అయినప్పటికీ – కన్నబాబు భార్య పక్షానే తీర్పు ఇచ్చారు. దాంతో ఆమె ఆర్థిక లావాదేవీలన్నింటినీ పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకుంది. చేతిలో డబ్బు ఆడకపోయేసరికి కన్నబాబు కిటకిటలాడిపోయాడు. అయిష్టంగా మళ్లీ వేటకి వెళ్లడం మొదలుపెట్టాడు. చేపలమ్మగా వచ్చిన డబ్బులో ఖర్చుకని ఐదో, పదో భార్య విదిల్చేది. వ్యసనలోలుడైన కన్నబాబుకవి ఏమూలకి సరిపోతాయి? అందుచేత తన దృష్టిని చేపల మీద కన్నా బిగినీసు మీద ఎక్కువగా సారించనారంభించాడు. త్వరలోనే సింహాచలం పంచన చేరి అతనికి కుడి భుజంగా మారిపోయాడు. అతని బలహీనతలని కనిపెట్టిన సింహాచలం, కాస్తంత ఉబ్బేస్తే ఎంత ప్రమాదకరమైన సాహసానికైనా ఒడిగట్టే కన్నబాబు స్వభావాన్ని బాగా వినియోగించుకున్నాడు. సింహాచలం ముఠాలో 'దేరింగ్ కన్నబాబు' అన్న బిరుదుని పొందాడు. స్మగ్లర్ల ప్రపంచంలో తానొక ఎదురులేని సాహస వీరుడినని కన్నబాబు నిజంగానే నమ్మసాగాడు.

ఏ అడ్డగోలు వ్యాపారంలోనైనా లాభాలు పెద్ద మొత్తంలో ఉండి, మదుపు పెట్టేవాడికి ఎటువంటి రిస్కూ, ప్రమాదమూ లేకపోతే గనక దానిమీద ఆధిపత్యం కోసం బాగా బలిసి ఉన్నవాళ్లు ముందుకొస్తారు. అలా వచ్చినవాళ్లు, తమ వ్యాపారంలో పోటీ అంటూ ఉండకుండా చేసుకోవడానికి ఎటువంటి చర్యలైనా తీసుకుంటారు. డబ్బుకి

లొంగే పోలీసులు, అధికారులు, రాజకీయ నాయకులు – అందర్నీ కొనేస్తారు. పొరపాటున ఎవడైనా నోరెత్తితే లంచం ఇచ్చి లేదా భయపెట్టి ఆ నోటికి తాళం వేయిస్తారు. గూండాల సహకారంతో పకడ్బందీగా నడిచే నేరపూరితమైన అటువంటి గుత్తాధిపత్యాన్ని కొన్ని దేశాల్లో మాఫియా అంటారని సింహాచలంకి తెలీదు. అయితే బిగినీసు మూలంగా అతనికి ఊళ్లోని పెద్దమనుషులతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. వాళ్లల్లో పోలీసులు, ప్రభుత్వాధికారులు, కార్పొరేటర్లు – అంతా ఉన్నారు. ఎక్కడ ఏ పార్టీకి స్కాచ్ విస్కీ కావాలన్నా సింహాచలానికి కబురందేది. 'మా ఇంట్లో మంచినీళ్లు తప్ప అన్నీ ఫారిన్ సరుకే' అని గొప్పగా చెప్పుకొనే ధనికులు, అధికారుల భార్యలు తయారయ్యారు.

పెద్దపెద్ద వాళ్లతో తనకు పరిచయాలూ, స్నేహాలు ఏర్పడుతున్నందుకు సింహాచలం మురిసిపోయాడు. వేలల్లో ఉన్నంతవరకూ వ్యాపారాన్ని పూర్తిగా చెప్పుచేతల్లో పెట్టుకున్న సింహాచలానికి, లక్షల్లోకి చేరుకొనేసరికి లంగరు అందలేదు. మదుపు పెట్టేవాళ్లు, అలాగే ఎక్కడైనా, ఏవైనా తేడాలొస్తే కొమ్ముకాసేవాళ్లు అవసరం అయ్యారు. సరిగ్గా అప్పుడే ఎల్లప్పుడూ చిరునవ్వులు చిందించే శాంతమూర్తి ఒకాయన ఒకానొక క్లబ్బులో పరిచయం అయ్యాడు. అతను సింహాచలానికి ధైర్యం చెప్పాడు. ఎంత మదుపు అవసరం అయితే అంతా పెడతాననీ, ఎవరితోనూ ఏ పేచీలూ రాకుండా చూసుకుంటాననీ అతడు హామీ ఇచ్చాడు. 'నీ పని నువ్వు చేసుకో, మిగతావి నేను చూసుకుంటాను' అని అభయం ఇచ్చాడు. సింహాచలానికి కావలసింది కూడా ఆ మదుపూ, ఆ హామీలే.

కొత్త ఉద్యోగ, వ్యాపార అవకాశాలు ఏర్పడ్డప్పుడల్లా – ఇతర ప్రాంతాలనుండి పెట్టుబడి, ఆయా మెళకువలు తెలిసిన వ్యాపార వర్గాలు గద్దల్లా వచ్చి వాలడం విశాఖపట్నానికి కొత్తేమీ కాదు. పోర్టు పనిచేయడం మొదలైనప్పుడు మొట్టమొదట దొరలు, బెంగాలీలు, గుజరాతీలు, మార్వాడీలు వచ్చి చేరారు. దేశవిభజన జరిగినప్పుడు పంజాబీలు, సింధీలు, బోరా ముస్లింలు వచ్చారు. అలా వచ్చిన వాళ్లంతా బాగుపడ్డారుగానీ నష్టపోలేదు. అటు పెట్టుబడి, ఇటు చొరబాటుతనం – రెండూ లోపించడం వలన స్థానికులు చిరు ఉద్యోగులుగానో, శ్రామికులుగానో మిగిలిపోయారు; స్థానిక వ్యాపారులు కూడా ఒక స్థాయికన్నా పైకి ఎదగలేదు. దీనికి కారణం కళింగాంధ్ర ప్రాంతపు 'వెనకబాటుతనం' అని కొందరు తీర్మానించారు, నమ్మించారు.

కొత్తగా ఏర్పడ్డ వ్యాపారావకాశాలను అందిపుచ్చుకుంటూ ఇతర ప్రాంతాల నుండి విశాఖ వచ్చిన వాళ్లు – ప్రధానంగా ఆంధ్రదేశపు నడిబొడ్డు నుండి వచ్చిన సమూహాలే. వాళ్లల్లో మొదటి తరంవాడు సింహాచలానికి అండగా నిలిచిన

శాంతమూర్తి. రిస్కు సింహాచలానిది. పెట్టుబడి, లాభంలో పెద్ద వాటా శాంతమూర్తిది. తొలి దశలో ఇదే ప్రధానమైన మోడల్‌గా నడిచింది.

ఎంతో కాలం, విశాఖ రేవు నుంచి పెద్ద ఎత్తున ఇనుప ఖనిజం జపాన్‌కి ఎగుమతి అయ్యేది. ఇందుకు అనువుగా జపాన్ వారు రేవులో పెద్ద యంత్ర పరికరాలను నిర్మించారు. జపాన్ వెళ్లడానికి రెండువారాలూ, అక్కడ ఖనిజాన్ని దించాక తిరిగి రావడానికి మరో రెండు వారాలూ పట్టేది. మార్గమధ్యంలో సింగపూర్‌లో ఒక పూట ఆగేవి. వాటి సిబ్బంది అక్కడ ఎడాపెడా కొనుగోళ్లు చేసి ఓడలో ఉండే అనేకానేక కుహరాలలో కొన్న వస్తువులను దాచి పెట్టేవారు. విశాఖ రేవు బయట ఆ ఓడలు లంగర్లు దించగానే జోరుగా అమ్మకాలు సాగేవి. ఆ ఓడల కేప్టెన్ల నుండీ క్రింది స్థాయి కళాసీల వరకూ అంతా ఈ వ్యాపారంలో భాగస్వాములే.

బిగినీసులో ఆరితేరిన కొందరు జాలరులు ఆ ఓడల్ని చుట్టుముట్టి కొనుగోళ్లు చేసేవారు. సరుకుని ఒడ్డుకి చేర్చేవారు. విదేశీ వస్తువుల మోజులో పడ్డ జనం, ఆ జాలరుల గుడిసెలకు పరుగెత్తి, ఎగబడి కొనుక్కొనేవారు. ఒక్కోసారి ఆ జాలరులు, 'ఒక్క వారం ఆగండి. జపాన్ నుండి ఫలానా ఓడ వస్తుంది' అని బెల్ బాటమ్ పేంట్లు కుట్టించుకోవడానికి స్ట్రెచ్ లాన్ గుడ్డ, ఆడవాళ్ల కోసం నైలెక్సు చీరలు, కేమెరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన గిరాకీలకు తెలియపరిచేవారు. ఈ 'దిగుమతి' అంతా పెద్ద ఎత్తున, పకడ్బందీగా సాగేది. లావాదేవీలన్నీ పూర్తిగా నగదు రూపేణా, పూర్తి స్థాయి సుంకాల మినహాయింపుతో, బాహాటంగా జరిగేవి.

జాలరి పురుషులలో లోకంతీరు తెలియని అమాయకులే ఎక్కువ. వాళ్లెప్పుడూ వ్యాపారాలకు, వ్యవహారాలకు దూరంగానే ఉండేవారు. తొలిదశలో చాలా తక్కువమంది మాత్రమే స్మగ్లింగులో తలదూర్చే సాహసం చేసారు. ఎప్పుడైతే సింహాచలం, శాంతమూర్తి వంటివారు చేతులు కలిపి ఈ వ్యాపారానికి భద్రత, సాధికారత ఏర్పరిచారో – అప్పుడు మరికొంత మంది ధైర్యం చేసి ముందుకొచ్చారు. జాలరులంతా స్మగ్లర్లుగా మారిపోయారు అని అనుకుంటే మాత్రం అది పొరబాటే అవుతుంది. అలాగే, వాణిజ్య నౌకల్లో పనిచేసిన నావికులంతా ఈ కార్యకలాపాలలో పాల్గొనలేదు. అది కొందరి పనే.

ఆ కొందరిలో 'ఓరియంటల్ పయనీర్' కేప్టెనూ, సిబ్బందీ ఉన్నారు. వాళ్లతో సింహాచలానికి సత్సంబంధాలున్నాయి. అనుకోకుండా జపాన్ నుంచి తిరిగి వస్తూన్నప్పుడు ఆ కేప్టెన్ అతని తల్లి మరణించిందనే కబురు రావడంతో సింగపూరులో దిగిపోవాల్సి వచ్చింది. కొత్త కేప్టెనుకి సింహాచలంతో ఉన్న ఏర్పాట్ల గురించి ఏమీ తెలీదు. పైగా ముక్కుకి సూటిగా పోయే రకం. ఇనుప ఖనిజం ఎగుమతితో బాటుగా విశాఖకు జరిగే భారీ దిగుమతుల గురించి సిబ్బంది అతనితో ప్రస్తావించడానికి

భయపడిపోయారు. ఈ వివరాలేవీ తెలియని సింహాచలం, అతనికుండే మార్గాల ద్వారా 'పయనీర్' వస్తోందన్న సమాచారం అందగానే,

"పయనీరొస్తుందిరా, మీరు రెడీ అయిపోండి," అని కన్నబాబు బృందాన్ని అప్రమత్తం చేశాడు.

ఓడ విశాఖ రేవు బయట లంగరు దింపగానే కన్నబాబు తన పడవలతో చుట్టుముట్టాడు. తమ వ్యాపారానికి కేప్టెన్ అనుమతి లేదని సిబ్బంది అనేసరికి, అడ్డుకుంటే ప్రాణాలు తీస్తానని కన్నబాబు కేప్టెన్‌ని బెదిరించాడు. ఖంగుతిన్న కేప్టెన్, నేవీకి, పోర్టుకి రేడియో ద్వారా ఫిర్యాదు చేశాడు. సిబ్బందిలో కొంతమంది తెచ్చిన సరుకుని అమ్మజూపారు. వాళ్లు వేసిన తాడు నిచ్చెనని పట్టుకొని ఓడ వెనకభాగంలో కన్నబాబు దిగుతూండగా అది గమనించని కేప్టెన్, మరింత దూరంగా వెళ్లి లంగరు దించేందుకుగాను ఇంజిను స్టార్ట్ చేశాడు. పంఖా (ప్రొపెల్లర్) తిరిగింది. నిచ్చెన ఊగిసలాడింది. పడవల్లో ఉన్న జాలర్లు కేకలు పెట్టారు. ఆ గందరగోళంలో కన్నబాబు జారిపడ్డాడు. పంఖా అతన్ని లాక్కుంది. నేవల్ షిప్పు రావడం చూసి, జాలర్లు ఓవర్ బోర్డ్ మోటార్లు అమర్చిన తమ పడవల్లో పారిపోయారు. ఆ మర్నాడు కన్నబాబు శవం స్కాండల్ పాయింట్ వద్దకు కొట్టుకొచ్చింది. ఆ విధంగా 'జమీల' ధీ కొట్టడంతో తిరగబడిన పడవ ప్రమాదపు బాధితులలో నూకరాజు తప్ప మిగతా ముగ్గురూ మరణించారు.

'ఓరియంట్ పయనీర్' ఉదంతంపై జరిగిన విచారణలో కేప్టెన్ తప్పులేదని తేలింది. సింహాచలం ఇంటిమీద దాడి చేసిన పోలీసులు పెద్ద మొత్తంలో విదేశీ సరుకుని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక, జాతీయ దినపత్రికలు ఈ వార్తల్ని ప్రముఖంగా ప్రచురించాయి. వ్యవహారం చాలా దూరం పోయిందని తెలుసుకున్న శాంతమూర్తి చేతులెత్తేశాడు. సింహాచలానికి రెండేళ్లు జైలు శిక్ష పడింది.

* * *

కొత్త స్కూలుకీ, అక్కడి వాతావరణానికీ వెంకీ తొందరగానే అలవాటు పడ్డాడు. ఇందుకుగాను డారల్ అతనికి సహకరించాడు. అది బాలుర పాఠశాల కావడంవల్ల అంతా మరీ రఫ్‌గా ఉన్నట్లు వెంకీకి మొదట్లో అనిపించింది. బ్రదర్లు, ఫాదర్లు ఎదురుపడినప్పుడు మాత్రం పిల్ల రౌడీలంతా చాలా బుద్ధిగా ప్రవర్తించేవారు. అప్పటికే తనకున్న ప్రతిభ మూలంగా వెంకీ స్కూల్ ఫుట్‌బాల్ టీమ్‌లో స్థానం సంపాదించాడు. డారల్ అప్పటికే సెంటర్ ఫార్వర్డ్‌గా ఓ వెలుగు వెలుగుతున్నాడు. వెంకీ త్వరలోనే రైట్ ఫార్వర్డ్ పొజిషన్ ఆడే స్థాయికి చేరుకున్నాడు. వాళ్లిద్దరి మధ్యా ఉండే సమన్వయం, గోల్స్ చెయ్యడంలో చాకచక్యం స్కూల్ కోచ్‌తో సహా అందరి

దృష్టినీ ఆకట్టుకుంది. వెంకీ ప్రత్యేకత సిజర్స్ షాట్. గాలిలో ఎగిరి బంతిని వెనక్కికొట్టి గోలు చెయ్యడంలో అతడు చూపిన ప్రతిభకి అంతా ముగ్ధులయ్యారు. వెంకీ ఇప్పుడు ధారాళంగా ఇంగ్లీషు మాట్లాడతాడు.

ఎల్లమ్మ ప్రభావం డెబొరాపైన కూడా పడనారంభించింది. గోరింటాకు పెట్టుకోవడం, కూరల్లో మసాలాలను ఇష్టపడడం, అన్నంలో పెరుగు కలుపుకొని ఆవకాయతో తినడం, అర్థంకాకపోయినా తెలుగు సినీమాలు చూడడం, అప్పుడప్పుడు చీర కట్టుకోవడం, గాజులు తొడుక్కోవడం, కాళ్లకు పట్టీలు వేసుకోవడం, చెవులకు లోలక్కులు పెట్టుకోవడం ఆమెకు కొత్తగా ఏర్పడ్డ సరదాలు. స్నేహితురాళ్లిద్దరికీ – శోభన్ బాబు, వాణిశ్రీలు అభిమాన తారలయ్యారు. టోనీ కూతుళ్లిద్దరూ అన్నిట్లోనూ డెబొరా, ఎల్లమ్మలను అనుకరించసాగారు.

నూకరాజు మెట్రిక్యులేషన్ పరీక్ష మొదటి ప్రయత్నంలోనే పాసయ్యాడు. అతని తల్లి పోలమ్మ, ఎల్లమ్మ ఎంతగానో సంతోషించారు. ఇక గవర్నమెంటు ఉద్యోగం చూసుకోమంది తల్లి.

"కావాలంటే చెప్పమను, పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తాను," అని కేప్టెన్ జిమ్మీ వెంకీతో అన్నాడు.

"ఏం చేద్దామనుకుంటున్నావు, బావా?" అని ఎల్లమ్మ అడిగినప్పుడు,

"పీ.యూ.సీ.లో చేరుతాను. ఇంకా పై చదువులు చదవాలి," అన్నాడు నూకరాజు.

పోలమ్మకు ఈ జవాబు నిరాశ కలిగించింది గానీ, ఎల్లమ్మ మాత్రం బావ తీసుకున్న నిర్ణయాన్ని హర్షించింది. నూకరాజు జాలారిపేట పక్కనే ఉన్న ఏ.వీ.ఎన్. కాలేజీలో ఆర్ట్స్ గ్రూపులో చేరాడు.



చెంగల్రావుపేట

నేను యారాడ కొండని...

విశాఖపట్నంలో జాలారిపేట తరవాత అత్యంత పురాతనమైన మానవ నివాస ప్రాంతం-చెంగల్రావుపేటను మీకు పరిచయం చేస్తాను. చెంగల్రావుపేటలో వైశ్యులు, వాడ బలిజలు, కంసాలులు, వడ్రంగులు, తెలుకులవాళ్లు, ఇంకా ఇతర కులస్థులూ, వృత్తులవారూ ఉన్నప్పటికీ, బ్రాహ్మణుల సంఖ్య అధికం. భూమికీ, వ్యవసాయానికీ ఒకటి రెండు తరాలుగా దూరమైన బ్రాహ్మణ కుటుంబాల నివాసంగా, పట్టణప్రాంత అగ్రహారంగా కూడా చెంగల్రావుపేటను చూడవచ్చు. పట్టణప్రాంతంలో అగ్రహారం ఉండడం ఒక అసంబద్ధత; అదే చెంగల్రావుపేట విశిష్టత కూడా.

చెంగల్రావుపేట సందులన్నీ సైకిలు తప్ప మరే సాధనం చొరలేని విధంగా ఇరుకిరుగ్గా, గజిబిజిగా ఉంటాయి. ఇంట్లోంచి బయటపడడం అంటే ముందు గదిలోంచి వీధిలోకి దూకడమే. ఇళ్లన్నీ ఒకదానికొకటి అతుక్కుపోయి, ఇంటి వెనకా, ముందూ, చుట్టుపక్కలా ఖాళీ స్థలం అంటూ లేకుండా చెల్లాచెదురుగా పడేసిన అట్టపెట్టెల్లా అస్తవ్యస్తంగా ఉంటాయి. అది టౌను ప్లానింగు అనే ప్రక్రియ కన్నా ముందుగా పుట్టి, అడ్డదిడ్డంగా విస్తరించిన నివాసాల సముదాయం. రిక్షా, లేదా జట్కా రావడం, పోవడం సాధ్యపడిందంటే అది వింతే అని చెప్పవచ్చు. కారుతో గనక లోపలికి ప్రవేశిస్తే పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లే. ఐదు సందులు కలిసే పంజా జంక్షన్ చెంగల్రావుపేటకి నడిబొడ్డున ఉంటుంది. విశాఖ మెయిన్ రోడ్డుని బీచితో సంధించే టౌనుహాలు రోడ్డు, పాతనగరాన్ని జాలారిపేటతో, ఇప్పటి ఫిషింగ్ హార్బరుతో కలుపుతుంది.

చెంగల్రావుపేట వీధులు, లేదా సందులు – ఎక్కువగా ఇంటి పేర్లను కలిగి ఉంటాయి. చిన్నంవారి వీధి, చట్రాతివారి వీధి, గంగాబత్తులవారి వీధి, చట్రాజువారి వీధి, పప్పుల వీధి, చట్టివారి వీధి – ఈ విధంగా. తిప్పర్తివారి వీధిలో శ్రీశ్రీ పుట్టాడు; అక్కడే పెరిగాడు. ఆ తరవాత ఏ ఊళ్లో ఉన్నా, నాలుగడుగులు వేస్తే సముద్రం

కనిపించాలని తపించాడు. సాగరఘోష కోసం, చేపల వాసనతో మిళితమైన ఉప్పునీటి గాలి కోసం జీవితమంతా కొట్టుకుపోయాడు.

బ్రిటీషు పాలకుల ప్రాపకం కోసం బొబ్బిలి రాజా కట్టించిన టౌనుహాలు, కురుపాం రాజా కట్టించిన కింగ్ ఎడ్వర్డ్ మార్కెట్టు, పెద్ద మనుష్యులు తమ విజ్ఞాన వినోదాల కోసం ఏర్పాటు చేసుకున్న హిందూ రీడింగు రూము, స్థానిక జమీందారు అంకితం వెంకట జగ్గారావు చెక్కించిన విక్టోరియా రాణీ బొమ్మ – ఇవి చెంగల్రావుపేటకి నాలుగు చెరగులా ఉండడం సహజమే అనిపిస్తుంది. అలాగే నాలుగడుగులు వేస్తే వచ్చే ఏ.వీ.ఎన్. కాలేజీ, కాస్త ముందుకి వెళ్తే కలెక్టరు ఆఫీసు, పెద్దాసుపత్రి కింగ్ జార్జ్ హాస్పిటల్ (కే.జీ.ఎచ్.), ఆ దిగువనే నేవల్ కోస్ట్ బ్యాటరీ, అటు పక్కనే మహారాణీ పేట, హవా మహల్, సెంచరీ క్లబ్బు – ఈ వలసకాలపు కట్టడాలన్నీ ఆ చుట్టుపక్కల ఉండడం కూడా కాకతాళీయం కాజాలదు.

గ్రామాల్లో ఉన్న తమ భూముల్ని స్వయంగా చూసుకోకుండా, ఎవరిమీదనో వదిలేసి, పట్టణాల్లో కాలిమీద కాలు వేసుకొని కాలక్షేపం చెయ్యడం (ఆబ్సెంటీ-లేండ్-లార్డిజం), అసమర్థత, వ్యసనపరత్వం వీటి మూలంగా ఆస్తుల్ని పోగొట్టుకొని చదువులు, ఉద్యోగాలపైనే పూర్తిగా ఆధారపడడం – అగ్రవర్ణాలలో సర్వసాధారణం అయిపోయింది. కొత్తగా పట్టణీకరణ చెందుతూన్న బ్రాహ్మణులకు పెద్ద చదువులు, ఉద్యోగాలు ఒక నూతన ప్రత్యామ్నాయాన్ని సృష్టించాయి. వీరిలో కొందరు పాశ్చాత్య సాహిత్యం నుండి, రాజకీయ అవగాహన నుండి ప్రేరణను పొందారు. కామిన్ టరన్‌లో సభ్యుడిగా లెనిన్, తదితర నాయకులతో ఎమ్.ఎన్. రాయ్ పనిచేశాడు. బెనారస్‌లో చదువుకుంటున్నప్పుడు అబ్బూరి రామకృష్ణారావు, రాయ్ ప్రభావానికి లోనయ్యాడు. అబ్బూరి ఆంధ్రా యూనివర్సిటీకి తొలి లైబ్రేరియన్ కావడం, అతడు శ్రీశ్రీకి ఆధునిక పాశ్చాత్య సాహిత్యాన్ని పరిచయం చెయ్యడం – ఇవన్నీ అంతర్జాతీయ చారిత్రక శక్తులు స్థానికంగా ఆవిష్కరించిన పరిణామాలే. ఆధునిక తెలుగు సాహిత్యానికి చెంగల్రావుపేట ప్రసాదించిన బహుమతి శ్రీశ్రీ. అతడు దర్శింపజేసిన 'మరో ప్రపంచపు కంచు నగారా విరామెరుగక మ్రోగింది'.

* * *

విశాఖపట్టణానికి ఏభై మైళ్ల దూరంలో రాజావారు అతని తాతకి దానంగా ఇచ్చిన వంద ఎకరాల్లోనూ సత్తెన్న పంతులికి ఏభై కూడా దక్కలేదు. చెప్పుకోవడానికేంగాని, అన్నీ మెట్టు భూములు, పూర్తిగా వర్షాధారం. 'ఇదే గోదావరి ఒడ్డున అయితేనా!'అని సత్తెన్న పంతులు తరచూ వాపోతూ ఉండేవాడు. అతని అసలు పేరు సత్యన్నారాయణ శర్మ; రైతులు అతన్ని సత్తెన్న పంతులుగా వ్యవహరిస్తూ దాన్నే ఖాయం చేశారు. రాజమండ్రిలో ఉన్న అతని మేనమామల భూములకి గోదావరి తల్లి

చల్లని ఆశీస్సులున్నాయి. కాటన్ దొర చేసిన మేలు వాళ్లని కాపాడుతున్నది. సత్తెన్న తల్లివైపు వాళ్లందరికీ తూర్పు వాళ్లంటే చిన్న చూపు. కళింగ ప్రాంతానికి గోదావరి నీళ్లు అందుబాటులో లేకపోవడమే ఇందుకు మూలకారణం అని తెలుసుకోవడానికి సత్తెన్నకి అట్టేకాలం పట్టలేదు. పట్టుదలగా పొలంలో నూతులు తవ్వించాడు; ఏతాలు పెట్టించాడు. పొలం మధ్యనే చిన్న పాక వేసుకొని నివసించసాగాడు. బ్రాహ్మణ వ్యవసాయమే అయినప్పటికీ కొంతకాలానికి పుంజుకుంది. రాలుబడి నిలదొక్కుకుంది. కొడుకు చదువుకని చెంగల్రావుపేటలో ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం అక్కడికి మార్చాడు. పొలం పనులు పడ్డప్పుడల్లా వెళ్లి వస్తూండేవాడు.

ఉన్నట్టుండి సత్తెన్న ఆరోగ్యం క్షీణించింది. పెద్దాసుపత్రి చుట్టూ తిరగడం ఎక్కువైంది. సత్తెన్న తమ భూముల్ని స్వయంగా చూసుకోలేక పొలాలు కౌలుదారులకిచ్చాడు. మొదట్లో శిస్తు సక్రమంగా కట్టిన కౌలుదార్లు పంతులి పరిస్థితి చూశాక ఏదో ఒక సాకు చూపి ఎగ్గొట్టసాగారు. ధర బాగుందని చెప్పి సత్తెన్న ట్రంకు రోడ్డుని ఆనుకున్న ఐదెకరాలను అమ్మి చెంగల్రావుపేటలో ఇల్లు కొన్నాడు. ఇంటికి పెట్టిన ధర ఎక్కువే అనిపించిందిగానీ అద్దె కొంపలో ఎన్నాళ్లని అవస్థ పడతాంలే అని సరిపెట్టుకున్నాడు, కొడుకు కామేశం బియ్యే అయ్యాక విశాఖపట్నంలోనే ఉద్యోగం చూసుకుంటాడనే ఆశతో.

సత్తెన్న కొడుకు కామేశం స్కూలు ఫైనలు పాసై, ఏ.వీ.ఎన్. కాలేజీలో బియ్యే ఇంగ్లీషులో చేరాడు. వ్యవసాయంలో అతనికి బొత్తిగా ఆసక్తి లేదు. సాహిత్యం అంటే అతనికి వల్లమాలిన అభిలాష. తెలుగు, ఇంగ్లీషు సాహిత్యాలే అతని ప్రపంచం. బియ్యే పూర్తయేనాటికి ఇంట్లో మంచి లైబ్రెరీ తయారుచేసుకున్నాడు. సాహిత్యాభిలాష కలిగిన మిత్ర బృందం అతని చుట్టూ చేరింది.

కొత్తకాలపు చదువుల మూలంగా రానురాను కామేశం నాస్తికుడిగా తయారవుతున్నాడనే దిగులు సత్తెన్నని వేధించసాగింది. ఒకదారిలో పడతాడనే ఆశతో ఉద్యోగం ఇంకా రాకుండానే కామేశానికి పెళ్లి చేశాడు. సత్తెన్న శిస్తు వసూళ్లకి వెళ్లనప్పుడల్లా కొడుకుని వెంట రమ్మనేవాడు. 'మన భూముల హద్దులైనా తెలుసుకోవాలి కదరా? రేపు నేను పోతే మన పొలాలు ఎక్కడున్నాయో కూడా నీకు తెలీకుండా అవుతుంది' అన్నా కూడా కామేశం పట్టించుకోలేదు. 'ఆ మాత్రం నాకు తెలుసులే, నాన్నా!' అని దమాయించేవాడు.

కామేశం భార్య ఘోషా ఆస్పత్రిలో కొడుకుని కని, పురిట్లోనే వాతం వచ్చి చనిపోయింది. కొడుక్కి తన పేరు పెడతాడని ఆశ పడ్డాడు సత్తెన్న; తెల్లవారుతూండగా పుట్టాడని ఉదయ భాస్కర్ అని పెట్టాడు, కామేశం. సత్తెన్నకి కొడుకు కన్నా కూడా మనవడే దగ్గరయ్యాడు. మనవడిని 'ఒరేయ్... భాస్కరం...' అని సాగదీస్తూ పిల్చేవాడు.

కామేశం మేనత్త, సత్తెన్న చెల్లెలు – విధవరాలు. నిత్యం చాకిరీలో మునిగితేలుతూ, మొత్తం ఇంటి బాధ్యతను ఆమే చూసుకొనేది. ఆమెకు చిన్నతనంలోనే పెళ్లయిపోయింది. భర్త ఏజెన్సీలో ఉద్యోగం చేస్తూ మలేరియాతో మరణించాడు. ఆమెకు పిల్లలు లేరు. భాస్కర్ ఆమెను 'అమ్మమ్మ' అని పిల్చేవాడు. అమ్మ లేకపోయినా అమ్మమ్మ ఉందికదా అని భాస్కర్‌కి ఎక్కడో ధైర్యంగా, కుశాలుగా ఉండేది – బాల్యంలో. సత్తెన్న కుటుంబానికి ఆమె ఒక్కర్తే ఆడ దిక్కు. ఆమె కూడా భాస్కరాన్ని అతిగానే గారాం చేసేది. ఆమె వంటి విధవలు జీవితాంతం ఉచితంగా, నమ్మకంగా, నోరెత్తకుండా అందజేసిన సేవలు, పడ్డ శ్రమ అసంఖ్యాకమైన బ్రాహ్మణ కుటుంబాలు బతికి బట్టకట్టడానికి పునాదిగా నిలిచాయి. బ్రాహ్మణ పురుషులు తమ దృష్టిని చదువులమీదా, ఉద్యోగాలమీదా కేంద్రీకరించడానికీ, అప్పటప్పట ఇతర వ్యాపకాల మీదకు మళ్లించడానికీ తోడ్పడ్డాయి. సత్తెన్న తన చిన్నతనంలో గాంధీజీ అంటే గౌరవంతోనూ, ప్రకాశం పంతులంటే అభిమానంతోనూ కాంగ్రెసు పార్టీలో కొంతకాలం చురుగ్గా పనిచేశాడు. 'క్విట్ ఇండియా' ఉద్యమం హింసవైపుగా మళ్లడంతో పార్టీకి దూరం అయ్యాడు. అరెస్టులకు భయపడి తప్పుకున్నాడని కొందరన్నారు. అతని సానుభూతి మాత్రం కాంగ్రెసు పార్టీతోనే కొనసాగింది.

కామేశం ఎప్పుడన్నా కొడుకు భాస్కరం మీద చెయ్యిచేసుకున్నా లేక కనీసం కోప్పడ్డా – తాత సత్తెన్న, అతని చెల్లలయిన 'అమ్మమ్మ' అడ్డుకొనేవారు. మనవడిని వెనకేసుకొచ్చేవారు. 'వాడినేమీ అనకురా, తల్లి లేని పిల్లాడురా,' అంటూ గుర్తు చేసేవారు. ఈ వెసులుబాటుని భాస్కర్ బాగా ఉపయోగించుకున్నాడు. ఏ ప్రమాదాన్నుంచైనా తాత, అమ్మమ్మలు తనని కాపాడతాడనే ధీమా అతనిలో ఏర్పడిపోయింది. ఇంట్లో ఉన్నంతసేపూ వారినే అంటిపెట్టుకొని ఉండేవాడు.

తాత, అమ్మమ్మల మీద పెత్తనం చేస్తూ, ఆడింది ఆటగా, పాడింది పాటగా భాస్కర్ పెరిగాడు. ఇది అతనిలో ఒక భద్రతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఎవర్నీ లక్ష్యపెట్టని గుణం, తన జీవితానికి తానే జవాబుదారుడు అనే భావన అతనిలో ఏర్పరచాయి. చెంగల్రావుపేటని తన పరిసరాలలో భాగంగా, ఇంటికి పొడిగింపుగా అతడు భావించాడు. అందర్నీ పలకరిస్తూ, స్నేహాలు చేస్తూ, పేటంతా కలియతిరుగుతూ, పాత నగరంలో షికార్లు కొడుతూ భాస్కర్ కలుపుగోరుతనం అలవరచుకున్నాడు. 'అంతా మన వాళ్లే' అనే ఆలోచన అతనిలో స్థిరపడిపోవడంతో, కొత్తవాళ్లంటే బెరుకులేకుండా తయారయ్యాడు. మనుషులంటేనే స్నేహం, ఆత్మీయత, ఇచ్చిపుచ్చుకోవడం అనే భావన ఏర్పడిపోయింది. సాధారణంగా పెద్ద ఉమ్మడి కుటుంబాలలో, గ్రామీణ ప్రాంతాలలో పెరిగిన వారికి ఇటువంటి సమిష్టితత్వ లక్షణాలు సంక్రమిస్తాయి. ఉంటున్నది విశాఖ నగరంలోనే అయినా చెంగల్రావుపేట ఏర్పరిచిన గ్రామీణ వాతావరణం ఈ విధంగా భాస్కర్ని తీర్చిదిద్దింది.

అతని అమ్మమ్మ కొన్నాళ్లపాటు చుట్టుపక్కల ఉన్న బ్రాహ్మణ కుటుంబాలలోని బోడమ్మలతో కలిసి రోజూ సాయంత్రం పూట శాస్త్రులుగారు చెప్పే పురాణాలు వినడానికని గుడికి వెళ్లేది. శాస్త్రులుగారు బోడమ్మల్ని, ఒక గుంపుగా, కాస్త ఎడంగా కూర్చోమనేవారు. ఒక రోజున వాళ్లంతా అలా గుంపుగా పురాణానికి వెళుతూ ఉంటే ఆ పేటలోని కుర్రకుంకలు కొంతమంది వాళ్లని, 'సిటీ పోలీస్! సిటీ పోలీస్!' అంటూ వెక్కిరించడం భాస్కర్ కంటబడింది. వాళ్లని వెంటతరిమి, ఒకడ్ని పట్టుకొని నాలుగు తగిలించాడు. ఆనాటితో వాళ్ల బెడద వదిలింది.

అలాగని భాస్కర్ కూడా తక్కువ వాడేమీ కాదు. అమ్మమ్మ ఇంటినుండి బయలుదేరుతూంటే, "బేగొచ్చీయే, అమ్మమ్మా!" అనేవాడు. అలా అంటే ఆమెకు కోపం వస్తుందని భాస్కర్‌కి తెలుసు. ప్రతీసారీ –

"ఏవిట్రా ఆ కాప వెధవ మాటలు?" అని కోపగించుకొనేది. భాస్కర్ పగలబడి నవ్వేవాడు.

తినడానికేదైనా పెట్టమని అమ్మమ్మని తరచూ వేధించేవాడు భాస్కర్. అప్పటికప్పుడు పుల్లట్లో, చిట్టి బూరెలో, బజ్జీలో చేసిపెట్టేది. వయసు పైబడ్డాక,

"నాకివాళ ఓపిక లేదురా! కుండలో తరవాణి అన్నం ఉంది. కాస్త మజ్జిగా, మాగాయీ వేసుకొని షోగ్గా చెంచాతో తినేద్దూ" అనేది.

సత్తెన్న శిస్తు వసూళ్లకి వెళ్లినప్పుడల్లా, అతడు తన తాతని, "ఎక్కడికి వెళ్తున్నావు తాతా? మళ్లీ ఎప్పుడొస్తావు?" అని నిలదీసేవాడు.

"రైతులతో మాట్లాడాలి రా! రేపు రాత్రికల్లా వచ్చేస్తాను," అని సత్తెన్న అంటే,

"నేనూ నీతో వస్తాను తాతా! రైతులతో నేను కూడా మాట్లాడతాను," అనేవాడు భాస్కర్.

"నా తండ్రే! కొంచెం పెద్దయ్యాక నాతో వద్దువుగానిలే," అని సత్తెన్న మురిసిపోయేవాడు.

వస్తున్నప్పుడు బస్టాండులో దొరికే పంచదార చిలకో, మాడుగుల హల్వాయో మనవడి కోసమని తీసుకొచ్చేవాడు.

"అలాంటివన్నీ తీసుకురాకండి. అవి తింటే పిల్లాడికి జబ్బుచేస్తుంది," అని కామేశం ముసలాయన మీద విసుక్కొనేవాడు.

"చిన్నప్పుడు నువ్వూ ఇవే తినేవాడివి కదరా? నీకేం అయింది, బాగానే ఉన్నావు కదా?" అని సత్తెన్న ఎదురు పలికేవాడు.

మనవడికేమీ కాలేదుగానీ సత్తెన్నకి హఠాత్తుగా జబ్బుచేసి మంచం పట్టాడు.

పెద్దాసుపత్రి డాక్టర్లు పెదవి విరిచారు. కామేశం తండ్రిని ఇంటికి తీసుకొచ్చేశాడు – ఏదైతే అదే అవుతుందని.

"ఈ సంవత్సరం వసూళ్లు పూర్తి కాలేదురా! నువ్వొక్కసారి వెళ్లరాదూ?" అని సత్తెన్న మొత్తుకున్నాడు.

"చూద్దాంలే, నాన్నా! నువ్వు ఇవేమీ ఆలోచించకు, నీ ఆరోగ్యం ముఖ్యం" అన్నాడు కామేశం చిరాగ్గా.

ఆ సంభాషణను వింటూన్న భాస్కర్,

"నేను వెళ్తాను తాతా! నేను వసూలు చేస్తాను, నువ్వు పడుకో," అని తాతకి ధైర్యం చెప్పాడు.

సత్తెన్న మనవడిని దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు.

"అవున్రా, భాస్కరం! ఇంక నువ్వే వెళ్లాలి. మీ నాన్న ఎలాగూ పట్టించుకోడు," అన్నాడు.

అవే అతని చివరి మాటలు. ఆ తరవాత మాట పడిపోయింది. రెండు రోజుల తరవాత మరణించాడు.

ఈ సంఘటన భాస్కర్ మనసులో బాగా నాటుకుపోయింది.

* * *

ఏనాడూ దేనికీ ఇబ్బందిపడకుండా, కష్టం అంటే ఏమిటో తెలియకుండా పెరిగిన కామేశం, తండ్రి మరణంతో తత్తరబిత్తర అయిపోయాడు. ఉండడానికి ఇల్లయితే ఉందిగానీ, ఇంటి ఖర్చులకు ఆదాయం ఎక్కడి నుండి వస్తుంది? ఉద్యోగంకోసం వెతుకులాటని ముమ్మరం చేశాడు. ఎంప్లాయిమెంటు ఎక్స్‌ఛేంజిలో వివరాలు నమోదు చేయించాడు. పట్టా కాయితాలూ, కౌలు ఒప్పందాలు తీసుకొని చెంగల్రావుపేటలోనే ఉంటూన్న లాయరుగారి దగ్గరకు పరుగెత్తాడు. 'మరేం భయం లేదు. అంతా నేను చూసుకుంటాను' అని ధైర్యం చెప్పాడు ఆ లాయరు. తోటి బాపనాడే కదా అని అతగాడిని నమ్మిన కామేశం ఊపిరి పీల్చుకున్నాడు.

ఏళ్లు గడిచిపోయాయి. వాయిదాల మీద వాయిదాలు పడ్డాయి. భూములు రైతుల స్వంతం అయిపోయాయి. 'ఊళ్లోకొస్తే కాళ్లిరగ్గొడతాం' అనే సంక్షిప్తమైన సందేశాన్ని కామేశానికి అందజేశారు. చివరికి పదెకరాల మామిడి తోట దక్కింది. ఆ పదెకరాలూ ఏదో కాడికి లాయరే కొనేసుకున్నాడు – 'నువ్వీ పుర్రాకులు పడలేవోయ్, కామేశం' అంటూ. ఆ విధంగా కామేశం ముత్తాతగారు రాజావారి వద్ద దానంగా పుచ్చుకున్న వందెకరాలూ హరించుకుపోయాయి. తండ్రి ముందుచూపుతో చెంగల్రావుపేటలో కొన్న ఇల్లు మిగిలింది. అదిప్పుడు శిథిలావస్థకు చేరుకుంది.

తండ్రి పోయాక కామేశం ఎదుర్కొన్న దుర్దినాల నడుమ కొన్ని మంచి పరిణామాలు కూడా చోటు చేసుకున్నాయి. పోర్టులో, ట్రాఫిక్ డిపార్టుమెంటులో గుమాస్తా ఉద్యోగానికి ఇంటర్వ్యూకి రమ్మని ఒక రోజున పిలుపు వచ్చింది. ఇంటర్వ్యూ బోర్డులో టకటకా ఇంగ్లీషులో ప్రశ్నలు అడిగి, కామేశం చెప్పిన జవాబులకు సంతృప్తిని వెలిబుచ్చిన హార్బరు మాస్టరు కూడా ఉన్నాడు. అతని పేరు కేప్టెన్ జిమ్మీ పెరేరా అని ఉద్యోగంలో చేరాక తెలిసింది.

ఇక రెండవ పరిణామం – సాహితీ కార్యక్రమాలలో కామేశం చురుగ్గా పాల్గొనడం. అతను వ్రాసిన సాహిత్య విమర్శలూ, పుస్తక సమీక్షలూ వివిధ పత్రికలలో – ముఖ్యంగా రెండు, మూడు మార్లు 'భారతి'లో – అచ్చుకావడంతో ఒకానొక ప్రగతిశీల సాంస్కృతిక సంస్థకు కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. కామేశానికి అతడు అభిమానించే రచయితలతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. మళ్లీ పెళ్లి చేసుకోకపోయినా ఒంటరితనాన్ని అధిగమించడానికి సాహిత్యం ఉపయోగపడింది; సాహితీ మిత్రులు కామేశానికి అండగా నిలిచారు.

చివరిగా – కొడుకు ఉదయ భాస్కరం, చదువులో బాగా రాణించడమే కాకుండా, పుస్తక పఠనంలో కూడా ఆసక్తి కలిగి ఉండడం కామేశానికి ఆనందం కలిగించింది. విశాలాంధ్ర వారి సోవియట్ పిల్లల పుస్తకాలతో మొదలుపెట్టి, అనువాద సాహిత్యం చదవసాగాడు. గోర్కీ 'నా బాల్యం', పెరల్ మాన్ 'నిత్య జీవితంలో భౌతికశాస్త్రం' భాస్కర్‌కి బాగా ఇష్టమైన పుస్తకాలుగా కడదాకా కొనసాగాయి. కొడుకు ఇంజినీరు కావాలని కామేశం ఆశపడ్డాడు. 'మా భాస్కరం కలెక్టరవుతాడు,' అంటూంటేది అతని అమ్మమ్మ. ఆమెకు తెలిసిన అతి పెద్ద ప్రభుత్వోద్యోగం అదే మరి.

సాయంత్రం పూట టౌనుహాలు వద్ద కలుసుకొని కర్రతిప్పి, కబడ్డీ ఆడి, విదేశీయులు మాతృభూమికి చేసిన ద్రోహం గురించి కథలు చెప్పుకొనే చెంగల్రావుపేట యువకుల బృందం ఒకటి ఉండేది. అందులో చేరమని భాస్కర్‌కి ఆహ్వానం అందింది. ఒకరిద్దరితో పరిచయం కూడా ఏర్పడింది గానీ వాళ్ల వాదనలలో పసలేదని భాస్కర్‌కి అనిపించింది. వాళ్ల సమాచారం తప్పులతడక అనీ, తమ విశ్వాసాలను సమర్థించుకోవడానికని చేసే ప్రచారం అనికూడా అతనికి అనిపించింది. వాళ్లల్లో అత్యధికులు తమ కులం వారేనన్నది కూడా భాస్కర్ గమనించాడు. ఓమారు వాళ్ల ప్రసక్తి వచ్చినపుడు తండ్రి కామేశం,

"పైకి చెప్పరుగానీ, వాళ్లకి హీరో గాడ్సే రా" అన్నాడు. ఆ మాట భాస్కరానికి ఆశ్చర్యం కలిగించింది. 'అటువంటి వాళ్లుకూడా ఉంటారా?' అనుకున్నాడు.

కామేశం సాహితీ మిత్రులు తరచూ ఇంటికి వస్తూండేవారు. సత్తెన్న మరణించాక వారి రాకపోకలు మరింత ఎక్కువయ్యాయి. కవితా పఠనాలు, చర్చలు,

కొత్త పుస్తకాల పరిచయాలు – ఇవన్నీ పక్క గదిలో చదువుకుంటూన్న భాస్కర్ చెవినపడుతూనే ఉన్నాయి.

ఒక రోజున – భాస్కర్ పీ.యూ.సీ.లో ఉన్నప్పుడు – 'కన్యాశుల్కం' నిత్య నూతనత్వపు రహస్యం ఏమిటి? అనే అంశంపై చర్చ జరుగుతోంది. అతడు అప్పటికే ఆ నాటకాన్ని చదివి ఉన్నాడు. చర్చను ప్రారంభించిన ఒక లాయరుగారు –

"కోస్తాంధ్ర ప్రత్యేకత అయిన అగ్రహారాలు ఛాందసానికి ఆయువుపట్లుగా ఘనీభవించాయి. అయితే బ్రిటిష్ పాలన తెచ్చిన మార్పుల మూలంగా అగ్రహారాలలో పేరుకుపోయిన భావజాలం తమ పట్టును సడలించనారంభించింది. గురజాడ – ఇంగ్లీషు చదువులు, ఉద్యోగాలవైపు తొలుత మొగ్గిన నియోగి బ్రాహ్మణుల్లో ఒకడు కావడం, తన నాటకాన్ని రాజుగారికి అంకితం ఇవ్వడం యాదృచ్ఛికాలు కానేకావు," అన్నాడు.

చదువుతూన్న ఫిజిక్స్ పుస్తకాన్ని పక్కన పెట్టి, పక్కగదిలో జరుగుతూన్న చర్చపై దృష్టి పెట్టాడు భాస్కర్. ఆనాటి చర్చ సారాంశం –

'బ్రాహ్మణులలోని ఒక సమూహంలో మొదలైన మార్పులను గురజాడ – 'కన్యాశుల్కం'లో నాటకీయం చేశాడు. సంధి కాలాలకూ వర్తింపజేయగల అంశాలు అనేకం 'కన్యాశుల్కం'లో పుష్కలంగా ఉండడమే దాని నిత్య నూతనత్వానికి ప్రధాన కారణం' – ఈ విధంగా చర్చ సాగుతోంది.

ఇంతలో తండ్రి కామేశం, అమ్మమ్మ కాచిన టీని కప్పుల్లో పోసి మిత్రులకు అందజెయ్యడానికి వంటింట్లోకి వెళుతూ భాస్కర్‌తో –

"చాలా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఇంకో పది నిమిషాల్లో ముగిస్తాం. నీ చదువుకి ఆటంకంగా ఉందేమో కదా?" అన్నాడు.

"మీ చర్చను నేనూ ఫాలో అవుతున్నాను. నేను రాత్రయినా చదువుకుంటాను గానీ ఒక విషయాన్ని మీరు విస్మరిస్తున్నట్లు నాకనిపిస్తోంది".

"అలాగా? నువ్వు కూడా మాతో చేరి అదేమిటో చెప్పరాదూ?" అన్నాడు కామేశం, టీ కప్పుల్ని ట్రేలో పేరుస్తూ.

తండ్రీ కొడుకులిద్దరూ చెరో ట్రే పెట్టుకొని హాలులో ప్రవేశించారు.

కామేశం తన మిత్రులను ఉద్దేశించి, "మా భాస్కర్ కొన్ని కామెంట్స్ చేరుస్తాడట" అన్నాడు.

"చెప్పు, చెప్పు," అన్నారు అక్కడ కూర్చున్నవాళ్లంతా. జంకూగొంకూ లేకుండా భాస్కర్ చెప్పనారంభించాడు –

"మీరనేది నిజమే. 'కన్యాశుల్కం' నాటకం, ముందుగా ఆధునిక స్వభావాన్ని ఏర్పరచుకున్న ఒక సమూహం నడిచివచ్చిన దారిని ప్రతిబింబించింది. గిరీశం పాత్ర, ఆ క్రమంలోని పరిమితులను అపహాస్యం చేస్తుంది. మధురవాణి, మిగతా అన్ని పాత్రల హిపోక్రసీని బహిర్గతం చేస్తుంది. ఆ నాటకం, మారుతోన్న సమాజం మీద కామెంట్ మాత్రమే కాదు, ఆ కామెంట్ మీద మధురవాణి, గిరీశం పాత్రల ద్వారా గురజాడ నడిపించిన కామెంటరీ కూడా. ఆ నాటకంలో ఒక యూనివర్సల్ మెథడాలజీ ఇమిడి ఉన్నది," అన్నాడు.

సాహితీ మిత్రులంతా చప్పట్లు కొట్టారు; 'నువ్వు ఈ వాదనని వ్యాస రూపంలో వెలువరించాలి' అన్నారు. ఆనాటి నుండీ వారంవారం జరిగే వాళ్ల చర్చలలో భాస్కర్ కూడా ఉత్సాహంగా పాల్గొనసాగాడు. ఇది కామేశానికి అమితమైన ఆనందాన్నీ, కించిత్తు గర్వాన్నీ కలగజేసింది.

కామేశం అభ్యుదయవాదేగానీ సముద్రం మీదుగా తూరుపు గాలులు వీచినపుడు జాలారిపేట నుంచి ఒక్కోసారి గుప్పుమని వెలువడే చేపల వాసనని భరించలేక, 'అబ్బ! పొద్దున్నే ఈ వెధవ కంపు!' అంటూ విసుక్కునేవాడు. అతగాడు రాజకీయాలలో నెహ్రూ తరహా సోషలిస్టు. 1962లో చైనాతో జరిగిన యుద్ధంతో కమ్యూనిస్టులంటే కామేశంలో ఏర్పడ్డ విముఖత చివరిదాకా కొనసాగింది. నెహ్రూ మరణం అతన్ని కృంగదీసింది. ఇందిరా గాంధీ రాజకీయాలు అతనికి మనస్తాపం కలిగించాయి. కామేశం నాస్తికుడు కాదు గానీ సంశయాళువు. భాస్కరం -

"తాత పోయాక మా నాన్న జంధ్యం తీసిపారేశాడు. బంధువర్గం ఎంత గోల పెట్టినా నాకు ఒడుగు చెయ్యనేలేదు. తాతగారికి ఆబ్దికాలు పెట్టలేదు. ఆ మేరకు అతడు అభ్యుదయవాది – సందేహం లేదు," అనేవాడు.

పీ.యూ.సీ. పూర్తయ్యేనాటికి భాస్కరానికి సాహిత్యంలోనే కాకుండా రాజకీయాల్లో కూడా ఆసక్తి పెరిగింది. పేపర్లు చదవడం, తండ్రితో వాదించడం, స్నేహితులతో చర్చించడం – మొదలయ్యాయి. కొన్ని విషయాల్లో తండ్రితో ఏకీభవించినా, పరిష్కారం ఇంకెక్కడో ఉందని భాస్కరానికి అనిపించసాగింది.

సమాజాన్ని పీడిస్తున్న సమస్యల మూలాలను స్వయంగా పరిశోధించి తెలుసుకోవాలని భాస్కర్ నిశ్చయించుకున్నాడు. రానురాను అతని సాయంత్రాలు పుస్తక పఠనంలోనూ, లేదంటే చదివిన సంగతులను నెమరువేసుకుంటూ సముద్రతీరం వెంట ఒంటరిగా నడవడంలోనూ గడచిపోయేవి. నూకరాజు అతని జీవితంలోకి ప్రవేశించే వరకూ భాస్కరానికి గొప్ప స్నేహితులంటూ ఎవరూ లేరు.

* * *

పీ.యూ.సీ.లో ఉండగా నూకరాజుకి ఉదయ భాస్కర్‌తో పరిచయం ఏర్పడింది. భాస్కర్ సైన్సు గ్రూపులో అదే కాలేజీలో పీ.యూ.సీ. చదువుతున్నాడు. తెలుగు, ఇంగ్లీషు క్లాసులలో పక్కపక్కనే కూర్చునేవారు. కొద్ది రోజుల్లోనే ఆ పరిచయం స్నేహంగా మారింది. ఆ స్నేహం నూకరాజు జీవితాన్ని ఒక ఊహించని మలుపు తిప్పింది.

భిన్నధ్రువాల మధ్య ఆకర్షణ ఉంటుందంటారు. ఏ.వీ.ఎన్. కాలేజీలో నూకరాజు, భాస్కర్‌ల మధ్య ఏర్పడ్డ లోతైన స్నేహానికి వాళ్ల భిన్న స్వభావాలే కారణం.

భాస్కర్ తెల్లగా బక్కగా ఉంటాడు. జుత్తు రేగిపోయి ఉంటుంది. అతనిలో దాగిన ఆరాటం, అసహనం, తొందరపాటు అతన్ని ముందుకి నడిపిస్తున్నట్లుగా తోస్తుంది. అతని పాదాలు నేలమీద ఉన్నప్పటికీ ఆలోచనలు ఆకాశంలో విహరిస్తున్నాయనిపిస్తుంది. కళ్లజోడులోంచి ప్రసరించే అతని నిశితమైన చూపు వాడిగా తగిలి మొదట్లో కొంచెం ఇబ్బంది కలిగించినా సులభంగా, స్వచ్ఛంగా నవ్వేసే గుణం, అతనికి తొందరగా స్నేహితులను ఏర్పరుస్తుంది. అతనందించే విస్తృతమైన సమాచారం, లోతైన విశ్లేషణ, సీరియస్ విషయాలు మాట్లాడుతున్నా హాస్యపుకోణాన్ని వీడకుండా ఏమాత్రం అవకాశం దొరికినా ప్రత్యర్థులకి మెత్తగా చురక అంటించే అలవాటు అతన్ని వక్తగా తీర్చిదిద్దాయి.

ఇందుకు భిన్నంగా – నూకరాజుది చామనచాయ; బాగా నూనె పట్టించి, నున్నగా దువ్విన వంకీల జుత్తు. అతడు దయతో నిండిన విశాలమైన నేత్రాలను కలిగి ఉంటాడు. చెవులకు రింగుల కోసమని చేసిన కన్నాలుంటాయి. అతని చేతులు పొడుగ్గా, వేళ్లు బలంగా ఉంటాయి – ఎముకల దృఢత్వాన్నీ, కాయకష్టాన్నీ సూచిస్తూ. ఒడిదొడుకులనూ, ఆటుపోట్లనూ ఎదుర్కొనగల స్వభావం కలిగిన వ్యక్తిగా, వయసుకి మించిన పరిపక్వత, నిలకడ కలిగిన వాడిలా కనిపిస్తాడు. నూకరాజు మంచి శ్రోత; మితభాషి; ఆచితూచి మాట్లాడతాడు. అతని మాటల్లోని మృదుత్వం, ఎవర్నీ కష్టపెట్టకూడదనే చింతన అతని పట్ల గౌరవాన్ని కలిగిస్తాయి. అతనితో ఏ విషయాన్నైనా నిస్సంకోచంగా చర్చించవచ్చు, ఏ రహస్యాన్నయినా నిర్భయంగా పంచుకోవచ్చు అనే భరోసా ఏర్పడుతుంది. తరచూ కొంచెం సిగ్గుతో మిళితమైన చిరునవ్వులు చిందిస్తూంటాడుగానీ, అతను పడీపడీ నవ్వడం ఎవరూ చూడలేదు.

పీ.యూ.సీ.లో భాస్కర్ పరిచయం అయిన కొత్తలో నూకరాజుని మొట్టమొదట ఆకర్షించిన అంశం – అతని అపారమైన లోకజ్ఞానం. 'ఈ భాస్కర్‌కి తెలియని విషయం అంటూ ఏదైనా ఉందా?' అని నూకరాజు ఆశ్చర్యపోయాడు. అదే మాట అతనితో అంటే,

"అదేం కాదులే గానీ, పేపర్లు చదువు" అని ముక్తసరిగా జవాబిచ్చాడు భాస్కర్.

అప్పుడు చేసుకున్న ఆ అలవాటు నూకరాజుని జీవితాంతం అంటిపెట్టుకొని ఉంది.

తానిప్పుడు తెలుగు పేపరు తెప్పించుకొని రోజూ ఇంటివద్ద చదువుతున్నాననీ, కాలేజీ లైబ్రెరీలో ఇంగ్లీషు పేపర్లు చూస్తున్నాననీ నూకరాజు భాస్కర్‌కి – ఒకింత బడాయిగా చెప్పినప్పుడు,

"పేపర్లలో రాసిందల్లా నమ్మకు," అంటూ గాలి తీసేశాడు.

"అంటే?" – నూకరాజుకి అర్థం కాలేదు.

"పేపర్లలో ఉన్నవే కాకుండా ఇంకా ఎన్నో విషయాలూ, విశేషాలూ ఉంటాయి," అన్నాడు.

అప్పటి వార్తలను విశ్లేషిస్తూ, వాటి వెనుకనున్న శక్తులనూ, మూలాలనూ నూకరాజుకి వివరించాడు.

ఏదీకూడా పైకి కనిపించేటంత సరళంగా ఉండదనే సత్యం తొలిసారిగా నూకరాజుకి బోధపడింది. అంతేకాదు, మొదటిసారిగా – 'బూర్జువా ప్రెస్' అనే మాటను కూడా అనాడే తొలిసారిగా విన్నాడు.

ఆనాటి నుండీ వార్తలను విశ్లేషించడం, చర్చించడం వాళ్లిద్దరికీ పరిపాటి అయింది. భాస్కర్ సూక్ష్మ బుద్ధి, నిశితమైన పరిశీలన, సంఘటనల వెనుక దాగి ఉండే మూలకారణాలని అవలీలగా వెలికితీసే విధానం – నూకరాజుని అబ్బురపరచేవి.

'ఎంతైనా బాపన బుర్ర!' అని మొదట్లో తరచుగా అనుకొనేవాడు.

1969 అక్టోబరులో విశాఖపట్నం సెంట్రల్ జైలునుండి – ఆదిభట్ల కైలాసం, నాగభూషణ్ పట్నాయక్‌లతో సహా పదకొండు మంది నక్సలైట్లు నాటకీయంగా పారిపోవడం, ఆ మరుసటేడు సత్యం, కైలాసంల ఎన్కౌంటర్లు – భాస్కర్, నూకరాజులు వివరంగా చర్చించుకున్న వార్తలలో ఇవి కూడా ఉన్నాయి.

* * *

భాస్కర్ మొదటిసారి ఇంటికి వచ్చినప్పుడు అన్నంలో చేపల పులుసు కలుపుకొని, ఇష్టంగా తినడం నూకరాజుకీ, అతని తల్లి పోలమ్మకీ కించిత్తు ఆశ్చర్యం కలిగించింది. నూకరాజు ఇంట్లో చేపలు తిన్నప్పుడు తొలి రోజుల్లో కొంత ఇబ్బంది పడ్డాడు. బయటకి అనకపోయినా 'బ్రాహ్మణ కులంలో పుట్టినప్పటికీ ఇవన్నీ తింటూ ఎంత అభ్యుదయవాదిగా మారిపోయానో చూడండి' అని ప్రకటించుకొనే అతిశయం, బడాయి అతనిలో తలెత్తి అతనికే ఆశ్చర్యం కలిగించాయి.

ఒకరోజు నూకరాజు చేపల పులుసు స్వయంగా వేడిచేసి వడ్డించినప్పుడు పోలమ్మ కలగజేసుకోకుండా చూస్తూ ఊరకుండిపోవడాన్ని మాటల్లో పడి భాస్కర్ గమనించనేలేదు. భోజనాలు అయ్యాక - ఎప్పుడూ లేనిది - నూకరాజు ఇద్దరి కంచాలూ కడిగి, వంటింట్లో పెట్టి ముందు గదిలోకి వచ్చాడు.

"ఏమైంది? మీ అమ్మకి ఒంట్లో బాగోలేదా?" అన్నాడు భాస్కర్.

"శనివారం కదా! మా యమ్మ నీసు ముట్టదు" అని నూకరాజు బదులు చెప్పాడు.

ఆనాటి నుంచి భాస్కర్, నూకరాజు ఇంట్లో భోజనం చేసినప్పుడల్లా తనే ఇద్దరి కంచాలూ కడిగేవాడు. కొన్నాళ్లయ్యాక పోలమ్మా, నూకరాజూ అతన్ని వారించే ప్రయత్నం విరమించుకున్నారు.

భాస్కర్ తల్లి అతని చిన్నతనంలోనే పోయిందని తెలుసుకున్నాక పోలమ్మ అతన్ని స్వంత కొడుకు మాదిరిగానే ఆదరిస్తోంది. వచ్చినప్పుడల్లా భోజనం చేస్తే తప్ప గడప దాటనివ్వదు.

కొంత కాలం గడిచాక పోలమ్మకి ఒక సందేహం కలిగింది. ఆమె నూకరాజుతో –

"మీ ఫ్రెండు నిజంగా బేపనోడేనంటావా? పతీదీ తినేస్తాడు! ఒక సెనోరం నేదు, ఒక సివరాత్తిరి నేదు," అన్నది.

నూకరాజు నవ్వి ఊరుకున్నాడు.

ఈ సంగతి భాస్కర్‌తో చెబితే, అతడు నూకరాజు భుజం చరిచి,

"అబ్బా! అలాగా? చెప్పవేం మరి? ఇది నిజంగా నాకు పెద్ద కాంప్లిమెంట్. మీ అమ్మకి థాంక్స్ చెప్పాలి," అన్నాడు ఉత్సాహంగా.

నూకరాజు అతని స్నేహితుడి ముఖంలోకి తేరిపార చూశాడు.

"మనదేశంలో వర్ణాన్ని, మతాన్ని వదిలించుకోగలమేమో గానీ కులంనుంచి బయటపడడం దాదాపుగా అసాధ్యం," అన్నాడు ఆవేశంగా.

"మనం ఆలోచించేది, చెప్పేది, చేసేది – ఈ మూడూ ఒకేసారి మారితేనే అది సాధ్యపడుతుంది. అది చాలా కష్టం," అన్నాడు నూకరాజు, నింపాదిగా.

ఈ సంభాషణ జరిగిన సాయంత్రం పూట వాళ్లిద్దరూ కాలేజీ డౌన్ నుంచి ఎల్లమ్మతోట వైపుగా నడుస్తూ 'బాటా' బయట, పేవ్ మెంటుమీద ఉండే పాత పుస్తకాల దుకాణం ముందు ఉన్నారు. బీచి రోడ్డు షికార్లు తగ్గించి ఈ మధ్య తరచూ మెయిన్ రోడ్డు వైపుగా వస్తున్నారు. ఆ దారిలో వాళ్లకి రెండు మజిలీలు – ఒక గమ్యం.

మొదటిది ఆ పాత పుస్తకాల దుకాణం. రెండోది శివాలయం ప్రక్కనే ఉండే కిళ్లీ కొట్టు. కలకత్తా నుండి వెలువడే 'ఫ్రాంటియర్'తో సహా విప్లవ, లేదా అభ్యుదయ రాజకీయ, సాహిత్య పత్రికలు ఊరంతటికీ ఆ ఒక్క చోటనే దొరికేవి. ఇక గమ్యం – జగదాంబ థియేటర్ నుండి లీలామహల్‌కి వెళ్లే దారిలో ఉండే శర్మా పంజాబు టీ దుకాణం. అక్కడ పావలా ఇచ్చి చిక్కటి మసాలా టీలు 'ఒన్-బై-టూ' తాగుతూ, మిత్రులతో సంభాషణలు, చర్చలు, వాదనలు జరుపుతూంటే గంటలు కూడా నిమిషాల్లా గడిచిపోయేవి.

ఆనాడు భాస్కర్, పాత పుస్తకాల దుకాణం నుంచి బయలుదేరుతూ,

"ఈ శుభ సందర్భంలో శర్మా పంజాబులో చాయి తాగాలి. నీ దగ్గర ఎంతుంది?" అన్నాడు.

"అలాగేలే, ఐదు రూపాయలున్నాయి," అని నూకరాజు తన సమ్మతిని తెలిపాడు.

"అంటే మనం ఈరోజున బాగా ధనవంతులమే! అంత డబ్బు కూడబెట్టడం కూడా క్షమించరాని నేరం! సంఘ ద్రోహం! చిత్రాలయలో ఏం సినిమా ఆడుతోంది?" అని అడిగాడు, భాస్కర్.

"ఏమో, తెలీదు. పోస్టర్లు చూద్దాం ఆగు."

"అవసరం లేదు. టీ తాగాక, ఏదుంటే అది చూసేద్దాం," అని సిగరెట్టు వెలిగించాడు భాస్కర్.

వాళ్లు టీ దుకాణంలోకి అడుగుపెట్టగానే 'ఉప్ కార్' సినిమాలో మన్నాడే పాట 'కస్మె వాదే ప్యార్ వఫా' వినబడుతోంది. వచ్చీరాని హిందీలో తనను ఆప్యాయంగా పలకరించే భాస్కర్ అంటే శర్మాజీకి చాలా అభిమానం. తను కొత్తగా కొన్న ఎచ్. ఎం.వీ. రికార్డు ప్లేయర్ని గర్వంగా ప్రదర్శించాడు. హిందీ పాటల లాంగ్ ప్లే (ఎల్పీ) రికార్డుల్ని భాస్కర్‌కి చూపించాడు శర్మాజీ. వాటిల్లో 'పడోసన్', 'జ్యూయల్ థీఫ్', ఉన్నాయి.

ఆ సాయంత్రం భాస్కర్, నూకరాజులిద్దరూ పరమచెత్త తెలుగు సినిమాకి అడ్డంగా దొరికిపోయారు.

* * *

భాస్కర్‌కి పీ.యూ.సీ.లో మంచి మార్కులు వచ్చాయి. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగు కాలేజీలో సీటు వచ్చింది. కామేశం ఇచ్చిన సలహాను పాటించి, నూకరాజు ఏ.వీ.ఎన్. కాలేజీలోనే బియ్యే ఎకనామిక్స్ మెయిన్‌లో చేరాడు. ఇంకా చదువుకోవాలని నూకరాజు స్వయంగా నిర్ణయించుకున్నందుకు ఎల్లమ్మ చాలా

సంతోషించింది. అటెండరు ఉద్యోగంతో తృప్తి పడనక్కరలేదనీ, కొడుకు ఎల్లమ్మకి సరిజోడీగా ఆఫీసరవుతాడనీ పోలమ్మ తన ఆశాసౌధాలను మరింత ఎత్తుకి పెంచుకుంది.

స్నేహితులిద్దరూ తమతమ కాలేజీలలో క్లాసులు అయ్యాక కలుసుకొని సముద్రతీరం వెంట నడుస్తూ, టీలు తాగుతూ గంటలకొద్దీ మాట్లాడుకొనేవారు. ప్రేమ, సెక్సు, ఫ్రాయిడ్ సిద్ధాంతాలు, చలం, రావిశాస్త్రి, బీనాదేవిల రచనలు, సినీమాలు, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ విశేషాలు, సైన్సు, ఆర్టు...ఒకటేమిటి? – అన్నీ వాళ్లకి ఆసక్తిని కలిగించే విషయాలే.

భాస్కర్ ప్రాణంపెట్టే 'మహాప్రస్థానం' కవితల్ని నూకరాజు మళ్లీమళ్లీ చదివాడు. చాలా గేయాలు అతనికి కూడా కంఠోపాఠం అయిపోయాయి.

'జడలు విచ్చిన, సుడులు రెచ్చిన
కడలి నృత్యం శమిస్తుందా
నడుమ తడబడి, సడలి ముడుగక
పడవ తీరం క్రమిస్తుందా?
నిజంగానే, నిజంగానే?'

వంటి పంక్తులు నూకరాజుకి బాగా నచ్చేశాయి.

భాస్కర్ అనర్గళంగా మాట్లాడుతూ ఉంటే – 'నేను తెలుసుకోవల్సిన విషయాలూ, చదవాల్సిన పుస్తకాలు ఎన్ని ఉన్నాయో?' అని నూకరాజు తరచూ అనుకొనేవాడు. భాస్కర్ వద్ద పుస్తకాలు తీసుకొని రాత్రి బాగా పొద్దుపోయే వరకూ చదివేవాడు. మర్నాడు ఆయా పుస్తకాలపై నూకరాజు అభిప్రాయం తెలుసుకోకుండా, చర్చ జరపకుండా భాస్కర్ వదిలేవాడు కాదు. రానురాను నూకరాజు కూడా తన అభిప్రాయాలను బలంగా వ్యక్తీకరించడం మొదలుపెట్టాడు. ఒక్కోసారి అతనికీ భాస్కర్ కీ మధ్య తీవ్రమైన వాదోపవాదనలు జరుగుతున్నాయి.

త్వరలోనే భాస్కర్‌లో ఉన్న మరో సుగుణం కూడా నూకరాజు దృష్టికి వచ్చింది. అది అతని అపరిమితమైన కుతూహలం. ప్రతీ విషయంలోనూ భాస్కర్ ఆసక్తి కలిగి ఉండడం నూకరాజుకి ఆశ్చర్యం అనిపించింది. భాస్కర్‌లో ఉన్న కుతూహలానికీ, అతని విషయ పరిజ్ఞానానికీ ఉన్న సజీవ సంబంధాన్ని గుర్తించడానికి నూకరాజుకి ఎంతోకాలం పట్టలేదు.

భాస్కర్ ఇంజినీరింగు రెండవ సంవత్సరంలో ఉండగా అతని అమ్మమ్మ చనిపోయింది. ట్రంకు పెట్టెలో ఆమె దాచుకున్న పెళ్లి శుభలేఖ, ఆమె భర్త ఫొటోలు,

ఉత్తరాలు బయటపడ్డాయి. అమ్మమ్మ కూడా ఒకానొకప్పుడు కొత్త పెళ్లికూతురే అని భాస్కర్‌కి మొట్టమొదటిసారిగా తోచింది. ఆమె శవాన్ని చావుల మదుం తీసికెళుతూ ఉంటే అతనికి ఏడుపు ఎగతోసుకొచ్చింది.

మర్నాడు నూకరాజు తమ ఇంటికి వచ్చినప్పుడు –

"గురజాడ రచనల గురించీ, కందుకూరి సంస్కరణల గురించి మా ఇంట్లో తరచూ చర్చలు జరుగుతూంటాయి. 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' మా నాన్నకి చాలా ఇష్టమైన పాట. అయినా నాకు తెలిసి మా అమ్మమ్మ బాగోగులు మాత్రం మా వాళ్లు ఏనాడూ విచారించనేలేదు. మా తాత ఆమె ఇష్టాయిష్టాలు తెలుసుకున్నట్లు గానీ, అమెకు మళ్లీ పెళ్లి చేయాలని ఆలోచించినట్టుగానీ లేదు. మళ్లీ ఆయనో పెద్ద గాంధీ వాది," అన్నాడు భాస్కర్ ఆవేశంగా.

"మాటలు కాదు, చేతలు ముఖ్యం," అని శాంతంగా తెగ్గొట్టేశాడు, నూకరాజు.

* * *

జాలరుల జీవనం గురించీ, సముద్రంలో చేపల వేట గురించీ నూకరాజుని యక్షప్రశ్నలు వేసి మొత్తం సమాచారం రాబట్టాడు. 'జమీల' ప్రమాదం గురించి నూకరాజు చెప్పినప్పుడు భాస్కర్ చలించిపోయాడు. చాలా సేపు మౌనంగా ఉన్నాక –

"రాజూ! నువ్వు నిజమైన శ్రామికుడివి; ప్రజల మనిషివి. స్వయంగా సముద్రంలోకి వెళ్లి చేపలు పట్టిన వాడివి. ప్రాణానికి ప్రాణం ఇవ్వడం తెలిసిన వాడివి. నీతో పోలిస్తే నేనొట్టి పుస్తకాల పురుగుని," అన్నాడు.

ఈ మాటలన్నప్పుడు భాస్కర్ కళ్లల్లో నీళ్లు తిరగడం నూకరాజు గమనించాడు.

ఆ మర్నాడు భాస్కర్, నూకరాజుని మరిన్ని ప్రశ్నలడిగాడు.

-'జమీల' యాజమాన్యం అన్ని పెద్ద వ్యాపారాల మాదిరిగానే బీమా సౌకర్యం కలిగి ఉందా?

-పరిహారం ఆవిధంగా ఇచ్చిందేనా?

-జాలరులకు బీమా పథకాలు ఎందుకు లేవు?

-జాలరుల భద్రత కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నది?

-'జమీల' ఏక్సిడెంటు రిపోర్టు నూకరాజు చదివాడా? అసలెవరైనా చదివారా? అందులో ఏముంది?

-భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదం మళ్లీ మళ్లీ సంభవించబోదని హామీ ఏమిటి?

భాస్కర్ అడిగిన ప్రశ్నలు వేటికీ కూడా నూకరాజు వద్ద జవాబుల్లేవు. జవాబు చెప్పలేకపోయిందుకు అతనికి కొంచెం సిగ్గనిపించింది. అది గమనించిన భాస్కర్ –

"నీ తప్పేమీ లేదులే. ఏ రిస్కూ లేకుండా పెట్టుబడి అన్ని జాగ్రత్తలూ తీసుకుంటుంది. మొత్తం రిస్కుని శ్రామికుల మీదకి నెడుతుంది. నీలాంటి వాళ్లకి పని, విధేయత తప్ప మరింకేమీ తెలియకూడదనే కోరుకుంటుంది," అన్నాడు.

నూకరాజుకి గందరగోళంగా అనిపించింది.

"కేప్టెన్ జిమ్మీ పాపం మంచివాడు. మమ్మల్ని రక్షించాడు. మాతో మంచిగా, మర్యాదగా ఉన్నాడు. మేము అడగపోయినా ఇంటికి వచ్చి మరీ డబ్బిచ్చాడు," అంటూ అడ్డుతగిలాడు.

"అయితే కావచ్చు; కాదనను. సాధారణంగా మనుషులంతా మంచిగా, న్యాయంగా ఉండాలనే అనుకుంటారు. లేదా ఉన్నాం అనుకుంటారు. ఇక్కడ విషయం – నూకరాజూ, కేప్టెన్ జిమ్మీ అనే వ్యక్తుల మధ్య నడిచిన వ్యవహారమూ, లావాదేవీలూ కావు. మనకన్నా పెద్ద శక్తులు మనల్ని నడిపిస్తాయి. వాటిని గుర్తించడం ముఖ్యం. అప్పుడే మనం తీసుకొనే నిర్ణయాలు ఏమేరకు నిజంగా మన స్వంతమో తెలుస్తుంది, చాలాసార్లు ఆ శక్తులకు వ్యతిరేకదిశలో ప్రయాణించాల్సి ఉంటుంది," అన్నాడు.

ఈ పాఠాన్ని నూకరాజు ఎన్నడూ మర్చిపోలేదు.

ఒక రోజున భాస్కర్ –

"ఈ రోజు సాయంత్రం హాస్టల్లో మీటింగు ఉంది. నువ్వు రావాలి," అన్నాడు.

నూకరాజు వెళ్లేసరికి సుమారు పాతికమంది డైనింగు హాలులో కూర్చొని ఉన్నారు. మీటింగు ఇంకా మొదలుకాలేదు; టీలు తాగుతూ గడగడా మాట్లాడుకుంటున్నారు. వాళ్లల్లో ఐదారుగురు అమ్మాయిలు కూడా ఉన్నారు. బోర్డుమీద 'విశాఖ ఉక్కు ఉద్యమం: గుణపాఠాలు' అని వ్రాసి ఉంది. ఆనాటి ప్రధాన వక్త ఏ.యూ. ఇంజినీరింగు కాలేజి ఫైనల్ ఇయర్ విద్యార్థి అయిన గిరిధర్ అనీ, ఆ మీటింగుకి వచ్చిన వాళ్లల్లో ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మే చేస్తున్నవాళ్లూ, ఆంధ్రా మెడికల్ కాలేజీలో మెడిసన్ చదువుతూన్న విద్యార్థులూ ఉన్నారనీ, వచ్చి పక్కనే కూర్చున్న భాస్కర్, నూకరాజు చెవిలో చెప్పాడు. అంతలో ఒక అమ్మాయి హడావుడిగా లోపలికి వచ్చింది.

భాస్కర్ లేచి, "కమలా!" అని ఉత్సాహంగా పలకరించాడు. ఆమె చిన్నగా నవ్వి, అమ్మాయిల సరసన కూర్చుంది.

"కమల అనీ – మెడిసన్ చదువుతోంది" అన్నాడు భాస్కర్, నూకరాజుతో. అలా అన్నప్పుడు భాస్కర్ కళ్లల్లో ఏదో కాంతి తొణికిసలాడింది.

ప్రధాన వక్త గిరిధర్ సన్నగా పొడుగ్గా ఉన్నాడు. నున్నగా గీసిన గడ్డం, కళ్లజోడు, టక్ చేసుకొని, మెరిసే షూస్‌తో టిప్‌టాప్‌గా ఉన్నాడు. 'ధనిక కుటుంబం నుండి వచ్చి

ఉంటాడు' అనుకున్నాడు నూకరాజు. కలుపుగోలుతనంతో కూడిన అతని నవ్వు మొహం ప్రసన్నంగా ఉంది. అతని వాక్ప్రవాహాన్నీ, అతని హావభావాలను గమనిస్తే అతనికి తన లక్ష్యంపట్ల స్పష్టత ఉన్నదనీ, అతనిలో చాలా శక్తి దాగి ఉన్నదనీ అనిపిస్తుంది. అతను ఇంగ్లీషులో మాట్లాడాడు. బాణాల వర్షంలాగా అతని మాటలు దూసుకొచ్చాయి.

గిరిధర్ ఇచ్చిన ఉపన్యాసపు సారాంశం – విశాఖ పోర్టులో కళ్లముందే ఇనుప ఖనిజం జపానుకు ఎగుమతి అవుతోంది. అదే జపాను నుండి నౌకా నిర్మాణానికి కావాల్సిన ఉక్కు ప్లేట్లను దిగుమతి చేసుకుంటున్నాం. ఇది సరికాదు. మన వనరులను మనమే వినియోగించుకుంటూ, పరిశ్రమలు స్థాపించి ఉద్యోగవకాశాలు కల్పించాలి. 'విశాఖ ఉక్కు' ఉద్యమ కాలంలో ఈ సందేశం అందరికీ సులభంగా అర్థం అయింది. రాష్ట్రమంతటా ఇదే విధమైన ఉద్యమాలను చేపట్టాలి.

అంతా ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు. చర్చ నడిచింది. ప్రశ్నలన్నింటికీ గిరిధర్ తడుముకోకుండా, చకచకా సమాధానాలు చెప్పాడు. ఏక్షన్ కమిటీ ఏర్పడింది. భాస్కర్ ని ఒక కమిటీ సభ్యుడిగా తీసుకున్నారు. ఆ కమిటీలో అందరిలోకీ చిన్నవాడు అతడే.

మీటింగు అయ్యాక నూకరాజుని కమలకి పరిచయం చేశాడు, భాస్కర్.

"మీ గురించి భాస్కర్ నాకు చాలా సంగతులు చెప్పాడు," అంది కమల, స్నేహపూర్వకంగా.

"మీ గురించి నాకేమీ చెప్పలేదు," అని నూకరాజు, కొంచెం అలకతో కూడిన స్వరంతో.

ముగ్గురూ నవ్వుకున్నారు. కాసేపు అవీఇవీ మాట్లాడుకున్నాక –

"మేము 'ఆనంద్' సినీమాకి వెళ్తున్నాం, వస్తావా?" అని భాస్కర్ నూకరాజుని అడిగాడు.

"మొన్ననే చూశాం కదా?!" అన్నాడు నూకరాజు ఆశ్చర్యంగా.

"గొప్ప సినిమా; కాబట్టి మరోసారి చూడొచ్చు; తప్పులేదు. పైగా కమల ఇంకా చూడలేదు," అన్నాడు భాస్కర్. నూకరాజుకి వెలిగింది.

"మీరు వెళ్లండి. నాకు పనుంది," అని తప్పించుకున్నాడు.

గిరిధర్ చుట్టూ మూగిన శ్రోతలు పల్చబడ్డారు. అతడు పెద్దపెద్ద అంగలు వేస్తూ వచ్చి, భాస్కర్‌ని ఆప్యాయంగా పలకరించాడు. భాస్కర్ అతనికి నూకరాజుని పరిచయం చేశాడు. కమల గిరిధర్‌కి ముందే తెలుసు. ఐదారు ప్రశ్నలు వేసి నూకరాజు

నేపథ్యం రాబట్టాడు గిరిధర్. కమల అక్కడికి వచ్చిన అమ్మాయిలతో మాట్లాడుతోంది. గిరిధర్ –

"ఒక్క నిమిషం! నీకో పుస్తకం ఇవ్వాలి, నా బ్యాగులో ఉంది, నాతో రా" అంటూ భాస్కర్‌ని పక్కకు తీసుకెళ్లి, అతనికి మాత్రమే వినిపించేలా, తగ్గు స్వరంలో –

"నగరాలలో విద్యార్థి సంఘాల్లోనూ, పారిశ్రామిక వాడల్లోనూ మాత్రమే కాకుండా, తీర ప్రాంతాలలో మత్స్యకారుల సమస్యలపైన కూడా పని చెయ్యమని పార్టీ ఆదేశించింది. మనకు రాజు సాయపడగలడు," అన్నాడు. తరువాత ఇద్దర్నీ ఉద్దేశించి, ఇంగ్లీషులో –

"పశ్చిమ తీరంలో, కొచ్చిన్ చుట్టుపక్కల బహుళజాతి సంస్థలు పెద్ద ఎత్తున ఫిషింగ్ ట్రాలర్స్ – అంటే ఆధునికమైన పెద్ద మర పడవలతో – రొయ్యల వేట, ట్యూనా వేట, ఎగుమతులు మొదలుపెట్టాయి. ఈ కార్యకలాపాలు రేపోమాపో ఇక్కడికి కూడా విస్తరిస్తాయి. తెరచాప పడవల్లో వెళ్లి సాంప్రదాయక పద్ధతిలో చేపలు పట్టే జాలరుల ఉపాధి పోతుంది. దీని మీద మనం అప్రమత్తంగా ఉండి, సమయం రాగానే ఉద్యమించాలి," అన్నాడు, గిరిధర్.

డీప్ సీ ఫిషింగ్ ట్రాలర్లు, మర పడవలు, రొయ్యల ఎగుమతి, లాంగ్ లైన్ ట్యూనా ఫిషింగ్ – ఈ మాటలు నూకరాజు వినడం అదే మొదటిసారి. ఆనాడు గిరిధర్ అన్న మాటల ప్రాముఖ్యత తెలిసిరావడానికి నూకరాజుకి మరో రెండేళ్లు పట్టింది.

మర పడవలు

జైలు నుంచి విడుదల కాగానే సింహాచలం అక్క గంగమ్మ ఇంటికి వెళ్లాడు. తమ్ముడిని చూడగానే గంగమ్మ అతగాడు గతంలో చేసిన అకృత్యాలన్నింటినీ మర్చిపోయి కన్నీరు పెట్టింది. 'అయ్యో! ఎంత చిక్కిపోయావురా' అంది.

"ఇప్పుడేం చేస్తావురా?" అని అడిగింది గంగమ్మ.

"ఏమో అప్పా! చూడాలి," అన్నాడు సింహాచలం కొంచెం నిస్పృహగా. అతగాడు జైల్లో ఉండగా అతని భార్య మరొకడిని చూసుకుంది. తన గోడుని అక్కకి చెప్పుకొని బావురుమన్నాడు. 'నువ్వే నన్ను కాపాడాల' అన్నాడు. తమ్ముడి అవస్థలు విన్న గంగమ్మ మనసు కరిగిపోయింది.

వారం తిరక్కుండా మళ్లీ ఒక సాయంత్రంపూట గంగమ్మ ఇంటికి హుషారుగా వచ్చాడు సింహాచలం.

అతను వచ్చినప్పుడు వెంకటేశు, ఎల్లమ్మ, నూకరాజు అక్కడే ఉన్నారు. వాళ్లు ముగ్గురూ – డారల్, డెబొరాలతో బాటుగా – జగదాంబలో 'మెకెన్నాస్ గోల్డ్' సినీమా మ్యాటనీ షో చూసి అప్పుడే తిరిగి వచ్చారు. పతాక సన్నివేశంలోని గుర్రాల దౌడు ఇంకా వారిని ఆవహించి ఉంది. వెంకటేశు, ఎల్లమ్మలు తమ మేనమావని మర్యాద కోసమని పలకరించి ముభావంగా ఊరుకున్నారు.

క్రిందటిసారి వచ్చినపుడు సింహాచలంలో అగుపించిన నిరాశ మాయం అయింది. గొంతులో ఉత్సాహం ధ్వనించింది. అతని మాటల సారాంశం –

యూనియన్ కార్బైడ్ అనే పెద్ద అమెరికన్ కంపెనీ రెండు అత్యాధునిక ట్రాలర్లను రొయ్యల వేటకై పశ్చిమ తీరంనుండి విశాఖపట్నం తీసుకొచ్చింది. పట్టిన రొయ్యల్ని కోల్డు స్టోరేజిలో ఉంచి, ప్రాసెసింగు, పాకేజింగు చేసి ఎగుమతి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ ఆ ట్రాలర్లలోనే ఉన్నాయి. జెట్టర్ హార్బర్లో భాగంగా నిర్మించిన ఫిషింగ్ హార్బర్ని త్వరలోనే తెరుస్తారు. పెద్ద ట్రాలర్లు మాత్రమే కాకుండా,

మర పడవలు కూడా ఫిషింగ్ హార్బరు సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. రాబోయే రోజుల్లో హవా అంతా మరబోట్లదే.

"ఎన్నాళ్లు సేపలు పడితే మాత్రం మనకేటి మిగిలింది? నూస్తానే ఉన్నాం కాదా – గొర్రె తోక బెత్తెడే! రొయ్యలేటలోగాని దిగితే పత్తీ జాలరి కుటమానికీ లచ్చలొచ్చి ఒల్లో పడతాయి. ఇంకోమాట ఇనుకో, సేపల మాదిరిగా రొయ్యల్ని మనం మార్కెట్టుకి మోసుకెల్లి అమ్ముకోనవసరం లేదు. కంపెనీల వోల్లే జెట్టీ దగ్గరకొచ్చి కల్లకద్దుకోని మొత్తం అట్టుకుపోతారు" అంటూ ముగించాడు.

గంగమ్మ ఒక్కర్తే సింహాచలం మాటల్లో ఆసక్తి కనబరిచింది. నూకరాజుకి గిరిధర్ చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది.

"అయితే మరేటి సెయ్యాల?" అని గంగమ్మ తమ్ముడిని అడిగింది.

"మర పడవ ఒక్కోటి పాతిక, ముప్పై లచ్చలవుద్ది. మనం ఐదు లచ్చలు మదుపెడితే చాలు, బేంకోడు మిగతాది సూసుకుంటాడు," అన్నాడు సింహాచలం.

"అయ్యబాబోయ్! అంత మదుపు మన దగ్గరెక్కడుందిరా?"

"బావ పోయినప్పుడు ఓడల కంపెనీవోల్లిచ్చిన లచ్చా బేంకులేసుకున్నన్నావు కాదా? అది తియ్యి. మిగతాది నాకొగ్గీ." నూకరాజు వెంకటేశుకి సైగ చేశాడు.

వెంకటేశు తన తల్లితో, "అయన్నీ మనం పడలేంలే అమ్మా! అయినా మనకంత అవసరం ఏటుందిప్పుడు?" అన్నాడు. సింహాచలం కేసి తిరిగి,

"ఆలోచిద్దాంలే మావయ్యా! అర్జెంటైతే ఇంకెక్కడైనా చూసుకో," అన్నాడు - 'ఇక నువ్వు దయచెయ్యి' అని అర్థం వచ్చేలా. సింహాచలానికి కోపం వచ్చింది.

"నాకేటిరా అర్జెంటూ! మనోలు బాగుపడతారనీసి మొదాట మీకు సెప్పేను. శానా మంది జనం మర పడవలు కొన్నందుకు పరిగెట్టుకొస్తన్నారు. శాంతమూర్తిగారి దగ్గర చుట్టం – యూనవరిసిటీల ప్రొఫెసరు నాయుడుగారనీసి, ఆయన మదుపు పెడతాను, ఒచ్చి కలమని నాకు కబురంపించేడు. మనం మనం మొకాలు సూసుక్కూసోనుంటే, పై కులాలోల్లూ, కేరలావోల్లూ ఒచ్చి మొత్తం ఎగరేసుకుపోతారు. తరవాత మన పని చెక్క భజనే," అన్నాడు సింహాచలం.

జాలరులు కాని ఇతర కులస్థులుకూడా చేపలూ, రొయ్యలూ పట్టే పడవలు కొనడానికి పరుగులు తీస్తున్నారంటే గంగమ్మ నమ్మలేకపోయింది.

"యూనవరిసిటీల మాస్టరన్నావు. ఆడికేం పొయ్యేకాలంరా? పాటాలు చెప్పుకోడం మానీసి రొయ్యలేటలో దిగనందుకు?" యూనివర్సిటీ అంటేనే సరస్వతీ నిలయం అనే గంగమ్మ విశ్వాసం ఆ రోజున సడలిపోయింది.

"రోజులు మారిపోనాయే అప్పా! పూర్వంనాగా కాదు. నాలుగు డబ్బులు ఆడతన్నాయంటే పత్తీవోడూ ఊపుకుంటా ఒచ్చేస్తాడు. నువ్వూ నేనూ ఇలా నోరెల్లబెట్టి సూత్తానే ఉంటాం, రేపు బాపనోల్లు కూడా మర పడవలు కొనీసి, పంచెలెగ్గట్టీసి, రొయ్యలేపారంల దిగిపోతారు...ఇంక నేను బైదెల్లాల," అంటూ ఖాళీ టీ గ్లాసు ఎల్లమ్మకి అందించి లేచాడు సింహాచలం.

ఆ రాత్రి గంగమ్మ బాగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చింది. మొత్తానికి సింహాచలం వేసిన ఎత్తు పారింది.

* * *

తూర్పు పాకిస్తాన్ కాందిశీకుల సమస్య పరాకాష్టకి చేరుకుంది. ఏదో ఒకటి చెయ్యాల్సిందే అన్నారంతా. ఊహించినదానికన్నా మరో అడుగు ముందుకెళ్లిన ఇందిరా గాంధీ సైన్యాన్ని పంపింది. బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం మొదలైపోయింది. కామేశం రాత్రికి రాత్రే ఇందిర భక్తుడిగా మారి ఆమె నాయకత్వాన్ని పొగుడుతూ కవితలు వ్రాశాడు. అవి అచ్చయ్యాయి కూడా. అవి చదివి భాస్కర్ మొహం ముడుచుకున్నాడు.

అది చలికాలం. బ్లాకౌటు మూలంగా రాత్రిళ్లు ఊరంతా చిమ్మ చీకటి అలముకునేది. డాల్ఫిన్స్ నోస్ లైటు హవుసుని కూడా నిలుపు చెయ్యడం నూకరాజుకి వింతగా అనిపించింది. దాని కాంతి కిరణంలేని విశాఖ రాత్రుల్ని అతడు ఊహించలేదు. సాయంత్రాలు రాత్రులుగా మారుతూండగా చుట్టూతా పరచుకున్న ఆ చీకట్లలోనే డాబామీద కూర్చొని అతనూ, ఎల్లమ్మా గంటలకొద్దీ మాట్లాడుకొనేవారు. కెరటాల సవ్వడి, కొబ్బరాకుల గలగల, సముద్రం మీదుగా వీచే చల్లటి గాలి – బ్లాకౌటు సాయంత్రాలు, రాత్రులు అలా గడచిపోయేవి. 'నూకరాజూ, నువ్వుకూడా ఇక్కడే తినీసీ. వంటయిపోయింది' అని గంగమ్మ క్రింది నుండే కేకేసేది. 'అలాగే అత్తా, వొస్తన్నాం' అనే వాడు నూకరాజు గానీ మాటలు తెమిలేవి కాదు. భోజనాలయ్యాక కూడా వాళ్ల మాటలు కొనసాగేవి. ఒక్కోసారి వెంకటేశు కూడా వచ్చి వాళ్లతో బాటు కూర్చొనేవాడు.

ఒకనాడు నూకరాజుకి చిన్నాన్న వరస అయ్యే జాలరి ఒకతను సముద్రంలో ఒక పైపు నిటారుగా ఉండడం గమనించాడు. ఆ విషయం సెంట్రల్ సెక్యూరిటీ గార్డులకు చెబితే వాళ్లు ఆ వార్తను నేవీకి తెలియజేసారు. రాత్రికి రాత్రి నేవీవాళ్లు జీపులో జాలారిపేట వచ్చి నూకరాజు చిన్నాన్నని తీసుకుపోయారు. వివరాలు సేకరించి పంపించివేశారు. ఈ సంగతి జాలారిపేట అంతా పాకింది. మరో రెండు రోజుల్లో పాకిస్తానీ సబ్ మెరీన్ 'ఘాజి'ని ముంచేసామని ప్రభుత్వం ప్రకటించింది.

భాస్కర్ పగటిపూట మాత్రమే నూకరాజుని కలిసేవాడు. రాత్రిళ్లు అతనికి ఏవేవో వ్యాపకాలుండేవి. నూకరాజుకి అన్నీ చెప్పేవాడు కాదు. కొన్ని ప్రింటింగు ప్రెస్సులకి వెళ్లి కరపత్రాల వ్రాతప్రతులను అందజేయడం, ప్రింటు అయ్యాక వాటిని గిరిధర్ చెప్పే చోట్లకు చేర్చడం. మరికొంతమందితో కలిసి గోడలపై పోస్టర్లు అంటించడం, నినాదాలు వ్రాయడం – ఇట్లాంటివి.

సాయంకాలాల్లో షికార్లు కొట్టడం, శర్మా పంజాబులో టీ త్రాగడం మానుకున్నారు. నూకరాజుకి అప్పుడు తెలియలేదుగానీ, భాస్కర్ వారానికి రెండుమూడు సార్లు కొండమీద ఉన్న మెడికల్ కాలేజి లేడీస్ హాస్టలుకి వెళ్లి కమలని కలుసుకుంటూండేవాడు.

బ్లాకౌటు రోజుల్లో భాస్కర్‌కి సిగరెట్లు తాగడం అలవాటయింది. మహా ఘాటుగా ఉండే చార్మినార్ సిగరెట్లు కాల్చేవాడు. కొన్నేళ్లయ్యాక చైన్ స్మోకరుగా మారాడు. మానడానికి శతవిధాల ప్రయత్నించాడుగానీ అతని వల్ల కాలేదు.

"ఆ తాగేదేదో ఫిల్టర్ సిగరెట్లు తాగొచ్చుకదా?" అని నూకరాజు విసుక్కొనేవాడు.

"ఘాటు ఎక్కువ, రేటు తక్కువ. అస్లీ మాల్, పైసా వసూల్," అని భాస్కర్ తన హాస్యంతో పక్కదారి పట్టించేవాడు.

అప్పుడప్పుడూ ఇంజినీరింగు కాలేజి హాస్టల్లో కొంతమంది స్నేహితులతో కూర్చొని భాస్కర్ రమ్ము తాగేవాడు. అటువంటి కొన్ని సందర్భాలలో నూకరాజుకి కూడా ఆహ్వానం అందేది. అతడు బిగినీసు జాలరుల వద్ద ఒక బాటిలు తీసుకొచ్చి అందజేసేవాడు. సీమ సరుకుని చూసి మిత్రులు మురిసిపోయేవారు. నూకరాజుకి పెద్ద పీట వేసేవారు. రమ్మో, సిగరెట్లో, బీడీలో తాగడం నూకరాజుకి పెద్ద విషయాలు కావు; చెప్పుకోదగ్గ సంగతులు కావు; అతనికవి అలవాట్లుగా మారనూ లేదు.

భాస్కర్ అటువంటి సందర్భాలలో ఫైజ్, సాహిర్, మఖ్దూంలని తలచుకొనేవాడు ఎడాపెడా వాళ్లని కోట్ చేసేవాడు. అతనిప్పుడు బాగా ఇష్టపడుతున్న కవి – చెరబండరాజు. ఒక రోజున హాస్టల్లో మిత్రులంతా రెండు రౌండ్లు రమ్ము పుచ్చుకున్నాక, భాస్కర్ కుర్చీ మీదకెక్కి చేతిలో పుస్తకం కూడా లేకుండానే –

'చిగురుటాకూ చెప్పునాకూ
గాయపడి నీ చెంత చేరిన
వీరపుత్రునికెంత గాలీ
దాచకుండా వీచగలవు?

మబ్బు తల్లీ, చెప్పు, చెప్పూ
నాలుకెండిన నేలబిడ్డలకెంత నీరూ
నేరుగా కరుణించగలవు?...

అంటూ మొత్తం కవితను చదివేశాడు. మిత్రులంతా, "వాహ్, వాహ్," అన్నారు.

భాస్కర్ చిరాగ్గా, "నాక్కాదు, వాహ్, వాహ్ లు. 'చెర'కి చెప్పండి," అన్నాడు.

"సరే, సరే. నీకోసం కాదు, నీ 'చెర' కోసమే లేవోయ్!...ఛీర్స్!" అని మిత్రులు అతన్ని శాంతింపజేసారు.

"ఇది చెర రాసిన కొత్త కవిత. ఎంత గొప్పగా రాశాడో కదా?" అంటూ పరవశించిపోయాడు భాస్కర్.

"శ్రీశ్రీని వదిలేశావా?" అని నూకరాజు అడిగాడు.

"ఒకవేళ మనం శ్రీశ్రీని వదిలినా ఆయన మనల్ని వదలడు. ప్రస్తుతానికి ఆయనే మహాకవి. చరిత్ర ముందుకి నడుస్తూన్న కొద్దీ – రాబోయే కాలాల మహాకవులు పుట్టుకొస్తారు," అన్నాడు భాస్కర్.

"భలేగా చెప్పావు బాస్! ఛీర్స్!!" అన్నారు మిత్రబృందం.

* * *

ఒక రోజున పొద్దున్నే భాస్కర్ నూకరాజు ఇంటికి వచ్చి,

"గిరిధర్‌తో మరబోట్ల విషయం చర్చించాను. పెట్టుబడిని అడ్డుకోవడానికి జాలరులతో సహకార సంస్థని ఏర్పాటు చేసి, బ్యాంకుల వద్ద ఋణాలు తీసుకొని మర పడవల్ని జాలరులే స్వయంగా కొనుక్కోవాలన్నాడు. అమ్మకాలు, ఎగుమతులు కూడా ఆ సంస్థ ద్వారానే నిర్వహించాలన్నాడు. టెక్నాలజీని అడ్డుకొనే ప్రయత్నం చెయ్యకుండా, ప్రజాహితంగా, పరిమితంగా వాడుకోవాలని అతని అభిప్రాయం. కేరళలో ఈ పరిష్కారం చాలావరకూ విజయవంతం అయిందట. ఆ ఆలోచన నాకు చాలా నచ్చింది. నువ్వేమంటావు? అన్నట్లు, నైలాన్ వలల మూలంగా ఏర్పడే సమస్యల గురించికూడా హెచ్చరించాడు".

"ఆలోచన చాలా బాగుంది. కానీ, మా వాళ్లెవరికీ ఇందులో అనుభవంలేదు. మా ఊరి పెద్దలతో మాట్లాడి చూస్తాను. అయినా గిరిధర్‌కి విషయాలన్నీ అంత బాగా ఎలా తెలుసు?"

"గిరిధర్ నాన్న మలయాళీ; సీ.పీ.ఎం.వాడు. కొచ్చిన్‌లో మత్స్యకారుల సంఘం నాయకుడిగా ఉండేవాడు. ఇప్పుడిక్కడే – ఆంధ్రాలోనే ఉంటున్నాడు – ఆరోగ్యం బాగోలేక. అమ్మ తెలుగామె. విజయవాడ – సీ.పీ.ఐ. కుటుంబం. రష్యాలో మెడిసన్

చదివింది. పిల్లల డాక్టరు. మంచి ప్రాక్టీసు. బీదవాళ్ల దగ్గర డిమాండ్ చెయ్యదుగానీ, ఉన్నవాళ్ల నుండి బాగా లాగుతుంది. వాళ్లది ప్రేమ వివాహం. గిరిధర్ పూర్తి పేరు గిరిధరన్ నాయర్. ఇంజినీరింగు అయిపోయింది. ఆరు నెలల పాటు పాట్రిస్ లుమూంబా యూనివర్సిటీలో రష్యన్ భాష, సాహిత్యాల్లో డిప్లొమా కూడా చేశాడు".

"ఓహో, అదన్నమాట సంగతి! ఇంకో విషయం కూడా జరిగింది. నీకు చెప్పలేదు".

"ఏమిటది?"

"చెప్తున్నా వినకుండా, మా అత్త ఒక పిచ్చి పని చేసిందీమధ్య"

"అత్తంటే – మీ మావయ్య గంగరాజు భార్య,...'జమీల',...ఎల్లమ్మ...?"

"అవును. ఆమే"

"ఏం చేసింది?"

"సిమ్మాచలం అనీ – నాకు చిన్నాన్న అవుతాడులే"

"అవును. స్మగ్లరు. జైలుకెళ్లాడు".

"నీకెలా తెలుసు?"

"ఎలా తెలుస్తుంది? నువ్వే చెప్పావు".

"అలాగా? అయితే విను".

"మా అత్త చేత మరపడవ కొనడానికి మదుపు పెట్టించాడు. మా మావయ్య పోయినప్పుడు ఓడ కంపెనీ వాళ్లిచ్చిన పరిహారం తీసికెళ్లి అందులో పెట్టింది – మేమందరం ఒద్దంటున్నా వినకుండా. మా అత్తా, సింహాచలం చెరో పావలా వాటా తీసుకున్నారు. సగం వాటా – ఎవరో యూనివర్సిటీ ప్రొఫెసరట ఆయన పెట్టాడు".

"ఎవరా ప్రొఫెసర్?"

"నాయుడని – సింహాచలం స్మగ్లింగు చేసే రోజుల్లో శాంతమూర్తి అనేవాడు ఫైనాన్స్ చేసేవాడులే – ఇప్పుడు లిక్కర్ డాన్. అతగాడికి బావమరిది ఈ నాయుడు".

"పెట్టుబడి చాలా దూకుడుగా ముందుకి వెళ్తోందే? అంటే రిస్కులేని లాభసాటి వ్యాపారం అన్నమాట!" అన్నాడు భాస్కర్ నవ్వుతూ.

"అవును. మనమే వెనకబడిపోయాం. అయినా ప్రయత్నిద్దాం, నష్టంలేదు. గిరిధర్ నాన్న మనకేమైనా సహాయం చెయ్యగలడేమో అడుగు. ఈ విషయాల్లో అనుభవం ఉన్నవాడు."

"అలాగే. అడుగుతాను." ఈ సంభాషణ జరిగి రెండు వారాలకు గిరిధర్ తండ్రి

కేన్సర్‌తో మరణించాడు. 1973లో విశాఖలో జరిగిన విరసం సాహిత్య సభలో గిరిధర్ని నూకరాజు ఆఖరిసారి చూశాడు. ఆ తరువాత అతడు పత్తాలేకుండాపోయాడు. ఆ సభలో గిరిధర్ ఇచ్చిన ఉపన్యాసంలో చాలా విషయాలే మాట్లాడాడు; ఎందుకో గానీ 'వియత్నాం ప్రజలు మనకి దారి చూపిస్తున్నారు' అన్న ముగింపు వాక్యం మాత్రం నూకరాజుకి గుర్తుండిపోయింది. తరవాత అతడేమయ్యాడో నూకరాజుకి తెలియరాలేదు. భాస్కర్‌ని అడిగితే తెలియదన్నాడు.

మరో సంవత్సరంలోనే అంతవరకూ ఒకటీ అరా ఉన్న మర పడవల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. అత్యాధునికమైన పెద్ద డీప్-సీ ట్రాలర్లుకూడా ఫిషింగ్ హార్బరుకి రావడం మొదలైంది.

ఏడాది కాగానే సింహాచలం, గంగమ్మల వాటాలకి రెట్టింపు చెల్లించి భాగస్వామ్య సంస్థని స్వంతం చేసుకున్న నాయుడు త్వరలోనే ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని నెలకొల్పాడు. ఎడాపెడా మరపడవల్నీ, ట్రాలర్లనీ కొని, అద్దెకు తీసుకొని, కొత్తగా ఏర్పడ్డ ఫిషింగ్ హార్బర్‌పై తన బావుటాని ఎగరేసాడు. ఎగుమతులను నిర్వహించేందుకు మరో కంపెనీని నెలకొల్పాడు. ప్రభుత్వం ఇచ్చే రాయతీలనూ, బ్యాంకులు ఇచ్చే ఋణ సౌకర్యాలనూ మొదట కొన్నాళ్లు సద్వినియోగం, తరవాత పూర్తి స్థాయి దుర్వినియోగం చేసి అడ్డగోలుగా గడించాడు. తన కులస్థులతో కంపెనీ యాజమాన్యాన్ని నింపేశాడు. మూడేళ్లల్లో ప్రొఫెసర్ నాయుడు, రొయ్యల నాయుడిగా అవతరించాడు. ఊళ్లోని పెద్దమనుషుల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. తన చేతికి మట్టి అంటుకోకుండా సింహాచలాన్ని తన స్థానిక ఏజెంటుగా వినియోగించుకున్నాడు. లోకల్ బ్రోకరుగా పనులు చేసిపెట్టేందుకుగాను వేరే ఒక కంపెనీని స్థాపించి దానికి సింహాచలాన్ని బ్రాంచి మేనేజరుగా నియమించాడు. సంతకం మాత్రమే చెయ్యగలిగిన సింహాచలం తానేదో కలెక్టర్ అయిపోయినట్లుగా పొంగిపోయాడు. అతడు పోలీసులతో సహా వివిధ ప్రభుత్వ విభాగాలతో, స్థానిక రాజకీయ నాయకులతో సత్సంబంధాలు ఏర్పరచుకున్నాడు. బాగా పెద్ద స్థాయి కనెక్షన్లని, ఏర్పాట్లని మాత్రం నాయుడే స్వయంగా చూసుకొనేవాడు.

'త్రిపుర' తన కవితలో చెప్పిన ముసలి పడవలు ఇప్పటికీ విశాఖ తీరంలో చిన్న సభలను నిర్వహించుకుంటూ కనిపిస్తాయి. వాటిని నీళ్లల్లోకి నెట్టి, వేటకు వెళ్లే జాలరులు ఇంకా ఉన్నారు. అయితే చాలా పడవలు మోటార్లతో నడుస్తాయి. నలభై, ఏభై ఏళ్ల క్రితం వరకూ – తెల్లవారకుండా గుంపులు గుంపులుగా బయల్దేరిన తెరచాప పడవలు తీరం వదిలి సముద్రపుటంచుకి పయనం కట్టేవి. వాటి హరికేన్ లాంతర్లు మిణుమిణుకుమంటూన్నా, తెరచాపలు మాత్రం గాలిని నింపుకొని వేల సంవత్సరాల జ్ఞానం, అనుభవం ప్రసాదించిన ఆత్మవిశ్వాసంతో ముందుకి సాగేవి.

సాయంత్రాలలో, ఒక వైపు సూర్యుడు అస్తమిస్తూ, సముద్రపు నీలంపై అరుణ కాంతులను గుప్పిస్తూంటే, గూళ్లకు చేరుకొనే పక్షుల్లా కలసికట్టుగా తిరిగి వచ్చేవి. ఆ సుందర దృశ్యాలన్నీ ఇప్పుడు కనుమరుగయ్యాయి.

* * *

డారల్, డెబొరాలు డిగ్రీ చదువుల్లో ఉండగానే వాళ్ల తాత – షెరాన్, టోనీల తండ్రి అయిన జెఫ్రీ అకస్మాత్తుగా మరణించాడు. అతన్ని పూడ్చిపెట్టినప్పుడు వెంకటేశు, ఎల్లమ్మలు కూడా శ్మశానానికి వెళ్లారు.

ఆ కార్యక్రమం పూర్తయిన వారం రోజులకి టోనీ ఒక సాయంత్రాన తన ఇంట్లో బావ జిమ్మీతో కూర్చొని స్కాచ్ విస్కీ తాగుతూ తండ్రిని తలుచుకొని కన్నీళ్లు పెట్టుకున్నాడు. జిమ్మీ అతని భుజంమీద చెయ్యి వేసి ఓదార్చాడు. 'తాగింది చాలు' అంటూ టోనీ చేతిలో ఉన్న గ్లాసు తీసుకొని పక్కన పెట్టి –

"అంతా ఎప్పుడో ఒకప్పుడు పోవలసినవాళ్లమే," అన్నాడు జిమ్మీ సముదాయింపుగా.

"నా బాధ అదికాదు, జిమ్మీ! మీ నాన్నా, మా నాన్నా మంచి స్నేహితులు. రైల్వేలో ఎన్నాళ్లో కలిసి పనిచేశారు. మంచి పేరు తెచ్చుకున్నారు. వైజాగ్ పోర్టు నిర్మాణం పనుల కోసం ప్రత్యేకంగా ఎంపికయ్యారు. పెద్దపెద్ద ఇంజినీర్లతో పనిచేసారు. అదిగో ఆ ఫొటో చూడు – వైజాగ్ పోర్ట్ ఆవిష్కరణ సందర్భంగా సాక్షాత్తూ వైస్రాయితో దిగిన ఫొటో. ఎంత గౌరవప్రదం! వాళ్లు ఎన్నెన్ని గొప్ప పనులు చేసారు! మీ నాన్న ముందే పోయాడు, ఒక విధంగా అదృష్టవంతుడు. అప్పటికింకా మర్యాదలు, ఇచ్చిపుచ్చుకోవడాలు, మంచిచెడ్డా జరిగితే ఒకరికొకరు సాయంగా నిలబడ్డం – ఇవన్నీ ఉండేవి. అలాంటిది, మొన్న మానాన్న పోయినప్పుడు ఎంతమంది చూడడానికి వచ్చారు? శ్మశానానికి రాలేకపోవచ్చు. ఆ తరవాతైనా ఎంత మంది పలకరించారు? పేపర్లో వేయించాను. కనీసం ఫోన్ అయినా చేసి మాట్లాడొచ్చుకదా? అబ్బే, అంతా మొహం చాటేసారు. ఆయన ఎంత మందికి ఎన్ని విధాల సాయం చేసాడో, పోర్టులో ఎంత మందికి ఉద్యోగాలు వేయించాడో, ఆయన మూలంగా ఎంతమంది బాగుపడ్డారో నాకు తెలుసు. అన్నాళ్లు ఆయనతో బాటు పనిచేసిన బడుద్ధాయిల్లో ఒక్కడైనా వచ్చాడా?...ఒక్కడూ రాలేదు" లోలోపలి బాధను వెళ్లగక్కుకుంటే మనసు తేలికపడుతుందని టోనీని మాట్లాడనిచ్చి –

"ఏం చేస్తాం? మనుషులన్నాక అలాగే ఉంటారనుకొని సరిపెట్టుకోవడమే. మీ నాన్న హాస్పిటల్‌కి కూడా వెళ్లకుండా సునాయాసంగా పోయాడు. మనం అంతా చివరిదాకా పక్కనే ఉన్నాం. ఆయన కోరుకున్నదీ అదే," అన్నాడు జిమ్మీ.

"లేదు జిమ్మీ, నా మనసు విరిగిపోయింది. మనకిక్కడ విలువలేదు. ఎంత చేసినా గుర్తింపు లేదు. మనవాళ్లంతా ఆస్ట్రేలియా వెళ్లిపోతున్నారు. ఇప్పటికే చాలామంది వెళ్లిపోయారు. మనం కూడా పెట్టే బేడా సర్దుకోవాలి, ఇప్పటికే ఆలస్యం అయింది." జిమ్మీకి చిరాకొచ్చింది. "ఆస్ట్రేలియాలో మాత్రం మనల్నెవరు గుర్తిస్తారు? ఎవరు మనల్ని నెత్తిన పెట్టుకుంటారు? ఇక్కడ చెయ్యలేనిదీ, అక్కడికి వెళ్లి ఊడబొడిచేదీ ఏముంది?"

"మనం వస్తామంటే రమ్మనే అంటున్నారు కదా? మన కోసం కాకపోయినా మన పిల్లల భవిష్యత్తు కోసమైనా ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి. తప్పదు."

"సరే, సరే. ఆలోచిద్దాం. ఇవాళ్టికి భోజనం చేసి రెస్టు తీసుకో," అంటూ జిమ్మీ లేచాడు. షెరాన్‌ని వెంటబెట్టుకొని ఇంటికి బయల్దేరాడు.

షెరాన్‌కి తమ్ముడు టోనీ అంటే చాలా ప్రేమ. వయస్సు రీత్యా వాళ్లిద్దరికీ మధ్య ఉన్న ఎడం ఎక్కువ. తల్లి పోయాక టోనీ బాగోగులు షెరాన్ స్వయంగా చూసుకొనేది.

"మీ నాన్న పోయిన బాధతో అలా అన్నాడు. పైగా విస్కీ కొంచెం ఎక్కువైనట్టుంది. రేపటికల్లా అంతా సర్దుకుంటుందిలే," అని జిమ్మీ తన భార్యను సముదాయించాడు.

మర్నాడు బ్రేక్‌ఫాస్ట్ టేబిల్ వద్ద జిమ్మీ టోస్టుకి వెన్న అద్దుతూ షెరాన్ తో –

"నిన్న రాత్రి మీ తమ్ముడన్న మాటల గురించే ఆలోచిస్తున్నాను. అతగాడు ఆస్ట్రేలియా వెళిపోదాం అనుకోవడం సబవుగానే ఉందనిపిస్తోంది," అన్నాడు. షెరాన్ కాఫీ కలుపుతూ భర్తకేసి ప్రశ్నార్థకంగా చూసింది.

"ఒకప్పుడు మన ఆంగ్లో-ఇండియన్ కమ్యూనిటీకి ఒక ప్రత్యేకత, గుర్తింపు ఉండేవి. బ్రిటీషు వాళ్ల తరవాత మళ్లీ అంతటి వాళ్లం మనమే అని మనం కూడా అనుకున్నాం. రైల్వేలు, పోర్టులు, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్,...వీటన్నింటిలోనూ మనవాళ్లు పెద్ద పాత్ర పోషించారు. చాలా కాలం వరకూ ఇంగ్లీషు భాష మనకు పెద్ద వెసులుబాటుగా ఉండేది. రానురాను పరిస్థితులు మారిపోతున్నాయి. స్థానికులు బాగా చదువుకుంటున్నారు. ఇంగ్లీషు చక్కగా మాట్లాడుతున్నారు. కొంతకాలం వరకూ మనవాళ్లు టీచర్లుగా చాలా పాప్యులర్ అయ్యారు. ఇప్పుడు చదువుకున్న స్థానికుల సంఖ్య బాగా పెరిగిపోయింది. ప్రజలంతా బ్రిటిష్ పాలన అంతం కావాలని కోరుకున్నారు. అది సహజం. మన కమ్యూనిటీకి ఇండియా అంటే ఒకటే దేశం. స్థానికులకు అలా కాదు. భాష, రాష్ట్రం, ప్రాంతం ఇవన్నీ వాళ్లకు ముఖ్యం – ఒక్కోసారి దేశంకన్నా కూడా. మొదట భాషా రాష్ట్రాలన్నారు. తెలుగు రాష్ట్రం కావాలని డిమాండ్ చేశారు. మెడ్రాసు నుండి విడిపోయారు. మొన్నంతా 'జై తెలంగాణా' ఉద్యమం నడిచింది. ఇప్పుడు 'జై ఆంధ్ర' మొదలైపోయింది. జనం అంత ఎమోషనల్‌గా

ఎందుకు ఫీలవుతున్నారో నాకర్థం కావడంలేదు. లోపం మన పాతకాలపు ఆలోచనల్లోనే ఉందనిపిస్తోంది. మనమే వెనకబడిపోయాం. వాస్తవ ప్రపంచం బాగా దూరం వెళ్లిపోయింది. మనంగానీ, మన పూర్వీకులుగానీ ఇష్టపడిన, కోరుకున్న దేశం ఇది కానేకాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, మనం ఇప్పుడు బయటవాళ్లం, గతకాలపు అవశేషాలం, పేకలో జోకరుగాళ్లం." షెరాన్‌కి కొంచెం కొంచెంగా అర్థం అవుతోంది. జిమ్మీ చెప్పుకుంటూ పోతున్నాడు –

"నీకు గుర్తుందా? మీ నాన్నా, మా నాన్నాకూడా ఇంగ్లండు వెళిపోదామని అనుకొనేవారు గానీ సాధ్యపడలేదు. ఇప్పుడు మన టైం వచ్చింది. పిల్లల భవిష్యత్తు కోసమైనా ఆస్ట్రేలియా వెళ్లిపోవాలి. ఇక్కడ పెరిగిపోతున్న కాంపిటీషన్ మనం తట్టుకోలేం. మన కమ్యూనిటీకి వాయిస్ లేదు; మనకి రిజర్వేషన్లు లేవు; మనం ఓటు బ్యాంకులం కాదు. మనల్నెవరూ పట్టించుకోరు," జిమ్మీ గొంతులో దుఃఖం ధ్వనించింది.

షెరాన్ లేచి వెళ్లి జిమ్మీ పక్కనే కూర్చొని అతని చేతిని తన చేతిలోకి తీసుకుంది.

"టోనీ గనక వెళిపోదామని డిసైడ్ చేసుకుంటే, మనం కూడా వాళ్ల వెంట నడుద్దాం. ముందుగా పిల్లలతో ఒక్కసారి మాట్లాడదాం. వాళ్ల అభిప్రాయం తెలుసుకోవాలి కదా?" అంది శాంతంగా.

"మాట్లాడదాంలే. మొదట అప్లై చెయ్యాలి. ఆ తతంగం అంతా ఆర్నెల్లు పైనే పడుతుంది."



చదువెందుకు?

వెంకటేశు, డారల్ ఇద్దరూ కూడబలుక్కొని ఆంధ్రా యూనివర్సిటీలో బీ.ఫాం.కి అప్లై చేసి సీట్లు సాధించారు. కొడుకు డాక్టరవుతాడని ఆశించిన గంగమ్మ, 'ఇదీ వైద్యానికి సంబంధించిన చదువేలే' అని సరిపెట్టుకుంది. ఇద్దరూ యూనివర్సిటీ తరఫున ఫుట్‌బాల్ ఆడారు. ఇద్దరికీ గర్ల్‌ఫ్రెండ్స్ ఏర్పడ్డారు. చదువు పూర్తయ్యాక ఉద్యోగాలు చెయ్యకూడదనీ, విశాఖపట్నంలోనే ఒక ఫార్మా కంపెనీ నెలకొల్పాలనీ నిశ్చయించుకున్నారు.

ఎల్లమ్మ, డెబొరాలు సెయింట్ జోసెఫ్స్ కాలేజిలో బీయ్యేలో చేరారు. డారల్‌కి తెలుగు పట్టుబడలేదుగానీ, డెబొరా బాగానే మాట్లాడుతుంది – కొంచెం యాసతో. డారల్, జిమ్మీలకు తెలియకూడని విషయాలను షెరాన్, డెబొరాలు తెలుగులో మాట్లాడుకుంటారు. డెబొరా, ఎల్లమ్మ – ఇద్దరూ పియానో బాగా వాయిస్తారు. చర్చిలో వాయిద్య బృందం వాళ్లకు స్థానం కల్పించింది. ఎల్లమ్మ క్రైస్తవ భక్తిగీతాలు పాడుతుంది. నలుగురూ ఆడుతూ పాడుతూ, లీలామహల్లో సినిమాలు చూస్తూ, పిక్నిక్‌లకీ, ట్రెక్కింగ్‌లకీ వెళ్తూ డిగ్రీ చదువులు పూర్తి చేశారు. తరవాత ఏమి చెయ్యాలి అని తర్జనభర్జన పడుతున్నారు.

నూకరాజు ఆర్థికశాస్త్రం ప్రధానాంశంగా బీయ్యే పాసయ్యాడు. అందువలన అర్థశాస్త్రపు మౌలిక సూత్రాలతో బాటు, ఆర్థిక పురోగతి, ద్రవ్యోల్బణం, జాతీయ వృద్ధి రేటు, నిరుద్యోగం, పెట్టుబడి, వనరులు, శ్రమశక్తి, ఉత్పత్తి – ఇటువంటి అనేకమైన అంశాలపట్ల అవగాహన ఏర్పడింది. ఇక్కడొక మాట చెప్పుకోవాలి. నూకరాజు, వెంకటేశు, ఎల్లమ్మ – ఈ ముగ్గురికీ కాలేజీలలో లేదా యూనివర్సిటీలో సీట్లు రావడానికి రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లు బాగా ఉపయోగపడ్డాయి.

బీయ్యేలో ఉండగానే, భాస్కర్ సూచించిన విధంగా వేసవిలో నిర్వహించిన రాజకీయ తరగతులకు వెళ్లాడు. దానితో శ్రమ దోపిడి, అదనపు విలువలు, సమాజాన్ని నడిపించే ఆర్థిక సూత్రాలు, వర్గ విభేదాలు, గతితార్కికత – ఇవన్నీకూడా

తెలిసివచ్చాయి. ఆర్థిక సూత్రాల అన్వయింపుతో సామాజిక శక్తుల్ని, మార్పుల్ని అర్థం చేసుకోవచ్చు అనిపించింది. క్లాసురూంలో చదువుకున్న అంశాలు, సూత్రాలు నిజ జీవితంలో ప్రాణం పోసుకున్నాయనిపించింది. కాలేజీ, ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీలలో చాలా పుస్తకాలు తెచ్చుకొని చదివాడు. నోట్సు రాసుకున్నాడు. భాస్కర్‌తోనూ, ఇతర మిత్రులతోనూ చర్చించాడు.

కొంతకాలానికి నూకరాజు దృక్కోణం, ప్రాపంచిక అవగాహన పూర్తిగా మారిపోయాయి. అయితే అతని జీవితానుభవసారం నుండి వెలువడ్డ సరళత్వం, స్పష్టత అలాగే కొనసాగాయి. సిద్ధాంతం ఏదైనా వాస్తవికతనే గీటురాయిగా తీసుకోవడం నూకరాజుకి సహజంగా పట్టుబడ్డ విద్య. నిజానికి అతడు ఆర్థిక సూత్రాలను అన్వయించే రీతి, అతను ఇచ్చే ఉదాహరణలు – ఇటు బియ్యే క్లాసులోనూ, అటు రాజకీయ తరగతుల్లోనూ – అధ్యాపకులకు ఆశ్చర్యం కలిగించేవి.

బీయ్యే క్లాసులో ఒకరోజున సహజవనరులు, శ్రమ, పెట్టుబడి – ఈ మూడింటి ద్వారా సంపదను సృష్టించడంపై పాఠం నడుస్తోంది. ఎవరైనా ఒక ఉదాహరణ ఇవ్వగలరా? అని అధ్యాపకుడు అడిగినప్పుడు నూకరాజు లేచి,

"సముద్రంలో ఉండే చేపలు సహజవనరులు అనుకుంటే, జాలరుల శ్రమ ద్వారా వాటిని వేటాడి మార్కెట్లకు చేర్చడం సాధ్యపడుతుంది. అమ్మకాల ద్వారా సంపద కాకపోయినా ఆదాయం ఏర్పడుతుంది. చేపల వేటకి కావాల్సిన పడవలు, వలలు పెట్టుబడికి రూపాంతరాలు. నిజానికి పెట్టుబడి అంటేనే కూడబెట్టిన శ్రమ. సమస్త సంపదల్నీ సృష్టించేదీ మానవ శ్రమ మాత్రమే. శ్రమ ద్వారా సృష్టించిన వస్తువులకు వినిమయ విలువ, మారకపు విలువ ఉంటాయి. శ్రమ విభజన, మారకపు విలువ – ఇవే వాణిజ్యాన్ని నడిపించే శక్తులు. శ్రమ లేకపోతే చేపలు సముద్రంలోనే ఉండిపోతాయి. బొగ్గూ, చమురూ భూగర్భంలోనే మిగిలిపోతాయి. ఏ విధమైన వస్తూత్పత్తి జరగదు." అన్నాడు.

తోటి విద్యార్థులంతా చప్పట్లు కొట్టారు.

అధ్యాపకుడు డా. కృష్ణారావు, "రాజు ఎంత చక్కగా వివరించాడో చూశారా?" అంటూ నూకరాజుని అభినందించాడు.

అప్పటి నుంచీ పాఠం మధ్యలో, "దీని గురించి మన రాజు ఏమంటాడు?' అని నూకరాజు వంక చూసేవాడు.

చేపల బజారులో జరిగే కార్యకలాపాలనూ, చేపల ధరలలో సంభవించే హెచ్చు తగ్గులనూ సప్లై-డిమాండ్‌ల మధ్య ఉండే సంబంధంగానూ, ప్రైస్ ఎలాస్టిసిటీనీ నూకరాజు ఆసక్తికరంగా వివరించేవాడు. అతను లేచి ఇలా వివరించినప్పుడల్లా

మిగతా విద్యార్థులు చప్పట్లు కొట్టడం చిలిపితనంతో కూడిన ఆనవాయతీగా మారింది.

ఇది ఎంతవరకూ వెళ్లిందంటే – ఉత్పత్తి సాధనాలు, వాటిపై ఆధిపత్యం, ఉత్పత్తి సంబంధాలలో – వీటిని కూడా తెరచాప పడవలు, మర పడవలు, పెట్టుబడి జోక్యం – గుత్తాధిపత్యం, పడవల యజమానులుగా ఉంటూవచ్చిన జాలర్లు, ట్రాలర్లలో జీతానికి పనిచేసే నౌకర్లుగా మారిపోవడం, రొయ్యల ఎగుమతి మూలంగా కొనుగోలుదార్లకు జాలరులకు మధ్య ఎడం, పరాయీకరణ – ఈ నిజ జీవిత వాస్తవికతల్ని కొంతమంది విద్యార్థుల మధ్య చర్చకు పెట్టసాగాడు. ఇందుకుగాను ఒక స్టడీ సర్కిల్ నెలకొల్పాడు. దాంతో ఆర్థికశాస్త్ర చర్చలు కొన్ని క్లాసురూంలోనూ, కొన్ని బయటా జరుగుతున్నాయి.

ఒక రోజున కృష్ణారావుగారు, కొంతసేపు చర్చ జరగనిచ్చి, "రాజూ, నువ్వు మంచి విషయాలు చెబుతున్నావు. క్లాసురూంలో చెప్పే పాఠాల్ని జీవితానికి అన్వయించగలుగుతున్నావు. కానీ నువ్వు చెప్పేవన్నీ మన సిలబస్‌లో లేవోయ్," అన్నాడు – నవ్వుతూనే.

"అదే మన దురదృష్టం, మాస్టారూ," అన్నాడు నూకరాజు.

అయితే నూకరాజు, కృష్ణారావుకి ప్రియ శిష్యుడైపోయాడు. నూకరాజుని ఇంటికి రమ్మని టీ ఇచ్చి, అనేక విషయాలు చర్చించేవాడు, చదవమని పుస్తకాలిచ్చేవాడు. అక్కడే మొదటిసారి జిడ్డు కృష్ణమూర్తి రచనలు, జార్జ్ ఆర్వెల్ నవలలు చూశాడు.

కృష్ణారావు ఒకరోజున నూకరాజుకి "నువ్వు అకాడెమిక్స్‌లో ఉండవలసిన వాడివయ్యా! ఎకనామిక్సులో ఎమ్మే, ఆ తరవాత పీ.హెచ్.డీ. చెయ్యి," అని సలహా ఇచ్చాడు.

దాంతో నూకరాజు ఆత్మవిశ్వాసం పెరిగింది. 'ఎక్కడ మొదలు పెట్టాను? ఎక్కడికి చేరుకున్నాను?' అనుకున్నాడు. ఈ సంగతి ఎల్లమ్మకి చెబితే చాలా ఆనందించింది.

* * *

నూకరాజు బీయ్యే ఫస్టుక్లాసులో పాసయ్యాడు. రిజల్ట్స్ తెలిసిన రోజునే మామిడిపళ్ల బుట్ట తీసుకొని కృష్ణారావు మాస్టారింటికి వెళ్లాడు. ఆయన చాలా అనందించి, "బట్టీపట్టి పరీక్షలు రాసి చాలామంది పాసవుతారు, మార్కులు తెచ్చుకుంటారు. నీకున్న నేటివ్ ఇంటెలిజెన్స్, మంద మనస్తత్వానికి భిన్నంగా ఆలోచించగలగడం, క్లాసురూం పాఠాల్ని జీవితానికి జోడించగలగడం – చాలా అరుదైన లక్షణాలు. తల్లిదండ్రులు పిల్లల్నీ, గురువులు తమ శిష్యుల్నీ వాళ్ల ఎదుట పొగడకూడదంటారు. ఇన్నాళ్లూ అనలేదుగానీ, నీలాంటి స్టూడెంటుని నా సర్వీసులో ఇంతవరకూ చూడలేదోయ్! అప్పుడప్పుడు వస్తూపోతూ ఉండు. మనం మాట్లాడుకుంటూ ఉండాలి," అన్నాడు.

నూకరాజుకి ఏమనాలో తెలియలేదు. కన్నీళ్లపర్యంతం అయ్యాడు. అప్రయత్నంగానే వంగి, ఆయన పాదాలకు నమస్కరించి, "వస్తాంటాను, మాస్టారూ. నిజమే. మనం చర్చించుకోవాల్సినవి చాలా ఉన్నాయి," అని భయటకు నడిచాడు.

బీయ్యే తరవాత ఏం చెయ్యాలా అని నూకరాజు చాలా తర్జనభర్జన పడ్డాడు. కృష్ణారావు చెప్పినట్లు ఎమ్మే ఎకనామిక్సు, ఆ తరవాత డాక్టరేటు చెయ్యమంది ఎల్లమ్మ. నూకరాజుకి ఆ సలహా అంత రుచించలేదు.

"ఒక దశవరకూ కనీస చదువు ప్రతీ ఒక్కరికీ అత్యవసరం. ఆ తరవాత, 'చదువు ఎందుకు?' అనే ప్రశ్నకు సరైన సమాధానం చెప్పుకోలేకపోతే అది మనిషిని సమాజానికి దూరం చేస్తుంది, ఎల్లీ," అన్నాడు.

ఏకాంతంలో ఎల్లమ్మని 'ఎల్లీ' అనే సంబోధించడం అలవరచుకున్నాడు నూకరాజు. ఆమె అతన్ని 'రాజ్' అంటుంది, రాజ్ కపూర్ సినీమాల్లో నర్గిస్‌ని గుర్తుచేసుకుంటూ.

ఎల్లమ్మ ఆసక్తిగా వింటోంది.

"డబ్బెందుకు అన్నట్టుగానే చదువెందుకు? అనే ప్రశ్నకు స్పష్టమైన జవాబు చెప్పుకోగలగాలి. చదువు అనేది చుట్టూ ఉన్న మనుషులకి ఉపయోగపడే పనులు చెయ్యడానికే అంటాను. జ్ఞాన సముపార్జన అంటావా – అది జీవితాంతం కొనసాగుతూనే ఉంటుంది. దానికి చదువుతో, డిగ్రీలతో నిమిత్తం లేదు. ఇకపై ఏమి చెయ్యాలి అనే దాని మీద నాకు కొన్ని ఆలోచనలున్నాయి."

"ఏం చేద్దామనుకుంటున్నావు?"

"నేను 'జమీల' ఏక్సిడెంటు గురించి చెప్పినప్పుడు – భాస్కర్ నన్ను కొన్ని ప్రశ్నలు వేశాడు, ఒక్క ప్రశ్నకి కూడా జవాబు చెప్పలేకపోయాను. ఇవాళ్టికి కూడా నా దగ్గర జవాబులు లేవు."

"ఏమిటా ప్రశ్నలు?" భాస్కర్ అడిగిన ప్రశ్నలను వివరించాడు నూకరాజు:

-'జమీల' యాజమాన్యం అన్ని పెద్ద వ్యాపారాల మాదిరిగానే బీమా సౌకర్యం కలిగి ఉందా?

-పరిహారం ఆవిధంగా ఇచ్చిందేనా?

-జాలరులకు బీమా పథకాలు ఎందుకు లేవు?

-జాలరుల భద్రత కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నది?

-'జమీల' ఏక్సిడెంటు రిపోర్టు నూకరాజు చదివాడా? అసలెవరైనా చదివారా? అందులో ఏముంది?

భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదం మళ్లీమళ్లీ సంభవించబోదని హామీ ఏమిటి?

"ఏక్సిడెంటులో నా ప్రాణం పోవాల్సిందే. మీ నాన్న కాపాడబట్టి బతికిపోయాను. నా బదులు ఆయన పోయాడు. ఇంత జరిగినా ఏక్సిడెంటు రిపోర్టు నేనుగానీ, మన వాళ్లెవరైనాగాని చూడనేలేదు. జాలర్ల భద్రతని కాపాడుకొనే ప్రయత్నం ఎంతమాత్రం చెయ్యలేదు. మనమే ఇంత అలక్ష్యం చేస్తే గవర్నమెంటుగానీ, వేరేవాళ్లుగానీ ఎందుకు పట్టించుకుంటారు? ఇంకా బతికున్నందుకైనా మనవాళ్ల కోసం ఏదో ఒకటి చెయ్యాలి." రవ్వంత ఉద్వేగం ధ్వనించింది నూకరాజు గొంతులో.

"కాబట్టి?"

"లాయర్ని అవుదామనుకుంటున్నాను. మనవాళ్లని ఆదుకోవడానికి చట్టాలు, న్యాయవ్యవస్థ – వీటి గురించి తెలిసి ఉండాలి. మనలో చాలా మందికి స్కూలు చదువుకూడా లేదు."

"చాలా మంచి ఆలోచన, రాజ్! నాకు తట్టనేలేదు."

"మరో విషయం. మర పడవలు, ట్రాలర్లు వచ్చేసాయి. పెట్టుబడిదే పై చేయిగా ఉంది. నిలవరించేవాళ్లు లేకపోతే అది మన నెత్తెక్కి తాండవం చేస్తుంది. రాబోయే రోజుల్లో మరో సమస్యను కూడా కార్పొరేట్లు సామాన్యుల మీద నెడతాయి. అది పర్యావరణ విధ్వంసం. యూరప్, అమెరికా, జపాన్‌లలో ఈ విషయం మీద చాలా అధ్యయనాలు జరుగుతున్నాయి; చట్టాలలో మార్పులు వస్తున్నాయి. అయితే అవన్నీ కూడా ప్రజలు ప్రశ్నించడం వల్లనే. జపాన్‌లో మినామాటా అనే చోట ఒక కెమికల్ ఫ్యాక్టరీ మూలంగా అక్కడి ప్రజలు, జాలర్లు ఎంత తీవ్రంగా నష్టపోయారనే విషయం మీద లైబ్రెరీలో ఈ మధ్యనే ఒక ఆర్టికల్ చదివాను. మనం ఊరుకున్నకొద్దీ రానురాను మన దేశం లాంటి దేశాల్లో బతుకులు ఇంకా అధ్వాన్నంగా తయారవుతాయి, సందేహం లేదు." ఎల్లీ అతన్ని ముద్దుపెట్టుకొని, "వెంటనే అప్లై చేసెయ్, రాజ్." అంది.

* * *

నూకరాజు 'లా'లో చేరానని చెప్పగానే కృష్ణారావు కొంచెం నిరుత్సాహపడ్డాడు కానీ, "నువ్వు చాలా ప్రాక్టికల్‌గా ఆలోచించావు. అందుకే అన్నాను, నీ ఆలోచనలు పూర్తిగా భిన్నంగా ఉంటాయని," అంటూ నూకరాజుని అభినందించి, "నేను కూడా చిన్నతనంలో నీలాగానే ఆలోచించే వాడిని. మా అమ్మా, నాన్నా హయ్యర్ సెకండరీ తరవాత నేను మెడిసన్లో చేరాలని కోరుకున్నారు. అప్పటికే నాకు ఎకనామిక్సంటే ఇష్టం ఏర్పడింది. కాలేజీలో, యూనివర్సిటీలో నేను ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్లో ఉండేవాడిని. లీడర్ని కూడా. మేం కొందరం చాలా ఉత్సాహంగా పనిచేసేవాళ్లం. అప్పటికి పార్టీ ఇంకా చీలిపోలేదు." నూకరాజు ఆసక్తిగా వింటున్నాడు. కృష్ణారావు

భార్య టీ, బిస్కెట్లు తీసుకొచ్చింది. నూకరాజు ఆమెకు నమస్కరించి, కప్పు అందుకున్నాడు.

"పార్టీ చీలిపోయాక ప్రాణస్నేహితులూ, కామ్రేడ్సూ అనుకున్నవాళ్లు కూడా రాత్రికి రాత్రే బద్ధ శత్రువులుగా మారడం నేను చూశాను. నా మనసుకి చాలా కష్టం అనిపించింది. అక్కడ ఉండలేక బయటకు వచ్చేశాను. పార్టీ అంటే మాకు తిరుగులేని విశ్వాసం ఉండేది. ఏమాటకామాటే చెప్పుకోవాలి. కమ్యూనిస్టు పార్టీలన్నిటిలోనూ ఒక సుగుణం ఉంది. తాము చేసిన తప్పుల్ని ఏభై ఏళ్ల తరవాత ఒప్పుకుంటాయి. అప్పటికి ఆ తప్పులు చేసిన వాళ్లుగానీ, వాటి బాధితులుగానీ ఎవరూ ఉండరు. అలాగని కొత్త తప్పులు చెయ్యడం మానవు. అవేమన్నా చిన్నాచితకా తప్పులా? లక్షలమంది ప్రాణాలుతీసే తప్పులు. అంచేత నువ్వు అడగకపోయినా నేనిచ్చే సలహా ఏమిటంటే పార్టీ రాజకీయాల్లో తల దూర్చకు. నిరాశ చెందుతావు. బయట ఉంటూనే పేదలకోసం చేయాల్సిన, చేయదగ్గ మంచి పనులు చాలా ఉంటాయి. వాటిమీద దృష్టి పెట్టు. ప్రతీ వాళ్లూ కార్యకర్తలు కానవసరంలేదు. నీలాంటి మనుషుల అవసరం సమాజానికి చాలా ఉంది, ఎప్పుడూ ఉంటుంది," అని ముగించాడు.

కృష్ణారావు మాటల్ని నూకరాజు చాలా సార్లు గుర్తుచేసుకున్నాడు. ఆయన ఎందుకని అలా అన్నాడనేది కొంచెం కొంచెంగా అర్థం అవుతూవచ్చింది – వయసు పెరుగుతున్నకొద్దీ.

* * *

"మేము ఆస్ట్రేలియా వెళ్లిపోవాలనుకుంటున్నాం," అని డారల్ చెప్పినపుడు వెంకటేశు నిర్ఘాంతపోయాడు; కలవరం చెందాడు. జీవితాంతం కొనసాగుతుందనుకున్న స్నేహం ఇక ముగిసి పోనున్నదని అతని మనసు శంకించింది.

ఎల్లమ్మ కూడా బాధపడింది. డెబొరాని కౌగలించుకొని ఏడ్చింది.

ఎల్లమ్మనీ, వెంకటేశునీ షెరాన్ తరచూ 'నా శిష్యులు' అంటూ ఉండేది. చదువులో వాళ్ల ప్రగతికి మురిసిపోయేది. మరో నెల్లాల్లో వెళిపోతారనగా శిష్యుల్ని భోజనానికి పిలిచింది. నూకరాజుని కూడా వెంట తీసుకురమ్మంది. కానీ నూకరాజూ, భాస్కర్‌లు ఆ సమయంలో విజయవాడలో రాజకీయ తరగతులు హాజరవుతున్నారు. అంచేత అతడు రాలేకపోయాడు.

అతిథులు జిమ్మీ బంగళాలోకి వెళ్లగానే ఇల్లు చాలావరకు ఖాళీ అయిందని గమనించారు. పియానో, మైఖెలేంజిలో 'పియాటా' నకలు ప్రతిమతో సహా అన్నీ ప్యాక్ చేసి షిప్పులో పంపించేశారు. ఎల్లమ్మకి దుఃఖం వచ్చింది. 'ఈ అధ్యాయం ముగిసిపోయింది' అని ఆమెకు గాఢంగా అనిపించింది.

"నూకరాజు రాలేదేం?" అని షెరాన్, జిమ్మీలిద్దరూ అడిగారు. ఊరెళ్లాడని వెంకటేశు చెప్పాడు.

షెరాన్ ఎల్లమ్మకి ఫోటో ఆల్బమ్ బహూకరించింది. అందులో అందరూ అరకులోయకి పిక్నిక్ వెళ్లినప్పుడు తీసుకున్న ఫొటోలున్నాయి. డారల్, సుప్రసిద్ధ ఫుట్‌బాల్ ఆటగాడు పేలే స్వయంగా సంతకం చేసిన ఫొటోని వెంకటేశుకిచ్చాడు. దాన్ని జిమ్మీ షిప్పులో బ్రెజిల్ వెళ్లినప్పుడు తీసుకొచ్చాడు. డెబొరా 'పియాటా' ఫోటో ఉన్న పిక్చర్ పోస్ట్ కార్డుపై సంతకం చేసి ఎల్లమ్మకు ఇచ్చింది. దాని ప్రాముఖ్యత డెబొరాకు తెలుసు. వెంకటేశు, నూకరాజు, ఎల్లమ్మలు తాము ఇంట్లో స్వయంగా చెక్కతో తయారుచేసి రంగులు వేసిన డాల్ఫిన్స్ నోస్ లైట్ హవుస్ నమూనాని ఇచ్చారు. జిమ్మీ, అతని కుటుంబసభ్యులూ దాన్ని చూసి, 'అద్భుతం!' అన్నారు. కాసేపు ఇబ్బందికరమైన నిశ్శబ్దం వారి సంభాషణల మధ్య పేరుకుపోయింది.

జిమ్మీ లోపలికి వెళ్లి, ఒక కవర్ని తెచ్చి ఇచ్చాడు,

"ఇవి నూకరాజుకివ్వండి. ఈ కవర్లో ఉన్నది 'జమీల' ఏక్సిడెంట్ రిపోర్ట్. నా పెర్సనల్ కాపీ. సామాన్లు సర్దుతూంటే బయటపడింది. వీలైతే అతన్ని రేపో, ఎల్లుండో ఒకసారి వచ్చి నన్ను ఆఫీసులో కలవమనండి. ఆ తరవాత అయితే ఉండను; రిలీవ్ అయిపోతాను," అంటూ.

భోజనానికి ముందు, అంతా టేబిల్ చుట్టూ కూర్చున్నాక, షెరాన్ రెండు మూడు నిమిషాలసేపు దైవ ప్రార్థన చేసింది. ఆస్ట్రేలియా వలసపోతూన్న తమ కుటుంబాన్నీ, అలాగే ఇండియాలో ఉన్న తన స్నేహితుల్నీ, శిష్యుల్నీ, వారి కుటుంబీకుల్నీ చల్లగా చూడమని ప్రభువుని వేడుకుంది.

భోజనాలయ్యాక జిమ్మీ పైపు వెలిగించి, "వెంకీ! నువ్వు కూడా ఆస్ట్రేలియా వచ్చేయవోయ్! డారల్‌తో కలిసి పెడదామనుకున్న కంపెనీ ఏదో అక్కడే పెట్టొచ్చు కదా?" అన్నాడు.

వెంకటేశు నవ్వి ఊరుకున్నాడు.

"క్రిస్మస్ ఈవ్ నాడు చర్చికి వస్తారుకదా? తప్పకుండా రావాలి. నూకరాజుని కూడా మీ వెంట తీసుకురావాలి. మీ కోసం ఎదురుచూస్తూ ఉంటాం," అంది షెరాన్, ఆప్యాయంగా.

"ఇండియాలో మాకిదే ఆఖరి క్రిస్మస్ – బహుశా" అనేశాడు జిమ్మీ అనాలోచితంగా.

షెరాన్ అతని వంక వాడిగా చూసింది – "ఎందుకా మాట ఇప్పుడు?...మళ్లీ వస్తామేమో, ఎవరు చెప్పగలరు?" అంది అతిథులకేసి అనునయంగా చూస్తూ.

ఎప్పటికీ తిరిగి రారని అక్కడున్నవాళ్లందరికీ తెలుసు.

ఆ సంవత్సరం క్రిస్మస్ వేడుకలలో స్టేజిమీద పాడిన భక్తిగీతాలలో 'నడిపించు నా నావ – నడి సంద్రమున దేవా' అనే కొత్త పాట ఎల్లీని బాగా ఆకర్షించింది.

'నా జీవిత తీరమున, నా అపజయ భారమున

నలిగిన నా హృదయమును నడిపించుము లోతునకు'

అని వాళ్లు పాడినప్పుడు ఎల్లమ్మకు తండ్రి గంగరాజు గుర్తుకొచ్చాడు. అతడే ఈ పాట ద్వారా తనతో సంభాషిస్తున్నాడనే భావన ఆమెకు కలిగింది. 'అయ్యో నాన్నా! నీది అపజయం కాదు. నీ ప్రయత్నం నువ్వు చేశావు' అనాలని ఆమెకు అనిపించింది. ఊహించని ఉద్విగ్నత ఏదో ఆమెను ఆవహించింది. పక్కనే కూర్చున్న అన్న వెంకటేశు చేతిని గట్టిగా పట్టుకుంది. అతను చెల్లెలి వంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఏమైందే?" అన్నాడు. ఆ పాట అతన్ని కూడా కదిలించింది.

"నాన్న..." అని ఎల్లమ్మ మొదలుపెట్టి ఆగిపోయినప్పుడు వెంకటేశ్‌కి అర్థం అయింది.

'రాత్రంతయు శ్రమ పడినా రాలేదు ప్రభూ జయము,

రహదారులు వెతికిననూ రాదాయెను ప్రతిఫలము'

అనే చరణాలు పాడినప్పుడు ఎల్లమ్మ ఇంక ఏడుపు ఆపుకోలేక పోయింది.

"పోనీ ఇంటికెలిపోదామా?" అన్నాడు వెంకీ – ఇంకేమనాలో తోచక.

ఎల్లమ్మ అడ్డంగా తల ఊపింది. తండ్రి గంగరాజు మరణం, జిమ్మీ కుటుంబంతో స్నేహం, వాళ్ల జీవితాల్లో వచ్చిన పెను మార్పులు – ఇవన్నీ ఎల్లమ్మకి గుర్తుకొచ్చాయి. ఈ పాటతో తమ జీవితంలోని ఒక అధ్యాయం ముగిసిపోతున్నదని ఆమెకు బలంగా అనిపించి దుఃఖం వచ్చింది. పాట ముందుకి సాగింది –

'ఆశా నిరాశాయే ఆవేదనెదురాయే,

ఆధ్యాత్మిక లేమి గని అల్లాడెనా వలలో'

అన్న దగ్గర, వెంకీ కళ్లల్లో కూడా నీళ్లు తిరిగాయి.

డారల్, డెబొరాలు లేని వెలితి వెంకటేశు, ఎల్లమ్మలను చాలా కాలం వెంటాడింది. కాలం గడుస్తూన్నకొద్దీ జిమ్మీ కుటుంబంతో పరిచయం తమ జీవితాలను ఎంతగా మార్చివేసిందనేది వాళ్లకు నెమ్మదిగా అర్థంకాసాగింది.

"ఆనాడు 'జమీల' ప్రమాదం గనక జరగకపోయి ఉంటే ఈ స్నేహాలు, మార్పులు ఇవేవీ ఉండేవే కావు," అని నూకరాజు ఒకసారి అన్నప్పుడు,

"అవును, బావా! నువ్వన్నది నిజం!" అన్నారు – అన్నా చెల్లెల్లిద్దరూ.

చాలా కాలం పాటు స్నేహితులు నల్గురూ ఉత్తరాలు వ్రాసుకొనేవారు. ఆ తరవాత కొన్నాళ్లు క్రిస్మస్, న్యూ ఇయర్ గ్రీటింగ్సు పంపేవారు.

* * *

జిమ్మీ పంపిన 'జమీల' ఏక్సిడెంటు రిపోర్టుని నూకరాజు ఆత్రుతగా ఆ రాత్రే చదివేశాడు. కొన్ని వాక్యాలు అండర్లైన్ చేశాడు.

రిపోర్టు చాలా వివరంగా ఉంది. కొన్ని సాంకేతిక అంశాలు నూకరాజుకి బోధపడలేదు. కేప్టెన్ జిమ్మీని కలిసినప్పుడు అతన్ని అడగాలని వాటిని పేజీ నెంబర్లతో సహా ఒక పుస్తకంలో విడిగా నోట్ చేసుకున్నాడు. రిపోర్టులో పేర్కొన్న ప్రధానాంశాలు ఈ విధంగా ఉన్నాయి –

తుఫాను హెచ్చరికను అందుకోగానే 'జమీల' సిబ్బంది అన్ని ముందు జాగ్రత్త చర్యలనూ సక్రమంగా చేపట్టారు. తుఫాను ఉధృతంగా ఉన్నంత సేపూ, ఆ రాత్రంతా కేప్టెను స్వయంగా బ్రిడ్జిమీదే ఉంటూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాడు. అదనంగా మరొక లుకవుట్‌ని బ్రిడ్జిమీద నియమించడం అతని ముందుజాగ్రత్తకి నిదర్శనం. తుఫాను సృష్టించిన ఇరవై-ముప్పై అడుగుల కెరటాల మధ్య, అదీ రాత్రిపూట, అలాగే మసక వెలుతురులో చిన్న పడవలని గుర్తించడం చాలా కష్టం. ముఖ్యంగా ఆ పడవలో దీపాలు లేకపోయినట్టయితే అది అసాధ్యం.

'జమీల' ఢీకొనడంతో పల్టీకొట్టిన జాలరుల పడవని వెంటనే గుర్తించి, మరు క్షణంలోనే ఆ పడవలోని వ్యక్తులను కాపాడడానికి కేప్టెన్ చర్యలు చేపట్టడం, ఏండర్సన్ మెనూవర్‌కై అతడు ఆదేశించడం, లైఫ్ బోటుని వెంటనే నీట్లోకి దించడం, మొత్తం రెస్క్యూ ఆపరేషన్‌ని కేప్టెన్ జిమ్మీ పర్యవేక్షించిన తీరు శ్లాఘనీయం. ఇదంతా తుఫాను సృష్టించిన బీభత్సం నడుమ, మసక చీకట్లో జరిగిందని గుర్తుంచుకోవాలి. సముద్రం మధ్యలో అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉండేది మనుష్యుల ప్రాణం మాత్రమే అనే మౌలిక, అదేశిక సూత్రాన్ని, నావికుల సాంప్రదాయాన్ని కేప్టెన్ జిమ్మీ, అతని సిబ్బంది సంపూర్ణంగా ఆచరించారు. పడవలో ఉన్న నలుగురిలోనూ ముగ్గుర్ని కాపాడగలిగారు. కలకత్తా వెళుతూన్న తమ ఓడని మానవతా దృష్టితో హుటాహుటిన విశాఖపట్నానికి మళ్లించారు. ఓడలోని రికార్డులనూ, డెక్, మరియూ ఇంజిను రూము లాగ్‌బుక్‌లలో పొందుపరచాల్సిన అంశాలను వెంటనే నమోదు చేసి, అలాగే అధికారులకు ముందుగా తెలియపరచి అన్ని నియమాలనూ సక్రమంగా పాటించారు. కేప్టెన్, ఛీఫ్ ఆఫీసర్లు విచారణ సమయంలో అధికారులకు అన్నివిధాలా సహకరించారు.

కేప్టెన్ జిమ్మీ పెరేరా ఈ దుర్ఘటనలో చూపిన సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు కొనియాడదగినవి. అవి వాణిజ్య నౌకాదళపు అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగానూ, భారతీయ నావికుల ప్రతిష్టను ఇనుమడింపజేసేవిగానూ ఉన్నవి.

చివరిగా ఈ ప్రమాదం నుంచి నేర్చుకోవాల్సిన గుణపాఠం గురించి. తీరానికి దూరంగా ప్రయాణించాలని కేప్టెన్ తీసుకున్న నిర్ణయం సరైనదే. అయితే అతడా నిర్ణయాన్ని ఇంకా ముందే – అంటే నర్సపూర్ పాయింట్ దాటగానే – తుఫాను తాకిడి తగలగానే తీసుకొని ఉండాల్సింది. అలా తీసుకొని ఉంటే గనక ఈ ప్రమాదం సంభవించేది కాదు.

కోస్తా వెంబడి వాణిజ్య నౌకల రాకపోకలు నానాటికీ ఎక్కువవుతూనే ఉన్నాయి, మరో వైపున ఎటువంటి రేడియోగానీ, మరే ఇతర ఆధునిక సాధనాలుగానీ – కనీసం విద్యుత్తు మరియూ విద్యుద్దీపాలు గానీ లేనటువంటి నాటు పడవల సంచారం కూడా అదే కోస్తాలో కొనసాగుతున్నది. వాణిజ్య నౌకలు కోస్తానుండి కొంత కనీస దూరంలో ప్రయాణించాలనే నియమం ఏదీ లేనందున, 'జమీల' కేప్టెన్, అతని సిబ్బంది, తమ నౌకను కోస్తాకి మరీ దగ్గరగా తీసుకుపోయారని గానీ, అందుకు సంబంధించిన అమలులో ఉన్న నియమాన్ని ఏవిధంగానైనా అతిక్రమించారని గానీ చెప్పలేము. అయితే అటువంటి నియమం ఒకటి అవసరం అని ఈ ప్రమాదం సూచిస్తున్నది – ముఖ్యంగా తుఫాను వాతావరణంలో, రాత్రిపూటలా. ఈ మేరకు ఒక ఆదేశాన్ని జారీ చెయ్యాల్సిందిగా ఇందుమూలంగా ప్రభుత్వ ఉన్నత నౌకా వ్యవహారాల సలహాదారుడు, నౌకా మంత్రిత్వ శాఖ వారిని అభ్యర్థిస్తున్నాం.

మొత్తం మీద ఆ రిపోర్టు నూకరాజులో ఆసక్తిని రేకెత్తించింది. ఆ సంఘటనని మళ్లీ లోతుగా, బలంగా గుర్తుచేసింది. 'జమీల' దుర్ఘటన జరిగి ఏడేళ్లు దాటాయి. విచారణ నిర్వహించిన అధికారులు కోరిన ఆదేశం వెలువడిందా? కేప్టెన్ జిమ్మీని అడగాలి. అతనికి తరచూ వచ్చే పీడకల ఆ రాత్రి మళ్లీ వచ్చింది. ఆ కలలో అతడు తలక్రిందులైన పడవ అడుగున వలలో చిక్కుకొని, ఊపిరి బిగపట్టి, కొట్టుమిట్టాడుతూ ఉంటాడు, ఎప్పటిలాగానే ఆ రాత్రి కూడా మృత్యుభయం అతన్ని ఆవహించింది; ఫ్యాన్ తిరుగుతున్నప్పటికీ వళ్లంతా చెమటలు పట్టి ధారగా కారాయి. ఒక్క ఉదుటన లేచి కూర్చున్నాడు. తరవాత చాలాసేపటికి వరకూ నిద్ర పట్టలేదు.

నూకరాజు మర్నాడు పొద్దున్నే లేచి, జిమ్మీని అతని పోర్టు ఆఫీసులో కలవడానికని తయారయ్యాడు. రాత్రి వచ్చిన పీడకల మూలంగా అతడు కలత చెందాడు. అతని ఆలోచనలు అల్లకల్లోలంగా ఉన్నాయి. 'ముగ్గురు జాలరులను కాపాడిన జిమ్మీని, విచారణ చేసిన అధికారులు పొగడ్తలతో ముంచెత్తారు. అంతవరకూ బాగానే ఉంది. మరి తనను రక్షిస్తూ గంగరాజు మావ ఏకంగా ప్రాణం పోగొట్టుకున్నాడు. అదే

సంఘటన మీద వచ్చిన నివేదికలో ఆ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించకపోవడం అన్యాయం' అని అతనికి బలంగా అనిపించింది.

జిమ్మీ ఇప్పుడు పోర్టుకి డెప్యూటీ కన్సర్వేటర్‌గా ఉన్నాడు. అంటే బాగా సీనియర్ ఆఫీసర్లలో ఒకడు. అతని ఆఫీసుకూడా అందుకు తగిన స్థాయిలోనే ఉంది. నూకరాజుని చూడగానే లేచి ఆప్యాయంగా పలకరించి, కరచాలనం చేశాడు జిమ్మీ. బెల్లు కొట్టి, టీ, బిస్కెట్లు తీసుకురమ్మని అటెండర్‌కి చెప్పాడు.

"ఒక్క నిమిషం ఆగు. అర్జెంటుగా సంతకాలు చెయ్యాల్సిన కాగితాలు కొన్ని ఉన్నాయి," అని ఫైళ్లు తీసి సంతకాలు చెయ్యసాగాడు.

నూకరాజు అక్కడున్న పెద్ద కిటికీలలోంచి బయటకు చూశాడు. ఎదురుగా పోర్టు ఛానెల్, వెనక యారాడ కొండ. మరో వైపున చురుకుగా సాగుతూన్న జెటర్ హార్బరు పనులు. ఫ్లోటింగ్ క్రేన్ 'భీమా' బ్రేక్ వాటర్స్ నిర్మాణంలో మునిగి తేలుతున్నది. నూకరాజు కిటికీలోంచి బయటకు చూడడాన్ని గమనించిన జిమ్మీ –

"మరో రెండు మూడేళ్లల్లో విశాఖపట్నం జెటర్ హార్బర్ పనిచేయడం మొదలవుతుంది. పోర్టు స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోతాయి. కానీ ఆ మార్పుల్ని చూసేందుకు నేనిక్కడ ఉండబోను. నీకు వెంకీ చెప్పాడా? టోనీ, నేనూ సిడ్నీ హార్బర్లో జాయిన్ అవుతున్నాం," అన్నాడు.

"అవునట. తెలిసింది" నూకరాజు చేతిలో ఉన్న 'జమీల' రిపోర్టును చూసి,

"అది ప్రాథమిక నివేదిక. ఫైనల్ రిపోర్టు కాపీ ఇదిగో. ఎక్స్ట్రా కాపీ ఇది. నువ్వు ఉంచుకోవచ్చు. పెద్ద మార్పులేవీ ఉండవుగానీ, నాకు గుర్తున్నంత వరకూ మీరు ముగ్గురూ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన వాంగ్మూలాల ఇంగ్లీషు అనువాదాలను రిపోర్టుకి అనుబంధాలుగా ఇందులో చేర్చారు".

'అంటే – గంగరాజు మావ తనను రక్షించిన తీరును గురించి నేను చెప్పింది ఎక్కడో రికార్డులో ఉందన్నమాట' అనుకున్నాడు నూకరాజు. కానీ ఆ వివరాలు మౌలిక నివేదికలో ఎక్కడా ప్రస్తావించకపోవడం, అతనికి నిరాశను కలిగించింది. అదే మాట జిమ్మీతో అంటే, అతడు –

"నువ్వన్నది నిజమే. కానీ ఈ విచారణ తాలూకు ప్రధాన లక్ష్యం వాణిజ్య నౌకల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించిందా లేదా అని పరిశీలించడం, రెండోది ఇటువంటి ప్రమాదాలు ఇక మీదట జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను గుర్తించడం," అన్నాడు.

ఇంతలో టీ వచ్చింది. నూకరాజు బీమా విషయం లేవనెత్తాడు. జిమ్మీ –

"ఓడల విలువ మిలియన్ల డాలర్లలో ఉంటుంది. అలాగే ఓడలోని సరుకు విలువ కూడా. అందుచేత ఇన్సూరెన్సు లేనిదే నౌకా వాణిజ్యం లేదు," అని వివరించాడు.

"అంటే మాకు ఇచ్చిన పరిహారం కూడా...?"

"ఓ యెస్. కాకపోతే నేను కంపెనీపై ఒత్తిడి పెట్టి అది మీకు వెంటనే అందేట్టు చేశాను. ఆ తరవాత కంపెనీ వాళ్లు క్లెయిమ్ చేసుకొని ఉంటారు."

"జాలరులకి బీమా సదుపాయం ఎందుకు లేదు?"

"చాలా దేశాల్లో ఉంది; ట్రాలర్ల యాజమాన్యమే బీమా సౌకర్యం కల్పిస్తుంది. నాకు తెలిసి మన వాళ్లు కూడా వ్యక్తులుగా లేదా గ్రూపులుగా ఇన్సూర్ చేసుకోవచ్చు. ప్రభుత్వం చెల్లించే అవకాశం ఉందేమో నాకు తెలియదు."

"రిపోర్టులో ఓడల్ని తీరానికి దూరంగా నడిపించాలని ప్రభుత్వానికి సూచన చేశారు. ఏమైంది?"

"దాని పైన చాలానే చర్చ జరిగింది. ఓడల కంపెనీల యాజమాన్యాలు ఆ సూచనను వ్యతిరేకించాయి. కోస్తా వెంట ఎక్కడికైనా వెళ్లగల వెసులుబాటు తమకు ఉండాలని వాదించాయి. అయినా ఇప్పుడు తెరచాపతో నడిచే నాటు పడవలు ఎక్కడున్నాయి? చాలావరకూ అన్నీ మర పడవలే. వాటికి విద్యుద్దీపాలుంటాయి; రేడియో ఉంటుంది; వైర్లెస్ కమ్యూనికేషన్ ఉంటుంది. ఇక డీప్ సీ ట్రాలర్లంటే వాటిల్లో రేడార్‌తో సహా అన్ని ఆధునిక సాధనాలూ ఉంటాయి. కాబట్టి ఆ సూచన గురించి ఈ మధ్యకాలంలో ఎవరూ మాట్లాడడం లేదు".

టీ త్రాగడం పూర్తయింది. జిమ్మీ తన రివాల్వింగ్ కుర్చీ వెనుకగా గాజు పెట్టెలో ఉన్నఒక తెరచాప ఓడ మోడల్‌ని తీసి నూకరాజుకిచ్చాడు. పైపు వెలిగించాడు.

"రాజూ, ఇది నీ కోసం; ఇదిగో, ఈ సంచిలో పెట్టుకొని జాగ్రత్తగా తీసుకెళ్లు. ఈస్టిండియా కంపెనీ వారి ఓడలు తొలినాళ్లల్లో ఈ విధంగానే ఉండేవి. లండన్‌లోని గ్రీనిచ్ మారిటైమ్ మ్యూజియంలో కొన్నాను – చాలా ఏళ్ల క్రిందట. ఇట్లాంటి ఓడల్లో నెలల తరబడి ప్రయాణిస్తూ, కేవలం గాలి వాటాన్ని అనుసరిస్తూ యూరపు నుండి ఇక్కడికి వచ్చివెళ్లేవారంటే ఆశ్చర్యంగా లేదూ? ఆ నైపుణ్యం, చాకచక్యం ఇప్పుడు ఇంచుమించుగా అంతరించి పోయాయి. తెరచాప పడవని నడపగలిగే సామర్థ్యం ఉన్న అతి కొద్దిమందిలో నువ్వొకడివి. మీ తాతలు, తండ్రులు, వాణిజ్య నౌకల్ని అంతర్జాతీయంగా నడిపిన ప్రాచీన భారతీయ నావికుల ఆఖరి ఆనవాళ్లు. ఇది నీకివ్వడం సరైన నిర్ణయం అని నాకు తోచింది," అన్నాడు జిమ్మీ.

మళ్లీ చెయ్యి చాచాడు. అంటే ఇక బయల్దేరమని సూచన. అదే వారిద్దరి ఆఖరి కలయిక. 'ఇన్నాళ్లకి భాస్కర్ అడిగిన ప్రశ్నలకు సమాధానలు దొరికాయి' ఇంటి

వైపుగా నడుస్తూ అనుకున్నాడు నూకరాజు. జిమ్మీలాంటి చిత్తశుద్ధి కలిగిన ఆఫీసర్లు ఇంకా ఉన్నారంటే అది మన అదృష్టం అని కూడా అనుకున్నాడు.

జాలరుల బీమా విషయమై ఏదో ఒకటి చెయ్యాలనే నిర్ణయానికి వచ్చాడు. ఇప్పటి వ్యవస్థలోనే న్యాయం కోసం ఎంతోకొంత చెయ్యడానికి అవకాశాలున్నాయనీ, జిమ్మీవంటి అధికారులు సహకరిస్తే చాలానే సాధించవచ్చనీ అతనిలో ఒక ఆశాభావం ఏర్పడింది.

* * *

'లా' చదివే రోజుల్లో నూకరాజు తన సాహిత్య అభిరుచుల్ని మరింత విస్తృత పరచుకున్నాడు. కొన్ని పుస్తకాలు మళ్లీమళ్లీ చదివాడు. అతన్ని రావిశాస్త్రి 'ఆరు సారా కథలు' బాగా ప్రభావితం చేశాయి. మన కోర్టులలో పేదవాడికి అన్యాయం జరుగుతుందే తప్ప న్యాయం దొరకదని ఆయన కథలు చెప్తాయి. అవే కోర్టులు డబ్బూ, పలుకుబడీ ఉన్నవాళ్లకి మాత్రం శిక్ష పడకుండా తప్పించుకోవడానికి శతకోటి మార్గాలను తెరుస్తాయని కూడా ఆయన ఆ కథల్లో చెప్పాడు. సీనియర్ లాయరు, జూనియర్‌కి చేసిన హితబోధని నూకరాజు ఎన్నిసార్లు చదువుకున్నాడో!

భాస్కర్, నూకరాజులు సారాకథల్లోని పాత్రలు జీవిత సత్యాలను వెల్లడించిన భాగాలను ఒకరికొకరు చదివి వినిపించుకొంటూ తెగ నవ్వుకొనేవారు. నవ్వినవ్వి భాస్కర్‌కి కళ్లల్లో నీళ్లొచ్చేవి.

"ఏం రాశాడు, బాస్! పేదల పక్షాన నిలబడ్డ రచయితకే అంత స్పష్టత ఉంటుంది," అనే వాడు భాస్కర్.

"గొప్ప కథలు రాశాడు, నిజమే. మన న్యాయవ్యవస్థ పట్ల ఎంతోకొంత నమ్మకం, ఆశాభావం లేకపోతే ఆయన స్వయంగా ఎందుకు లా ప్రాక్టీసు చేస్తున్నట్లు?" అని సందేహం వెలిబుచ్చాడు నూకరాజు.

"ఏమో? ఆయన్నే అడగాలి," అని కాసేపు ఊరుకున్నాక,

"మన లాయర్లు, కోర్టులు చేసే మంచి గురించి నాకు తెలీదుగానీ, ఆయన ప్రాక్టీసు చెయ్యబట్టేకదా, ఇంత గొప్ప కథలు రాయగలిగేడు?! ఆవిధంగా ఆయన ప్రాక్టీసు తెలుగు సాహిత్యానికి గొప్ప మేలు చేసింది," అన్నాడు భాస్కర్.

ఇద్దరూ మరోసారి నవ్వుకున్నారు.

రావిశాస్త్రి సాయంత్రం అయ్యేసరికి తెల్లటి పాంటూ, షర్టూ టక్ చేసుకొని, ఎల్లమ్మ తోటనుండి కే.జీ.ఎచ్., కలెక్టరాఫీసుల మీదుగా జిల్లా పరిషత్తు వైపు నడుచుకుంటూ ఇంటికి వెళ్లిపోతూండడం, ఆ తరవాత రిక్షాలో వెళ్తూండడం నూకరాజు చాలా సార్లు చూశాడు గానీ పలకరించే సాహసం చెయ్యలేదు.

తరవాతెప్పుడో స్వంతంగా ప్రాక్టీసు మొదలుపెట్టాక ఆయనను సంప్రదించాడు.

* * *

'జై ఆంధ్ర' ఉద్యమం మూలంగా కొన్నాళ్లపాటు చదువులు పోయినప్పటికీ – భాస్కర్ ఇంజినీరింగు, నూకరాజు 'లా' పూర్తి చేశారు. నూకరాజు ఆఫీసరు కావడం ఖాయం అనుకుంది అతని తల్లి పోలమ్మ. ఆ ఉద్యోగమేదో తొందరగా వస్తే, ఎల్లమ్మని చేసుకుంటాడని ఆమె ఆశ. వాళ్లిద్దరూ ఒకళ్లనొకళ్లు ఇష్టపడుతున్నారని ఆమెకే కాదు, జాలారిపేట మొత్తానికి తెలుసు. ఎల్లమ్మ ఎమ్మే ఇంగ్లీష్ లిటిరేచర్లో చేరింది. ప్రాణ స్నేహితుడు డారల్ ఆస్ట్రేలియా వెళ్లిపోవడంతో వెంకటేశుకి చదువుమీద ఆసక్తి తగ్గింది. మొదట కొన్ని సబ్జెక్ట్స్‌లో పరీక్ష తప్పినా మొత్తానికి బీ.ఫాం. గట్టెక్కించాడు. జాలారిపేటలోనే మెడికల్ షాపు పెట్టే ఆలోచనలో ఉన్నాడు.

కొడుకు విశాఖలోనే ఏదో ఒక ప్రభుత్వరంగ సంస్థలో చేరుతాడని కామేశం ఆశించాడు. కానీ భాస్కర్ ఆలోచనలు వేరే దారిలో నడుస్తున్నాయి. రాత్రిపూట ఇంటికి రావడం లేదు. కొన్ని రోజులపాటు బయటెక్కడో తిరుగుతున్నాడు. అడిగితే ఏదో ఒకటి చెప్పి తప్పించుకుంటాడు. ఒక్కోసారి డబ్బు కావాలంటాడు. వందా, రెండు వందలూ తీసుకుంటాడు. ఉద్యోగాలకి అప్లై చెయ్యమంటే, ఎంప్లాయ్మెంట్ ఎక్స్‌ఛేంజిలో రిజిస్టర్ చేసుకోమంటే – అదిగో, ఇదిగో అంటాడు. గట్టిగా అడిగితే చిరాకుపడతాడు. డాబామీదకి వెళ్లి సిగరెట్లు కాలుస్తున్నాడని వాసన బట్టి తెలుస్తూనే ఉంది. భాస్కర్ డాబామీద ఉన్నప్పుడు అక్కడికి వెళ్లడం మానుకున్నాడు కామేశం. ఏం చెయ్యడానికీ అతనికి తోచడం లేదు. భాస్కర్ ఏదో సందిగ్ధతనీ, సంక్షోభాన్నీ ఎదుర్కొంటున్నాడనీ, ఎందుచేతనో గానీ హింస పడుతున్నాడనీ కామేశానికి తెలుస్తోందిగానీ, అదేమిటో, ఎందుకో అనేది అతనికి అంతుపట్టడం లేదు.

* * *

నూకరాజు విశాఖపట్నం బార్‌లో రిజిస్టర్ చేసుకొని, ఎప్పటి నుండో లేబర్ 'లా' ప్రాక్టీసు చేస్తున్న ఒక ప్రముఖ ఏడ్వొకేటు వద్ద జూనియరుగా చేరాడు. ఇండస్ట్రియల్ ఎస్టేటులో జరిగిన ప్రమాదంలో చెయ్యి పోగొట్టుకున్న కార్మికుడికి నష్టపరిహారం ఇప్పించే కేసు నూకరాజే చూశాడు. కేసు కాగితాలన్నీ తయారుచేసి పెట్టాడు. లేబర్ కోర్టులో హియరింగుకి మాత్రం సీనియర్ లాయర్ ఎటెండ్ అయ్యాడు. కేసు నెగ్గారు. సీనియర్ లాయర్ నూకరాజుని మెచ్చుకున్నాడు. కార్మికుడికి న్యాయం జరిగింది. నూకరాజులో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆదాయం నిలదొక్కుకుంది. తల్లి కోరినట్టుగా – చిన్నదే అయినా – జాలారిపేటలోనే పక్కా ఇల్లు కట్టించాడు.



పావలా సీసం

జూన్ 25, 1975. ఎవరూ ఊహించని విధంగా అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశవ్యాప్తంగా ఎమెర్జెన్సీని ప్రకటించింది. అంతటా గందరగోళం, అనిశ్చితి, వదంతులు.

అదే వారంలో ఒక రాత్రి పూట భాస్కర్ నూకరాజు ఇంటికి రిక్షాలో ఒక పెద్ద సూట్ కేసుతో, భుజానికి హేండ్ బ్యాగుతో వచ్చాడు.

"ఊరికా?" అని అడిగాడు నూకరాజు.

"ఇవన్నీ పుస్తకాలు, డాక్యుమెంట్లు. ఎక్కడో జాగ్రత్తగా దాచు. నీ దగ్గర కూడా ఉంచొద్దు. మా ఇంటి మీద రెయిడ్ జరగొచ్చు," అన్నాడు భాస్కర్, సూట్ కేసుని చూపిస్తూ.

బిజినెస్ చేసే జాలరులు ఇచ్చిన జానీ వాకర్ సీసాను నూకరాజు అలమారలోంచి బయటకు తీసాడు.

"నువ్వు కావాలంటే తాగు. నాకొద్దు. మానేశాను," అని భాస్కర్ సిగరెట్టు వెలిగించాడు.

"ముందా సిగరెట్లు మాను. ఆరోగ్యానికి హానికరం," అంటూ నూకరాజు బాటిల్ని లోపల దాచాడు.

"మానాలని చాలా సార్లు ప్రయత్నించాను కానీ మానలేకపోతున్నాను."

"నువ్వు తల్చుకుంటే ఇట్టే మానగలవు."

"నామీద నాకన్నా నీకే ఎక్కువ నమ్మకం ఉన్నట్టుగా ఉంది. టీ తాగుదాం, చెయ్యి."

"బయటకి పోదాం."

"బయట తిరగడం సేఫ్ కాదు. ఇంట్లోనే తాగుదాం." నూకరాజు తల్లిని

ఉద్దేశిస్తూ, "అమ్మా! భాస్కర్‌కీ నాకూ, రెండు కప్పులు టీ చెయ్యి," అని కేక పెట్టాడు.

"ఇయ్యేలప్పుడు టీ ఏట్రా? భాస్కర్నికూడా ఇక్కడే తినీమను. చేపల పులుసొండాను. బోజనాలు చేసీండి," అన్నది పోలమ్మ కొంగుకి చేతులు తుడుచుకుంటూ వంటింట్లోంచి వచ్చి.

"ఏం బాబూ, బాగున్నావా?" అంటూ భాస్కర్ని ఆప్యాయంగా పలకరించింది.

"ఇక్కడే తింటాడులే గానీ నువ్వు ముందు టీ చెయ్యే," అని తల్లికి పురమాయించి, భాస్కర్ని –

"ఈ ఎమర్జెన్సీ గురించి నువ్వేమనుకుంటున్నావు?" అని అడిగాడు.

"పూర్తిగా అప్రజాస్వామికం. ఇండియాకూడా ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల మాదిరిగా నియంత పాలన క్రిందికి వచ్చింది. ఇక మీదట ప్రజాస్వామిక వ్యవస్థలేవీ ఉండబోవు. పార్లమెంటరీ మార్గం శాశ్వతంగా మూసుకుపోయింది. ఒకటే మార్గం మిగిలింది – సాయుధ పోరాటం. ఆ మేరకి ఎమర్జెన్సీ మంచి చేసింది. అందరికీ స్పష్టత వచ్చేసింది. ఈ మధ్యంతా అటాఇటా అని ఊగిసలాడాను. ఇప్పుడు అంతా స్పష్టంగా ఉంది."

"అంటే...నువ్వు డిసైడ్ అయిపోయావా?"

"సందేహం అక్కర్లేదు. ఇక మీదట అజ్ఞాతవాసమే." నూకరాజు ఆశ్చర్యపోయాడు. "అంత పెద్ద నిర్ణయం తీసుకున్నావు. నాకు చెప్పనేలేదు," అన్నాడు – నొచ్చుకుంటూ.

"నువ్వేమంటావో నాకు తెలుసు."

"నా సంగతి సరే. మరి కమల...?" ఇప్పుడు భాస్కర్ ఆశ్చర్యపోయాడు. "నీకు తెలుసా?"

"నాకన్నీ తెలుసు.. నువ్వు చెప్పకపోయినా. కమలే చెప్పింది. ఈ రోజు ఉదయాన్నే మా ఇంటికి వచ్చింది. ఏడ్చింది. నువ్వేమవుతావో అని చాలా బెంగ పెట్టుకుంది. నన్ను మాట్లాడమంది. నేనూ, కమలా పొద్దున్న మీ ఇంటికి వచ్చాం. నువ్వు లేవు. ఇంత పెద్ద నిర్ణయం తీసుకొనేముందు బాగా ఆలోచించాలి కదా? అయినా తొందర దేనికి? నాలుగు రోజులు ఆగు. పోనీ పార్టీ కోసమైనా బయట ఉంటూనే ఇంకో పనేదో చెయ్యొచ్చు కదా."

"బయట ఉంటే అరెస్టవుతాను. జైల్లో కూర్చొనే బదులు, అజ్ఞాతంలో ఉంటే పనికొచ్చే పనేదో ఒకటి చెయ్యొచ్చు." పోలమ్మ టీ కప్పులతో వచ్చి, అందించి, లోపలికి వెళ్లింది. ఆమె వెళ్ళాక భాస్కర్ కొనసాగించాడు –

"ఇలాంటి విషయాల్లో లాజిక్, చర్చ – ఇవన్నీ ఒక పాయింట్ వరకే. చిట్ట చివరకి ఇదొక ఎమోషనల్ డెసిషన్. ఇది కూడా ప్రేమలాంటిదే. ఒకసారి అనుకున్నాక ఏమవుతే అవుతుందని దూకెయ్యాలి – అంతే. అందుకే అంటారు – 'అగాధాన్ని ఒకే గంతుతో దాటాలి' – రెండు గంతులు పనిచెయ్యవు. లోయలో పడతాం."

కాసేపు మౌనంగా ఉండిపోయాక, నూకరాజు – "నీ నిర్ణయం నాకు నచ్చలేదు. సరైనది కాదనిపిస్తోంది. తొందరపడుతున్నావు," దృఢంగా అన్నాడు.

భాస్కర్ కటువుగా –

"నా నిర్ణయాన్ని చర్చించడానికి ఇక్కడికి రాలేదు. నువ్వు సాయం చేస్తావని వచ్చాను," అనేశాడు.

నూకరాజు మనసు గాయపడింది. ఇక వాదించి ప్రయోజనం లేదని తెలిసిపోయింది.

"ఏం చెయ్యమంటావు?"

"రాత్రి ఇక్కడే పడుకుంటాను. రేపు తెల్లవారుతూనే అనకాపల్లిలో నన్ను దింపెయ్. ఆ తరవాత నేను చూసుకుంటాను. మరో విషయం. డబ్బు కావాలి. వెయ్యి, రెండు వేలు – ఎంతుంటే అంత."

"అలాగే" ఇద్దరూ మౌనంగా భోజనం చేశారు. చేపల పులుసు ఇష్టంగా తినే భాస్కర్ సుష్టుగా తినకపోవడం పోలమ్మకి మనస్తాపం కలిగించింది.

"పులుసు సల్లారిపోయింది. బేగి రమ్మంటే మరొచ్చారుకాదు," అంది నొచ్చుకుంటూ.

స్నేహితులిద్దరూ చేతులు కడుక్కొని మళ్లీ ముందు గదిలోకి వచ్చారు.

భాస్కర్ జేబులు తడుముకొని, "చచ్చాం! సిగరెట్లయిపోయాయి" అన్నాడు, ఆందోళనగా.

"పద, బస్టాపు వరకూ వెళ్దాం. అక్కడ దొరుకుతాయి. ఈ టైంలో అంత జనాలుండరులే".

రాత్రి పది దాటినా ఆ కిళ్లీ బడ్డీ తెరిచే ఉంది.

బడ్డీకెదురుగా ఒక మెడికల్ షాపు మూసి ఉంది. నూకరాజు దాని కేసి చూపించి,

"మా బావ వెంకటేశు తెలుసుకదా? మెడికల్ షాపు పెట్టాడు. అదిగో అదే," అన్నాడు.

వెంకటేశ్, ఎల్లమ్మలు భాస్కర్‌కి బాగా తెలుసు. వాళ్లంతా కలిసి సినీమాలకీ, రెస్టారెంట్లకీ వెళ్లారు.

భాస్కర్ "అలాగా, వెరీ గుడ్!" అన్నాడు. అంటే ఆ సమాచారం అతని మెదడులో నమోదయిందన్నమాట.

"పది పేకెట్లు తీసుకో" అన్నాడు భాస్కర్. అంటే అతని వద్ద డబ్బులేదని అర్థం.

సిగరెట్లు తీసుకొని బయల్దేరుతూంటే,

సింహాచలం కొత్త వెస్పా స్కూటర్ మీద వచ్చి బడ్డీ ముందు స్టాండు వేశాడు. వీడినెలా తప్పించుకోవాలా అని నూకరాజు ఆలోచిస్తూండగానే,

"రత్నాజర్దా కారా కిల్లీలు – నాలుగు కట్టరా" అని ఆర్డర్ చేసి, భాస్కర్ వంక తేరిపార చూస్తూ –

"ఏట్రా నూకాలూ, పెద్ద లాయరవైపోయావట! పత్తీవోడూ ఇదే మాట. ఊళ్లో తగువులన్నీ ఇంక మనింటి మీదకే!... ఎలగున్నయిరా, బేరాలు? కేసులు కావాలంటే చెప్పు, తీసుకొచ్చిస్తాను. మరి నా కమీసను నాకిచ్చీయాల. తమ్ముడు తమ్ముడే, పేకాట పేకాటే," అని తన గారపళ్లను ప్రదర్శిస్తూ పళ్లికలించాడు.

"ఆ...ఏదోలే...నడుస్తంది బండి," అని నూకరాజు జారుకున్నాడు. భాస్కర్ అతని వెంట నడిచాడు. నాలుగడుగులు వేసాక నూకరాజు,

"సిమ్మాచలం అనీ – చిన్నాన్న అవుతాడులే – రొయ్యల నాయుడి ఏజెంటు. సరైనోడు కాదు."

"అవును. స్మగ్లరు. జైలుకెళ్లాడు."

"నీకెలా తెలుసు?"

"నువ్వే చెప్పావు." ఇదే సంభాషణ ఇంతకు ముందు కూడా జరిగిందని నూకరాజుకి అనిపించింది.

* * *

పొద్దున్నే సింధియా జంక్షన్ వరకూ సిటీ బస్సులో వెళ్లి అక్కడ బెల్లం మార్కెట్టుకి వెళ్తూన్న లారీని పట్టుకొని అనకాపల్లి రైల్వే స్టేషను దాటగానే దిగిపోయారు.

"నూకాలమ్మ గుడికి వెళ్లాలి. అక్కడికి ఒకతను వస్తాడు. నువ్వింక వెళ్లిపోవడం మంచిది," అన్నాడు భాస్కర్ దృఢంగా.

"లేదు. నేనూ గుడికి వస్తాను పద".

రిక్షాలో గుడి వద్దకు చేరుకున్నారు. జనం బాగా ఉన్నారు.

పొద్దున్న లారీలోనూ, ఇప్పుడు రిక్షాలోనూ భాస్కర్ సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తున్నాడు.

మరో సిగరెట్టు వెలిగిస్తూ, "నువ్వు వెళిపోవాలి. తప్పదు," అన్నాడు – నూకరాజుతో.

"చూడ్డానికి భక్తుడిలాగా లేవు. కొబ్బరికాయ, అరటిపళ్లు కొనుక్కో బొట్టు పెట్టుకో. గుడిలో సిగరెట్లు తాగకు, తంతారు," నూకరాజు హెచ్చరించాడు.

భాస్కర్ నవ్వి, సిగరెట్టు మురికి కాలవలో పడేట్టు విసిరాడు. గబగబా నడుస్తూ జనంలో కలిసిపోయాడు. అంతే! అదే వీడ్కోలు.

నూకరాజు ఆలోచనలు ఒక తీరుగా లేవు. 'ఇది భాస్కర్ పద్ధతి కాదు. ఒక్కసారన్నా కౌగలించుకోకుండా, ఒక శ్రీశ్రీ గేయాన్నో తిలక్ కవితనో వల్లించకుండా, వెనక్కి తిరిగి చూడకుండా అలా ఎలా వెళ్లిపోయాడు?...పోనీ ఒక కరచాలనం?...ఏదో ఒక ప్రైవేటు జోకు? ఎవరైనా చూస్తే అనుమానిస్తారనా?... బాగా టెన్షన్‌లో ఉన్నాడా?...చివరిలో మనసారా నవ్వేడే?...అతనడిగిన డబ్బు రాత్రే ఇచ్చేశాడు. ఇంకేమన్నా కావాలేమో?...బ్యాగులో అన్నీ పెట్టుకున్నాడా? పొద్దున్న హడావుడిగా బయల్దేరిపోయారు. ఏదైనా మర్చిపోయాడా? మళ్లీ ఎప్పుడు కలుస్తాడో? అసలు కనిపిస్తాడో లేదో?...'.

నూకరాజుని ఒక ఉద్వేగం ఆవహించింది. దుఃఖం కమ్ముకొచ్చింది. కన్నీళ్లతో కళ్లు మసకబారాయి. నిస్సహాయత ఆవరించింది. గుడి బయటి నుండే – 'అమ్మా! నూకాల్తల్లీ! మా అమ్మా నాన్నా నాకు నీ పేరే పెట్టారు. నీ చల్లటి దీవెనతోనే నేను పుట్టేను. నేనెప్పుడూ నిన్నేదీ కోరలేదు. మా భాస్కర్ని మాత్రం ఏ ఆపదా రాకుండగ నువ్వే చల్లగా చూసుకోవాల. ఎలాగైనా నువ్వే మా వాడిని కడుపులో పెట్టుకొని కాపాడాలమ్మా' అని మనసులోనే దండం పెట్టుకున్నాడు. ఇది అతని ప్రమేయం లేకుండానే అప్రయత్నంగా జరిగిపోయింది. తానొక పరమ నాస్తికుడిగా మారిపోయానని భ్రమ పడ్డాడు, ఇన్నాళ్లూ. అతని ప్రవర్తన అతనికే అంతుపట్ట లేదు.

* * *

ప్రస్తుతానికి భాస్కర్ ఏమంత ప్రమాదకరమైన వ్యక్తి కాదని ఇంటెలిజెన్స్ వర్గాలు భావించాయి. అయితే అతని కదలికలపై నిఘా పెట్టాలనీ, ఎవరెవరిని కలుస్తున్నాడో ఆరా తీయాలనీ, ఇంకా ముఖ్యమైన వ్యక్తులను వలవేసి పట్టుకోవడానికి ఎరగా వినియోగించుకోవాలనీ వారు భావించారు. అతడు జాలారిపేటకి తరచూ వెళ్తూంటాడని వారికి తెలుసు. తమకు అన్నివిధాలా సహకరిస్తున్న సింహాచలానికి భాస్కర్ పోటో ఇచ్చి ఓ కన్ను వేసి ఉంచమని కోరారు. ఉన్నట్టుండి భాస్కర్ అంతర్ధానం కావడం అధికారులకు ఆశ్చర్యంతో బాటుగా చికాకును కూడా కలిగించింది. డిపార్టుమెంటు వారు ఇంకా పెద్ద చేపల్ని పట్టుకొనే ప్రయత్నంలో తలమునకలుగా ఉన్నారు.

అదే రోజున సింహాచలం వన్-టౌన్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి, ముందురోజు రాత్రి భాస్కర్ని నూకరాజుతో బాటు జూలారిపేటలో చూశానని రిపోర్ట్ చేశాడు. ఎస్సై నూకరాజుని స్టేషన్‌కి పిలిపించి భాస్కర్ ఆచూకీ గురించి ప్రశ్నించాడు. నాకు తెలియదని నూకరాజు నమ్మబలికినప్పుడు, మళ్లీ కనిపిస్తే వెంటనే వచ్చి తెలియజేయమని చెప్పి పంపించాడు. ఇది సింహాచలం పనే అని నూకరాజుకి అర్థం అయిపోయింది. భాస్కర్ ఏమయ్యాడనేది మరో ఏణ్ణర్థం వరకూ తెలియలేదు.

మధ్యలో ఒక యువకుడు నూకరాజు వద్దకు వచ్చి, "కొన్ని మందులు కావాలి. మీ ఫ్రెండు పంపించాడు. ఊరికే కాదు, డబ్బిచ్చేస్తాను," అన్నాడు.

"ఎలా ఉన్నాడు?" అని ఆత్రుతగా అడిగాడు నూకరాజు.

"నాకు ఆయనెవరో, ఎలా ఉంటాడో తెలీదు. ఎవరో ఎవరికో చెబితే, వాళ్లు నాకు చెప్పారు." నూకరాజు నిట్టూర్చి, అతడిని వెంకటేశు షాపుకి తీసుకెళ్లాడు. ఆ విధంగా మూడు నాలుగుసార్లు జరిగింది. ఒకసారి వచ్చిన వ్యక్తి మళ్లా రెండోసారి రాలేదు గానీ వాళ్లంతా, 'మీ ఫ్రెండు పంపించాడు' అనేవారు. అట్టపెట్టెలలో మందులు, ఇంజెక్షన్లు, సిరెంజిలు, బ్యాండేజిలు ప్యాక్ చేయించి పట్టుకుపోయేవారు. అణా పైసలతో సహా మొత్తం చెల్లించేవారు.

* * *

రెండు మూడు కేసులు నెగ్గడంతో నూకరాజుకి కార్మికుల లాయరుగా మంచి పేరొచ్చింది. లేబర్ లా అతని ప్రత్యేకత అయింది. విశాఖలోని యూనియన్లు, ఉద్యోగుల సంఘాలు – ముఖ్యంగా ఏదో ఒక ఎర్రజెండా క్రింద పనిచేసే సంఘాలన్నీ అతన్ని సంప్రదించసాగాయి. అతన్ని తమ లాయరుగా, సలహాదారుడిగా నియమించాయి. స్వంతంగా ప్రాక్టీసు మొదలు పెట్టి కాలేజీ డౌన్లో మేడమీద ఒక గది అద్దెకు తీసుకొని, చిన్న ఆఫీసు తెరిచాడు. ఒక మోపెడ్ కొనుక్కున్నాడు. అతని ఇంగ్లీషు మరింత బాగా వ్రాయడానికి, మాట్లాడడానికీ ఎల్లమ్మ చాలా సహకరించింది. నూకరాజు ఇప్పుడు చక్కటి ఇంగ్లీషులో డ్రాఫ్టింగు చేస్తాడు; బాగా మాట్లాడతాడు. తోటి లాయర్ల గుర్తింపుతో బాటు జడ్జీల మన్ననలు కూడా పొందాడు.

రాజ్యాంగమే ప్రజల్ని కాపాడుతుందనీ, చెయ్యాల్సిందల్లా 'రూల్ ఆఫ్ లా' అన్ని వర్గాలకీ, సమూహాలకీ సమానంగా వర్తింపజేయడమే అనీ నూకరాజు దృఢంగా నమ్మాడు. పేదలకీ, పీడితులకీ చట్టం ఏర్పరచే న్యాయం అందేట్టు చెయ్యడమే తన జీవిత ధ్యేయం అని కొంత అమాయకంగానూ, చాలా మొండిగానూ అతడు అనుకున్నాడు. ఆ పనుల్లోనే కొంతకాలంగా బొత్తిగా తీరుబడి లేకుండా ఉన్నాడు. ఎల్లమ్మ ఏ సినీమాకో రమ్మంటే, రేపు హియరింగు ఉంది, ప్రిపేరవ్వాలి అనేవాడు.

ఆమె నవ్వుతూ, "బావా, నీకు క్షణం తీరుబడి లేదు, దమ్మిడీ ఆదాయం లేదు." అనేది.

అయితే నూకరాజు ఆదాయంకోసం ఎన్నడూ ప్రాకులాడలేదు; అలాగని ఇబ్బందీ పడలేదు. ఇంటి ఖర్చులకు సరిపడా వస్తూనే ఉంది. ఈ మధ్య పారిశ్రామిక సంబంధాల కేసులే కాకుండా, పర్యావరణానికి సంబంధించిన కేసులు కూడా ఎక్కువగా అతని వద్దకు వస్తున్నాయి. 'పెళ్లి చేసుకో' అని ఇటు తల్లీ, అటు గంగమ్మత్తా పోరుతున్నారు. ముందుగా స్వంత ప్రాక్టీసు నిలదొక్కుకోవాలని అతని కోరిక. ఈలోగా ఎల్లమ్మ ఎమ్మే పూర్తిచేసి మహిళా కళాశాలలో లెక్చరరుగా చేరింది. 'వలసకాలంనాటి ఆంగ్ల సాహిత్యంలో కోరమాండల్ తీరం ప్రసక్తి' అనే అంశంపై పార్ట్-టైం పీ.ఎచ్.డీ. చేస్తోంది.

ఇద్దరి ఆదాయంతో ఏదోలా బండి లాగించవచ్చులే అనుకున్నారు. రిజిస్టర్ పెళ్లి చేసుకున్నారు; దండలు మార్చుకున్నారు. ఆ విధంగా గంగరాజు కోరికలు రెండూ – ఎల్లమ్మ పెద్ద చదువులు, నూకరాజు అల్లుడు కావడం – నెరవేరాయి. దండల పెళ్లి గంగమ్మ, పోలమ్మలకు నిరుత్సాహం కలిగించిందిగానీ చివరికి రాజీ పడ్డారు. 'ఇదేం పెళ్లిరా?' అన్నారు జాలారిపేట పెద్దలు. డారల్, డెబొరాలు శుభాకాంక్షలు పంపించారు. పెళ్లికి భాస్కర్ లేకపోవడం నూకరాజుని ఎంతగానో బాధించింది. మరుసటేడు వెంకటేశు తల్లి కుదిర్చిన సంబంధం చేసుకున్నాడు. అమ్మాయి ఇంటర్మీడియట్ పాసైంది. కొడుకు పెళ్లైనా శాస్త్రోక్తంగా జరిగినందుకు గంగమ్మ సంతోషించింది.

* * *

ఆ దుర్వార్త ఏరోజునైనా వినాల్సివస్తుందని నిత్యం భయపడుతూనే ఉన్నప్పటికీ చింతపల్లి అడవుల్లో భాస్కర్ ఎన్కౌంటర్ అయిన వార్తను 'ఈనాడు' పేపర్లో చదివినప్పుడు నూకరాజు మొదట నమ్మలేదు. 'అంతా వట్టిదే, అంతా వట్టిదే' అనుకోసాగాడు. అతని మెదడు మొద్దుబారిపోయింది. 'ఆ వార్త పచ్చి అబద్ధం అని ఎవరైనా వచ్చి చెబితే బాగుండును' అని ఎల్లమ్మతో అన్నాడు.

మర్నాడు ఉదయం భాస్కర్ తండ్రి కామేశం నూకరాజు ఆఫీసుకి వచ్చి భోరున ఏడ్చినప్పుడు మాత్రం జరిగిందేమిటనేది అతని ఎరుకలోకి వచ్చింది. శవాన్ని గుర్తుపట్టడానికి కామేశాన్ని కే.జీ.ఎచ్. మార్చురీకి తీసికెళ్లారట. 'అక్కడినుంచే వస్తున్నాను' అన్నాడు ఏడుస్తూ. నూకరాజు కూడా కామేశాన్ని పట్టుకొని ఏడ్చేశాడు. వెళ్తూవెళ్తూ కామేశం –

"ఒకేసారి తుపాకితో కాల్చి చంపేసి ఉంటే ఇంత బాధ పడకపోదును రాజూ!... కొట్టికొట్టి చంపారు బాబూ, వేళ్లన్నీ విరిచేశారు," అని మళ్లీ ఏడ్చాడు.

'రేపు పదకొండు గంటలప్పుడు – చావుల మదుం' అంటూ మెట్లు దిగి వెళ్లిపోయాడు.

నూకరాజుకి శ్మశానానికి వెళ్లబుద్ధి కాలేదు. ఆ తరవాత నాలుగు రోజులు పిచ్చివాడిలాగా సముద్రం ఒడ్డున రాత్రనక, పగలనక తిరిగాడు. జరిగిన దాన్ని నమ్మడానికీ, తననితాను సమాధానపరచుకోవడానికీ ప్రయత్నించాడు. ఎల్లమ్మ సమక్షంలో ఏడ్చాడు. ఆ తరవాత మౌనంగా, స్తబ్ధుగా, అన్నిట్లో అనాసక్తంగా ఉండిపోయాడు. కోర్టుకి వెళ్లడం మానుకున్నాడు. ఎల్లమ్మ అతన్ని సముదాయించడానికి శత విధాలుగా ప్రయత్నించింది. పోలమ్మ చాలా బాధపడింది. 'మంచోల్లందర్నీ దేవుడు తీసికెలిపోతన్నాడు...ఎప్పుడొచ్చినా చేపల పులుసు చెయ్యమనీవోడు. ఎంతో ఇష్టంగా తినీవోడు' అంది.

అలా రెండు వారాలు గడిచాయి.

నూకరాజు తన గురువైన కృష్ణారావుని కలుద్దామనిపించి వెళ్లాడు. ఆయన అంతా శ్రద్ధగా విని, నిట్టూర్చి –

"పావలా సీసం," అన్నాడు.

నూకరాజుకి అర్థం కాలేదు.

"నువ్వు చెప్పిందాన్ని బట్టి, భాస్కర్ చాలా అపురూపమైన వ్యక్తి అయి ఉంటాడనిపిస్తోంది. అటువంటి మనుషులు సమాజానికి కావాలి. వాళ్లు చెయ్యగలిగేవి, చెయ్యాల్సినవి చాలా ఉన్నాయి. అలాంటి అరుదైన వ్యక్తుల్ని పోగొట్టుకుంటున్నాం. అటువంటి మనుషులు ఒక దారిలో, ఒక హిస్టారిక్ ప్రాసెస్‌లో వస్తారు. వాళ్లంతా చరిత్ర సానపట్టిన వజ్రాలు. వాళ్లని మన సమాజం కాపాడుకోవాలి; వినియోగించుకోవాలి. కానీ ఏం జరుగుతోంది? ఒకరి తరవాత ఒకరిని పోగొట్టుకుంటున్నాం. మీ భాస్కర్ అడవుల్లోకి వెళ్లి ఏమి సాధించాడో మనకి తెలీదు. వాళ్లవన్నీ హత్యా రాజకీయాలు. ఎందరో కష్టపడి, త్యాగాలు చేసి నిర్మించిన గిరిజన ఉద్యమాన్ని ఒక్క ఏడాదిలో నాశనం చేసుకున్నారు. నగరాల నుండి చాటుగా వెళ్లి నలుగురు భూస్వాముల్ని చంపితే విప్లవం వస్తుందా? అలాగని మార్క్సిజం ఎన్నడూ చెప్పలేదు. చివరికి ఏం జరిగింది? ఒకే ఒక సీసపు గుండు అతన్ని చంపేసింది. ఆ చిన్న సీసపు గుండు ఖరీదు ఎంతుంటుంది? పావలా...? పావలా సీసం అతని అమూల్యమైన జీవితాన్ని అంతం చేసింది. ఎంతమంది ఎన్నిసార్లు జోహార్లు, లాల్ సలాంలు చెప్పినా పోయిన ప్రాణం తిరిగొస్తుందా?" మాస్టారి గొంతులో ఆవేదన ధ్వనించింది.

నూకరాజుకి అప్పట్లో తెలియలేదుగానీ, వెంకటేశు మెడికల్ షాపుకి ఎదురుగా ఉన్న కిళ్లీబడ్డీ యజమాని, సింహాచలం ఏజెంట్లలో ఒకడు. నూకరాజు

ఎవర్నో వెంటబెట్టుకొని వస్తున్నాడనీ, ఆ వ్యక్తి అట్టపెట్టెల్లో మందులు ప్యాక్ చేయించి తీసుకెళ్తాన్నాడనీ సింహాచలానికి సమాచారం అందింది. అతను వెంటనే పోలీసులకు ఉప్పందించాడు. ఇదే చివరికి భాస్కర్ ఆచూకీ వెల్లడి కావడానికీ, అతను పట్టుబడడానికీ దారితీసిందా? కావచ్చు.

* * *

ఇందిరా గాంధీ ఎన్నికలు ప్రకటించింది. జనతా పార్టీ ఎన్నికల్లో నెగ్గి, అధికారంలోకి వచ్చింది. దేశంలో ప్రజాస్వామిక ఆకాంక్షలూ, సంస్థలూ ఇంకా బలంగానే ఉన్నాయనే భావన నూకరాజుతో సహా చాలామందికి కలిగింది. మరుసటేడు నూకరాజు, ఎల్లమ్మలకు కొడుకు పుట్టాడు. భాస్కర్ని గుర్తుచేసుకుంటూ కొడుక్కి ఉదయ్ అని పేరుపెట్టుకున్నారు. గంగమ్మా, పోలమ్మా తమ మనవడిని 'ఉదయం' అని పిలుస్తారు.

మరో రెండేళ్లకి ఉదయ్‌కి చెల్లెలు పుట్టింది. కాస్త ఆలస్యంగానైనా లక్ష్మీదేవి ఇంట అడుగుపెట్టిందని గంగమ్మా, పోలమ్మా మురిసిపోయారు. ఆమెకి షెరాన్ అని పెడదామని ఎల్లమ్మ సూచించింది. చివరికి అదే విధంగా ధ్వనించేలా శరణ్య అని పెట్టారు. ఇంట్లో 'శరణ్' అని పిల్చేవారు.

* * *

వ్యాపారం అంటే ప్రతి ఒక్కడినీ నమ్మించడం, ఏ ఒక్కడినీ నమ్మకపోవడం. ఈ సంగతి రొయ్యల నాయుడికి ముందే తెలుసు. అందుచేత విశాఖకు వచ్చిన కొత్తలో సొంత అక్కకు మొగుడైన శాంతమూర్తినీ, అతని స్థానిక వ్యాపార సంబంధాల్నీ బాగా వాడుకుని, తరవాత అతగాడిని పక్కకు తప్పించాడు. 'ట్రాలర్లూ, రొయ్యలూ, ఎగుమతులూ – ఇవన్నీ నువ్వు పడలేవు బావా, నేను చూసుకుంటాను' అంటూ స్మగ్లర్లకు మదుపుపెట్టి, లిక్కర్ డాన్‌గా ఎదిగి ఒక వెలుగు వెలిగిన శాంతమూర్తి అంతటి వాడి చెయ్యి పట్టుకొని, రిటైర్మెంటు దిశగా నడిపించాడు. బావ వద్ద పనిచేసిన వాళ్లల్లో 'వీడు నాకు ఉపయోగపడతాడు' అని తోచిన వ్యక్తులను చేరదీశాడు. వాళ్లల్లో సింహాచలం ఒకడు. వ్యాపారం ఎంత వృద్ధి చెందినా యూనివర్సిటీ ఉద్యోగం మాత్రం మానలేదు. వీలున్న రోజున వెళ్లడం, లేని రోజున మానెయ్యడం; లేదా ముఖం చూపించి వచ్చెయ్యడం. అడిగేదెవరు? ఉద్యోగం అనేది పురుష లక్షణం మాత్రమే కాకుండా, సమాజంలో ఒక గౌరవప్రదమైన స్థానాన్ని కలగజేస్తుందనీ, దాని మూలంగా ఎప్పటికైనా ఉపయోగం ఉంటుందనీ – దూరదృష్టి కలిగిన నాయుడికి తెలుసు. విశాఖ వ్యాపార ప్రపంచంలో అతని ప్రసక్తి వచ్చినప్పుడల్లా – 'అబ్బో! ఆయన మామూలు బిజినెస్‌మేన్ కాదు, మహా మేధావి' అంటూఉండడం అతనికి

బాగా నచ్చింది. కాకపోతే అలగాజనం తనని 'ప్రొఫెసర్ నాయుడు' అని కాకుండా 'రొయ్యల నాయుడు' అని వ్యవహరించడం అతనికి మనస్తాపం కలిగిస్తున్నది.

వ్యాపారం అంటేనే రిస్కుతో కూడిన వ్యవహారం. అంచేత తెలివిగల వ్యాపారి ఏం చేస్తాడంటే – రిస్కుని తన ఉద్యోగులకి పంచిపెడతాడు; కష్టమర్లకి విడిచిపెడతాడు; అప్పులిచ్చిన బ్యాంకులకి ఎసరుపెడతాడు; చేతికేదీ అంటుకోకుండా జాగ్రత్త పడతాడు; పీకలమీదకొస్తే తప్పుకుంటాడు; లాభాలు మాత్రం జేబులో వేసుకుంటాడు; ఇందుకుగాను అటు పెద్దలతో, ఇటు కులపోళ్లతో సత్సంబంధాలు కలిగి ఉంటాడు. ఈ వ్యాపార రహస్యాన్ని రొయ్యల నాయుడు అతి త్వరలోనే తెలుసుకున్నాడు. ట్రాలర్ యజమానుల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. బావ శాంతమూర్తికి తెలియని ఒక వ్యాపార రహస్యాన్ని రొయ్యల నాయుడు స్వయంగా కనుక్కున్నాడు. అదేమంటే - వ్యాపారానికీ రాజకీయాలకూ ఉండే సజీవ సంబంధం.

భుక్తి కోసమని అందరూ చేసే చిన్నాచితకా వ్యాపారాల జోలికి పోకుండా, సంప్రదాయ వ్యాపార కులాల మాదిరిగా కిరాణా, బంగారం, పట్టుచీరల అమ్మకాలకు పరిమితం కాకుండా, కొత్తగా ద్వారాలు తెరుచుకుంటూన్న వాణిజ్య రాజమార్గాలను స్వంతం చేసుకోవాలనీ, అవసరమైతే ద్వారపాలకులనే కాకుండా, పాలకులనూ కూడా మచ్చిక చేసుకొని ఆయా దారులను దగ్గరుండి స్వయంగా తెరిపించాలనీ, అందుకు అస్మదీయుల సహకారం అవసరం అనీ రొయ్యల నాయుడు గ్రహించాడు. రకరకాల కంపెనీలను స్థాపించాడు. మొట్టమొదట తన దృష్టిని పెద్దపెద్ద కాంట్రాక్టులపై పెట్టాడు. వాటిల్లో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికై మంజూరైన కాంట్రాక్టులు ప్రధానమైనవి. ఆ వెంటనే రియల్ ఎస్టేటు రంగంలోకి దూకాడు. రాబోయే రోజుల్లో ఉండబోయే డిమాండుని ఊహించి భూముల్ని ఎడాపెడా, కారుచౌకగా కొని అట్టేపెట్టుకున్నాడు. అక్కడి నుండి ప్రముఖ బిల్డరుగా, వైజాగ్ బిల్డర్స్‌కి మార్గదర్శకుడిగా ఎదగడానికి ఎంతోకాలం పట్టలేదు.

ఇదే కాలంలో రొయ్యల నాయుడి అనుచరులలో ఒకడైన సిమ్మాచలం కూడా స్థానిక నాయకుడిగా ఎదిగాడు. పదవ తరగతి పాసు కాలేకపోయినా, చేపలవేటకి వెళ్లడం అంటే నామోషీగా భావించే గ్యాంగుని అతడు చేరదీశాడు. యువజన సంఘం స్థాపించాడు. ప్రతీ ఏటా వినాయక చవితి, దుర్గాపూజ పెద్ద ఎత్తున నిర్వహించసాగాడు. తన అనుచరుల చేత చందాలు వసూలు చేయించాడు. వసూళ్లకు ట్రాలర్ల యజమానులు సహకరించారు. తన వెంట తిరిగే రికామీ కుర్రకారుకి ఆటో రిక్షాలు కొనుక్కోవడానికీ, జెరాక్స్ షాపులు పెట్టుకోవడానికీ, ఎస్.టీ.డీ. బూతులు నడపడానికీ బ్యాంకుల నుండి ఋణాలు ఇప్పించాడు. ఎంత చిన్న పని చేసినా దానికి విస్తృతమైన ప్రచారం కల్పించాడు.

రేషన్ కార్డు కావాలా? అర్జెంటుగా గ్యాస్ కనెక్షను అవసరం అయిందా? కే.జీ. ఎచ్.లో లేదా కలెక్టరాఫీసులో పని పడిందా? డ్రైవింగు లైసెన్సు సంపాదించాలా? చిరు ఉద్యోగమైనా లేక నానాఅవస్థలూ పడుతున్నారా? అర్జెంటుగా అప్పు కావాలా? చిన్న పొరబాటుచేసి పోలీసులకి అడ్డంగా దొరికిపోయారా?...అన్ని సమస్యలకీ ఒకే పరిష్కారం. అదుగో మన సిమ్మాచలం. అందరికీ అన్ని పనులూ చేసి పెట్టాడు. అన్ని వైపులా కమీషన్లు నొక్కేశాడు.

సింహాచలంలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి దాన్ని బయటకు రప్పించిన ఘనత మాత్రం అతని గురువు రొయ్యల నాయుడిదే. గురువుగారి ఆశీర్వాద బలంతోనే అతని ప్రియశిష్యుడు సింహాచలం కార్పొరేటర్‌గా అవతరించాడు. తన చుట్టూ తిరిగే మందీ మార్బలం ఏర్పాటు చేసుకున్నాడు. తన హోదాకి తగినట్లుగా ఎస్.యూ.వీ. కొన్నాడు. పనీపాటా లేని ముసలాళ్లు కొందరు జాలారిపేట మధ్యలో ఉన్న మర్రిచెట్టు కింద, చప్టామీద కూర్చొని సొల్లు కబుర్లు చెప్పుకుంటూ, తనని 'జైలుకెళ్లినోడు', 'పెల్లాం ఒదిలీసినోడు' అంటున్నారని తెలిసిన రోజున రవ్వంత బాధ పడ్డాడుగానీ నాయుడుగారి చలవతో అతని స్టారు రైజింగులో ఉంది.

* * *

జాలారిపేటలో మరోవైపున వెంకటేశు తాను ఎంతో ఇష్టపడే బాక్సింగు రంగంలో యువకులకు తర్ఫీదు ఇవ్వడానికని, అలాగే బాడీ బిల్డింగు, వెయిట్ లిఫ్టింగు, కుస్తీ నేర్పించడానికని ఒక అకాడెమీ తెరిచాడు. రెండుమూడేళ్లల్లో రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తయారుచేశాడు. వాళ్లల్లో కొంతమంది జాతీయ స్థాయికి కూడా చేరుకున్నారు.

మేనల్లుడు వెంకటేశు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతూన్న వస్తాదుల్ని చూసి సింహాచలం మురిసిపోయాడు. అతగాడు చేసే వ్యాపారాలకీ, నడిపే వ్యవహారాలకీ రౌడీల అవసరం ఎల్లప్పుడూ ఉంటుంది మరి. భూమి తగాదాలూ, సెటిల్మెంట్లు, లిక్కర్ లైసెన్సులు, బెల్టు షాపులు, మొండిబాకీల వసూళ్లు - వీటన్నింటికీ బలప్రయోగం అవసరం అని సింహాచలానికి తెలుసు.

"గొప్ప పనిచేస్తన్నావల్లుడూ! మనోల్లందరికీ ఒక దారి చూపిస్తన్నావు," అని మేనల్లుడి భుజం తట్టి, మునగ చెట్టు ఎక్కించాడు.

అకాడెమీకి చక్కని భవనం కట్టుకోవడానికి స్థలం, కుర్రాళ్లకి ఉద్యోగాలు ఇప్పిస్తానన్నాడు.

సింహాచలం మాటలమీద పెద్ద నమ్మకం లేకపోయినప్పటికీ రెండురోజుల పాటు వెంకటేశు చాలా కలలు కన్నాడు. మూడో రోజున – కొంచెం సందేహిస్తూనే – బావ నూకరాజుకి సింహాచలం చేసిన ప్రతిపాదన గురించి చెప్పాడు.

వెంకటేశు చెప్పిందంతా శ్రద్ధగా విని -

"అంతకన్నా బుద్ధితక్కువ పని మరోటి ఉండదు" అన్నాడు నూకరాజు.

కోప్పడతాడనుకున్న బావ అంత శాంతంగా జవాబివ్వడంతో మరికొంత సాగదియ్యాలని చూశాడు వెంకటేశు.

"మనకి పోయేదేమీ లేదు. అన్నీ అతగాడే చూసుకుంటాడు. ఉద్యోగాలు వచ్చినవాళ్లకి వస్తాయి. మనకి స్థలం ఇప్పిస్తానంటున్నాడు...అంతకన్నా మనకేం కావాలి?"

"ఇవన్నీ ఊరికే చేస్తాడా?"

"ఏమీ కావాలని అడగలేదు మరి..."

"వాటా కావాలంటాడు, చూస్తుండు"

"పెద్ద వ్యాపారమేమీ కాదుకదా? నాకు ఇంట్రెస్టు కొద్దీ చేస్తున్నానంతే. నీకు తెలుసు, నా అసలు వ్యాపారం వేరే ఉంది"

"అంటే...సింహాచలంతో చేతులు కలుపుతావా?"

"మనకి పోయేదేమీ లేదంటున్నాను" కాసేపు మౌనంగా ఉన్నాక -

"సరే, నీ ఇష్టం. కానీ ఒకటి గుర్తుంచుకో. మీ నాన్న పరువు తీసి బజార్లో పెడుతున్నావు" అన్నాడు నూకరాజు దృఢంగా.

"అదేంటి బావా! అంత మాటనేశావు?"

"జాలారిపేటలో మీ నాన్న ఎంత గౌరవంగా బతికేడో మనం అందరం చూసాం. ఇదే సింహాచలం గాడి మూలంగా కన్నబాబు, అప్పల్రాజు - ఇద్దరి ప్రాణాలూ పోయాయి. ఆరోజున మీ నాన్నతో బాటు పడవలో ఉన్నవాళ్లల్లో నేక్కడినే మిగిలాను. మీ నాన్న తనతో ఉండేవాళ్లని ఎంత బాగా చూసుకొనేవాడో నాకు తెలుసు. మీ అమ్మ చేత మరపడవ కొనిపించి జాలారోల్లకి కిచ్చీ రాయతీలన్నీ వాడుకు దొబ్బాడు. కాస్త పచ్చగా కనబడగానే ఆ కంపెనీనే రొయ్యల నాయుడికి దొబ్బెట్టాడు. టైమొచ్చింది కాబట్టి ఇంకొక్క మాటకూడా చెప్తాను. మా ఫ్రెండు భాస్కర్ని ఈడే పట్టించాడని నా అనుమానం. అలాటి బాడుకావోడితో చేతులు కలపడానికి నువ్వు సిద్ధపడ్డావంటే ఇయ్యాల్టితో నీకూ నాకూ తెగిపోయినట్టే," అని ముగించాడు నూకరాజు.

నూకరాజు ఏకబిగిని అన్ని పరుష వాక్యాలు మాట్లాడడం వెంకటేశు అంతకు ముందెప్పుడూ వినలేదు. అతనికి చెమటలు పట్టాయి.

"సరే బావా! నీకంత ఇష్టంలేని పని నేను మాత్రం ఎందుకు చేస్తాను?" అని సర్దిచెప్పాడు వెంకటేశు.

వెంకటేశుకీ, సింహాచలానికీ మధ్య ఒప్పందం ఏదీ కుదరలేదు. అయినప్పటికీ అకాడెమీలో తర్ఫీదైన యువకుల్ని కొందరిని తన పనుల కోసం రిక్రూట్ చేసుకున్నాడు సింహాచలం.

రౌడీలను సప్లై చేసే స్కూలుగా తన అకాడెమీకి ముద్ర పడుతుందేమోనని వెంకటేశు భయపడ్డాడుగానీ క్రీడారంగంలో వచ్చిన మంచిపేరు అలాగే కొనసాగింది.

యోధుల్ని తయారుచెయ్యడమే కాకుండా వాళ్లు ఎవరికి ఉపయోగపడతారో అనే అంశంపైన కూడా దృష్టి పెట్టాలని ఈ సంఘటనతో వెంకటేశు తెలుసుకున్నాడు.

"ప్రధానంగా ఆత్మరక్షణకీ, అవసరమైన మేరకి ఎదురుదాడులకీ ఫైటర్స్ అవసరం అవుతారు," అని వెంకటేశు, నూకరాజుతో అన్నాడు ఇది జరిగిన కొత్తలో.

బాక్సర్లని 'ఫైటర్స్' అని పిలుచుకొనే ఆనవాయతీ ఉంది.

నూకరాజు నవ్వి, "నువ్వనేదాంట్లో చాలా ప్రమాదాలున్నయిలే గానీ, భాస్కర్ నీ మాట విని ఉంటే సంతోషించేవాడు," అన్నాడు.

* * *

ఎల్లమ్మ పీ.ఎచ్.డీ. పూర్తి చేశాక యూనివర్సిటీలో ఉద్యోగం కోసం అప్లై చేసింది. ఇంటర్వ్యూలో బాగా చేసింది. ఇంక రాదనుకుంటూ ఉండగా ఒకరోజున రిజిస్టర్డ్ పోస్టులో అపాయింట్‌మెంట్ లెటర్ వచ్చింది. నూకరాజుతో కలిసి వెళ్లి తల్లి గంగమ్మ పాదాలకు మొక్కి, ఆ ఉత్తరాన్ని ఆమె చేతికిచ్చి శుభవార్తను తెలియజేస్తే, ఆమె కన్నీళ్లు పెట్టుకొని –

"మీ నాయినే గనక ఉండి ఉంటే ఎంత సంతోషించే వాడే!" అంది.

నూకరాజు, ఎల్లమ్మ – ఇద్దరికీ కన్నీళ్లు ఆగలేదు.

అపాయింట్‌మెంటు లెటర్ కొసలకి కాస్తంత పసుపు అంటించి, గంగరాజు ఫొటో ముందు పెట్టి,

"దండం పెట్టుకోండి. రేపే అమ్మవారికి పూజ చేయిస్తాను, మీరు రావాలి," అంది.

ఆమె మాటకాదనలేక, "అలాగే" అన్నారు దంపతులిద్దరూ.

* * *

అప్పటికే కుల శిబిరాలుగా విడిపోయి ఉన్న యూనివర్సిటీలో చేరినప్పుడు ఎల్లమ్మ కొత్తలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంది.

"మీరు జాలరులు అయినప్పటికీ తెలుగే కాదు, ఇంగిలీషు కూడా చాలా బాగా మాట్లాడతారండీ!" అని కొందరు ఆమె ముందే ఆశ్చర్యం ప్రకటించారు.

"నేను బోధించేదే ఇంగ్లీష్ లిటిరేచర్ అయినప్పుడు మీకింత ఆశ్చర్యం ఎందుకో?" అనేది ఎల్లమ్మ.

తొలి రోజుల్లో ఆమె వద్ద పరిశోధన చెయ్యడానికని చేరిన వాళ్లంతా క్రింది కులాల వాళ్లే. ఈ ధోరణిలో మార్పు రావడానికి నాలుగైదేళ్లు పట్టింది. ఎల్లమ్మ నిబద్ధతకీ, సామర్థ్యానికీ మొదట విద్యార్థులలో గుర్తింపు వచ్చింది.

సహోద్యోగులంతా మారిపోయారని కాదుగానీ, అంతవరకూ ఆమెను టార్గెట్ చేసినవాళ్లు కూడా –

"అమ్మో! ఈ జాలరిది పరమ గయ్యాళి. దీంతో జాగ్రత్తగా ఉండాలి," అంటూ వెనక్కి తగ్గే రోజులొచ్చాయి.

క్రమేపీ ఊళ్లోని సాహితీ సంస్థలతోనూ, రచయితలతోనూ ఎల్లమ్మకు సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఆమెకు ఒక విమర్శకురాలిగా, అనువాదకురాలిగా మంచి గుర్తింపు వచ్చింది. సభలు, సమావేశాలకు వక్తగా రమ్మని ఆహ్వానాలు అందసాగాయి.

ఎల్లమ్మ బియ్యేలో ఉన్నరోజుల్లో ఆమెకు నూకరాజే తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేశాడు. ఆమె ఎమ్మేలో చేరాక ఇంగ్లీషు సాహిత్యాన్ని, ఆధునిక అంతర్జాతీయ సాహిత్యపు ఇంగ్లీషు అనువాదాల్నీ ఎల్లమ్మ అతనికి పరిచయం చేసింది. అప్పటికే నూకరాజు పని ఒత్తిడుల మూలంగా చదవడం తగ్గించేశాడు. అయినప్పటికీ వాళ్ల మధ్య సాహిత్య చర్చలు కొనసాగాయి.

ఒకసారి శ్రీశ్రీ గురించి ఎల్లమ్మ - "సంస్కృతం, సంప్రదాయ సాహిత్యం, ఛందస్సు, ధ్వని – వీటి పైన అతనికి ఉన్న పట్టు అతని పదజాలానికీ, విన్యాసాలకూ ఎంతో ఉపయోగపడ్డాయి. అక్కడి నుండి ఒక గెంతులో ప్రపంచ సాహిత్యాన్ని అందుకున్నాడు. ఈ క్రమంలో అచ్చ తెలుగుకీ, ఎవరి కోసమైతే తపించాడో ఆ అట్టడుగు వర్గాల ప్రజల జీవితానుభవాలకు దూరంగా ఉండిపోయాడు. అందుకే 'మహా ప్రస్థానం' తరవాత అతని కవిత్వం పల్చబడింది".

"అవును. అందుకే మరి 'గీతాన్ని, యజ్ఞోపవీతాన్ని' అన్నాడు. అతని కవిత్వం కొందర్నే తాకుతుంది. అయినా ఎవరైనా చేసిందాన్ని గుర్తించాలిగానీ, ఇంకా ఏదో చెయ్యలేదు అనుకోవడంలో అర్థంలేదు. ఎవరి పరిమితులు వాళ్లకుంటాయి. శ్రీశ్రీ కూడా ఒక కాలం, ఒక సమాజానికి చెందినవాడే," అన్నాడు, నూకరాజు.

"అవును, నిజం. అందుకే 'కాలం కడుపుతో ఉండి ఒక శ్రీశ్రీని కన్నది' అన్నాడు శివసాగర్. ఆ మాటలో పొగడ్త, వాస్తవికత – రెండూ ఉన్నాయి." సాహిత్యాభిలాష అనేది నూకరాజు, ఎల్లమ్మల వివాహబంధంలో ఒక బలమైన పాయగా కొనసాగింది.

డొంక కదిలింది!

నేను యారాడ కొండని...

విశాఖపట్నం మహానగరంగా అవతరించడం, దాని స్వరూపమే కాకుండా స్వభావం కూడా మారిపోవడం నేను కళ్లారా చూశాను. అందరిలాగానే నూకరాజు, ఎల్లమ్మ, వెంకటేశు...వీళ్లంతా కూడా మారుతూన్న పరిసరాలకు అనుగుణంగా మారిపోయారు... చాలా సార్లు కాల ప్రవాహానికి కొట్టుకుపోయారు, అందరు మనుష్యులలాగానే. ఒక్కోసారి మార్పులకు ఎదురొడ్డి నిలిచారు... చేవ కలిగిన మనుష్యులలాగా. ఆ మార్పులకు వాళ్లెవరూ సిద్ధంగా లేరు. విశాఖపట్నం అంతలా మారిపోతుందని ఎవరూ అనుకోలేదు.

నగరాలన్నీ తమని తాము చూసుకుంటూ మురిసిపోతాయి; వెర్రి వ్యామోహంతో తమ ప్రతిబింబాలను ప్రేమిస్తాయి. ప్రపంచం యావత్తూ తమ చుట్టూ పరిభ్రమిస్తున్నదనే భ్రమని ఏర్పరచుకుంటాయి. పారిస్ అయినా అంతే; కలకత్తా అయినా అంతే. నగరపు రహదారులు సుదూర ప్రాంతాలను సంధిస్తూన్న కొద్దీ నివాసితుల హృదయాలు ఇరుకు సందులవుతాయి. ఇరుగుపొరుగు ఎవరో తెలియని, తెలుసుకోవాల్సిన అవసరంలేని పరిస్థితులు దాపురిస్తాయి. మహానగరాలు తమ పౌరులకు ఒంటరితనాన్ని ప్రసాదిస్తాయి. నగరవాసులు త్వరలోనే ఆ అనామక అజ్ఞాతవాసాన్ని ఆస్వాదిస్తారు. ఇది అనివార్య ప్రస్థానం.

1970ల వరకూ టౌనుగా ఉన్న విశాఖపట్నం, 1980-90 దశకాలలో తన స్వభావాన్ని చాలా వరకూ పోగొట్టుకుంది. ఈ దశకాలలోనే ఎత్తైన అపార్టుమెంట్లు వెలిసాయి. 'పది కిలోమీటర్లు' అంటే, 'అబ్బో! చాలా దూరం' అనే స్థానికులు కూడా నాలుగైదు ఏళ్లల్లో అపార్టుమెంటు జీవనం వైపు మొగ్గారు.

అదే కాలంలో భూమి మీద ఒత్తిడి అనూహ్యంగా పెరిగిపోయింది. పొలాలు, తోటలు ఇళ్ల స్థలాలుగా అవతరించాయి. మధ్యతరగతి ఉద్యోగులు ఎగబడి కొనుక్కున్నారు. చాలా సార్లు మోసపోయారు. 'అభివృద్ధి' తళుకుబెళుకుల వెంట

నగరవాసులు పరుగులు తీసారు. గోడల మీద విప్లవ నినాదాల స్థానంలో కోచింగు సెంటర్ల ప్రకటనలు వెలిసాయి. ఎల్లమ్మతోట జగదాంబ జంక్షన్ అయింది; తుమ్మెదల మెట్ట మొదట చావులమదుంగా మారి, తరవాత కాన్వెంట్ జంక్షన్‌గా స్థిరపడింది. పాతనగరం వెలిసిపోయింది. కొత్త కాలనీలు కళకళలాడాయి.

రూపురేఖల్లో నగరాలన్నీ పైకి ఒకే మాదిరిగా కనిపించినప్పటికీ, వాటి స్వభావాల్లో భిన్నత్వం ఉంటుంది. ఆ భిన్నత్వాన్ని పోగొట్టుకుంటే అద్దానికెదురుగా అద్దం నిలబెడితే ఎదురయ్యే అసంఖ్యాకమైన ప్రతిబింబాల మాదిరిగా అన్ని నగరాలు ఒక దానికొక ప్రతిరూపంగా మారే విషాదం పొంచి ఉంటుంది. ఏ ఊరు వెళ్లినా అదే మెక్ డోనాల్డ్స్, అదే కెంటకీ ఫ్రైడ్ చికెన్, అవే సూపర్ మార్కెట్లు, అవే మల్టీప్లెక్సులు. ప్రేమలో పడేందుకు వాటిల్లో ప్రత్యేకత అంటూ ఇంకేమీ మిగలదు. అదృష్టవశాత్తూ విశాఖపట్నానికి సంబంధించి ఆ ప్రత్యేకత కాస్తోకూస్తో మిగిలే ఉంది.

అప్పటికల్లా స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్రను పోషించిన స్థానిక రాజకీయ శక్తులు క్షీణదశకు చేరుకున్నాయి. పైనుంచి దిగుమతి అయిన నాయకులు, వారి అనుచరులు రాజ్యమేలారు. స్థానికులు ప్రేక్షకులుగా మిగిలిపోయారు. కొత్త శక్తుల భూదాహానికి రియల్ ఎస్టేటు విజృంభణ తోడయ్యింది. గాజువాక వంటి పారిశ్రామిక వాడలు అడ్డదిడ్డంగా పెరిగిపోయాయి. మింది, పరవాడ లాంటి గ్రామాలు కాలుష్య కూపాలుగా మారిపోయాయి.

మార్కెట్లో లభ్యమయ్యే వస్తువులపట్ల తీవ్రమైన ఆకర్షణ 1991నాటి ఆర్థిక సంస్కరణలతో మొదలైంది. మధ్యతరగతి ఆశలు, ఆకాంక్షలు పెరిగిపోయాయి. అంతా పరుగులు పెట్టడం మొదలుపెట్టారు. ప్రైవేటీకరణకు ప్రపంచీకరణ తోడైంది. ప్రశ్నించేవారు లేక, జవాబుదారీతనం లేని పరిశ్రమలు విశాఖను కాలుష్యకేంద్రంగా మార్చాయి. కాదన్నవాళ్లను అభివృద్ధి వ్యతిరేకులుగా, తీవ్రవాదులుగా ముద్ర వేశారు. 'విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు' అని ఉద్యమించిన ప్రజలే 'మాకు పరిశ్రమలు వద్దు మొర్రో' అని ఇప్పుడు మొర పెడుతున్నారు. ఇక్కడి ఫ్యాక్టరీలను వేరే చోట్లకి తరలించమని పట్టుబడుతున్నారు.

* * *

"లేబర్ లా" పై పట్టును సంపాదించిన నూకరాజు సమిష్టిగా పనిచేసే దృక్పథంతో మరి కొంతమంది లాయర్లను కూడగట్టి ఒక లాయర్స్ కలెక్టివ్‌నీ, అందులో కొన్ని న్యాయ సలహా సంఘాలనీ (లీగల్ అడ్వైస్ సెల్స్) స్థాపించాడు. నూకరాజు ఈ ప్రయత్నం మొదలుపెట్టిన కొత్తలో ఒక సీనియర్ లాయరు, 'మనవాళ్లంతా ముళ్ల పందులవంటి వాళ్లు. కాస్త దూరం పాటించకపోతే ఒకళ్లనొకళ్లు

గాయపరుస్తారు' అన్నాడు. కానీ నిబద్ధత కలిగిన మిత్రబృందాన్ని కూడగట్టడంలో నూకరాజు విజయవంతం అయ్యాడు. చాలా సందర్భాల్లో ఆ బృంద సభ్యులు ఉచితంగా, లేదా తక్కువ ఖర్చుతో పేదలకు సేవలు అందించారు. కొన్నిసార్లు పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పీ.ఐ.ఎల్.) కేసులు తీసుకొచ్చారు. వారు చేబట్టిన కేసులే మారుతోన్న విశాఖ సామాజిక పరిస్థితులకు అద్దంపట్టాయి. తొలుత పారిశ్రామిక సంబంధాలతో మొదలుపెట్టినా, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించే పరిశ్రమలపై కేసులు ఎక్కువయ్యాయి. ఆ తరవాత భూకబ్జా కేసులు కుప్పతెప్పలుగా వచ్చిపడ్డాయి. మధ్యలో వరకట్న వేధింపుల కేసులు. కుల వివక్ష కేసులు. ఇప్పుడు లైంగిక అత్యాచారాల కేసుల సంఖ్య పెరుగుతోంది. ఇవి కాక హక్కుల ఉల్లంఘన కేసులు; పోలీసు కస్టడీలో మరణాలు, ఎన్కౌంటర్లపై నిజనిర్ధారణలు. నూకరాజుకీ, అతని లాయర్ల బృందానికి తీరిక లేనన్ని కేసులు. కొన్ని ప్రభుత్వ సంస్థలకు నూకరాజు న్యాయ వ్యవహారాల సలహాదారుడిగా ఉన్నాడు. ఇదంతా 1980-90 దశకాలలోనే జరిగింది. అదే కాలంలో నూకరాజుకి రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఉన్న ప్రముఖ లాయర్లతో, హక్కుల సంఘాల నాయకులతో పరిచయాలు ఏర్పడ్డాయి.

మొత్తానికి లాయర్‌గా తన కులస్థులకూ, పేదలకూ, పీడితులకూ ఎంతో కొంత సేవ చెయ్యాలనే నూకరాజు ఆశయం నెరవేరింది. మంచి పేరుతో బాటు ఎంతోకొంత డబ్బు కూడా సంపాదించుకున్నాడు. అడ్డగోలుగా సంపాదించుకొనే అవకాశాలు చాలానే వచ్చాయిగానీ నూకరాజు ఎన్నడూ వాటి జోలికి పోలేదు; తన ఆదర్శాలతో రాజీ పడలేదు. ఈ క్రమంలో నూకరాజు చాలా ధక్కామొక్కీలు తిని రాటు దేలాడు. ఎల్లమ్మ అతనికి దన్నుగా నిలబడింది. ఏ పార్టీలోనూ సభ్యత్వం లేకపోయినా అతన్ని కొందరు 'ఎర్ర లాయర్' అన్నారు. మరికొందరు 'ప్రజా న్యాయవాది' అన్నారు.

నూకరాజుకి పేరు రావడంతోనే బెదిరింపు ఫోను కాల్స్, ఆకాశరామన్న ఉత్తరాలు ఎక్కువయ్యాయి. బాడీగార్డులను పెట్టుకోమనీ, కావాలంటే తన శిష్యుల్ని పంపుతాననీ వెంకటేశు నూకరాజుని బ్రతిమాలాడు. కనీసం బలిష్ఠుడైన డ్రైవర్ నైనా పెట్టుకోమన్నాడు. నూకరాజు నవ్వి ఊరుకున్నాడు. పోరగా పోరగా - 'అవసరం పడినప్పుడు చూద్దాంలే' అన్నాడు. ఆ అవసరం రానే వచ్చింది

ఒక కాలుష్యం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఒకానొక పారిశ్రామికవేత్త ఆధీనంలోని రసాయనాల ఫ్యాక్టరీ మూతపడింది. అతగాడు పంపిన గూండాలు ఒక రాత్రిపూట గాజువాక జంక్షను వద్ద నూకరాజు కారుని ఆపి, యాసిడ్ దాడి చేశారు; అతడు తన ముఖం మీద యాసిడ్ పడకుండా తృటిలో తప్పించుకున్నాడు. కారుని స్పీడుగా తోలి అక్కడి నుండి బయటపడ్డాడు. మెడ వద్ద, ఛాతీపైన బాగా

కాలింది. వారం రోజులు ఆస్పత్రిలో ఉన్నాడు. ఇన్ఫెక్షన్ సోకుతుందనే భయంతో నాలుగు రోజులపాటు డాక్టర్లు ఎవరినీ అతని గదిలోకి రానివ్వలేదు. ఎల్లమ్మకూడా అద్దంలోంచి చూసేది.

ఈ దాడికి ఎల్లమ్మ భయపడలేదు సరికదా, కోపంతో మండిపడింది. తనే ఫోన్లు చేసి వివిధ ప్రాంతాల నుండి, నగరాల నుండి మద్దతు కూడగట్టింది. ఆస్పత్రిలోనే ప్రెస్ రిలీజులు తయారుచేసి పంపింది. ప్రెస్ మీట్‌లు, పబ్లిక్ మీటింగులు నిర్వహించింది. నూకరాజు కాస్త కోలుకున్నాక ఇద్దరూ కలిసి, మరికొందరి సహకారంతో విశాఖలో పెరుగుతూన్న కాలుష్యంపై సమగ్రమైన నివేదికను తయారుచేసి ప్రచురించారు. మీడియాకే కాకుండా, పొల్యూషన్ కంట్రోలు బోర్డుకీ, ఇతర ప్రభుత్వ విభాగాలకీ నివేదికను అందజేసారు. శాసనసభలో సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. ఆ విధంగా నూకరాజూ, అతని బృందం రాజేసిన సెగ రాష్ట్రం నలుమూలలకీ వ్యాపించింది. జనంలో చర్చ మొదలైంది, కాలుష్యకారకులను అరెస్టు చెయ్యాలనీ, ఆ పరిశ్రమల్ని మూసివెయ్యాలనీ ప్రజలు డిమాండు చేశారు. ఈ వివాదాలకు మూలం అయిన పారిశ్రామికవేత్త తన ఫ్యాక్టరీని ఒక విదేశీ సంస్థకి అమ్ముకొని, చేతులు దులుపుకున్నాడు.

ఈ సంఘటనలో ఎల్లమ్మ చూపిన చొరవ, ధైర్యం నూకరాజుకి కూడా ఆశ్చర్యం కలిగించాయి. రెండు కులాల మధ్య వైరం మూలంగా ఒక కులం వారి ఆధీనంలోని మీడియాలో ఈ వివాదానికి పెద్ద ఎత్తున ప్రచారం వచ్చింది. నూకరాజుకి ప్రజల మద్దతు లభించింది. విశాఖ, ఆ చుట్టుప్రక్కలా ఏ పారిశ్రామిక ప్రమాదం జరిగినా, కాలుష్య సమస్య నమోదైనా పత్రికల వాళ్లు నూకరాజుని తన అభిప్రాయం తెలుపమంటారు. న్యాయం వైపు నిలబడడం, సివిల్ సొసైటీకోసం పనిచేయడం అంటే ఆధిపత్య రాజకీయాలతో నిత్యం సంఘర్షించడమే అని నూకరాజుకీ, ఎల్లమ్మకీ అర్థం అయిపోయింది. డొంకని కదిలించకుండా తీగెను లాగలేం అని తెలుసుకున్నారు. అలాగే కర్ర విరుగుతుందని భయపడితే పాముని చంపలేం అని కూడా తెలుసుకున్నారు.

నూకరాజు, తన బావమరిది వెంకటేశు సలహా పాటించి, అతగాడు పంపిన వస్తాదుని డ్రైవర్‌గా పెట్టుకున్నాడు.

"బావా! నేను చెప్తూనే ఉన్నాను. ఇప్పుడైనా రివాల్వర్ లైసెన్సు కోసం అప్లై చెయ్యి," అన్న వెంకటేశు మాటని మాత్రం పెడచెవిన పెట్టాడు.

యాసిడ్ దాడి తరవాత నూకరాజు సంస్థకి వచ్చే కేసుల సంఖ్య బాగా ఎక్కువైంది. పని ఒత్తిడి బాగా పెరిగిపోయింది. పుస్తక పఠనం, భార్యా బిడ్డలతో గడిపే సమయం

తగ్గిపోయాయి. తన పాత పరిచయాలనూ, స్నేహాలనూ పునరుద్ధరించుకోవాలని అనుకుంటూ ఉంటాడు గానీ సాధ్యం కావడంలేదు. 'కృష్ణారావు మాస్టార్ని చూసి చాలా కాలం అవుతోంది' అనుకుంటూండగా ఒక రోజున ఆయనే నూకరాజుకి ఫోను చేసాడు.

"రిటైరై ఇంట్లోనే ఉంటున్నాను. ఆరోగ్యం అంత బాగుండడం లేదు. ఈ మధ్యంతా పేపర్లలో చూస్తున్నాను; నువ్వు చాలా మంచి పనులు చేస్తున్నావు. నిన్ను చూడాలని ఉంది. వీలుచూసుకొని ఒకసారి రావోయ్" అన్నాడు.

మాస్టారు ఇష్టపడే బకాడీ వైట్‌రమ్ ఒక బాటిల్ తీసుకొని, కొత్తగా కొనుక్కున్న మారుతీ-800 కారులో ఆరోజు సాయంత్రమే ఆయన్ను కలవడానికి మహారాణిపేటకి వెళ్లాడు. అది వర్షాకాలం. పొద్దుట్నించీ ముసురు. ఎప్పుడూ స్మార్ట్‌గా తయారయ్యే కృష్ణారావు గెడ్డం మాసింది. అతని దుస్తులు నలిగిపోయి ఉన్నాయి. కృష్ణారావుగారి పాతకాలపు పెంకుటిల్లు అస్తవ్యస్తంగా, అపరిశుభ్రంగా ఉంది. చాలాచోట్ల కారుతోంది. తొందరగా చీకటి పడింది. డ్రాయింగు రూమ్‌లో పవర్ సప్లై లేదు. కొవ్వొత్తులు వెలిగించి కూర్చొని ఉన్నాడు.

"కూర్చోవోయ్. ఒక ఫేజ్ పోయింది. ఎదురుగుండా అపార్టుమెంటు వాచ్‌మేన్ చేత ఎలెక్ట్రీషియన్‌కి కబురుపెట్టాను. రేపు వస్తానన్నాడు," అన్నాడు, కృష్ణారావు.

"ఫ్యూజు పోయి ఉంటుంది, మాస్టారూ."

"కావచ్చు. మనింట్లో పోయిందో, పోలుమీద పోయిందో? అయినా నేను స్టూలెక్కి చూడగలనా? జారి పడితే?... కాలో చెయ్యో విరిగితే? కనీసం ఎవరికీ తెలియను కూడా తెలియదు.".

నూకరాజు, 'నేను చూస్తాను,' అని ఫ్యూజులు చెక్ చేశాడు. ఒక ఫ్యూజు పోయింది; కొత్త తీగె వేశాడు. లైట్లు వెలిగాయి.

నూకరాజు తెచ్చిన రమ్ బాటిల్ చూసిన కృష్ణారావు,

"ఇంట్లో స్టాకు ఉంచుకుంటే అతిగా తాగుతున్నానని, కొని పెట్టుకోవడం మానేశానోయ్" అంటూనే

లోపలికి వెళ్లి గ్లాసులు తెచ్చాడు. నూకరాజు గ్లాసులు నింపాడు.

ఆరునెలల క్రిందట అతని భార్య కేన్సర్‌తో చనిపోయిందట. ఒక్కడే ఉంటున్నాడు. కొడుకు అమెరికా.

కాసేపు అవీఇవీ మాట్లాడుకున్నాక –

"పేపర్లు చూస్తున్నావు కదా?...రెండేళ్లపాటు నా భార్య అనారోగ్యం, ఆ తరవాత

చనిపోవడం. ఆ డిప్రెషన్‌లోంచి పూర్తిగా బయట పడకముందే...ఇదిగో ఇది," అంటూ గుట్టగా పడి ఉన్న న్యూసుపేపర్ల కట్టవైపు చూపించాడు, కృష్ణారావు.

"నాకర్థం కాలేదు, మాస్టారూ."

"అదేనయ్యా, సోవియట్ యూనియన్ పతనం. మొదట ఎంతగానో నేను ప్రేమించిన వ్యక్తి వెళ్లిపోయింది. సంవత్సరం తిరక్కుండానే నేను ప్రేమించిన దేశం కూడా కాలగర్భంలో కలిసిపోయింది. ఈ రెండు సంఘటనలతో నా యవ్వనపు దినాల రొమాన్సు, ఆశావాదం, విశ్వాసాలు, దేన్నయినా ఎదుర్కోగలను అనే నిబ్బరం – అవన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఇవన్నీ చూస్తూ నేనింకా ఎందుకు మిగిలి ఉన్నానా అనిపిస్తోంది." కృష్ణారావు చాలా ఒంటరిగా, దిగాలుగా ఉన్నాడని నూకరాజుకి అర్థం అయింది.

"మీరు ఆ భావజాలానికి ఎప్పుడో దూరమయ్యారు కదా, అవన్నీ ఎందుకు పట్టించుకుంటున్నారు మాస్టారూ?"

"నేనూ అలాగే అనుకున్నానోయ్! నా లోలోపల ఇంత ఎటాచ్మెంటు ఉందని నాకూ తెలియలేదు. మా తరం, ఆ మాటకొస్తే మీ తరం కూడా సోవియట్ పుస్తకాలూ, రష్యన్ సాహిత్యం అనువాదాలూ చదువుతూ పెరిగిన వాళ్లమే. అదొక అంతర్జాతీయ సంస్థలాగా, శాశ్వతంగా ఉండిపోతుందనే అనుకున్నాం అంతా. ఇప్పుడది విమర్శించడానికీ, వాదించుకోవడానికీ, తగువు పెట్టుకోవడానికీ కూడా లేకుండా వెళ్లిపోయింది, మా ఆవిడలాగే," అని విషాదభరితమైన నవ్వు నవ్వాడు.

కాసేపాగి, "దీని మూలంగా ప్రపంచమంతటా ఫాసిస్టు శక్తులు లాభపడతాయి, చూస్తూ ఉండు," అన్నాడు నిరాశగా.

సంభాషణను ఇతర అంశాలపైకి మళ్లించేందుకు ప్రయత్నించాడు నూకరాజు.

వస్తూ వస్తూ, "కొన్నాళ్లపాటు మీ అబ్బాయి దగ్గర ఉంటే బాగుంటుందేమో?" అన్నాడు.

"వాడూ రమ్మనే అంటున్నాడు. వెళ్లినా అక్కడ ఉండగలనా? అయినా అది వాడి ఇల్లు; ఇది నా ఇల్లు".

నూకరాజు బయలుదేరుతూంటే కారు వరకూ వచ్చిన కృష్ణారావు,

"నువ్వు 'లా' చదివి మంచి పనిచేశావోయ్! అకడెమిక్స్‌లోకి రాలేదని అప్పుడు డిసప్పాయింట్ అయ్యానుగానీ, నువ్వు తీసుకున్న నిర్ణయమే సరైనది. డెమాక్రటిక్ స్పేస్‌ని కాపాడుకోవడానికి నీబోటి వాళ్లు ఇప్పుడు చాలా అవసరం," అన్నాడు.

నూకరాజు కారు స్టార్టు చేస్తూ, 'గంగరాజుమావ నన్ను బతికించింది ఇందుకేనేమో?' అని అనుకుంటూ నిట్టూర్చాడు.

కృష్ణారావుని డిప్రెషన్‌లోంచి బయటపడెయ్యడానికి నూకరాజు కొన్నాళ్ల పాటు వారంవారం వెళ్లేవాడు. బకాడీ తీసుకెళ్లడం మాత్రం మానుకున్నాడు. ఇంట్లో వండించిన చిరుతిళ్లు తీసికెళ్లి ఇచ్చేవాడు. మూడు నెలల ఎడం వచ్చింది. ఆ ఇంట్లో అద్దెకున్నవాళ్లు తలుపు తీశారు. అమెరికా వెళ్లిపోయాడని చెప్పారు. అక్కడే మరణించినట్లు తరవాతెప్పుడో తెలిసింది. శిథిలావస్థకు చేరుకున్న అతని పెంకుటిల్లుని కొడుకు డెవలపర్స్‌కి అమ్మేశాడు. అప్పటికే కృష్ణారావు పుస్తకాల్ని చెదలు తినేశాయి.

* * *

పెరేరా కుటుంబంతో ఏర్పడ్డ అనుబంధం, క్రైస్తవమత ప్రభావాల మూలంగా ఎల్లమ్మా, వెంకటేశులిద్దరికీ సేవాతత్పరత అలవడింది. తమ సంపాదనలో కొంత డబ్బుని పక్కనపెట్టి, దాన్ని దానధర్మాలకు వినియోగించడం అలవాటయింది. చదువు ద్వారా వాళ్ల జీవితాలలో వచ్చిన పెను మార్పులను కళ్లారా చూసినందున పేద పిల్లల పుస్తకాలకు, ఫీజులకు ఎక్కువగా ధనసహాయం చేయసాగారు. జాలరుల పిల్లలెవరైనా పెద్ద చదువులు చదివితే వాళ్లకు సహాయ సహకారాలు అందించేవారు. నూకరాజు కూడా తన వంతు డబ్బును ఈ పనికోసం ఎల్లమ్మ చేతుల్లో పెట్టేవాడు. వేరే కులాల పేద విద్యార్థులకు కూడా ఇవ్వసాగారు. అయితే వాళ్లు చేసే ఈ కార్యక్రమాలన్నింటినీ ఎటువంటి ప్రచారం జరపకుండా గుప్తదానాలుగానే సాగించారు.

ఒకరోజున నూకరాజూ, ఎల్లమ్మ, వెంకటేశు ప్రేమసమాజంలో అనాథ పిల్లలకు భోజనాల కోసం విరాళం ఇవ్వడానికని దాబాగార్డెన్సు వెళ్లినప్పుడు అక్కడ భాస్కర్ స్నేహితురాలు కమల కనిపించింది. కమల చండీగఢ్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి పిల్లల డాక్టరుగా ఒక ఆస్పత్రిలో పనిచేస్తోంది. పేద పిల్లలకు తన క్లినిక్‌లో ఉచితంగా వైద్యం చేస్తోంది. వారంవారం అనాథ శరణాలయాల పిల్లల్ని కూడా చూస్తుంది. ఆమె భర్త తమిళియన్ అనీ, కార్డియాలజిస్టనీ చెప్పింది. కమల చండీగఢ్ వెళ్లిపోయాక నూకరాజుకు ఆమెతో సంబంధాలు తెగిపోయాయి. మళ్లీ ఇదే చూడడం. చాలా కాలం తమిళనాడులో ఉన్నాక ఏడాది క్రితం విశాఖ వచ్చామని కమల చెప్పింది. సీతమ్మధారలో ఉంటున్నామనీ, వాళ్ల ఇంటికి రమ్మనీ ఆహ్వానించింది. ఫోన్ నెంబర్లు ఇచ్చి పుచ్చుకున్నారు.



పుడమి సంతతి

నేను యారాడ కొండని...

మనుష్యులంతా ఋషులు కాలేరు. అలాగని విప్లవకారులూ కాలేరు. ఆలోచనాపరులైన మనుష్యుల్లో అత్యధికులు, ఈ రెండు కొసల మధ్యా సతమతమవుతూ ఉంటారు. సత్యం అల్లంత దూరాన తళుక్కున మెరిసి మాయమవుతూంటుంది. మనుష్యుల్ని తమ దారి తామే వెతుక్కోమంటుంది. ఆలోచనకీ, ఆచరణకీ అంతరం కొనసాగుతూనే ఉంటుంది.

నూకరాజూ, ఎల్లమ్మా పెద్దవాళ్లయ్యారు. అయినా బాధ్యతల బరువు వాళ్లని కృంగదీయలేదు. వాళ్లిద్దరి మధ్య ఉన్న బంధం తన రూపాన్ని మార్చుకుంది. వాళ్ల జీవితాల్లో వచ్చిన ఎదుగుదలని కలిసే పంచుకున్నారు. ఒకరికొకరు ఎడంగా, దూరంగా జరిగిపోలేదు. వాళ్ల పిల్లలు కూడా ఎదుగుతున్నారు.

* * *

ఆ ఆదివారం, మధ్యాహ్న భోజనానికని ఎల్లమ్మ, నూకరాజులను కమల తమ ఇంటికి ఆహ్వానించింది. కమలకి బహుమతిగా ఏమివ్వాలా అని భార్యాభర్తలు తర్జనభర్జన పడ్డాక, బుక్ సెంటర్లో ఆగి కొత్తగా వెలువడిన స్త్రీవాద కవితా సంకలనం 'నీలిమేఘాలు' పుస్తకాన్ని కొని తీసుకెళ్లారు. సెల్వన్‌కి ఏమివ్వాలో నూకరాజు సులభంగానే తెలుసుకున్నాడు. షివాస్ రీగల్ విస్కీ బాటిల్.

సీతమ్మధారలో – సింహాచలం కొండవాలుపై కమల ఇల్లు కొనుక్కుంది. అక్కడినుండి సముద్రం తళతళా మెరుస్తూ కనిపిస్తోంది. దూరంగా ఊరికి కాపలాగా యారాడ కొండ. తాము తీసుకొచ్చిన కానుకలతో బాటుగా చేపలు, రొయ్యలు కూడా కమలకి అందజేసారు.

"సెల్వన్‌కి రొయ్యలు ఇష్టం. పొద్దున్నే ఫోనొస్తే టిఫిన్ కూడా తినకుండా హాస్పిటల్‌కి వెళ్లిపోయాడు – ఏదో ఎమర్జెన్సీ అని. భోజనానికి వచ్చేస్తానన్నాడు. చూడాలి మరి. కూర్చోండి," అంది కమల సోఫాలో కూర్చుంటూ.

డ్రాయింగు రూమ్‌లో పుస్తకాలు నిండిన అరలు. ఒక వైపు అంబేడ్కర్ ఫొటో. మరో వైపున బాక్సింగు ఛాంపియన్ మహమ్మద్ ఆలీ పోస్టర్. మధ్యలో సెల్వన్ తల్లిదండ్రులది కాబోలు – దండవేసిన ఫొటో. క్రింద అరవంలో ఏదో వ్రాసి ఉంది. వంటింట్లోంచి వంటకాల సువాసనలు, మిక్సీ చప్పుళ్లు, ప్రెషర్ కుక్కర్ ఈలలు వెలువడుతున్నాయి. 'వంటమ్మాయి ఉన్నట్టుంది' అనుకుంది ఎల్లమ్మ.

"మీ పిల్లలు...?" అని అడిగింది.

"ఒక అబ్బాయీ, ఒక అమ్మాయి. అబ్బాయి చెన్ కోచింగుకి వెళ్లాడు. అమ్మాయి పక్కవీధిలోనే కర్నాటక సంగీతం నేర్చుకోవడానికి వెళ్లింది. వచ్చేస్తారు. మీకెంతమంది పిల్లలు?" అన్నది కమల.

"మీలాగే ఇద్దరు. అబ్బాయి ఉదయ్. అమ్మాయి శరణ్య."

"ఉదయ్?...శరణ్య?" అంది కమల, ఆసక్తిగా.

"అవును. భాస్కర్, షెరాన్ ఆంటీలకు గుర్తుగా ఆ పేర్లు పెట్టాం." కమల మౌనంగా ఉండిపోయింది.

ఈ సంభాషణ జరుగుతూన్నప్పుడు నూకరాజు కమలను గమనిస్తున్నాడు. ఈ ఇరవై ఏళ్లల్లో కమల లావెక్కింది కానీ మొహం పెద్దగా మారలేదు. ఆదివారం అని కాబోలు, తలస్నానం చేసి రిలాక్స్‌డ్‌గా కూర్చుంది. భాస్కర్ జ్ఞాపకాలు అతన్ని చుట్టుముట్టాయి. ఏం మాట్లాడడానికీ తోచలేదు. అతని మౌనం ఎల్లమ్మకి అర్థం అయింది. కమల కూడా గ్రహించినట్లుంది. తనే కల్పించుకొని అదీఇదీ మాట్లాడసాగింది.

"సెల్వన్ దళితుడు. అతని అమ్మా నాన్నా తంజావూరు జిల్లాకి చెందినవాళ్లు. మార్క్సిస్టు పార్టీ కార్యకర్తలు. ఆ ఏరియాలో రైతుకూలీలను ఆర్గనైజ్ చేసేవారు. 1968లో కీలవేన్మణి దళితులపై జరిగిన దాడి, నలభై నలుగురు సజీవ దహనం కావడం గుర్తుండే ఉంటుంది. అది వాళ్ల పోరుగు ఊరే. అప్పుడు సెల్వన్‌కి పదహారేళ్లుంటాయి. ఆ సంఘటన సెల్వన్‌పై చెరగని ముద్ర వేసింది. దాని గురించి మాట్లాడడానికి ఇప్పటికీ ఇష్టపడడు. ఇన్నాళ్లయినా ఈ దేశంలో దళితుల అనుభవాలు ఇంకా మెయిన్ స్ట్రీమ్‌లోకి రానేలేదు అంటూ ఉంటాడు," అంది కమల.

"చాలా మంచి పరిశీలన. కీలవేన్మణి గురించి చెప్తూంటే నాకు కారంచేడు గుర్తుకొచ్చింది. సెల్వన్‌ని కలుసుకోవాలి. మళ్లీసారి మీరంతా మా ఇంటికి రావాలి," అని నూకరాజు ఆహ్వానించాడు.

"అవునవును. తప్పకుండా రావాలి," ఎల్లమ్మ వంత కలిపింది.

ఫోన్ మ్రోగింది. కమల ఒక్క నిమిషం విని, "ఓ యెస్, నో ప్రాబ్లెం," అని పెట్టేసింది. నూకరాజు, ఎల్లమ్మల కేసి తిరిగి,

"భోజనానికి రాలేకపోతున్నాను, మీకు సారీ చెప్పమన్నాడు, సెల్వన్...ఆ, ఏం చెబుతున్నాను? అవును...కీలవేన్మణి. ఆ సంఘటనతో సెల్వన్ మారిపోయాడు. పోలీసులు భూస్వాముల్ని విడిచిపెట్టి పార్టీ కార్యకర్తల్ని అరెస్టు చేశారు. సెల్వన్ అమ్మా, నాన్నలు కూడా జైలు కెళ్లారు. సెల్వన్ తన కసిని చదువు మీద చూపించాడు. చదువు రాక్షసుడయ్యాడు," అన్నది.

"అంటే?" ఎల్లమ్మకి అర్థం కాలేదు.

"చదువు మీదనే పూర్తి ధ్యాస పెట్టాడు. చదువు తప్ప వేరే ప్రపంచం లేనట్టు కొన్ని సంవత్సరాలు గడిపాడు. అదొక్కటే అతన్ని రక్షిస్తుందని నమ్మాడు. డాక్టరయ్యాడు. జిప్మెర్, చండీగఢ్‌లో పీజీ చేశాడు. మేమిద్దరం ఒకే బ్యాచ్. అతను గోల్డ్ మెడలిస్టు".

ఎల్లమ్మ, "అది నిజమే. చదువే మనల్ని రక్షిస్తుందనేది మా అనుభవం కూడా. షెరాన్ ఆంటీ మమ్మల్ని ఆదుకోకపోయుంటే నేనూ, మా అన్నా ఏమయ్యేవాళ్లం? రాజు కూడా చదువుకోబట్టే కదా, ఈరోజున లాయరయ్యాడు? అయితే రాజు మీద భాస్కర్ ప్రభావం చాలా ఉంది" కమల నవ్వుతూ, "నాకు మీ ముగ్గురి గురించీ బాగా తెలుసు. భాస్కర్ చెప్తుండేవాడు" అంది.

"నిజానికి భాస్కర్ ప్రభావం నా మీద కూడా చాలా ఉంది," అంది ఎల్లమ్మ.

కమల, నూకరాజు, ఆసక్తిగా ఎల్లమ్మ వంక చూశారు.

కమల, "భాస్కర్ ప్రభావం పడనివాళ్లుండరు. ఎలాంటి వాళ్లనైనా పది నిమిషాల్లో ఇంప్రెస్ చేస్తాడు. అతన్ని గుర్తుంచుకొనేలా చేస్తాడు," అన్నది – నవ్వుతూనే.

నూకరాజు 'అవును, కొంచెం డ్రామా కూడా చేస్తాడు' అనబోయి ఊరుకున్నాడు. ఆమె మాటల్లో ఎక్కడో విషాదంతో కూడిన ఆపేక్ష ధ్వనించింది, నూకరాజు చెవులకి. లేక అది అతని ఊహ మాత్రమేనా?

కమల, "నువ్వేదో చెబుతున్నావు...నీ మీద భాస్కర్ ప్రభావం గురించి" అని ఎల్లమ్మకి గుర్తు చేసింది.

"అవును, నేను ఎమ్మే ఇంగ్లీషు లిటిరేచర్ చెయ్యడానికి భాస్కరే కారణం," అంది ఎల్లమ్మ.

"అదెట్లా జరిగింది? నువ్వు ఇంగ్లీషు మీడియంలోకి మారినప్పుడే నువ్వు డిసైడ్ అయిపోయి ఉండాలే?" కమల ఆశ్చర్య పడింది.

"అది కొంత వరకే. భాస్కర్ నాకు హెమింగ్వే నవల 'ఓల్డ్ మ్యాన్ అండ్ ది

సీ' బహుమతిగా ఇచ్చి 'చదివి నీ అభిప్రాయం చెప్పు' అన్నాడు. ఆ పుస్తకం నన్ను పూర్తిగా మార్చేసింది. ఆ నిర్భాగ్యుడైన ముసలి జాలరి – శాంటియాగోలో మా నాన్న కనిపించాడు. నన్ను మా నాన్న ఆవహించాడు. అది చదివాక మా నాన్న సముద్రం మధ్యలో పడవలో ఒక్కడే ఉన్నట్లూ, పడవ చుట్టూ సొరచేపలు ప్రదక్షిణలు చేస్తున్నట్లూ కలగన్నాను. హెమింగ్వే ఆ నవలని నాకోసం, మా జాలరుల కోసం రాశాడనిపించింది. చాలా సేపు నేనూ, భాస్కర్ చర్చించుకున్నాం. అప్పుడు భాస్కర్ ఒక మాటన్నాడు, 'మన చదువులు డిగ్రీలు ఇస్తాయి; అవి అవసరమే కానీ, మనుషులు పడే క్షోభ, సమాజంలోని ఘర్షణ, చరిత్రచేసే దిశానిర్దేశం – వీటి పట్ల మనం సెన్సిటైజ్ కావడానికి సాహిత్యం, కళలు అవసరం. అప్పుడే మన చదువు సార్థకం అవుతుంది'. ఆ మాటలే నన్ను లిటిరేచర్ వైపు నడిపించాయి. నిజానికి భాస్కరే నాకు యూనివర్సిటీ నుంచి ఎమ్మే అప్లికేషన్ ఫాం తెచ్చి ఇచ్చాడు. తనే స్వయంగా వెళ్లి సబ్మిట్ చేశాడు. కానీ కాన్వొకేషన్‌కి ఉండకుండా వెళ్లిపోయాడు".

కమల వంటామెతో మాట్లాడడానికని వంటింట్లోకి వెళ్లింది.

నూకరాజుకి ఎల్లమ్మ చెప్పిన విషయాలు చూచాయగా తెలుసుగానీ వివరాలు గుర్తులేవు.

"నువ్వు ఇవేవీ నాకు చెప్పనే లేదు," అన్నాడు – ఫిర్యాదు చేస్తున్నట్లుగా.

"నీకన్నీ చెప్పాను, మర్చిపోయావు!" అంది ఎల్లమ్మ చిరుకోపంతో.

వంటామె డైనింగు టేబిలు మీద వంటకాలన్నీ పేర్చింది.

"భోజనానికి లేద్దామా? చేతులు కడుక్కుంటారా?" అన్నది కమల. ఎల్లమ్మ బాత్రూంకి వెళ్లింది.

"ఎమర్జెన్సీ విధించగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన భాస్కర్ నిన్ను మళ్లీ కలిసాడా?" అని నూకరాజు కమలని అడిగాడు. కమలని 'మీరు' అని కాకుండా 'నువ్వు' అని సంబోధించడం అతనికే ఆశ్చర్యం కలిగించింది. అది అతని నోటికి అత్యంత సహజంగా వచ్చింది.

"లేదు. అదే ఆఖరుసారి కలవడం. కానీ క్రిందటి నెల మెడికల్ కేంపుకని ఏజెన్సీకి వెళ్లినప్పుడు ఒక ఊహించని సంఘటన జరిగింది. ఎల్లమ్మ రానీ చెబుతాను. ముందు భోజనాలు కానిద్దాం, లేటవుతోంది," అంటూ డైనింగు టేబిలు వైపు దారి తీసింది.

"భాస్కర్ గురువు గిరిధర్ ఏమయ్యాడో తెలుసా?" భాస్కర్‌కి సంబంధించి కమలవద్ద ఏ సమాచారం ఉన్నా తెలుసుకోవాలనే ఆత్రుతతో నూకరాజు ఆమెను అడిగాడు.

"గిరిధర్?...ఓ అతనా? అతని తండ్రి పోయాక రాజకీయల నుండి దూరం అయ్యాడని తెలిసింది. వాళ్లమ్మను చూసుకుంటూ విజయవాడలో ఉన్నాడని నాకు తెలిసిన డాక్టర్ ఫ్రెండ్స్ చెప్పారు. అతను సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్నాడని విన్నాను. అంతే, ఆ తరవాత ఏమైందో తెలియలేదు," అన్నది కమల.

భోజనాలు అవుతున్నంత సేపూ కమలే ఎక్కువగా మాట్లాడింది.

సెల్వన్‌ని పెళ్లాడడం వాళ్ల నాన్నకి ఇష్టం లేదట. 'ఆయనే మా కుటుంబంలో ఆఖరి భూస్వామి. ఆయన తరవాత భూములూ లేవు, భూస్వాములూ లేరు,' అంది నవ్వుతూనే.

"అందుకే సెల్వన్ తల్లిదండ్రులు పోయాక తమిళనాడు విడిచిపెట్టినప్పుడు మొదట నా స్వస్థలమైన గుంటూరులో ప్రాక్టీసు పెడదాం అనుకున్నా ఆ ఆలోచన మానుకొని విశాఖపట్నం వచ్చేశాం. ఆ తరవాత మా నాన్న కూడా పోయాడు," అంది.

"ఇక్కడికి రావడమే మంచి నిర్ణయం," అంది ఎల్లమ్మ.

"సెల్వన్ అంటూంటాడు. 'ఆంధ్రాలో ఉన్న ఏకైక కాస్మోపాలిటన్ సిటీ విశాఖపట్నం; మిగతావన్నీ గ్లోరిఫైడ్ విలేజిలే,' అని"

"అది మాత్రం నిజం," అన్నాడు నూకరాజు.

ఇంతలో పిల్లలిద్దరూ అరవంలో వాదులాడుకుంటూ లోపలికి వచ్చారు. అతిథుల్ని చూసి టక్కున మౌనం వహించారు.

"ఇంత ఆలస్యం అయిందేరా? నీ కోచింగు క్లాసు అయిపోగానే చెల్లిని తీసుకొని తిన్నగా ఇంటికి రమ్మని చెప్పానా, లేదా?" అని కమల కొడుకుని ఇంగ్లీషులో గద్దించింది.

"మమ్మీ! ఇదే చేసింది! నువ్వేమో ఎప్పుడూ నన్నే అంటావు. నేనెప్పుడనగా వెళ్లాను. అదేమో దాని ఫ్రెండ్స్‌తో మాట్లాడుకుంటూ లోపల ఉండిపోయింది. రమ్మంటే ఎప్పటికీ రాదు. నన్నేమో లోపలికి వెళ్లనివ్వరు...ఇదెప్పుడూ అంతే," అని కమల కొడుకు తల్లికి ఫిర్యాదు చేశాడు.

"అయినా వీడెందుకు అక్కడికి రావడం? బాయ్స్ రాకూడదు. మా టీచర్ కోప్పడుతుంది. నేను రాలేనా? పక్క వీధే కదా?" అంటూ కూతురు ఎదురు తిరిగింది.

ఎల్లమ్మకి ఆమె చిన్ననాటి రోజులు, అన్న వెంకటేశుతో నిరంతరంగా సాగిన వాదులాటలు గుర్తుకొచ్చాయి.

"సరే, సరే. చేతులు కడుక్కోండి. భోజనాలు చెయ్యండి," అంది కమల.

పెద్దలు ముగ్గురూ భోజనాలు ముగించి, మళ్లీ వచ్చి సోఫాల మీద కూర్చున్నారు. పిల్లలు – అతిథులున్నారని స్వరం తగ్గించి, వాదించుకుంటూ భోజనాలు చేస్తున్నారు; వంటామె వాళ్లకి వడ్డిస్తోంది.

"ఏదో చెబుతానన్నావు? ఏజెన్సీలో మెడికల్ కేంపు...," అని కమలకి గుర్తు చేశాడు నూకరాజు.

"అవునవును. క్రిందటి నెల పాడేరులో మెడికల్ కేంపు నిర్వహించాం. ఒకాయన వచ్చాడు. పక్కనే ఉన్న గూడేనికి సర్పంచ్ అట. మన వయస్సు ఉంటుంది. కాస్త పెద్దవాడేమో. వాళ్ల వయసు చెప్పడం కష్టం. జుత్తు నెరిసింది. అందరు గిరిజనుల్లా కాకుండా పేంటూ, షర్టూ వేసుకున్నాడు. చెప్పులు తొడుక్కున్నాడు. కళ్లజోడు పెట్టుకున్నాడు. 'జబ్బేమిటి?' అని నేను అడిగితే,

"'ఏ జబ్బూ లేదు. నిన్ను చూడడానికి వచ్చాను', అన్నాడు. నాకేమీ బోధపడలేదు. కొంచెం చిరాకు కూడా కలిగింది. అప్పుడు చెప్పాడు, భాస్కర్ దళంలో ఉండేవాడట. ఫొటో కావాలన్నాడు".

ఎల్లమ్మ, నూకరాజుల ఆసక్తి పెరిగిపోయింది.

"నువ్వు ఫలానా అని ఎలా తెలుసుకున్నాడు?" – నూకరాజు అడిగాడు.

"నేనూ అదే అడిగాను. 'ఎలా తెలుస్తుంది? ఆ రోజుల్లో భాస్కరే చెప్పాడు. నువ్వు వొస్తున్నట్టు మొన్న మా వాళ్లెవరో చెప్పారు,' అన్నాడు. అడవుల్లో, కొండల్లో రోజుల తరబడి నడుస్తూ చాలా విషయాలు మాట్లాడుకొనే వారట. 'నా వద్ద ఫొటో లేదు. ఇంటికి వెళ్లాక పంపుతాను' అన్నాను."

"మరి?"

"గ్రూపు ఫొటో ఒకటి ఉంటే దాంట్లోంచి తీయించి, ఎన్లార్జ్ చేయించి, పోస్టులో పంపాను. అంత బాగా రాలేదు గానీ, దానికే పొంగిపోయాడు. నాకు ఫోను చేసి పదిసార్లు థాంక్సు చెప్పాడు"

"ఇంకా ఏమన్నాడు?" నూకరాజు సోఫా అంచున కూర్చొని, బాగా ముందుకి వంగి అడిగాడు. ఎల్లమ్మకి అంతా ఆశ్చర్యంగా ఉంది.

"ఆరోజు పాడేరులో రెండు విషయాలు చెప్పాడు. గిరిజన ప్రాంతాలలో ఇవాళ రోడ్లు, స్కూళ్లు, పథకాలు ఉన్నాయంటే, అసలు వాళ్లని ప్రభుత్వాలు పట్టించుకుంటున్నాయంటే – అది అన్నల మూలంగానే అన్నాడు."

"అది మాత్రం నిజం. ఇంకా ఏమన్నాడు?" అని నూకరాజు అడిగాడు.

"అన్నల వలన వాళ్ల జీవన సరళి మారిపోయిందన్నాడు".

"అంటే?"

"మూఢ నమ్మకాలను ఎదుర్కోవడం, ఆరోగ్యం, పరిశుభ్రత, చదువు – వీటి ప్రాముఖ్యతపై ఎరుక ఏర్పడడం. అలాగే పోలీసులన్నా, ఫారెస్టు గార్డులన్నా, మైదాన ప్రాంతీయులన్నా భయం పోవడం, ప్రభుత్వ ఆఫీసులలో పనులు చేయించుకోవడం, బ్యాంకులలో అప్పులు మంజూరు చేయించుకోవడం – ఇట్లాంటి మార్పులు – రాజకీయలకూ, తుపాకులకూ సంబంధం లేకుండా".

"అవును సుమా! నాకు తట్టనేలేదు" అంటూ ఆశ్చర్యపోయాడు నూకరాజు.

"వచ్చేస్తూంటే ఆ సర్పంచి మరో మాట కూడా అన్నాడు. 'నన్ను చూడండి! పేంటూ, షర్టూ, చెప్పులూ వేసుకొని తిరుగుతున్నాను. దళంలో ఉండగా కొద్దిగా చదవడం, రాయడం నేర్చుకున్నాను. అది నాకిప్పుడు పనికొచ్చింది. మా గూడెం వాళ్లకు పనులు చేసిపెడుతున్నాను. మళ్లీ కొండలెక్కి, చెట్లు కొట్టి, పోడు వ్యవసాయం చెయ్యమంటే నా వల్ల అవుతుందా? నాకు ముగ్గురు కొడుకులు. పెద్దవాడు టెంత్ పాసయ్యాడు. మిగతా ఇద్దరూ ఇంటర్మీడియట్ చదివారు. వాళ్లకి పోడు అంటే ఏమిటో కూడా తెలీదు. ఉద్యోగాల వేటలో ఉన్నారు. నా తరం వరకూ మాలో నిరుద్యోగులంటూ ఎవరూ లేరు. మాకు ఆ మాటే తెలీదు. ఇప్పుడు ప్రతీ గూడెంలోనూ నిరుద్యోగులు తయారయ్యారు' అన్నాడు," – కమల వివరించింది.

ఎల్లమ్మ, నూకరాజు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. వాళ్లకి కులవృత్తులు మానుకున్న జాలరులు గుర్తుకొచ్చారు.

"అదొక ఇర్రివర్సిబల్ ప్రోసెస్ అనిపిస్తుంది. ముందుకే తప్ప వెనక్కి వెళ్లలేం. నూకరాజు ఇప్పుడు వేటకి వెళ్లి చేపలు తేలేడు, నేను వాటిని బజార్లో అమ్మలేను," అంది ఎల్లమ్మ.

ముగ్గురూ నవ్వుకున్నారు గానీ, అంతుచిక్కని ప్రశ్నలు వారిని లోలోపల వేధించాయి. అసంతృప్తిని మిగిల్చాయి.

పిల్లలు భోజనాలు చేసి వాళ్ల గదిలో సఖ్యంగా వైకుంఠపాళి ఆడుకుంటున్నారు. మధ్యమధ్యలో నవ్వులూ, కేరింతలూ వినబడుతున్నాయి.

"ఇక మేం బయల్దేరుతాం," అంది ఎల్లమ్మ.

"కూర్చోండి. ఒక్క నిమిషం. పాయసం వస్తుంది," అంటూ వారించింది, కమల.

వంటామె కటోరీల్లో సేమ్యా పాయసం, చెంచాలు ట్రేలో పెట్టి తీసుకొచ్చి టీపాయి మీద పెట్టి వెళ్లింది.

"రాజూ, నిన్నొకటి అడగాలి. భాస్కర్‌తో అంత స్నేహంగా ఉండేవాడివి కదా? అతని రాజకీయాలకు ఎందుకని దూరంగా ఉండిపోయావు?" అంది కమల.

"మనం ఇందాక అనుకున్నాం కదా, సెల్వన్‌కీ, అలాగే నాకూ, ఎల్లమ్మకీ చదువుకోవడం ఒక గొప్ప అవకాశం. అనుకోకుండా మాకది దొరికింది. ఎంత గింజుకున్నా మాలో అందరికీ అది దొరకదు. మీకు – అంటే, నీకూ, భాస్కర్ లాంటి వాళ్లకి – చదువు అనేది ఎదగడంలో ఒక విడదీయలేని భాగం; పెద్ద ప్రయత్నం లేకుండా అందుబాటులో ఉండే సాధనం. మీలో బొత్తిగా చదువులేని వాళ్లంటూ ఉండరు; మాలో ఇంటర్మీడియట్ వరకైనా చదువుకున్నవాళ్లు ఇప్పటికీ నూటికో కోటికో ఒకరు. ఇందాక నువ్వు చెప్పిన గిరిజన సర్పంచి ఒక మాటన్నాడు – వాళ్ల జీవన సరళిలో మార్పుల గురించీ, ప్రభుత్వ ఆఫీసులతో లావాదేవీల గురించీని. అదే దారిలో చదువుని వినియోగించుకొని నా వాళ్లకు ఇప్పటి వ్యవస్థలోనే చాలా మంచి పనులు చెయ్యగలనని నా నమ్మకం. అంతేగాని అడవులు పట్టడం పరిష్కారం కాదు – నా ఉద్దేశంలో," అన్నాడు తన సహజ ధోరణిలో – ఆచితూచి మాట్లాడుతూ.

కమల శ్రద్ధగా విని, "నువ్వనేది నాకర్థం అయింది. సెల్వన్ కూడా ఇట్లానే అంటాడు. నీకు తెలుసు, నేను కూడా మొదటి నుంచీ పార్టీ రాజకీయాలకు దూరంగానే ఉంటూ వచ్చాను. ఇప్పుడు స్త్రీలకి సంబంధించిన సమస్యలపై పని చేస్తున్నాను. బీదలకు ఉచిత వైద్యం, మెడికల్ కేంపులూ – అవెలాగూ నడుస్తూనే ఉంటాయి. అన్నట్లు, మీరేమైనా సాయం చెయ్యగలరా? డబ్బుకన్నా ముఖ్యంగా పనిచేసే వాళ్లు, వాలంటీర్లు కావాలి," అంది.

ఎల్లమ్మ, "నేనూ అదే అందామనుకుంటున్నాను. నువ్వు చేస్తున్న పనులకు మా చేతనైన సాయం చేస్తాం. మా అన్న వెంకటేశుని అడిగి ఉచితంగానో, తక్కువ ధరలకో మందులు అందేలా చేస్తాం. మేం కూడా వస్తాం. కానీ స్త్రీల సమస్యలన్నావు, నాకర్థం కాలేదు," అంది.

"ఈ మధ్య విశాఖపట్నంలో వరకట్న వేధింపులు, హత్యలు ఎక్కువైపోయాయి. మొగుళ్లు కొట్టిన దెబ్బలకు ట్రీట్మెంట్ కోసం ప్రతీరోజూ ఎవరో ఒకరు నా దగ్గరకు వస్తూనే ఉంటారుగానీ ఆ దెబ్బలన్నీ ప్రమాదవశాత్తూ తగిలాయనే అంటారు. నా క్లినిక్ ఉన్న చోటనే ఆరు నెలల క్రితం – ఒకతను తాగొచ్చి భార్యని కొట్టాడు. స్కూటర్ కావాలని డిమాండ్ చేశాడు. ఆమె ఎదురు తిరగడంతో కిరోసిన్ పోసి కాల్చేశాడు. మొదట నా దగ్గరకు తీసుకొచ్చారు. నేను డాక్టరునే అయినా ఆ బొబ్బలు చూడలేకపోయాను; ఆర్తనాదాలు వినలేకపోయాను. కే.జీ.ఎచ్.లో ఎడ్మిట్ చేయించాను. మూడో రోజున చనిపోయింది. మరణ వాంగ్మూలంలో స్టవ్ పేలిందని చెప్పింది. ఆ తరవాత ఆ చుట్టుపక్కల మరో మూడు కేసులు జరిగాయి. కొంతమంది స్థానిక స్త్రీలను కూడగట్టుకొని ఊరేగింపు తీసాం. పోలీసు స్టేషన్ ముందు ప్రొటెస్ట్ చేశాం. భర్తల్ని, అత్త మామల్ని అరెస్టు చెయ్యమని డిమాండ్ చేశాం. విచిత్రం

ఏమిటంటే అది పారిశ్రామిక వాడ. ఎర్ర జెండాల యూనియన్లు అక్కడ బలంగా ఉన్నాయి. ఆ మొగుళ్లలో చాలామంది కార్మిక సోదరులే. ఎక్కువమంది సోకాల్డ్ క్రింది కులాల వాళ్లే. వాళ్ల సభ్యుల జోలికి వెళ్లొద్దని మా పైన ఒత్తిడి తీసుకొచ్చారు. ఇంకా బలంగా ఉద్యమాలు తీసుకురాకపోతే ఆడవాళ్ల ప్రాణాలకి ముప్పు. వాళ్ల జీవితాలు ఇంకా దుర్భరంగా తయారవుతాయి అనిపిస్తోంది. ఇందుకు మీరు కూడా సహకరించాలి. ఒక లాయరుగా నూకరాజులాంటి వాళ్లు మాకు కావాలి," అన్నది కమల.

నూకరాజు కమలకు భరోసా ఇచ్చాడు. "తప్పకుండా. నేనూ, నా లాయర్ ఫ్రెండ్సూ మీకు అండగా ఉంటాం. కులవృత్తిని వదులుకొని, చిన్నాచితకా ఉద్యోగాలు చేసుకుంటూన్న మా జాలరుల్లో కూడా ఇవాళ ఇదే పరిస్థితి. మార్కెట్లో వస్తువులు కనబడుతున్నాయి. కొనే స్తోమత లేదు. భార్య వైపు నుంచి ఏదో విధంగా రాబట్టాలనే దురాశ పెరుగుతోంది. మన యూనియన్ నాయకులు కూడా సభ్యుల్ని చైతన్యవంతుల్ని చెయ్యడం మానేసి, స్త్రీలు తిరగబడితే వాళ్లకు నాయకత్వం వహించకుండా, అదొక అనవసరమైన తలకాయ నొప్పి అన్నట్లు, వాళ్ల ప్రధాన మార్గం నుండి మళ్లిపోతున్నారన్నట్లు ప్రవర్తిస్తున్నారు." ఎల్లమ్మ, "అవును ఆడవాళ్లకు స్వంత ఆర్గనైజేషన్లు ఉండాలి. రోడ్డెక్కి, ఉద్యమాలు చేస్తే తప్ప ఎవరూ మనల్ని పట్టించుకోరు. ఇందాక నువ్వు చెప్పిన గిరిజన సర్పంచి కూడా అదే అన్నాడు కదా," అని నిర్ద్వంద్వంగా ప్రకటించింది.

"బాగా చెప్పావు, ఎల్లమ్మా! నీకున్న స్పష్టత చాలా పార్టీల నాయకులకు లేదు. మనం కలిసి పని చేద్దాం," అంటూ కమల ఎల్లమ్మని హత్తుకుంది.

"ఓ యెస్! తప్పకుండా. ఈ విషయం మీద మనం టచ్‌లో ఉందాం. మనకి ఎలాగూ లాయర్ల సహకారం ఉంటుంది. ఇక మేం బయల్దేరాలి" అని ఎల్లమ్మ లేచింది. నూకరాజు కూడా లేచి నిలబడ్డాడు.

పిల్లల అలికిడి వినబడడం లేదు. కమల వాళ్ల గదిలోకి వెళ్లి చూసొచ్చి,

"నిద్రపోతున్నారు. బాగా అలిసిపోయారు. ఆదివారం వస్తే రోజంతా యుద్ధాలు చేస్తూనే ఉంటారుగానీ, మళ్లీ ఒకర్ని వదిలి ఒకరు ఉండలేరు," అంది.

"మా ఇంట్లో కూడా అంతే" అంది ఎల్లమ్మ నవ్వుతూ.

గేటు వద్ద కమల, "ఇంకో విషయం చెప్పడం మర్చిపోయాను. ఇది కూడా ఆ గిరిజన సర్పంచి చెప్పిందే. దళంలో భాస్కర్ పెట్టుకున్న పేరేమిటో తెలుసా?" అంది - చిరునవ్వుతో.

కమల ఏమి చెబుతుందా అని నూకరాజూ, ఎల్లమ్మా చూశారు.

"నూకన్న" అంది.

నూకరాజు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వాటిని దాచుకుంటూ –

"భాస్కర్ అలాంటి వాడే. అన్నిటికీ ఏదో ఒక డ్రామా చేస్తాడు. 'ఆనంద్' సినీమాలో రాజేశ్‌ఖన్నాలాగా," అన్నాడు.

కమల, ఎల్లమ్మలు ఆ మందుటెండలో నవ్వుల జల్లు కురిపించారు.

మరి కొద్ది వారాల్లోనే ఎల్లమ్మా, కమలా, మరికొందరూ కలిసి ఒక మహిళా సంస్థని స్థాపించారు. మీటింగులు పెట్టుకున్నారు. కార్యాచరణని రూపొందించుకున్నారు. వరకట్న వేధింపుల మీదా, స్కూళ్ల లోనూ, కాలేజీల్లోనూ బాలికలను చైతన్య పరచడం మీదా తమ దృష్టిని కేంద్రీకరించాలని నిశ్చయించుకున్నారు. ముఖ్యంగా గృహ హింసకూ, లైంగిక వేధింపులకూ గురయ్యే స్త్రీల కేసులు వచ్చినపుడు ఏమేం చెయ్యాలో ఒక పట్టిక తయారు చేసుకున్నారు. ఇందుకు నూకరాజు సహకరించాడు.

మరో నెల్లాళ్లల్లో ఊహించని విధంగా మొదటి కేసు వాళ్ల చేతికి వచ్చింది. సింహాచలం మిత్రుడూ, ఒకప్పటి భగ్నప్రేమికుడూ అయిన అప్పారావు ఒక రోజున తప్పతాగి భార్యను చితక బాదాడు. ఈ వార్త జాలారిపేటను చేరుకోగానే ఎల్లమ్మకి తెలిసింది. వెంటనే ఆమెను కమల వద్దకు తీసుకెళ్లింది. ఆమెకు తగిలిన గాయాల వివరాలను గవర్నమెంటు అస్పత్రిలో నమోదు చేయించింది. నూకరాజు సహకారంతో స్టేట్మెంటు తీసుకుంది; పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయించింది.

మొదట అప్పారావు, తరవాత సింహాచలం – ఎల్లమ్మని ఎఫ్.ఐ.ఆర్. వెనక్కి తీసుకోమని బతిమాలారు. అదేం కుదరదని ఆమె ఖరాఖండీగా తెగేసి చెప్పింది. ఎల్లమ్మ తన పరువుతీసి బజార్లో పెడుతుందని అప్పారావుకి అర్థం అయింది. సింహాచలం తన మేనకోడల్ని రాజీకి ఒప్పించేందుకు ప్రయత్నించి నానా చీవాట్లూ తిన్నాడు. 'పెద్దమనిషిని, కార్పొరేటర్ని అని కూడా ఖాతరు చెయ్యకుండా, స్వంత మేనకోడలై ఉండి నా మాటని మెడ్డీసింది,' అని సింహాచలం చాలా నొచ్చుకున్నాడు. చేసేది లేక అప్పారావు జాలారిపేట పెద్దల్ని ఆశ్రయిస్తే వాళ్లు ఎప్పటిలాగానే అతని భార్యకు అనుకూలంగా తీర్పు చెప్పారు. నూకరాజు, అతని మిత్రులు కోర్టు కేసు గెలిచారు. అప్పారావుకి శిక్ష పడింది. గవర్నమెంటు ఉద్యోగం ఊడింది. భార్య విడాకులిచ్చింది. గంగమ్మ తన కూతురితో,

"ఆ అప్పారావుగాడికి మంచి శాస్తి చేశావు, లేకపోతే ఆడికేం పొయ్యేకాలం? జాలారోడయ్యుండీ పెల్లాన్ని కొడతాడా? తాగుముచ్చెదవ!" అంది.

భార్యాభర్తల్ని విడగొడుతున్నారనీ, సంసారాల్లో చిచ్చు పెడుతున్నారనీ మహిళా సంఘం మీద బురదజల్లే ప్రయత్నం విఫలమైంది. ఎల్లమ్మకి ఆర్గనైజేషన్

వ్యవహారాల్లో మంచి అనుభవం వచ్చింది. మీడియాలో ప్రాచుర్యం లభించింది. ఒక ఎర్ర ట్రేడ్ యూనియన్‌కి చెందిన సీనియర్ నాయకుడు మాత్రం –

"ఉన్న సమస్యలు చాలక ఈ లేడీస్ ప్రాబ్లెమ్స్ కూడా మన నెత్తిమీదకి తీసుకొస్తున్నారు. మొగుడూ పెళ్లాల జెట్టీలన్నీ రోడ్డెక్కిస్తున్నారు," అని విసుక్కున్నాడు.

ఎల్లమ్మ కమలతో చేతులు కలపడం, ఉత్సాహంగా మహిళా సంఘానికి నాయకత్వం వహించడం నూకరాజుకి సంతోషం కలిగించింది.

నిత్య సంఘర్షణ

మరో ఆదివారం నాడు కమల, సెల్వన్‌లు ఎమ్.వీ.పీ. కోలనీలో ఉన్న ఎల్లమ్మ, నూకరాజుల ఇంటికి డిన్నర్‌కని వచ్చారు. ఆ రోజున ఉదయ్, శరణ్యాలు వాళ్ల అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. సెల్వన్ని చూస్తే ఎల్లమ్మకి అన్న వెంకటేశు గుర్తొచ్చాడు. నల్లగా, బలిష్టంగా, నిత్యం వ్యాయామం చేసే వాడిలా కండలు తిరిగి ఉన్నాడు. కాకపోతే బాగా పొడుగు; ఆరడుగులుంటాడేమో. కమేండోలా ఉన్నాడు. మెడికల్ కాలేజీలో ఉన్నప్పుడు బాక్సింగు ఛాంపియన్ కూడా. అతనికి తెలుగు వచ్చుగానీ – అది పేషెంట్లతో మాట్లాడడానికే సరిపోతుంది అన్నాడు. అందుచేత సంభాషణ ప్రధానంగా ఇంగ్లీషులోనే సాగింది. సెల్వన్ కోసం తెప్పించిన జానీవాకర్ బ్లాక్ లేబిల్ బాటిల్‌ని నూకరాజు తెరిచాడు.

జాలరుల గురించీ, మారుతూన్న వారి స్థితిగతుల గురించి సెల్వన్ ఎన్నో ప్రశ్నలు వేసి చాలా సమాచారం రాబట్టాడు. చివరికి,

"నాకు అర్థం అయింది. మీరంతా విశాఖపట్నంలో పుట్టి పెరిగారు; గ్రామీణ ప్రాంతాలలో ఉండే కుల వివక్ష మీకు అనుభవంలోకి రాలేదు," అన్నాడు.

"నిజమే. ఆ విధంగా మేము అదృష్టవంతులం. అటు సముద్రంలోనూ, ఇటు చేపల బజారులోనూ వివక్ష ఉండే అవకాశమే లేదు. సముద్రాన్ని ప్రకృతి శక్తులు నిర్దేశిస్తాయి, బజారుని మార్కెట్ శక్తులు నడిపిస్తాయి," అన్నాడు నూకరాజు ఉల్లాసంగా.

నలుగురూ నవ్వుకున్నారు.

అప్పుడు నూకరాజు విశాఖపట్నంలో ముందు తరం వరకూ చాలా చోట్ల కొనసాగిన ఓపెన్ లేవటరీస్ గురించీ, వాటిని శుభ్రం చేసి, మానవ మలాన్ని తట్టలతో మోసే 'పాకీ' వాళ్ల గురించీ చెప్పాడు.

"ఓ మై గాడ్! కమలా నువ్వు దీని గురించి నాకెప్పుడూ చెప్పనేలేదు," అన్నాడు, సెల్వన్ తప్పుపడుతూన్న స్వరంతో.

"సందర్భం రాలేదు. నూకరాజు చెప్పేది అక్షరాలా నిజం," అన్నది కమల.

వాళ్ల గురించి ఇంకా చెప్పమని సెల్వన్ నూకరాజుని అడిగితే తెల్లమొహం వేశాడు.

సెల్వన్ కోపంగా, "మాట్లాడితే మీరంతా పీడితులూ, పీడకులూ, పోరాటాలూ, ఉద్యమాలూ, గాడిద గుడ్డూ అంటారు – మీ ఊళ్లోనే ఉన్న కమ్యూనిటీ గురించి తెలుసుకోవాలని అనుకోలేదా?" అన్నాడు.

గ్లాసులో ఉన్న విస్కీ గటగటా తాగి, బాటిల్ ఒంపి మరో లార్జ్ పెగ్ పోసుకున్నాడు.

ఇదెటు దారితీస్తుందో అని కమల భయపడింది. 'తాగింది చాలు' అని అరవంలో సెల్వన్‌ని హెచ్చరించింది. నూకరాజు, ఎల్లమ్మలకు అర్థం అయిపోయింది.

సెల్వన్ కొంచెం తమాయించుకొని, "ఐ యామ్ సారీ! నా ఉద్దేశం అది కాదు. మన చుట్టూ ఉన్న దళిత కులాల గురించి వివరంగా తెలుసుకోవాలా, లేదా? మనమే ఇంత ఉదాసీనంగా ఉన్నప్పుడు అగ్రవర్ణాల వాళ్లు మనల్ని పట్టించుకోవడం లేదని పొద్దస్తమానూ ఏడవడంలో అర్థం లేదు. సరే, ఒక ఒప్పందానికి వద్దాం. మళ్లీ మనం కలుసుకొనేటప్పుడు వాళ్ల గురించి మనం పూర్తి సమాచారం సేకరించాలి. ఇంకా ఎంత శాతం మాన్యువల్ స్కావెంజింగ్ చేస్తున్నారు? ఏ మేరకు చదువుకుంటున్నారు? ఎవరెవరు, ఏయే ఉద్యోగాలు చేస్తున్నారు, స్త్రీల పరిస్థితి ఏమాదిరిగా ఉంది? పిల్లకాయలు స్కూళ్లకు వెళుతున్నారా లేదా? ప్రభుత్వ పథకాలు ఎంత వరకూ అందుతున్నాయి? వగైరా. ప్రిలిమినరీ సర్వే అన్నమాట. గవర్నమెంటు పబ్లిష్ చేసిన డాటా ఉంటుంది – అది కూడా ఏక్సెస్ చెయ్యాలి. సరేనా?".

"ఓ యెస్, అలాగే" అన్నారు ఎల్లమ్మా, నూకరాజులు. సెల్వన్ శాంతించాడు. కలుపుగోరుగా, నవ్వుతూ మాట్లాడసాగాడు. పేషెంట్లతో మాట్లాడే తెలుగు గురించి తన మీద తానే జోకులు వేసుకున్నాడు. కమల 'హమ్మయ్య' అనుకొని ఊపిరి పీల్చుకుంది.

"మనకు బ్రాహ్మణులతో వ్యక్తిగతమైన వైరం లేదు. – మీ రావిశాస్త్రి ఏమన్నాడూ – (ఇక్కడ సెల్వన్ అరవ యాసతో తెలుగులోనే మాట్లాడాడు) – పోలీసుల్లో కూడా మంచివాళ్లుంటారు; చుట్టాల్లో కూడా స్నేహితులుంటారు; బ్రాహ్మణుల్లో కూడా గొప్పవాళ్లుంటారు" – అని బిగ్గరగా హాలంతా ప్రతిధ్వనించేలా నవ్వాడు.

సెల్వన్ గొంతు హెచ్చు స్వరంలో ఉంటుంది. అతని హావభావాలు మోతాదుని మించి ఉంటాయి. అతనిలో పరిసరాలను శాసించే ఒక బలమైన ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. ఇల్లంతా నవ్వులతో నిండిపోయింది.

"ఇది నీకెలా తెలుసు?" నూకరాజు అడిగాడు.

"కమల చెప్పింది. మన యుద్ధం మనువాదంపైనే. ఆ భావజాలాన్ని వదిలించుకోవడం అంత తేలికేమీ కాదు. ఎవరైనా - వాళ్లు అగ్రవర్ణాల వాళ్లైనా సరే – సిన్సియర్ గా అటువంటి ప్రయత్నం చేస్తుంటే గనక మనం దాన్ని స్వాగతించాలి, ఎంకరేజ్ చెయ్యాలి. కమలా, విత్ యువర్ పెర్మిషన్, ఒన్ లాస్ట్ డ్రింక్ బిఫోర్ డిన్నర్. ఎలాగూ నువ్వే కారు డ్రైవ్ చేస్తున్నావు," అని చిన్న పెగ్గు పోసుకొని, గ్లాసు తీసుకొని, నూకరాజుతో బాటు డైనింగు టేబిలు వద్దకు నడిచాడు.

వాళ్లిద్దరూ కుర్చీల్లో కూర్చొని తమ సంభాషణను కొనసాగించారు. సెల్వన్ –

"కొన్నికొన్ని సంఘటనలు మనిషిని సమూలంగా కదిలిస్తాయి. ఎన్నాళ్లయినా మర్చిపోలేం. ముఖ్యంగా అవి చిన్నతనంలో జరిగినవి అయితే. నా విషయంలో కూడా అలాంటి విషాదం ఒకటి ఉంది. మా పొరుగూరైన కీలవేన్మణిలో నలభై మంది దళితుల్ని సజీవదహనం చెయ్యడం గురించి మీరు వినే ఉంటారు..." అంటూ ఆ అనుభవం గురించి చెప్పసాగాడు. ఆ దాడిలో చనిపోయిన పిల్లల ప్రస్తావన వచ్చినపుడు –

"కనీసం తమ పిల్లలైనా బతుకుతారనే ఆశతో తల్లిదండ్రులు వాళ్లని మండుతూన్న గుడిసెలలోంచి బయటకు విసిరేశారు. పారిపోతున్న పిల్లల్ని వెంటాడి పట్టుకొని తిరిగి మంటల్లో పడేసారు, ఆ అగ్రకుల భూస్వాములు..." అంటూంటే సెల్వన్ గొంతు బొంగురుపోయింది. ఉద్వేగానికి లోనై మాట్లాడలేకపోయాడు.

కమల అతని పక్కన కూర్చొని భుజం మీద చెయ్యి వేసింది. కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

కమలా, ఎల్లమ్మా వంటకాలను తీసుకురావడానికి వంటింట్లోకి వెళ్లారు.

"కీలవేన్మణిలో చనిపోయిన వాళ్లల్లో సెల్వన్ స్కూల్లో చదివిన పిల్లలు, బంధువులు ఉన్నారు...సెల్వన్ ఈమధ్యకాలంలో ఇంత ఫ్రీగా మాట్లాడడం చూడలేదు. మొదట కొంచెం భయపడ్డాను – ఆ కోపం, ఆ ఎమోషన్స్ చూసి," అంది కమల.

"అతను నిఖార్సయిన మనిషి. ఉన్నదున్నట్లు మాట్లాడతాడు. అలాంటి వాళ్లతో ఇబ్బందిలేదు. వాదించుకోవడాలూ, కోపాలూ, ఎమోషనల్ కావడాలూ మా ఇంట్లో కూడా మామూలే," అంది ఎల్లమ్మ అనునయంగా.

భోజనాలు చేస్తున్నంత సేపూ సెల్వన్ మాట్లాడుతూనే ఉన్నాడు. కులం, మతం – ఈ విషయాల్లో తమిళనాడు ఏ విధంగా భిన్నమైనదో చెప్పసాగాడు. పెరియార్ గురించీ, డీ.ఎమ్.కే. పార్టీ పుట్టుక గురించీ చాలా ఆసక్తికరమైన విషయాలు చెప్పాడు. అలాగే మహారాష్ట్రలో దళిత్ పాంథర్స్ గురించీ, నియో-బుద్ధిస్టుల గురించీ ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు. అవన్నీ ఎల్లమ్మ, నూకరాజులకి కొత్త విషయాలు.

చివరికి తమిళ సాహిత్యంలో దళిత ధోరణులను గురించి చెప్పి,

"ఈ విషయంలో తెలుగు సాహిత్యం ఎక్కడుంది?" అని అడిగాడు. కమల ఊపిరి బిగబట్టింది.

నూకరాజు, ఎల్లమ్మల వద్ద ఈ ప్రశ్నకు సమాధానం ఉంది.

'చిక్కనవుతున్న పాట' గురించీ, శివసాగర్ రాస్తూన్న కవిత్వం గురించీ చెప్పారు. కమల ఊపిరి వదిలి మళ్లీ పీల్చుకుంది.

"మీ ఇంట్లో ఆ పుస్తకాలున్నాయా?" అని సెల్వన్ అడిగాడు. ఎల్లమ్మ లేచి, అరలోంచి తీసి ఇచ్చింది.

వాటిని చేతిలోకి తీసుకొని, అప్యాయంగా తడుముతూ, పేజీలు తిప్పుతూ ముద్దుపెట్టుకున్నాడు.

అతని గాఢత, ఉద్వేగం నూకరాజుకీ, ఎల్లమ్మకీ ఆశ్చర్యం కలిగించాయి.

"ఏదో ఒకటి చదివి వినిపించు" అని సెల్వన్ అడిగినప్పుడు, 'దళిత మేనిఫెస్టో'లోని శివసాగర్ కవిత 'నడుస్తున్న చరిత్ర'ను నూకరాజు బయటకు చదివాడు –

శంభూకుడు పెదాల మీద చిరునవ్వుతో
రాముణ్ణి వధిస్తున్నాడు.
ఏకలవ్యుడు ద్రోణుని బొటనవేలును
గొడ్డలితో నరుకుతున్నాడు.
బలి తన చిరు పాదాలతో వామనుణ్ణి
పాతాళానికి తొక్కేస్తున్నాడు
...
ఇప్పుడు నడుస్తున్న చరిత్ర
పరమ ఛండాల చరిత్ర.

సెల్వన్ కళ్లుమూసుకొని శ్రద్ధగా విన్నాడు. నూకరాజు కవిత అర్థాన్ని వివరించబోయాడు.

"అవసరం లేదు. నాకర్థం అయిపోయింది. ఎంత గొప్పగా రాశాడు! చాలా బోల్డ్‌గా రాశాడు! ఎవరితను?" నూకరాజు శివసాగర్ గురించి చెప్తూంటే – చాలా ఇంప్రెస్ అయ్యాడు.

కారెక్కబోతూ, నూకరాజుని హత్తుకొని, "మనం కలిసి చెయ్యాల్సిన పనులు చాలా ఉన్నాయి, రాజూ! కానీ మొట్టమొదట – ఆ సర్వే!" అన్నాడు, సెల్వన్.

రెండో రోజు కమల ఫోను చేసి ఎల్లమ్మతో చాలా సేపు మాట్లాడింది.

"సెల్వన్ ఇన్నాళ్లూ ఒడ్డున పడ్డ చేపలాగా కొట్టుకొనేవాడు. వైజాగులో అడ్జస్ట్ కాగలడో లేదో అని నాకు సందేహంగా ఉండేది. మొన్న మీ ఇంటికి వచ్చిన దగ్గరనుండీ చాలా ఉత్సాహంగా ఉన్నాడు. తెలుగు చదవడం, రాయడం నేర్చుకుంటున్నాడు. అతని పేరెంట్స్ పోయిన తరవాత డిప్రెస్ అయ్యాడు. అతనిలో ఇంత ఉత్సాహం మళ్లీ ఇప్పుడే చూస్తున్నాను. మనం తరచూ కలుసుకోవాలి," అంది.

ఎల్లమ్మ, "అవును. సెల్వన్ మాకు తెలియని విషయాలు చాలా చెప్పాడు. ఒక కొత్త ప్రపంచాన్ని మా ముందుంచాడు. భాస్కర్ మాటల్లాగా అనిపించాయి, అతని మాటలు," అంది.

కమల, "అవును, ఇద్దరికీ కొన్ని విషయాల్లో పోలికలున్నాయి. సెల్వన్‌కి కూడా స్ట్రాంగ్ లైక్స్ అండ్ డిస్లైక్స్. మంచి రోజులు వస్తాయని ఇద్దరూ నమ్ముతారు," అన్నది - సాలోచనగా.

"అందుకేనేమో నీకు సెల్వన్ నచ్చాడు."

"ఏమో?" అని నవ్వేసింది కమల.

"నువ్వేమీ అనుకోనంటే ఒకటి అడగాలి," అంది ఎల్లమ్మ సందేహిస్తూ.

"అడుగు."

"సెల్వన్ అంటే నీకేదో భయం ఉందని అనిపిస్తోంది."

"భయం కాదుగానీ జంకు."

"ఎందుకని?"

"సెల్వన్ చాలా సెన్సిటివ్. ఒక్కోసారి వోలటైల్ కూడా. ఎప్పుడు పేలుతుందో చెప్పలేని అగ్నిపర్వతం."

"అతనిలో ఏదో అణిచిపెట్టిన కోపం ఉందనిపిస్తుంది."

"నిజమే. నీకు చెప్పానుకదా, అతని బాల్యం గురించి."

"అవును. గుర్తుంది. అంత కోపం, క్షోభ లోలోపల ఉంటే మనిషిని తినేస్తాయి. ద్వేషంగా మారి చుట్టూ ఉన్నవాళ్లకి కూడా శాంతి లేకుండా చేస్తాయి."

"నేనూ అదే అన్నాను."

"మరి?"

"నీకు తెలుసుకదా, మాది చౌదరి కుటుంబం. మా అక్కతో తప్పిస్తే మా చుట్టాలెవరితోనూ నాకు పెద్దగా సంబంధాలు లేవు. అమ్మ పోయి చాలా కాలం అయింది. నాన్న క్రిందటి ఏడాది పోయాడు."

"అవును. చెప్పావు."

"ఇప్పుడు మానేశాడుగానీ, మొదట్లో ఏ చిన్న ఆర్గ్యుమెంటు వచ్చినా సెల్వన్, 'అవున్లే, చౌదరీల అమ్మాయివి కదా!' అని దెప్పిపొడుస్తూండేవాడు. ప్రతీసారీ శీలపరీక్షలాగా, నాకు కులం పట్టింపులు లేవని ఋజువు చేసుకుంటూ ఉండాలి. అతని కులాన్నిగానీ, అతనివైపు వాళ్లని గానీ పల్లెత్తు మాటనడానికి వీల్లేదు. కొన్నాళ్లకి నాలో నేరభావం పెరిగిపోయింది," అన్నది కమల ఉద్వేగంగా.

"నేరభావం దేనికి?"

"మా పూర్వీకులూ, మొత్తం అగ్రవర్ణాల వాళ్లూ చేసిన, చేస్తున్న నేరాలకీ, పాపాలకీ," అంది ఆవేశంగా.

ఎల్లమ్మలోని జాలరి మహిళ మేల్కొంది.

"ఒక పక్క కోపం, ద్వేషం మరో పక్క నేరభావం, భయం – ఇలాగైతే కష్టమే. అసలు మీ కాపరం ఇన్నాళ్లు ఎలా సాగిందో అర్థం కావడం లేదు. ఇంత చదువుకునీ, ఇంత పెద్ద డాక్టరువి అయి ఉండీ మొగుడుకి భయపడడం ఏమిటి? ఇప్పటికైనా ముసుగులో గుద్దులాట మానుకోకపోతే – మీరు మొగుడూ, పెళ్లాలుగా కొనసాగడంలో అర్థం లేదు," అనేసింది.

"అయ్యో! సెల్వన్ చెడ్డవాడేమీ కాదు. చాలా మంచి గుణాలున్నాయి. ఇందాక చెప్పాను చూడు. అతనిలో ఒకవైపు సున్నితత్వం, మరోవైపు వెర్రి కోపం రెండూ కలగలిసిపోయి ఉంటాయి. ఆ రెండింటి మధ్యా అతడే స్వయంగా నలిగిపోతూంటాడు. సున్నితంగా ఉన్నప్పుడు ఎంత ఉదాత్తంగా, శాంతంగా, ప్రేమగా ఉంటాడో చెప్పలేం. నేను ఇష్టపడిందీ, ప్రేమించిందీ ఆ సెల్వన్‌నే. అతనిలోని గొప్ప పార్శ్వం ఇదే. వైజాగు వచ్చాక కొన్ని కొత్త టెన్షన్లు ఎదుర్కొన్నాం – పనిలో, వ్యక్తిగత జీవితంలో. ఇక్కడ మీరిద్దరూ ఉండడం మాకు ఎంత బాగుందో మాటల్లో చెప్పలేను."

"సెల్వన్‌ని అగ్నిపర్వతం అన్నావుగానీ, నీలో కూడా చాలా ఒత్తిడిని దాచిపెట్టుకున్నావు."

"నిజమే. ఈరోజున నీతో చెప్తున్న సంగతులు మా అక్కకి కొంతవరకూ చెప్పానుగానీ ఇంత వివరంగా ఎవ్వరితోనూ అనలేదు. ఇవన్నీ నా లోలోపలే ఉండిపోయాయి. అదృష్టం ఏమిటంటే, సెల్వన్ నేడు సమిష్టి ఆచరణ వైపు ప్రయాణిస్తున్నాడు. అదే అతని లోపలి అసహనం నుండి బయట పడడానికి విముక్తి మార్గం. కాకపోతే భాస్కర్ విషయంలో సెల్వన్ ఇంకా కొంత మారాలి. మారతాడనే అనుకుంటున్నాను."

"భాస్కర్ విషయంలోనా!?...అదెప్పటి భాస్కర్?"

"కొంతమంది మనుష్యులు వెళ్లిపోయాక కూడా మనలో భాగంగా

ఉండిపోతారు. భాస్కర్ అటువంటి మనిషే. వాళ్ల ఆలోచనలు, ఆచరణ, ప్రవర్తన మనలో సజీవంగా ఉండిపోతాయి."

"అవునవును. నాకు తెలుసు. భాస్కర్ అటువంటివాడే."

"నేనూ, భాస్కర్ ఒకరినొకరు ఇష్టపడ్డాం అని నీకు తెలుసుకదా? చాలా క్లోజ్‌గా ఉండేవాళ్లం. అంతకుమించి చెప్పడం అనవసరం. నువ్వు అర్థం చేసుకోగలవు."

"అయినా అదంతా గతం. ఇరవై ఏళ్లనాటి మాట."

"నిజమే. అవన్నీ ఎప్పుడో మర్చిపోయాం అనుకున్నాను. ఈ మధ్య – అంటే వైజాగు వచ్చిన దగ్గరనుండీ, ఏదో ఒక సందర్భంలో భాస్కర్ మా మధ్యలోకి వస్తూనే ఉన్నాడు. అతని ప్రభావం నాపైన చాలా ఉందని సెల్వన్‌కి తెలుసు. అది సెల్వన్‌కి ఇప్పటికీ ఇబ్బంది కలిగిస్తోంది. పైగా భాస్కర్ బ్రాహ్మడైపోయాడు." ఎల్లమ్మ నిర్ఘాంతపోయింది.

"పాపం, భాస్కర్! అతడు తనని విప్లవకారుడనుకున్నాడు. అంతా అతన్ని అలాగే తలుచుకోవాలని అనుకున్నాడు. చుట్టూ తిరిగి అతని ప్రస్తావన ఒక బ్రాహ్మడిగానే మిగిలిపోతుందని కలలో కూడా ఊహించి ఉండడు – అది కూడా అతని సన్నిహితుల మధ్య,"

"భాస్కర్ పట్ల అతనికున్న సందిగ్ధాన్ని కూడా పరిష్కరించుకోగల సహృదయం, విజ్ఞత సెల్వన్‌కి ఉన్నాయి. అతనిపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. అతడే ఈ ముడిని స్వయంగా విప్పుకోవాలి. నేను గనక జోక్యం చేసుకుంటే మరింత జటిలం అవుతుంది. ఇప్పుడు నీకు అర్థం అయి ఉంటుంది – నాలో ఆ జంకు ఎందుకు ఏర్పడిందో."

"అయినా నువ్వు కూడా అన్నిటికీ భయపడుతూ, జంకుతూ ఉండాల్సిన పనిలేదు. మనం ఎసర్టివ్‌గా ఉండకపోతే ఏదో దాస్తున్నామనే మగవాళ్లు అనుకుంటారు. ఇంకా దుర్భరంగా తయారవుతారు. ఒక విషయం చెప్పమంటావా? ప్రేమించడం అంటే ఆరాధించడం కాదు. ప్రేమకోసం, ప్రేమించిన మనుష్యులకోసం యుద్ధం చెయ్యడం,"

"బాగా చెప్పావు. నువ్వనేది అక్షరాలా నిజం. నీతో ఇవన్నీ ఫ్రీగా మాట్లాడగలగడం నాకు చాలా రిలీఫ్‌గా ఉంది, ఎల్లమ్మా. క్లినిక్‌కి వెళ్లాల్సిన టైం అవుతోంది. తరవాత మాట్లాడదాం," అని కమల ఫోను పెట్టేసింది. ఎల్లమ్మ అన్నమాటలు ఆమె లోలోపల ప్రతిధ్వనించాయి.

* * *

సెల్వన్ తెలుగు బాగా మాట్లాడాలనీ, చదవాలనీ నిశ్చయించుకున్నాడు. సహజంగానే తెలివైనవాడూ, పట్టుదల కలిగినవాడూ కావడంచేత మూడు, నాలుగు

నెలల్లోనే కొంత ప్రగతి సాధించాడు. కమల అతనికి సహకరించింది. రోగులతోనే కాకుండా, అన్ని సందర్భాలలోనూ తెలుగు మాట్లాడాలని ప్రయత్నించసాగాడు.

అతడు పనిచేస్తున్న ఆసుపత్రిలో ఒక సహోద్యోగి కూతురు పెళ్లి భోజనానికని కమలతో సహా వెళ్లినప్పుడు అతనికొక వింత అనుభవం ఎదురైంది.

సెల్వన్ 'కూర, అన్నం, పెరుగు' అంటున్నప్పటికీ, వడ్డించేవాళ్లుగానీ, చుట్టుపక్కల కూర్చున్న వాళ్లుగానీ ఆ మాటల్ని ఉపయోగించడం లేదని గ్రహించాడు. ప్రతి ఒక్కరూ –

'కర్రీస్, రైస్, కర్డ్' అనే అంటున్నారు. పైగా కొంతమంది సెల్వన్ని వింతగా చూస్తూ నవ్వుకున్నారు. ఏం జరుగుతోందో అతనికి బోధపడలేదు.

తమిళంలో పోలీస్ స్టేషన్, కంప్యూటర్‌తో సహా చాలా మాటలకు స్థానిక పదాలున్నాయి. వాటిని తమిళులు వాడతారు కూడా. కారులో ఇంటికి వెళుతూ,

"తెలుగులో ఉన్న మాటల్నికూడా ఎందుకు ప్రయోగించరు?" అని కమలని అడిగాడు.

"మా గుంటూరులో చాలా నయం. ఇక్కడ మరీను. ఎందుకో తెలీదు," అంది కమల.

"తెలుగువాళ్లకి, ముఖ్యంగా విశాఖపట్నం వాళ్లకి ఆత్మవిశ్వాసం బాగా తక్కువ - ఎందుకని?"

"ఏమో" సెల్వన్ దేన్నయినా సరే, 'మనకెందుకులే' అని విడిచిపెట్టే రకం కాదు. చెప్పుకుంటూ పోతున్నాడు –

"మొన్న బ్యాంకులో ఏమైంది? నువ్వూ, నేనూ తెలుగులో మాట్లాడుతూంటే, ఆ మేనేజరు తెలుగువాడై ఉండీ, పూర్తిగా ఇంగ్లీషులోనే మాట్లాడాడు. మా తమిళనాడులో ఆ విధంగా ఎన్నడూ జరగదు. పైగా మీరు రాసే తెలుగు, మాట్లాడే తెలుగు – పూర్తిగా వేరువేరుగా ఉంటాయి..." అప్పటికే పదిన్నర దాటింది. ఇల్లుచేరుకున్నారు. కమలకి నిద్ర వస్తోంది.

"ఎవరినైనా అడగాలి," అంది కమల బట్టలు మార్చుకుంటూ. ఈ సమస్య అంతు చూడాలని నిశ్చయించుకున్న సెల్వన్ ఉత్తేజంగా ఉన్నాడు. అతని నిద్ర ఎగిరిపోయింది. పైగా కాఫీ చేసుకొని తాగాడు. అతనికి ఒక్కసారిగా వెలిగింది.

"కమలా! నాకేమనిపిస్తోందంటే, తెలుగులో మొదటే సంస్కృతం పాలు ఎక్కువ. ఇప్పుడు ఇంగ్లీషు కూడా వచ్చి కూర్చుంది. తమిళభాష ఆ రెండిటినీ దూరంగా ఉంచి బతికిపోయింది," అన్నాడు.

"సరే, సరే. ఏ యూనివర్సిటీకో వెళ్లి పండితుల్నీ, మేధావుల్నీ అడుగుదాం. ఇవాళ్టికి ఇక పడుకుందాం," అంది కమల ఆవులిస్తూ.

"నువ్వు పడుకో. నాకు నిద్ర రావడం లేదు. కాసేపు టీవీ చూస్తాను."

* * *

తెలుగు నేర్చుకొనే ప్రయత్నం అనుకున్నంతగా ముందుకి సాగకపోయేసరికి సెల్వన్ ఇక లాభంలేదని స్టాఫ్‌తోనూ, రోగులతోనూ ఇంగ్లీషులోనే మాట్లాడడం మొదలుపెట్టాడు. దాంతో అతనిపట్ల వాళ్లకుండే గౌరవం రెండింతలు పెరిగిపోవడాన్ని గమనించాడు. తెలుగువాళ్లపై ఏవగింపు, తెలుగు భాషపై విముఖత ఏర్పడ్డాయి. అది కమలకూ, తనకూ మధ్య అడ్డంకిగా మారుతుందేమోనని శంకించాడు.

నూకరాజు, ఎల్లమ్మలని మళ్లీ కలుసుకున్నప్పుడు దీని మీద చర్చ జరిగింది.

ఆరోజున సెల్వన్ కాల్ డ్యూటీలో ఉన్నాడు అందుకని అతడు తాగలేదు. వెళ్లేటప్పుడు కూడా స్వయంగా కారు డ్రైవ్ చేశాడు.

"ఇటువంటి చర్చలు జరిగేటప్పుడు 'భాస్కర్ మన మధ్య ఉండి ఉంటే ఏమనేవాడు?' అనే ప్రశ్న కలుగుతుంది – నా లోలోపల, ప్రతీసారీ" – అన్నాడు నూకరాజు.

భాస్కర్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా సెల్వన్ మొహంలో ఛాయలు మారుతాయి. ఎక్కడో తన అంతరంగంలో తనను భాస్కర్‌తో సరిపోల్చుకుంటూ ఉంటాడని కమలకు తెలుసు. తెలుగు పట్ల సెల్వన్‌లో కలిగిన విముఖతకీ, కలుక్కుమనే భాస్కర్ జ్ఞాపకాలకీ ఏదో సంబంధం ఉందని కూడా ఆమెకు ఇటీవల అనిపిస్తోంది. చిన్నతనంలోనే సెల్వన్‌లో ఘనీభవించిన బ్రాహ్మణ భావజాల వ్యతిరేకత, ఆ కులస్థుల పట్ల ద్వేషంగా మారి, 'ఎన్ని కబుర్లు చెప్పినా చిట్టచివరికి భాస్కర్ కూడా బ్రాహ్మడే సుమా!' అని అతనికి పదేపదే గుర్తు చేస్తోందా?...అదే నిజం అయితే రేప్పొద్దున్న తన సంగతి మాత్రం?...కమల ఈ చీకటి లోతులలోకి వెళ్లే సాహసం చెయ్యలేదు ఇన్నాళ్లూ. ఎల్లమ్మతో మాట్లాడాక కమలకు స్పష్టత వచ్చింది. తన జీవితంలో భాస్కర్‌కి గల ప్రత్యేక స్థానాన్ని కేవలం అతని కులానికే ముడిపెట్టి ముగించడం ఆమెకు సుతరామూ ఇష్టం లేదు.

నూకరాజుకి భాస్కర్ కుల మూలాలతో పేచీ లేకపోవడం ఆమెకు మొదట్లో కొంత ఆశ్చర్యం కలిగించేది. తన విషయానికి వస్తే, ఏకపక్షంగా గతంతో శాంతియుతమైన తుది ఒప్పందం చేసుకోవడం ఇప్పట్లో అసాధ్యం అని ఆమెకు తెలుసు. అది ఎందుకో కూడా ఆమె ఊహించగలదు.

ఇవాళ్టికి కూడా భాస్కర్ నిజంగా, లోతుగా గుర్తుకొచ్చినప్పుడు కమల తన రీతిలో

విలవిలలాడిపోతుంది. అటువంటి జ్ఞాపకాల వెల్లువ ఆమెను చుట్టుముట్టకుండా ఆమె జాగ్రత్త పడుతూంటూనే ఉంటుంది గానీ, ఒక్కోసారి ఆమెకు వశం కాదు. అదృష్టవశాత్తూ గతం ఎప్పుడోగాని గుర్తుకి రాదు. ఈ మధ్య, అంటే మళ్లీ విశాఖ వచ్చాక, నూకరాజు, ఎల్లమ్మలతో స్నేహసంబంధాలు ఏర్పడ్డాక, ఆనాటి జ్ఞాపకాలు ఒక్కోసారి ముసురుకొస్తున్నాయి. సెల్వన్‌లోని ఒక గొప్ప సుగుణం ఏమిటంటే, కమల మానసికస్థితి బాగులేనప్పుడల్లా ఆమెతో మరింత సున్నితంగా ప్రవర్తిస్తాడు; విసిగించకుండా జాగ్రత్త పడతాడు. ఇదే వారి బంధాన్ని కాపాడుతూ వస్తోంది.

నూకరాజు భాస్కర్ మాటెత్తగానే సెల్వన్ మొహంలో కళ తగ్గడాన్ని ఈ దినాన ఎల్లమ్మ కూడా గమనించింది. నూకరాజు మాత్రం ఏమీ పట్టించుకోకుండా చెప్పుకుపోతున్నాడు –

"...భాష అంటే సంస్కృతి కూడా. సంస్కృతి అంటే ప్రజలు – అన్ని వర్గాల, కులాల వాళ్లూనూ. ఆధిపత్య సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజల సంస్కృతి ప్రాచుర్యంలోనికి రానంతకాలం మనకీ దౌర్భాగ్యం కొనసాగుతూనే ఉంటుంది," అని ముగించాడు.

సెల్వన్, "హియర్, హియర్," అని లేచి వెళ్లి నూకరాజుని హత్తుకున్నాడు.

ఆ తరవాత సంభాషణ తేలికపాటి అంశాల పైకి మళ్లింది. ఆ నలుగురూ తెలుగు వాళ్లమీద బోల్డన్ని జోకులు వేసుకున్నారు.

"'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అనుకుంటూ మురిసిపోయే తెలుగు వాళ్లు, ఇటాలియన్ భాషని 'తెలుగు ఆఫ్ ది వెస్ట్' అని ఎప్పటికీ అనబోరనీ, ఈ పోలికలు తేవడం, చంకలు గుద్దుకోవడం – వీటి వెనక ఆధిపత్య సంస్కృతి ఉంటుందనీ పాపం గ్రహించలేరు," అన్నాడు సెల్వన్.

భీమిలిని 'బ్రిస్టల్ ఆఫ్ ఈస్ట్', తెనాలిని 'ఆంధ్రా పారిస్', అరుకులోయని 'ఆంధ్రా ఊటీ' అనీ అనుకోవడం వెనక ఉన్న భావదాస్యం గురించి మాట్లాడుకున్నారు.

"తమకు ప్రామాణికత లేదని భావిస్తూ, తమని తామే కించపరచుకుంటూ, మిగతా వాళ్లందరికీ నకళ్లుగా మిగిలిపోయేందుకు వెంపర్లాడే జాతి మీది," అనేశాడు సెల్వన్ – నవ్వుతూనే.

"ఎంతసేపూ ఇతరులను చూసి మురిసిపోవడమే తప్ప, తమ వాళ్లల్లో ఉన్న ప్రతిభని తెలుగు జాతి గుర్తించదు," అన్నది కమల.

"అవును. మరాఠీ గురజాడ, బెంగాలీ శ్రీశ్రీ, తమిళ రావిశాస్త్రిల కోసం ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూడాలో?" అంది ఎల్లమ్మ, పెంకెగా.

"అక్కడితో ఆగిపోయావేం? తెలుగు కీర్తి విదేశాలకు వ్యాపించాలా, వద్దా?" అని నిలదీసింది, కమల.

"అయ్య బాబోయ్! ఆంధ్రా ఛెఖోవ్‌లూ, ఆంధ్రా మార్క్వెజ్‌లూ ఉన్నారా... కొంపదీసి?" అన్నాడు సెల్వన్, వెటకారంగా.

"గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో కనిపించే ఆత్మస్థైర్యం కళింగాంధ్రలో లోపించడం వెనక చారిత్రక కారణాలున్నాయి," అన్నాడు నూకరాజు సీరియస్‌గా.

"అంతా కృష్ణా, గోదావరి నదుల ఆశీర్వాదం. కాటన్ దొరగారి చలవ!" అని చర్చను ముగించాడు, సెల్వన్.

ఇంటికి వస్తూ, కారులో –

"తెలుగుజాతి ఆత్మగౌరవం అనే ఒకే ఒక్క పాయింట్ ఆధారంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి ఎలా గెలవగలిగాడో నాకు ఈరోజున అర్థం అయింది," అన్నాడు.

"అవును. అప్పట్లో తెలుగు వాళ్లంతా ఒక్కటే అనుకున్నారంతా," అంది కమల కారులోంచి బయటకు, దుకాణాల వైపు చూస్తూ. సీతమ్మధార – 'ఈనాడు' జంక్షన్, రైతుబజారు దాటిపోయారు.

'రేపు టిఫిన్ ఏం చెయ్యమని వంటామెకు చెప్పాలి? ఇంట్లో ఏమేమి ఉన్నాయి? నిన్ననే ఉప్మా అయింది. ఇడ్లీకి పప్పు నానబెట్టమని చెప్పి ఉంటే సరిపోయేది...' అని మనసులో అనుకుంది కమల. సెల్వన్ మాట్లాడే మూడ్‌లోకి వచ్చాడు. అతన్ని ఆపడం ఇంక ఎవరికీ సాధ్యం కాదు.

"మా తమిళులకైతే ప్రతి ఒక్కరిలోనూ ఆత్మగౌరవం దండిగా ఉంటుంది. దాన్ని ఎలా కాపాడుకోవాలో కూడా అందరికీ తెలుసు. అంచేత తమిళనాడులో ఆత్మగౌరవం కోసం పార్టీని స్థాపించక్కర్లేదు...తెలుగుజాతి ఆత్మగౌరవం అన్నాడు, ఎన్టీఆర్. సరే, బాగానే ఉంది. కానీ ఎవరా తెలుగు వాళ్లు? ఏ మతం? ఏ కులం? ఏ వర్గం? ఏ ప్రాంతం?...చాలా మడత పేచీలున్నాయి. ఆ మడతలన్నీ ఇప్పుడు విడుతున్నాయి... చూస్తూ ఉండు, తెలంగాణా విడిపోతుంది,"

"నువ్వు సోషల్ సైంటిస్టువి అవ్వాల్సింది," అంది కమల నవ్వుతూ.

"ఇందాక రాజు ఒక మాటన్నాడు. 'భాస్కర్ ఉండి ఉంటే ఏమనేవాడో' అని – గుర్తుందా?" కమల గతుక్కుమంది.

"అవును. గుర్తుంది," అంది ముక్తసరిగా.

"దేశ రాజకీయపటం అతి త్వరగా మారిపోతోంది. ఇన్నాళ్లూ రాజ్యంగం మనల్ని కాపాడింది. ఇప్పుడు మనమే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. భాస్కర్ లాంటి మేధావులు మనకి కావాలిప్పుడు. భాస్కర్లని పోగొట్టుకున్నాం. నూకరాజులనైనా కాపాడుకోవాలి. అందర్నీ కూడగట్టుకొని ముందుకి నడవాల్సిన కాలం ఇది,"

"ముమ్మాటికీ నిజం," అంది కమల. సెల్వన్ మాటల్లో ఆమెకు ఆసక్తి పెరిగిపోయింది.

"భాస్కర్ని కలుసుకోలేకపోయాను. అదే నా విచారమల్లా." అని నిట్టూర్చాడు, సెల్వన్ – కారుని పార్క్ చేస్తూ. అతడేం మాట్లాడినా నిష్కపటంగా, నిర్మొహమాటంగానే మాట్లాడతాడని కమలకి తెలుసు.

ఆమె మనసు తేలికపడింది.

* * *

తెల్లవారుఝామునే లేచి జాగింగుకి వెళ్లడం, కుదిరితే సాయంత్రం పూట జిమ్‌కి వెళ్లడం సెల్వన్‌కి అలవాటు. జాగింగుకి వెళ్లినప్పుడల్లా కమలని కూడా రమ్మంటాడుగానీ, 'నేను యోగా చేస్తున్నాను కదా?' అని చెప్పి తప్పించుకుంటుంది.

ఆ రోజు జాగింగు నుండి వచ్చాక, ఎప్పటిలాగానే పాల పాకెట్లు, పేపర్లు లోపలికి తీసుకొచ్చాడు. పాలు కాచి, కాఫీ చేసుకొని డైనింగు టేబిలు వద్ద కూర్చొని తాగుతూండగా, కమల నిద్రలేచి, ముఖం కడుక్కొని, అక్కడికి వచ్చి, ఆనాటి పేపరుతీసి చదువనారంభించింది. ఆమెను ఉద్దేశించి –

"ఇవాళ ఏం జరిగిందో తెలుసా? పేషెంటు ఒకాయన మోర్నింగు వాక్‌కని వచ్చి నాకు కనిపించాడు. బాగా రికవర్ అయిపోయాడు. కాసేపు మాట్లాడాను. 'అదేమిటీ? మీరు ఇక్కడ పుట్టి పెరిగినవాళ్లు కాదా? ఇంతబాగా తెలుగు ఎలా మాట్లాడుతున్నారు?' అని ఒకటే ఆశ్చర్యపోయాడు. 'ఇక్కడ పుట్టి ఉంటే తెలుగులో ఎందుకు మాట్లాడతాను?' అన్నాను. అతను పడీపడీ నవ్వాడు. ఈ కోలనీలోనే ఉంటాడట. మనల్నిద్దర్నీ ఇంటికి రమ్మన్నాడు. సాహిత్యంలో అతనికి ఆసక్తి ఉందట. తెలుగు సాహిత్యం గురించి కూడా కాసేపు మాట్లాడుకున్నాం. మొట్టమొదటి సారి, 'నాదీ ఈ ఊరే' అనిపించింది, అతనితో మాట్లాడుతూంటే. నువ్వు చెప్పే క్లాసిక్స్, తెలుగులో ఇప్పుడు వస్తూన్న సాహిత్యం – ఇవి చదవడానికైనా తెలుగు నేర్చుకుందామని అనుకుంటున్నాను. అసలు తెలుగు చక్కగా మాట్లాడితే వినడానికి ఎంత బాగుంటుదో!... ముఖ్యంగా నువ్వు మట్లాడుతూంటే!" అన్నాడు సెల్వన్.

కమలకి సంతోషం కలిగింది. ఆ చలికాలపు ఉదయపుటెండలో ట్రాక్ సూట్లో ఫిట్‌గా కనిపిస్తూన్న సెల్వన్‌ని చూస్తే ఆమెకు ముచ్చటేసింది. దగ్గరకు వెళ్లి అతని పెదాలను ముద్దు పెట్టుకుంది. కాఫీ వాసన, రుచి.

"ఆగాగు! వళ్లంతా చెమట, చెమట," సెల్వన్ అడ్డుచెప్పాడు.

"మరేం ఫరవాలేదు," అని అతని ఒళ్లో కూర్చుంది. అతని భుజాల చుట్టూ చేతులు వేసింది. మరో ముద్దు పెట్టింది.

వంట చేసే అమ్మాయి, అకస్మాత్తుగా వంటింట్లోంచి – చేతులు తుడుచుకుంటూ బయటకు వచ్చింది. కమల దిగ్గున లేచిపోయింది.

"ఈ రోజు టిఫిను ఏం చెయ్యమంటారమ్మగారూ?" అన్నది వంటామె, ఏమీ చూడనట్లు.

ఆమె వెంట వంటింట్లోకి నడుస్తూ, సెల్వన్‌తో ఇంగ్లీషులో, "ఈమెగారు ఎప్పుడొచ్చింది? మనల్నిగాని చూసేసిందా?" అని కమల అడిగింది.

సెల్వన్ అరవంలో, "నేనే తలుపు తీశాను. చూస్తే మాత్రం ఏం కొంప మునుగుతుంది?" అని నవ్వాడు.

టిఫిన్, వంట – ఏమేమి చెయ్యాలో పురమాయించి, బయటకు వచ్చి,"ఆమె వంటింట్లో ఉందని ఎందుకు చెప్పలేదు?" అంది కమల చిరుకోపంతో.

"నీ మూడ్ పాడు చెయ్యడం ఇష్టం లేక. ఇంకో కప్పు కాఫీ ఇస్తావా? నేను చేసుకొనే కాఫీకన్నా నీ చేతులతో చేసిస్తేనే బాగుంటుంది," అంటూ ఆమెను శాంతింపజేశాడు, సెల్వన్.

* * *

సెల్వన్ పట్టుబట్టిన విధంగా పారిశుద్ధ్య కార్మికుల గణాంకాలనూ, మాన్యువల్ స్కావెంజింగ్ వివరాలనూ నూకరాజు సేకరించాడు. ఒకటి రెండు కొత్త విషయాలు తెలిసాయి.

విశాఖ నగరంలో మాన్యువల్ స్కావెంజింగ్ దాదాపుగా అంతరించిపోయింది. అయితే మురుగుకాలవలు శుభ్రం చేసేదీ, సెప్టిక్ ట్యాంకులను కడిగేదీ, ఆఫీసుల్లో టాయిలెట్లు తుడిచేదీ, ఆస్పత్రుల్లో తోటీ పనులు చేసేదీ 'పాకీ' వాళ్లే.

ఈ వివరాలను సెల్వన్‌కి చూపించినప్పుడు, తనదైన ధోరణిలో -"ఈ ఉద్యోగాలన్నింటిలోనూ మనవాళ్ల గుత్తాధిపత్యం ఇంకా కొనసాగడం బాగోలేదు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించాలి. అదే మన డిమాండ్! లేకపోతే వాళ్ల మనోభావాలు దెబ్బ తింటాయి, పాపం." అన్నాడు.

నూకరాజు ఎప్పటిలాగానే - సీరియస్‌గా -

"అభివృద్ధి, ఆధునికత – అన్నీ భ్రమలేమో అనిపిస్తుంది ఒక్కోసారి. కొత్త రూపాల్లో ఆధిపత్యాలు కొనసాగుతూనే ఉంటాయి మన దేశంలో," అన్నాడు.

అలాగని నిరాశ చెందకుండా – ఈ సమస్యపై పోరాడుతూన్నవాళ్లతో చేతులు కలిపి పీ.ఐ.ఎల్. వేశాడు నూకరాజు. హై కోర్టు స్టే ఇచ్చింది.

"దీని మీద తెలుగు, ఇంగ్లీషులలో పేపర్లు రాద్దాం," అంది ఎల్లమ్మ – నూకరాజుతో.

* * *

ఒక ఆలోచన తడితే దాన్ని వెంటనే అమలుచెయ్యడం సెల్వన్ నైజం. దాడులకు గురవుతూన్నవాళ్లు, ముఖ్యంగా అత్యాచారాలకు గురయ్యే ఆడపిల్లలు తమ ఆత్మరక్షణకై బాక్సింగు, కరాటే, కుంగ్-ఫు వంటి విద్యల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని అతడు నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా వెంకీకి ఫోను చేసి అతని అకాడెమీలో ఈ తర్ఫీదుల్ని చేబడితే బాగుంటుందని సూచించాడు. వెంకటేశు ఎగిరిగంతేశాడు. సెల్వన్, అతని డాక్టర్‌మిత్రుల సహకారాన్ని అందిపుచ్చుకొని వెంకటేశు కొన్ని వందలమంది యువకులకీ, ఆడపిల్లలికీ ఆత్మరక్షణతో బాటుగా ఆత్మస్థైర్యం కలిగించే సత్కార్యాన్ని నిర్వహించాడు. నేటికీ ఆ పనిలోనే ఉన్నాడు. డాక్టర్లతో స్నేహం అతని మెడికల్ షాపుకి ఉపయోగపడింది. వెంకటేశు భార్య బీకాం పూర్తిచేసి అతని వ్యాపార లావాదేవీలను చూసుకోసాగింది.



కొత్త నీరు

నేను యూరాడ కొండని...

జంతువులకూ, వృక్షజాతులకూ ఈ సమస్య తెలియదు. మనుష్యులకే ఇది ప్రత్యేకం. పిల్లల్ని ఎంతవరకూ చెయ్యి పట్టుకొని నడిపించాలి? ఎక్కడ, ఎప్పుడు వొదిలెయ్యాలి? ప్రతీ తరంలోనూ, ప్రతీ తల్లిదండ్రులూ ఈ ప్రశ్నలకు జవాబుల కోసం సతమతమవుతూనే ఉంటారు. నిజానికి అందరికీ వర్తించే సూత్రాలంటూ లేవీ విషయంలో. ఇద్దరు ముగ్గురు బిడ్డలుండే తల్లిదండ్రులకు ఈ రహస్యం ముందుగా తెలిసొస్తుంది. అందర్నీ ఒకేలా పెంచినా, అందరికీ ఒకే పరిస్థితులను, అవకాశాలనూ కల్పించినా ఒక్కో బిడ్డా ఒక్కో రీతిగా, ఒక్కో నిర్దిష్టమైన వ్యక్తిగా రూపొందుతుంది. ఏ సూత్రమూ లేకపోవడమే సర్వత్రా పనిచేసే సూత్రం. నూకరాజు, ఎల్లమ్మల పిల్లల విషయంలో కూడా ఇదే జరిగింది.

* * *

చదువులో అంతంత మాత్రంగానే ఉన్న నూకరాజు పెద్దకొడుకు ఉదయ్, ఇంజినీరింగు చదువుతానని పట్టుబట్టడంతో కర్నాటకలోని ఒక ప్రైవేటు కాలేజీలో – డొనేషన్ కట్టి మరీ – చేర్పించారు. కాలేజీలో అతని మిత్రబృందం అంతా బాగా పులిసి ఉన్నవాళ్లు; ఎక్కువగా తెలుగు వాళ్లు, అగ్ర కులస్థులు. వాళ్లతో సమ ఉజ్జీగా ఉదయ్ కూడా బైక్ మీద తిరిగేవాడు; పార్టీలు, పబ్బులూ, గర్ల్ ఫ్రెండ్సు – అన్ని విధాలా వాళ్లకు దీటుగా ఉండేవాడు. 'షిట్, ఫక్' అంటూ వాళ్లలో ఒకడిగా కలిసిపోయాడు.

తన ఇంజినీరింగు మిత్రులతో నాన్న పెద్ద లాయరనీ, అమ్మ యూనివర్సిటీలో ప్రొఫెసరనీ చెప్పుకొనేవాడుగానీ తాము జాలరులమని ఎవరితోనూ అనలేదు. అలాగే తమకు రిజర్వేషన్లు ఉపయోగపడ్డాయని కూడా ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. విశాఖపట్నం నుండి వచ్చి, అదే కాలేజీలో చేరిన జూనియర్లు కొంతమంది అతని నేపథ్యాన్ని వెల్లడించారు. అప్పటినుండి మిత్రులంతా అతను ఎదురుగాలేనప్పుడు అతని కులంమీద జోకులు వేసుకొనేవారు. అతడిని తమ

గ్రూపునుండి కాస్తంత దూరం పెట్టేవారు. పాపం ఉదయ్ తెలుసుకోలేక పోయాడు. అతని స్నేహితులందరి లాగానే ఉదయ్ జీవితాశయం కూడా ఒకటే – ఏదో విధంగా అమెరికా వెళ్లిపోవడం. ఇందుకుగాను వివిధ ఏర్పాట్లు, ప్రయత్నాలు – రెండో సంవత్సరంలోనే మొదలైపోయాయి.

ఉదయ్ తన జీవితాశయాన్ని వెల్లడించినపుడు, నూకరాజూ, ఎల్లమ్మా విస్తుపోయారు. చాలాసేపు వాగ్వివాదం జరిగింది. చివరకు తల్లిదండ్రులకు ఒక విషయం స్పష్టంగా తెలిసింది. ఉదయ్‌కి తన అమ్మానాన్నల జీవితానుభవంపైనా, వాళ్లు నడిచివచ్చిన మార్గంపైనా ఎటువంటి గౌరవమూ లేదు; పైగా చిన్న చూపు. అవన్నీ కూడా సిగ్గు పడాల్సిన, దాచిపెట్టాల్సిన విషయాలుగా అతని దృష్టికి తోస్తున్నాయి.

రెండు మూడుసార్లు తీవ్రంగా వాదించుకున్నాక, ఇక లాభం లేదని అమెరికా విషయం మాట్లాడడం మానేశారు. వై-టూ-కే ధర్మమా అని పెద్ద కష్టపడకుండానే ఉదయ్ లాంటి నామమాత్రపు ఇంజినీరింగు గ్రాడ్యుయేట్లకి అమెరికా వెళ్లే అవకాశం వచ్చింది. వీసా కూడా వచ్చేసింది.

ఎల్లమ్మ, 'సరే. వాడి కర్మ. ఎలాగైతే అలాగవుతుంది,' అని ఊరుకుందిగానీ. నూకరాజు మాత్రం కొడుకుతో కొన్నాళ్లపాటు మాటలు మానేశాడు. ఒకరోజున ఎల్లమ్మతో –

"భాస్కర్ పేరు వీడికి పెట్టి పెద్ద తప్పు చేశాం" అన్నాడు, బాధపడుతూ.

"పిల్లలికి సరదాకొద్దీ ఎవరెవరివో పేర్లు పెట్టడం, తీరా పెద్దయ్యాక అలా లేరని బాధ పడడం – ఇవన్నీ తల్లిదండ్రులు అత్యుత్సాహంతో చేసే నిర్వాకాలే. వాటికి పిల్లల్ని బాధ్యుల్ని చెయ్యడం, తప్పు పట్టడం సరికాదు," అని కుండ బద్దలుకొట్టింది ఎల్లమ్మ.

మొదట ఎల్లమ్మ మాటలు అతని మనసుకి కష్టంగా తోచినా – వాటిల్లోని వాస్తవికతకుగాను నూకరాజు ఆమెను అభినందించకుండా ఉండలేకపోయాడు. ఆ తరవాతే ఉదయ్‌తో మళ్లీ మాట్లాడడం మొదలుపెట్టాడు.

* * *

శరణ్య తీరు అన్నకి పూర్తిగా భిన్నం. మొదటినుండీ చదువులో బాగా రాణించింది. పుస్తక పఠనం, సాహిత్యం అంటే అభిలాష. ఇంజినీరింగులో తనకు ఆసక్తిలేదని పదవ తరగతిలోనే ప్రకటించింది. చరిత్ర, పురాతత్వశాస్త్రాలలో ఆసక్తి కనబరిచింది. చరిత్ర ప్రధానాంశంగా హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటెగ్రేటెడ్ ఎమ్మే పూర్తి చేసింది. మొదటి స్థానం వచ్చింది. అది ఆమె ఆలోచనల్ని

సమూలంగా మార్చి వేసింది. వామపక్ష విద్యార్థి సంఘాలతో పరిచయాలూ, స్నేహాలూ ఏర్పడ్డాయి. పీ.ఎచ్.డీ. చెయ్యడానికని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చేరింది. దాంతో ఆ మార్పు మరింత ఉధృతం అయింది. రొమిల్లా థాపర్, ఇర్ఫాన్ హబీబ్ వంటి హేమాహేమీల లెక్చర్లకు హాజరు కావడం తన అదృష్టంగా భావించింది. అదే కాలంలో ఆమె పరిశోధకురాలిగా, చరిత్రకారిణిగా, మేధావిగా ఎదిగింది. కళింగాంధ్రలో బౌద్ధధర్మ వ్యాప్తిపై పరిశోధన చేస్తోంది.

శరణ్య విజయాలు ముఖ్యంగా నూకరాజుకెంతో సంతోషాన్ని కలిగించాయి. ఒకసారి సెలవుల్లో దిల్లీనుంచి వచ్చినపుడు ఆమె నూకరాజుకి ఒక సంఘటనను వివరించింది –

"నేను జాలరుల కుటుంబం నుండి వచ్చాననీ, మా నాన్న స్వయంగా సముద్రంలోకి వెళ్లి చేపలు పట్టేవాడనీ, అమ్మమ్మ, మామ్మ – చేపల బజారులో అమ్మకాలు చేసేవారనీ – కొన్ని సందర్భాలలో నా క్లాస్మేట్లకీ, టీచర్లకీ చెప్పాను," శరణ్య తన తల్లిదండ్రులకు ఈ సంగతిని డైనింగ్ టేబిల్ వద్ద అంతా కూర్చున్నప్పుడు వివరించింది. సెలవు మీద వచ్చిన ఉదయ్ కూడా పక్కనే ఉన్నాడు.

"వాళ్లకెందుకే అవన్నీ చెప్పడం – అనవసరంగా?" అని చెల్లెలి మీద చిరాకు పడ్డాడు.

"దాన్ని చెప్పనీరా!...అప్పుడేమైంది?" అని నూకరాజు కుతూహలం ప్రదర్శించాడు.

"దాంతో వాళ్లందరికీ నా మీద గౌరవం పెరిగిపోయింది. అదేపనిగా ప్రశ్నలు అడిగి, బోల్డన్ని వివరాలు రాబట్టారు. నేనెక్కడకెళ్లినా – నన్ను బాగా చూసుకొనేవారు. 'మా శరణ్య ఎవరనుకుంటున్నారు? జాలరి. ఆమె తండ్రి లాయరుగా మారిన జాలరి. స్వయంగా సముద్రంలోకి వెళ్లి చేపలుపట్టేవాడు, తెలుసా?' అని కొత్త వాళ్లకు గర్వంగా పరిచయం చేస్తారిప్పుడు." సుమారు ముప్పై ఏళ్ల క్రిందట –

'రాజూ! నువ్వు నిజమైన శ్రామికుడివి; ప్రజల మనిషివి. స్వయంగా సముద్రంలోకి వెళ్లి చేపలు పట్టిన వాడివి. ప్రాణానికి ప్రాణం ఇవ్వడం తెలిసిన వాడివి. నీతో చూస్తే నేనొట్టి పుస్తకాల పురుగుని,' అంటూ చాలా ఉద్వేగంగా భాస్కర్ అన్న మాటలు గుర్తుకొచ్చాయి, నూకరాజుకి.

"శ్రమను గౌరవించే అట్లాంటి మేధావులు ఇప్పుడుకూడా ఉన్నారంటే అది సంతోషించవలసిన విషయం," అన్నాడు నూకరాజు కూతురితో. అతని గొంతు జీరబోయింది.

"ఎందుకు లేరు, నాన్నా? చాలా మందే ఉన్నారు," అన్నది శరణ్య, తండ్రి ఉద్వేగానికి కొంచెం ఆశ్చర్యపడుతూ.

'ఈ తండ్రీ కూతుళ్ల ఎమోషనల్ సీన్ చూడలేకపోతున్నాం' అనుకుంటూ ఉదయ్ విసుగ్గా లేచి అక్కడినుంచి వెళ్లిపోయాడు. టీవీ ఆన్ చేసి ఎప్పుడో అయిపోయిన క్రికెట్ మాచ్ ని మళ్లీ చూడనారంభించాడు.

అక్కడున్నవారిలో ఎల్లమ్మకి మాత్రమే ఈ సంభాషణకున్న ప్రాముఖ్యత పూర్తిగా తెలుసు.

* * *

విశాఖనగరంలోని ట్రేడ్ యూనియన్లు చాలా వరకూ వివిధ వర్ణాల ఎర్ర జెండాల చేతుల్లో ఉన్నాయి. వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి రొయ్యల నాయుడి వర్గాలు విశ్వప్రయత్నం చేశాయి; అడ్డదారులు తొక్కాయి; అవసరం అని తోచినప్పుడల్లా భౌతిక దాడులకు కూడా వెనకాడలేదు. ట్రాలర్ కార్మికుల సంఘం మెరుగైన వేతనాల కోసం, పని పరిస్థితుల కోసం సమ్మె చేసినప్పుడు యజమానులు నూకరాజుపై కక్ష కట్టారు. యాజమాన్య సంఘానికి పెద్దగా ఉన్న రొయ్యల నాయుడు, సింహాచలం సహకారంతో నూకరాజు వివరాలు సేకరించాడు. తమ ఆధీనంలో ఉన్న పత్రికల్లో అతన్ని అదే పనిగా టార్గెట్ చేశారు. 'నూకరాజుకి తీవ్రవాదులతో సంబంధాలున్నాయి' అన్నారు.

ఒక రాత్రిపూట, బాగా లేటవుతోందని డ్రైవర్ని పంపించేసి, తానే డ్రైవ్ చేసుకుంటూ, ఫిషింగ్ హార్బరు నుండి ఎం.వీ.పీ. కోలనీలో కొత్తగా కొనుక్కున్న ఇంటికి బయల్దేరాడు నూకరాజు. బైక్‌ల మీద నలుగురు వ్యక్తులు అతన్ని దాటి ముందుకి వెళ్లారు. బీచ్ రోడ్డు మీద మాటు కాసి, ముఖాలకు గుడ్డలు కట్టుకున్న ఆ గూండాలు, రామకృష్ణా మిషన్ వద్ద ఆపి నూకరాజుని బయటకులాగి, కర్రలతో కొట్టారు. ఇది 'జాగ్రత్త! ఇది మొదటి వార్నింగ్' అన్నారు. తలకి పెద్ద గాయం అయింది. కే.జీ.ఎచ్.లో ఎడ్మిట్ అయ్యాడు. ఈ సంఘటనతో కార్మికులు మరింత బిగిసిపోయారు. విశాఖ పారిశ్రామిక సంఘాలే కాకుండా దేశవ్యాప్తంగా వివిధ యూనియన్లు, ముఖ్యంగా మత్స్యకారుల సంఘాలు దాడిని ఖండించాయి. నూకరాజుకి అప్పటికే ఉన్న పేరు ప్రతిష్టలు అతనికి తోడ్పడ్డాయి. సమ్మె విజయవంతం అయింది. చర్చల్లో పాల్గొన్న ఇరు పక్షాలకు నూకరాజు, రొయ్యల నాయుడు నాయకులుగా వ్యవహరించారు. తన మీద జరిగిన దాడి వెనక రొయ్యల నాయుడి ప్రత్యక్ష పాత్ర ఉన్నట్లు నూకరాజుకి రూఢిగా తెలిసింది కానీ తగిన సాక్ష్యాధారాలు లభించలేదు. ఈ సంఘటన జరిగి రెండేళ్లవుతోంది.

బాగా డబ్బు చేసుకున్నవాళ్లంతా 'ఆ...డబ్బుదేముంది? ఇవాళ ఉంటుంది, రేపు పోతుంది' అంటూ ఉంటారు. వాళ్ల దృష్టి పదవులు, బిరుదులు, అవార్డులు, సన్మానాలు, విగ్రహాలు – వీటి పైకి మళ్లుతుంది. చచ్చాక కూడా బ్రతకాలనే ఆశతో

సమాజపు ఆమోదం కోసం వెంపర్లాడతారు. ప్రచారం బాగుంటుందంటే దానధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు. వాళ్ల చుట్టూచేరే భజన బృందాన్ని పోషిస్తారు. రొయ్యల నాయుడు ఈ దశకు చేరుకున్నాడు. ట్రాలర్లు, ఎగుమతులు, పరిశ్రమలు, కాంట్రాక్టుల యాజమాన్యం కొడుకులకు అప్పగించి, వాటాలు మాత్రం తన వద్దనే ఉంచుకొని, పూర్వాశ్రమంలో తానొక ప్రొఫెసర్నని అందరికీ గుర్తుచేస్తూ ప్రముఖ విద్యావేత్తగా అవతరించాడు. వైద్య, విద్యావ్యాపారాలకి ఉన్నంత గౌరవనీయమైన స్థానం ఇంకే వ్యాపారానికీ లేదని అతనికి తెలుసు. అస్మదీయుల సహకారంతో రాజ్యసభ సభ్యుడయ్యాడు. గౌరవప్రదమైన జీవనానికి ఏర్పాట్లు చేసుకున్నాడు.

* * *

నూకరాజూ, రొయ్యల నాయుడూ ఒకే ఫ్లైట్లో దిల్లీ వెళ్లాల్సిన సందర్భం వచ్చింది. నాయుడు పార్లమెంటు శీతాకాల సమావేశాలకీ, నూకరాజు మత్స్యకారుల సమస్యలపై అంతర్జాతీయ సదస్సుకీ వెళ్తున్నారు. విశాఖ ఎయిర్ పోర్టులో ఒకరికొకరు ఎదురుపడ్డారు. రొయ్యల నాయుడు నవ్వు మొహంతో నూకరాజుని పలకరించాడు.

"ఏమయ్యా నూకరాజూ! దిల్లీ వెళ్తున్నావా?...ఏమిటి విశేషం?...అవునూ, నువ్వు మా సింహాచలానికి దగ్గర చుట్టానివట కదా? నాకిన్నాళ్లూ తెలియలేదు," అంటూ పక్కన కూర్చోమని సైగ చేశాడు.

నూకరాజుకి మండిపోయింది. 'నన్ను గూండాలతో కొట్టించిన మనిషి. వీడికన్నీతెలుసు. ఏమీ తెలియనట్టుగా వేషాలేస్తున్నాడు. మా సింహాచలం అట! – దానర్థం ఏమిటో? పైగా నన్ను తక్కువ చెయ్యడానికి ఏకవచన ప్రయోగం చేస్తూ నువ్వు అంటున్నాడు.' అనుకున్నాడు. 'వీడికి తగిన శాస్తి చెయ్యాలి' అని నిశ్చయించుకున్నాడు.

"నా సంగతి సరే, నువ్వేమిటిలా బయల్దేరావు? ఓ...అవును, పార్లమెంట్ సెషన్ ఉందికదా?" అనేశాడు.

తన వంటి పెద్దమనిషిని పట్టుకొని, ఒక అణాకాణీ జాలరి వెధవ 'నువ్వు' అనేస్తాడా? – నాయుడు తట్టుకోలేకపోయాడు. పైగా అతని పీయ్యే, కొంతమంది బిజినెస్ మిత్రులూ పక్కనే ఉన్నారు.

"అబ్బో! చాలా పెద్దవాడివైపోయావు!" అన్నాడు వెటకారంగా.

"నాదేముందిలే గానీ, చూస్తుండగానే నువ్వు ఎంత పెద్దవాడివైపోయావో, ఎలా అయిపోయావో ఊళ్లో అందరికీ తెలుసు," అన్నాడు నూకరాజు.

"ఇంతకీ దిల్లీలో ఏం పని? ఎన్నాళ్లుంటావు? మా గెస్ట్ హౌస్‌లో ఉందువుగాని నాతో రా," అని రూటు మార్చాడు నాయుడు.

తాను వెళ్తున్న సమావేశం గురించి చెప్పాడు నూకరాజు. వాళ్లే ఉండడానికి ఏర్పాటు చేస్తున్నారన్నాడు.

"అక్కడ కూడా ఎర్ర జెండా ఎగరేస్తావా? మీ వాళ్లే కేరళలో ట్రాలర్ వ్యాపారాన్ని ముంచేశారు. చూస్తూ ఊరుకుంటే ఈస్టు కోస్టుని కూడా నాశనం చేస్తారు," రొయ్యల నాయుడు విషం వెళ్లగక్కాడు.

నూకరాజు పరమశాంతంగా –

"కేరళలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. అది పక్కన పెట్టు. నేను రేపు మాట్లాడబోయే అంశం గురించి చెబుతాను, పూర్తిగా విను. యూరోపియన్ యూనియన్లో, ముఖ్యంగా నార్వేలో మత్స్యకారులకి ఉన్న సదుపాయాలు, జీతభత్యాలు, భద్రత, బీమా సౌకర్యం – ఇవన్నీ ఇక్కడ మనవాళ్లకి కూడా కల్పించమని అడగబోతున్నాను. ఆ దేశాల్లో ఉన్నది పెట్టుబడీదారీ వ్యవస్థ అయినప్పటికీ జాలరులను చక్కగా చూసుకుంటోంది. అదే ఇక్కడ కూడా ప్రవేశపెట్టమని డిమాండ్ చేస్తున్నాం. ఆ మాత్రం దానికి ఎర్ర జెండా అవసరం లేదు," అన్నాడు.

"ఏం మాట్లాడుతున్నావు...అర్థంపర్థం లేకుండా? నార్వే ఎక్కడ? మనం ఎక్కడ? అసలక్కడ ఎట్లా ఉంటుందో నీకేమైనా ఐడియా ఉందా?" అన్నాడు, నాయుడు అసహనంగా.

"నాకన్నీ తెలుసు. క్రిందటేడాది ఒక అధ్యయన బృందంతో బాటు ఆ దేశాలన్నీ తిరిగొచ్చాను. ఒక మాట చెప్పు. మీరంతా రొయ్యల్నీ, చేపల్నీ అంతర్జాతీయ మార్కెట్లో అమ్ముకుంటున్నారా, లేదా? డాలర్లు దొబ్బుకొస్తున్నారా, లేదా? బ్యాంకులో వేసుకుంటున్నారా, లేదా? అటువంటప్పుడు మీ ఉద్యోగులకి అదే అంతర్జాతీయ స్థాయిలో జీతాలూ, సదుపాయాలూ, భద్రతా ఎందుకు కల్పించలేరు?" అని నిలదీసాడు.

'పొగరుమోతు జాలారి వెధవ! వీడి నోట్లో నోరు పెట్టడమే పెద్ద పొరబాటు' అనుకుంటూ పీయ్యేని –

"ఫ్లైట్ డీలే అయినట్టుంది, కనుక్కో..వీ.ఐ.పీ. లౌంజిలో ఉంటాను," అని లేచి వెళ్లిపోయాడు.

మరి కాసేపట్లో - ఫ్లైట్ స్టేటస్ బాస్‌కి తెలియపరచడం కోసం పీయ్యే వీ.ఐ.పీ. లౌంజిలోకి వెళ్లాడు. పేపర్లు చూస్తున్న రొయ్యల నాయుడితో 'ఇంకో గంట పడుతుంది సార్' అన్నాడు.

నాయుడు విసుక్కున్నాడు.

ఒక్క క్షణం తటపటాయించాక - పీయ్యే అతని పక్కనే కూర్చొని, చెవిలో,

"ఈ జాలారోడితో మాచెడ్డ న్యూసెన్సుగా ఉంది సార్! ప్రతీ దానికీ అడ్డం పడతన్నాడు. మీరో మాట అనండి, మనోళ్లు చూసుకుంటూరు," అన్నాడు.

నాయుడు మనోహరంగా నవ్వి, "నీకన్నిటికీ తొందరేనయ్యా పంతులూ! ఆ టైము రానీ," అని మళ్లీ పేపర్లో మునిగిపోయాడు.

* * *

దిల్లీలో రెండు రోజుల కాన్ఫరెన్సు బాగా జరిగింది. వివిధ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు ఎన్నో కొత్త విషయాలు చెప్పారు. కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. కార్యాచరణకు ప్రణాళికను రూపొందించుకున్నారు. నూకరాజు ఉపన్యాసానికి మంచి స్పందన వచ్చింది. అతనిలో నూతనోత్సాహం వెల్లివిరిసింది.

మర్నాడు ముందుగా ప్లాన్ చేసినట్లుగా శరణ్యతో ఒక రోజు గడుపుదామని సాయంత్రం ఆమె యూనివర్సిటీకి వెళ్లాడు. కాంటీన్‌లో కలుసుకున్నారు. చుట్టూ పచ్చని చెట్లు. గూళ్లకు తిరిగివస్తున్న పక్షుల కోలాహలం. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. యువతీ యువకుల నవ్వులూ, కేరింతలతో సందడిగా ఉంది. వాళ్లను చూస్తూంటే తన వయస్సు ఎంత పెరిగిపోయిందో తెలుస్తోంది. కూర్చోగానే –

"తొట్లకొండ మీద కబ్జాలని నిలుపుజెయ్యడానికని వేసిన పీ.ఐ.ఎల్. ఏమైంది నాన్నా?" శరణ్ అడిగింది. ప్రాచీన బౌద్ధ క్షేత్రాలనీ, ఇతర వారసత్వ సంపదనీ పరిరక్షించుకోవడంపై శరణ్యకి ఆసక్తి మెండు.

"మొన్ననే హై కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది,"

"ఎక్సెలెంట్!"

"మళ్లీ మర్చిపోతాను," అంటూ గంగమ్మ, పోలమ్మలు పంపిన చిరుతిళ్లను నూకరాజు శరణ్‌కి అందజేసాడు.

ప్యాకెట్లు తీసుకుంటూ, "చాలా మోసుకొచ్చావు, నాన్నా! ఇంకో రెండు మూడు వారాల్లో ఎలాగూ ఇంటికి వచ్చేస్తాను కదా?" అంది శరణ్, విసుగ్గా.

"మీ అమ్మమ్మా, మామ్మా నా మాట వింటారా? తినలేకపోతే మీ ఫ్రెండ్సుకి పంచు. ఎలా ఉన్నావు? నీ ఆరోగ్యం ఎలా ఉంది? బాగా చిక్కిపోయావు,".

"నా ఆరోగ్యానికేం, బాగానే ఉన్నాను. నేనేం చిక్కిపోలేదులే గాని సెలవుల్లో పెరిగిన బరువు అతికష్టం మీద తగ్గాను. అయినా అమ్మా, నువ్వూ ఎప్పుడూ అదే మాటంటారు. ఫ్రెండ్సు చాలామందే ఉన్నారులే పంచడానికి. నీకో మాట చెప్పాలి. నా బెస్టు ఫ్రెండు ఒకతనిప్పుడు మనల్ని డిన్నర్‌కి రమ్మన్నాడు. అతని పేరు సిద్ధార్థ్. నాకు

రెండేళ్లు సీనియర్. సోషియాలజీలో రిసెర్చి పూర్తి చేసాడు. మరో రెండు నెలల్లో పోస్ట్-డాక్టరల్ స్టడీస్‌కి హాలెండు వెళ్తున్నాడు. నేనూ అతనూ స్టూడెంట్ కౌన్సిల్ మెంబర్లుగా, యూనియన్లో విద్యార్థి ప్రతినిధులుగా కలిసి పనిచేసాం. అలాగే మామధ్య స్నేహం ఏర్పడింది."

"అలాగా? తప్పకుండా అతన్ని కలుద్దాం. నీ రిసెర్చి ఎంతవరకూ వచ్చింది?" అని బయటకు అన్నాడు గానీ అతని తండ్రి హృదయాన్ని సిద్ధార్థ్ ప్రస్తావన తాకింది. 'శరణ్ తన మొగ స్నేహితుల ప్రస్తావన తీసుకురావడం ఇదే తొలిసారి. అతడు మాత్రం నన్ను కలుసుకోవాలని ఎందుకు అనుకుంటున్నాడు? శరణ్ ప్రోత్సాహం కూడా ఉన్నట్లుగానే ఉంది' నూకరాజు ఆలోచనలు ముందుకి పరుగెత్తుతున్నాయి.

"బాగా నడుస్తోంది. ఫీల్డ్ వర్క్, డేటా కలెక్షన్ అయిపోయాయి. థీసిస్ రాయడం మొదలుపెట్టాను. మరో ఆరు నెలల్లో నా గైడ్ అమెరికా వెళ్లిపోతుంది. ఈ లోగా మొదటి డ్రాఫ్ట్, కనీసం ముఖ్యమైన ఛాప్టర్లు వ్రాయడం పూర్తిచెయ్యాలని అనుకుంటున్నాను."

"వెరీ గుడ్," అన్నాడు నూకరాజు.

తన పరిశోధన ఫలానా గడవుతో ముగియబోతున్నదని శరణ్ చెప్పడం ఇదే మొదటిసారి. భారతదేశపు అత్యుత్తమ యూనివర్సిటీలలో ఒకటైన జే.ఎన్.యూ.లో కూతురు పీ.ఎచ్.డీ. పూర్తి చేసే శుభదినం దగ్గరలోనే ఉందంటే అతనిలో ఆనందం ఉరకలువేసింది. ఈరోజే ఎల్లమ్మకి ఫోన్ చేసి చెప్పాలి అనుకున్నాడు. సరిగ్గా అప్పుడే శరణ్ బాంబు పేల్చింది.

"ఇంకో విషయం కూడా చెప్పాలి. నేనూ సిద్ధార్థ్ ఆరు నెలలుగా అతని ఫ్లాట్‌లో కలిసి ఉంటున్నాం",

నూకరాజు ఖంగు తిన్నాడు. ఏమనాలో తెలియక, "అంటే నువ్విప్పుడు హాస్టల్లో ఉండడం లేదా? రూము ఖాళీ చేశావా?" అన్నాడు, కాస్త తడబడుతూ.

"రూము అలానే ఉందిగానీ, ఇక్కడ ఉండేది తక్కువ. దగ్గరలోనే సిద్ధార్థ్ ఫ్లాటు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు."

"ఆరు నెలల బట్టీ అన్నావు. అంటే క్రిందటిసారి నువ్వు సెలవులికి ఇంటికి వచ్చినప్పుడు..." అని ఆగిపోయాడు.

'అప్పుడు మాకీ విషయం ఎందుకు చెప్పలేదు? ఇద్దరూ ఒకే ఫ్లాట్లో ఉంటున్నారంటే ఏమనుకోవాలి? ఎంత ఫ్రెండయితే మాత్రం రోజూ యూనివర్సిటీలో కలుసుకోవచ్చు కదా? అది సరిపోదా?...' ఇవన్నీ అడుగుదామని అనుకున్నాడు గానీ అతనికే స్పష్టత లేదు – ఏది అడగాలో, ఏది అడగకూడదో. 'పక్కన ఎల్లమ్మ ఉంటే

బాగుండు' అనుకున్నాడు. 'తల్లి ఎదుట ఇలా, ఇంత నిస్సంకోచంగా మాట్లాడేది కాదేమో?' అని కూడా అనుకున్నాడు. తండ్రి ఇబ్బంది పడుతున్నాడని శరణ్ గ్రహించింది.

"అవును. అప్పటికే కలిసి ఉంటున్నాం. అయినా ఇవన్నీ ఈ రోజుల్లో మమూలే నాన్నా. అది ఎటు దారితీస్తుందో అప్పుడు మాకే తెలీదు. అందుకే మీకు చెప్పలేదు."

"మరిప్పుడు ఏమనుకుంటున్నారు?"

"పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాం. అతని పీ.ఎచ్.డీ. మొన్ననే పూర్తయింది. అందాకా ఆగాలని అనుకున్నాం కాబట్టి ఇప్పుడు చెప్తున్నాను. ఎలాగూ దిల్లీ వచ్చావు కదా? నువ్వు ముందుగా ఒకసారి అతన్ని కలిస్తే బాగుంటుందని...." శరణ్ లేచి కౌంటర్ వద్దకు వెళ్లి ఒక ప్లేట్లో రెండు సమోసాలూ, పేపర్ కప్పుల్లో టీ, మంచినీళ్ల బాటిల్స్ – ట్రేలో పెట్టి తీసుకొచ్చింది.

చాలా సమాచారాన్ని తక్కువ సమయంలో దట్టించడం వలన నూకరాజు తండ్రి పాత్రలో కాసేపు తబ్బిబ్బయ్యాడు గానీ మరి కొద్దిసేపట్లోనే అతని లాయరు తెలివి మేలుకుంది.

ఎదురుగా కూర్చొని, "ఇక్కడ సమోసాలు బాగుంటాయి" అంది కూల్‌గా.

కూతురు ధైర్య సాహసాలను మనసులోనే మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు, నూకరాజు. 'ఏంతైనా జాలరుల పిల్ల, ఎల్లమ్మ కూతురు, గంగమ్మ మనవరాలు,' అనుకున్నాడు.

"సిద్ధార్థ్ ఎక్కడి వాడు? అమ్మా, నాన్నా ఎక్కడుంటారు? ఏం చేస్తుంటారు?"

"అతను మలయాళీ. నాన్న స్వీడెన్లో ఇండియన్ అంబాసడర్‌గా పనిచేస్తున్నాడు. అమ్మా, నాన్నా విదేశాల్లో ఉండడం మూలాన, సిద్ధార్థ్ ఆంధ్రప్రదేశ్‌లోనే, రిషి వేలీ స్కూల్లో చదువుకున్నాడు." 'హమ్మయ్య' అనుకున్నాడు నూకరాజు. బాగా చదువుకున్నవాళ్లు. మంచి పొజిషన్లలో ఉన్నవాళ్లు. కల్చర్డ్ ఫ్యామిలీ అయి ఉంటారు. ఇంకా ఏదో అడగబోయాడు. శరణ్ దృష్టి కేంటీన్ బయట ఉన్న పార్కింగు వైపు మళ్లిందని గమనించాడు.

"అదిగో, వచ్చేశాడు!" అంది శరణ్.

సన్నగా, పొడుగ్గా ఉన్న యువకుడొకడు మారుతి కారులోంచి దిగాడు. జీన్సు, టీషర్టు, స్నీకర్స్. అతనిలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. తండ్రీ, కూతురూ కూర్చున్న టేబిలు వద్దకు వచ్చాడు.

"సిద్ధార్థ్! మీట్ మై ఫాదర్" అంది శరణ్.

"సిద్ధార్థ్ నాయర్!...ప్లీజ్డ్ టు మీట్ యూ సర్!" అని చెయ్యందించి, చిరునవ్వు చిందిస్తూ, దృఢంగా హేండ్ షేక్ చేశాడు, రవ్వంతైనా ముందుకి వంగకుండా, నిటారుగా.

"నాకు తెలుగూ కొంచెం వస్తుందీ, అంకుల్. నేను ఆంధ్రాలోనే బోర్డింగ్ స్కూల్లో చదువుకున్నాను. మై ఫాదర్ స్పీక్స్ ఫ్లూయంట్ తెలుగు. డిప్లొమాటిక్ సర్వీస్‌లో ఉండడం వలన రష్యన్, ఫ్రెంచి, స్పానిష్ కూడా బాగా మాట్లాడతారు డాడీ," అన్నాడు.

కొంతమంది తొలి కలయికలోనే మంచి అభిప్రాయం కలుగజేస్తారు. 'వీళ్లకీ మనకీ నప్పుతుంది' అనిపిస్తుంది. తక్కువ సమయంలోనే వాళ్లతో నిస్సంకోచంగా మనసు విప్పి మాట్లాడతాం; జీవితగాథలను పంచుకుంటాం; వ్యక్తిగత విషయాలను చర్చిస్తాం; వాళ్ల అభిప్రాయాలను గౌరవిస్తాం. సిద్ధార్థ్‌లో ఈ లక్షణాలు మెండుగా కనిపించాయి నూకరాజుకి. ముఖ్యంగా సిద్ధార్థ్ నవ్వినప్పుడు, ఎక్కడో చూసినట్లుగా, ఎప్పటినుండో స్నేహం ఉన్న వ్యక్తిలా నూకరాజుకి అనిపించాడు. అక్కడి నుండీ వాళ్ల సంభాషణ ఇంగ్లీషులోనే సాగింది.

"మీ నాన్నగారికి తెలుగు ఎలా పట్టుబడింది?"

"డాడీస్ మదర్ – తెలుగామె. అంతేకాదు, డాడీ వైజాగ్‌లో ఇంజినీరింగ్ చేశారు. ఏయూ కాలేజ్‌లో. ఆ తరవాత ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కి సెలెక్టయ్యారు. డాడీ వైజాగ్ గురించి తరచూ చెప్తూంటారు. చాలా సుందరమైన నగరం; స్పానిష్ మెడిటెరేనియన్ టౌన్స్‌లాగా ఉంటుంది అంటారు. నేను కూడా శరణ్‌తో కలిసి వైజాగ్ రావాలని అనుకుంటున్నాను, వచ్చే నెలలో. డాడీ కాలేజీ రోజులు అక్కడ గడిచాయి మరి. తీరం వెంబడే భీమిలి వెళ్లే రోడ్డు, డాల్ఫిన్స్ నోస్ కొండ - వీటి గురించి కూడా చెప్తూ ఉంటారు."

"అవును. అది యారాడ కొండ. ఇంతకీ మీ నాన్నగారి పేరు?"

"గిరిధరన్ నాయర్" నూకరాజు తల గిర్రున తిరిగింది. 'గిరిధరన్ నాయర్! తల్లి తెలుగామె. తండ్రి మలయాళీ...గిరిధర్!! ఎప్పటి గిరిధర్? ముప్పై ఏళ్లవుతుందా? అవును కచ్చితంగా! అందుకే సిద్ధార్థ్‌ని చూడగానే ఎక్కడో చూసినట్లు అనిపించింది. ఆ నవ్వు – అచ్చం అతని నాన్నలాగానే'.

నూకరాజు నెమ్మదిగా కుర్చీలో కూర్చుండిపోయాడు. తల తిరుగుతోంది. 'ఒకే రోజున రెండు ఊహించని సంఘటనలు. మొదట శరణ్ బలమైన దెబ్బ కొట్టింది; ఇంకా తేరుకోకముందే మరో దెబ్బ – ఈ సిద్ధార్థ్...అసలేం జరుగుతోంది?' తలను అరచేతుల్లో పెట్టుకొని టేబిల్ మీదకి వాలిపోయాడు.

"నాన్నా! ఏమైంది?" శరణ్ అరిచింది. కేంటీన్‌లో కూర్చున్నవాళ్లంతా ఇటుగా చూశారు.

"వాట్ హేపెండ్ అంకుల్? షల్ ఐ కాల్ ద ఏంబ్యులెన్స్?" అన్నాడు సిద్ధార్థ్ – కంగారుగా.

అవసరం లేదన్నట్లు నూకరాజు చేత్తోనే సైగచేశాడు. రెండు నిమిషాలాగి గుక్కెడు మంచినీళ్లు త్రాగాడు.

అయిదు నిమిషాలు గడిచాయి. సిద్ధార్థ్ గబగబా బయటకు నడిచి కారుని గుమ్మం వద్ద పార్క్ చేసి, మళ్లీ లోపలికి వచ్చాడు.

"కేంపస్ క్లినిక్కి తీసుకెళతాను, కూర్చోండి," అంటూ నూకరాజు రెక్కపట్టుకొని లేపాడు.

నూకరాజు సులభంగానే లేచి నిలబడ్డాడు. చిన్నగా నవ్వుతూ సిద్ధార్థ్‌ని కౌగలించుకున్నాడు. సిద్ధార్థ్ నూకరాజు భుజం తట్టాడు. మరి కాసేపట్లో కారు వద్దకు ముగ్గురూ నడిచారు.

"ఆర్ యూ ఆల్రైట్, అంకుల్?" అని అడిగాడు సిద్ధార్థ్ కారెక్కుతూ.

"ఇవాళ్టి దినం నా జీవితంలో అత్యంత ఆనందకరమైనదీ, మర్చిపోలేనిదీను. డిన్నర్‌కి ఎక్కడికో తీసుకెళ్తానని అన్నావటగా? తొందరగా పద మరి. మనం మాట్లాడుకోవాల్సినవి చాలా ఉన్నాయి," అన్నాడు హుషారుగా – నూకరాజు, డ్రైవరు పక్క సీట్లో కూర్చుంటూ.

"దగ్గరలోనే – మంచి రెస్టారెంటు ఒకటి ఉంది. శరణ్, నేనూ తరచూ అక్కడికి వెళ్తూంటాం. మీరు చైనీస్ తింటారు కదా?" అంటూ సిద్ధార్థ్ ఇంజిన్ స్టార్టు చేశాడు.

"ఏదైనా ఫరవాలేదు. బీరు దొరుకుతుంది కదా? మొదట నీకు మీ నాన్న గురించి చెప్తాను. లెట్ అజ్ సెలబ్రేట్!" అన్నాడు నూకరాజు నవ్వుతూ. సిద్ధార్థ్‌కీ, వెనక సీట్లో కూర్చున్న శరణ్‌కీ ఏమీ అర్థం కాలేదు.

"ఓ యెస్. అక్కడ ఆల్కహాల్ సెర్వ్ చేస్తారు," అన్నాడు సిద్ధార్థ్ సంశయాత్మకంగా. అతనికి కూడా ఏం జరుగుతోందో తెలియలేదు.

కొంత దూరం వెళ్లాక, సిద్ధార్థ – శరణ్యని ఉద్దేశించి, "శరణ్, కారు ఇంట్లో పెట్టి టేక్సీలో రెస్టారెంటుకి వెళ్దాం, ఎందుకైనా మంచిది. ఈ మధ్య పోలీసుల చెకింగ్ కూడా ఎక్కువయింది. ఏమంటావు?" అన్నాడు.

"ఓ యెస్. గుడ్ ఐడియా" అంది, శరణ్.

'అబ్బో, ఈ సిద్ధార్థ జాగ్రత్తపరుడే; అనవసరమైన రిస్కులు తీసుకొనే రకం

కాదు. పైగా శరణ్యకీ, సిద్ధార్థకీ మధ్య మంచి సఖ్యత ఏర్పడినట్టుగా ఉంది' అని సంబరపడ్డాడు, నూకరాజు.

'హోటల్‌కి వెళ్లగానే ఎల్లమ్మకి ఫోను చేసి ఈ శుభవార్త చెప్పాలి' అనుకున్నాడు.



ఉపసంహారం

ఇంతవరకూ మీరు చదివిన కథ నిజంగా జరిగిందా అని అడుగుతున్నారు కదూ? ఈ కథలో ప్రస్తావించిన చారిత్రక సంఘటనలు, సందర్భాలు, వాస్తవాలు – ఇవన్నీ జరిగినవే. పాత్రలు, సన్నివేశాలు మాత్రం కల్పించినవి. జాలరుల పడవ ప్రమాదానికి గురికాకపోయి ఉంటే ఈ కథకు ఆస్కారం ఉండేదికాదు అని అప్పట్లో కొందరన్నారు. 'గాలివాన రాకపోతే కథే లేదు' అని విమర్శకులు చమత్కరించారు. ఇవేవీ పెద్ద సంగతులు కావు గానీ, ఒక విషయం చెబుతాను.

నేను చెప్పబోయేది మానవ సమాజానికే కాదు, ప్రకృతికి కూడా వర్తిస్తుంది: బాహ్య పరిస్థితులలో సంసిద్ధత, పరిపక్వత ఉన్నప్పుడు ఒకేఒక సంఘటన మొత్తం వ్యవస్థను తారుమారు చేస్తుంది. సుమారు వందేళ్ల క్రితం, ఈ రచన వెలువడిన కాలంలోనే ఒక అంటువ్యాధి ప్రపంచమంతటా వ్యాపించి మొత్తం మానవజాతి నాశనం కాగల పరిస్థితిని తీసుకొచ్చింది. ఆ వ్యాధి ప్రకోపించడానికి మనుషులు చెయ్యగలిగిందంతా చేశారు. వ్యాప్తికి తోడ్పడగల అన్ని పరిస్థితులనూ మనుషులే సిద్ధం చేసి ఉంచారు. తీరా అది వ్యాపిస్తూంటే లబోదిబోమన్నారు. మానవజాతి అంతమైతే మాత్రం ఏం మించిపోతుంది? ఎన్నెన్ని వృక్షజాతులూ, జీవజాతులూ ఈ భూమ్మీద అవతరించి, అంతరించిపోలేదు? రాకాసి బల్లుల అంతర్ధానమే తీసుకుందాం. ఒకే ఒక ఉల్కాపాతం వాటిని అంతం చేసిందా లేదా? అంతవరకూ ఎందుకు? ఒక విత్తనం మొలకెత్తి మొక్కగా ఎదగాలంటే తగిన భూసారం ఉండాలి, ఋతువు సరైనది అయి ఉండాలి. అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడు గాలివాటానికి ఎగిరివచ్చిన చిన్న విత్తు ఎదిగి మహావృక్షంగా మారడం ప్రకృతిలో నిత్యకృత్యం. అందుచేత పుట్టుక, వ్యాప్తి, వినాశనం - ఇవన్నీ పరిస్థితులు సానుకూలంగా ఉన్నంతకాలం కొనసాగుతూనే ఉంటాయి.

చివరిగా ఒక మాట. ఈ రచనలో ప్రస్తావించిన జాలారిపేట, చెంగల్రావుపేట, సోల్జరుపేట – ఇంకా ఇతర ప్రదేశాలూ అలాగే ఉన్నాయా? మేము వెళ్లి చూడవచ్చా?

అని కొందరు అడుగుతున్నారు. అవేవీ ఇప్పుడు లేవు. వాటి ఆనవాళ్లు కూడా లేవు. సముద్రమట్టం పెరిగి ఆ మూడు పేటలూ పూర్తిగా మునిగిపోయాయి. సగం వరకూ సముద్రంలో మునిగిపోయి నేనున్నాను. నా ముక్కు పుడక డాల్ఫిన్ను నోస్ లైట్ హవును కట్టడం మాత్రం ఇంకా ఉంది. పర్యాటకులకు అదిప్పుడొక ఆకర్షణ. అప్పుడప్పుడు సందర్శకులు వస్తూంటారు. అక్కడి నుంచి చూస్తే మెట్ట ప్రాంతాలకు తరలిపోయిన కొత్త విశాఖపట్నం, కాలుష్యం తక్కువగా ఉన్నరోజుల్లో దూరంగా, మసగ్గా కనిపిస్తుంది.

ఈ కథ ఇంతటితో ముగిసింది గానీ కాలం ముందుకి పరుగెత్తుతూనే ఉంటుంది. కొత్త తరాలను, కొత్త సన్నివేశాలను, సంఘర్షణలను రంగం మీదకి తీసుకొస్తూనే ఉంటుంది. తమ పాత్రలను తాము పోషించాక మనుష్యులు వెళ్లిపోతారు. కొత్త నటీనటవర్గం వస్తూనే ఉంటారు. మొత్తం నాటకాన్ని ఆద్యంతం చూసినవారెవరూ లేరు, నేను తప్ప. ఇది ఏకకాలంలో విషాదమూ, సముచితమూ కూడా అనిపిస్తుంది నాకు.

భవిష్యత్తులో ఇటువంటి సందర్భం ఏదైనా వస్తే మళ్లీ కలుసుకుందాం. నేనిక్కడే, ఇలానే ఉంటాను, నిశ్చలంగా; పరిసరాలను పరికిస్తూ, మానవ నైజాన్ని ఒక కంట కనిపెడుతూ.

దిగంతాలకు విస్తరించిన మహాసముద్రం సకల జీవజాతులకూ మూలాధారమై నిలుస్తూ, ఎల్లప్పుడూ నా కళ్లెదుట తాండవమాడుతూ ఇలానే ఉంటుంది... నిరంతరంగా ఘోషిస్తూ, చిత్తం వచ్చినట్లుగా ఎప్పటికప్పుడు మారిపోతూ – ఉల్లాసంగా అల్లరిచేస్తూ; గంభీరంగా నిండుకుండలా; భయంకరంగా విరుచుకుపడుతూ...



1970ల నాటి విశాఖపట్నం తీరుతెన్నులు (ఈమని రాణీ శర్మ గారి సౌజన్యంతో)

రచయిత పరిచయం

ఉణుదుర్తి సుధాకర్ పుట్టుక 1954లో. స్వస్థలం విశాఖపట్నం. స్కూలు చదువు శ్రీకాకుళం జిల్లాలో. కుటుంబ వాతావరణం సాహిత్యాభిలాషని, చరిత్ర పట్ల ఆసక్తిని, తెలుగు భాష అంటే ప్రేమని పెంపొందించింది. వీటికి ఉద్యమ ప్రభావం తోడైంది. వృత్తి రీత్యా మెరైన్ ఇంజినీరు. ఏవీఎన్ కాలేజి చదువు, విశాఖ పోర్టులో అప్రెంటిస్‌గా ఐదేళ్లు, వాణిజ్య నౌకలలో ఉద్యోగం, యూరప్‌లో ఉన్నత విద్య – వీటన్నిటి జాడలు ఈ తొలి నవలలో కనిపిస్తాయి. 2018లో వెలువడ్డ కథల సంపుటి 'తూరుపు గాలులు' పాఠకుల మన్ననలను పొందింది; విమర్శకుల దృష్టిని ఆకర్షించింది. 'తథాగతుని అడుగుజాడలు' (2019) అనే చారిత్రక పరిశోధక రచనకు సహరచయిత. ప్రస్తుత నివాసం హైదరాబాదులో.

ఫోన్: 9000601068
ఈ-మెయిల్: sudhakarudu@gmail.com

Ānvīkshikī™

Publishers

ఆన్వీక్షికి ప్రచురణలు

• ఇన్ ది మూడ్ ఫర్ లవ్ -కథలు	డిసెంబర్ 2018	వెంకట్ శిద్దారెడ్డి అపర్ణ తోట
	• • •	
• సోల్ సర్కస్ -కథలు	ఏప్రిల్ 2019	వెంకట్ శిద్దారెడ్డి
• సినిమా కథలు -కథలు	ఏప్రిల్ 2019	వెంకట్ శిద్దారెడ్డి
• లాంగ్ మార్చ్ - నవల	జూన్ 2019	పెద్దింటి అశోక్ కుమార్
• మధురాంతకం నరేంద్ర కథలు నాలుగుకాళ్ళ మండపం	ఆగష్టు 2019	మధురాంతకం నరేంద్ర
• కాశీభట్ల వేణుగోపాల్ నవలలు (నేనూ-చీకటి, తపన, దిగంతం) Twilight Series-1	సెప్టెంబర్ 2019	కాశీభట్ల వేణుగోపాల్
• శివసాగర్ కవిత్వం	సెప్టెంబర్ 2019	సంపాదకత్వం - డా. గుర్రం సీతారాములు
• సినిమా ఒక ఆల్కెమీ - సినిమా వ్యాసాలు	అక్టోబర్ 2019	వెంకట్ శిద్దారెడ్డి
• లెటర్స్ టు లవ్ - ప్రేమ లేఖలు	అక్టోబర్ 2019	కడలి సత్యనారాయణ
• అనగనగా ఒక సినిమా - సినిమా వ్యాసాలు	అక్టోబర్ 2019	కె.పి. అశోక్ కుమార్
• తెలుగాంగ్ల మిశ్రసమాసనిఘంటువు	నవంబర్ 2019	పులికొండ సుబ్బాచారి
• పొగమంచు అడవి - కథలు	నవంబర్ 2019	కుప్పిలి పద్మ
• నూరేళ్ళ తెలుగు కథ - వ్యాసాలు	నవంబర్ 2019	మహమ్మద్ ఖదీర్ బాబు
• సిరా -నవల	నవంబర్ 2019	రాజ్ మాదిరాజు
• బోల్డ్ & బ్యూటిఫుల్ -కథలు,	నవంబర్ 2019	అపర్ణ తోట
• ఖచ్చితంగా నాకు తెల్సు -కథలు	డిసెంబర్ 2019	వంశీ

• రష్యన్ క్లాసిక్స్ -కథలు	డిసెంబర్ 2019	సంపాదకత్వం - కూనపరాజు కుమార్
• #మీ టూ -కథలు		డిసెంబర్ 2019 సంపాదకత్వం - కుప్పిలి పద్మ
• 16 తొలిప్రేమ కథలు -కథలు	డిసెంబర్ 2019	సంపాదకత్వం - వెంకట్ శిద్దారెడ్డి - సిద్ధార్థ్ కట్టా
• ఆత్మనౌక దివ్వెగా - నవల	డిసెంబర్ 2019	మూలా సుబ్రహ్మణ్యం
• చిదంబర రహస్యం - కథలు	డిసెంబర్ 2019	జనార్ధన్ మహర్షి
• • •		
• వీరయ్య - నవల	ఆగష్టు 2020	కృష్ణ గుబిలి అనువాదం - గురుమూర్తి గుబిలి
• పాట్నా ఒక ప్రేమకథ - నవల	ఆగష్టు 2020	అబ్దుల్లా ఖాన్ - అరిపిరాల సత్యప్రసాద్
• అసత్యానికి ఆవల - నవల	అక్టోబర్ 2020	కాశీభట్ల వేణుగోపాల్
• సెలయేటి సవ్వడి (కవిత్వం 2006-2014)	అక్టోబర్ 2020	మూలా సుబ్రహ్మణ్యం
• శప్తభూమి - (రాయలసీమ చారిత్రక నవల)	అక్టోబర్ 2020	బండి నారాయణస్వామి
• యారాడ కొండ - (ఆట బహుమతి పొందిన నవల)	నవంబర్ 2020	ఉణుదుర్తి సుధాకర్
• మనోధర్మపరాగం - (ఆట బహుమతి పొందిన నవల)	నవంబర్ 2020	మధురాంతకం నరేంద్ర

YAARAADAKONDA
ATA Prize Winning Novel
by
Unudurti Sudhakar

జాలరుల కుగ్రామంగా మొదలైన విశాఖపట్నం, రెండో ప్రపంచ యుద్ధం తరువాత మహానగరంగా అవతరించడానికి మూలకారణమైన భౌగోళిక విశేషం యారాడ కొండ. విశాఖపట్నం ఎదుగుదలకు అదొక కొండగుర్తు. ఎంతో మందికి ఉపాధినీ, కొంత మందికి సంపదనూ ప్రసాదించిన బంగారు కొండ అది. ఆ కొండ విశాఖపట్నం కథను చెప్పుకొస్తే అది ఎలా ఉంటుంది? గడచిన వందేళ్ల కాలంలో అక్కడి మనుషులూ, వాళ్ల ఆశలూ, ఆశయాలూ, వ్యథలూ, బాధలూ, సుఖ సంతోషాలనూ, అలాగే వీటన్నింటినీ నడిపించిన శక్తులనూ యారాడ కొండ నమోదుచేసి వినిపించిన గాథకు నవలా రూపం ఈ రచన. మూలాలను తెలుసుకున్నప్పుడే ఎదుగుదల అర్థవంతం కాగలదనే నమ్మికతో వీరికూర్చిన సృజన ఈ **'యారాడ కొండ'** నవల.

AN ANVIKSHIKI PUBLICATION
Anvikshiki Publishers
NOVEL
₹225
ISBN-978-81-948767-0-0
9 788194 876700